

చిలువలు * భూతాలు * ధృక్పథాలు

894.8274
RAC

With Best Compliments from :

SRI KRISHNA IRON WORKS

2020, PAN BAZAR, SECUNDERABAD

Shop Phone : 72763 **Res : 74341**

propreitor : B. SHANKARIAH

★

Manufacturers of

AGRICULTURAL IMPLIMENTS,

REPAIRING, WELDING AND WORK

★

Stockists of

BEAMS, CHANNELS, ANGLES, PLATES

SHEETS, RODS, AND WINDOW SECTIONS E


విలువలు * బాధ్యతలు * ధృక్పథాలు

"మారుతున్న విలువలు
రచయితల బాధ్యతలు"

గోష్ఠి సందర్భంగా ప్రత్యేక వ్యాససంకలనం

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY

N11923



ప్రాప్తులు
శ్రీ నాపా
వెంకటేశ్వరాచార్యులు
విక్రయ.

రిజిస్టర్డు సంఖ్య : 1/64

సాహితీ సాంస్కృతిక సంస్థ
5, కింగ్సువే, సికింద్రాబాదు-3.

1

RACHANA

VILUVALU * BADHYATHALU * DRUKPADHALU

COLLECTION OF SPECIAL ESSAYS
FOR THE SEMINAR ON
CHANGING VALUES AND WRITERS' RESPONSIBILITIES.

894.8274
RAC

యువభారతి ప్రచురణ–5

ప్రథమముద్రణ
జూలై: 1970

ముఖపత్ర రచన
శీలా వీర్రాజు

ముద్రణ
శ్రీపాద ఆర్టు ప్రింటర్స్, హైదరాబాదు.

ముఖచిత్ర ముద్రణ
విస్టాస్ ప్రింటర్స్, హైదరాబాదు.

ప్రతులకు
యువభారతి
5, కింగ్సువే, సికింద్రాబాదు-3.

వెల
ఐదు రూపాయలు

7

A0 ADUA102B105

V.R. NARLA MEMORIAL
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
11923



మా మాట

సముద్రం ఒడ్డున కనబడే అలలకు ఎక్కడో ఆ వెనుక అల్లంత దూరంలో కనబడని గాలిచేసిన అలజడి కారణం. నీటిమడుగులో రాయివేస్తే, వేసిన చోటేకాదు మొత్తం చలిస్తుంది - జలదరిస్తుంది.

మారుతున్న విలువలు

విలువలు - వాటి నిర్వచనాలు మారుతున్నాయి. కొన్ని మరుగున పడిపోతున్నాయి. కొన్ని సరికొత్తవి వస్తున్నాయి. కొత్త రూపం దాల్చే పాత విలువలు కొన్నిఅయితే, మరీ కొత్త విలువలు మరికొన్ని. విలువలు వడివడిగా మారుతున్నందుకు - బాధలేదు. మార్పు - మంచికే ఐతే, బాధలేదు. ప్రతిమార్పూ - మంచికి మలుపే అని ఖచ్చితంగా చెప్పలేము. అలా నిక్కచ్చిగా చెప్పలేము కాబట్టి - మార్పుకు ప్రయత్నం చేయకూడదు, దోహదం చేయకూడదు అను కోవడం కూడా తప్పే అవుతుంది. మార్పుకు అవకాశం ఇవ్వాలి. కాని, విశృంఖలత్వానికి కాదు. మంచితనానికీ ; మరోగొప్ప సత్యానికి అవకాశం ఇవ్వాలి. కాని విచ్చలవిడి తనానికి కాదు.

బా ధ్య త లు :

మనిషి సంఘజీవి అని ఒప్పుకున్నప్పుడు కేవలం కనీసపుటవసరాలే తీర్చుకోవడం కాకుండా జీవితం అంటే మరింకేదో సాధించాల్సివుందని ఒప్పుకున్నప్పుడు ప్రతిదానికీ సమాజం సమిష్టిగా బాధ్యత వహించాలి. సమాజంలోఉన్న ప్రతివాడూ "బాధ్యత నాదికాదు నాదికాదు" అంటూ కూర్చుంటే, "నేనొక్కడినీ సమాజమా ?" అని ప్రశ్నిస్తూ కూర్చుంటే ? నిజం - ఎవ్వరూ పట్టించుకోకుండా ఉన్నట్లయితే

నాగరికత ఒక్కఅడుగు ముందుకువేసి ఉండేదికాదు. మానవుడు ఇన్ని రంగాలలో ఇంత పురోభివృద్ధి సాధించి వుండేవాడుకాదు. ప్రత్యక్షం గానో, పరోక్షంగానో, కొద్దో గొప్పో ప్రతి ఒక్కడికీ బాధ్యతఉంది. అలా ఉందని అనుకున్నప్పుడే సమాజం నిలుస్తుంది, నడుస్తుంది, ముందుకు కదలుతుంది.

నేటి యువత

ఆలోచించలేనివాడు అదృష్టవంతుడు - ఏ కాస్త తీపికా మరింకాస్త తీరికా చేసుకుని చుట్టూవున్న పరిస్థితులను గురించి ఆలోచిద్దామనుకున్నా ఆలోచనలు పారక అర్థంకాని నిశ్చలస్థితిలో వుండిపోతుంది మనస్సు.

నేటి యువతరం క్రొత్త పోకడలు పోతోంది. వింత పోకడలు కూడా పోతుంది. ప్రతీదాన్ని సూటిగా ప్రశ్నించే మనస్తత్వం అల వరుచుకొంది. అనాదిగా అందరు అవునని తలలూపిన విషయాలను, వాస్తవాలను ధిక్కరిస్తూంది నేటి యువతరం. నిలదీసి అడుగుతోంది సమాధానం చెప్పమని. ఒక్కోసారి అలజడి, అరాచకం మా జన్మహక్కని అనిపించేట్లు ప్రవర్తిస్తోంది.

భవిష్యత్తు గురించి కలలు కనాల్సిన వయస్సులో - భద్రతలేని బ్రతుకు కళ్ళెదుట కనబడుతోంది, వీరికి. భవిష్యత్తు గురించి, తాను చేయగలిగిందేమి లేదేమో అన్న ఆలోచన నిర్లిప్తతను ఆవరింప జేస్తూంది. - సమాజం తన భవిష్యత్తుకై భద్రత చేకూర్చలేక పోతోం దన్న అసంతృప్తి - యువతను అరాచకంవైపు, హింసవైపు మొగ్గు చూపేలా చేస్తోంది. తీరని అశాంతితో నేటి యువతరం ఒక సంధి యుగంలో వుందేమోఅనిపిస్తోంది. ఏదో తెలియని ఆరాటం - ఏదో కొత్తదనం కోసం - పోరాటం - ఇదీ ప్రస్తుత పరిస్థితి.

కాలం వేగం పెచ్చింది. కనీసం అలా పెచ్చినట్లనిపిస్తున్నది. ఎటునుండి ఎటుపోతున్నామో తెలియని స్థితి - ముందుకో వెనక్కో అసలే తెలీని పరిస్థితి. - అదేదో శూన్యంలోకి, అర్థంచేసుకుందామని ప్రయత్నించినా అర్థంకాని అస్తవ్యస్త వ్యవస్థలోకి - భూమ్యాకర్షణ శక్తి లోపించినచోట మనిషి నడవటానికి ప్రయత్నించినట్లు - సమాజం వంకరటింకర నడకలు నడుస్తోంది. తప్పటడుగులు వేస్తోంది. ఒక

గమ్యం, ఒక లక్ష్యం చూపించి జనతను ముఖ్యంగా యువతను ఆ వైపు నడిచేలా నిర్దేశించగల్గిన శక్తి-కాదు, సాహసం నేడు నిండుగాపూజ్యం.

నేటి పెద్దతరం వారు, నేటి యువతరాన్ని మారుతున్న విలు వలకు బాధ్యులుగా, పరిగణిస్తారు. మరి వారు ఒనగూర్చినదేమిటి ?

పెద్దతరం వారు ఏమీ చెయ్యలేక పోవటానికీ, ఏమీ చెయ్యక పోవటానికి, యువతరంలోని అశాంతికి, తిరుగుబాటు ధోరణికీకారణం మారుతున్న విలువలే. నాగరికత పేరిట మరోసమాజంలోని సభ్యత అనబడే దాన్ని విచక్షణారహితంగా దిగుమతి చేసుకోవడం కొంత కారణం కావచ్చు. ఏదయినా సామాజిక జీవితం నియమరహిత మవు తున్నది. ఇది విరుగుడు దొరక్కుండా తిప్పలు పెడుతున్న సమస్య.

విలువలు - బాధ్యతలు

కాళోజి అన్నట్లు - చాలామందికి కోపం వచ్చినాసరే - "జనంలో చాలామంది గొర్రెలమంద". అందుకే అందరూ చెయ్యా ల్సిన పనిని అందరూ పట్టించుకోకుండ అందరి బాధ్యత తమ నెత్తిపై వేసుకునేవారు ఏకొందరుమాత్రమో ఉన్నారుకాబట్టే సమాజం కనీసం యిలా అయినా నడుస్తోంది. కనీసం కుంటినడకనయినా చూపిస్తోంది.

నిజానికి సమాజం యింతవరకూ సాధించిన ప్రగతికి, పురోభి వృద్ధికి కారకులు, బాధ్యులు ఆ పై చెప్పిన కొద్దిమంది. అంటే సగటు మనిషి తెలివితేటలకన్నా కాస్తంత ఎక్కువపాళ్ళలో తెలివితేటలు, సగటుమనిషి స్వార్థంకన్నా కాస్త తక్కువపాళ్ళలో స్వార్థమూ - తాను నివసిస్తున్న సమాజానికి తానేదో చేసిపెట్టాలన్న ఆరాటమూ కలిగిన మేధావివర్గము. అందుకే మేధావివర్గానిదే ముఖ్యమైనబాధ్యత.

గమ్యం చేరుకోగలిగిన ఓర్పు, గమ్యం చేర్చగలిగిన నేర్పు పీరిలోకూడా అందరికీ వుండదు. కొందరే చేతయినవాళ్ళు. చేతనయిన వాళ్ళందరూ చేపట్టేవాళ్ళుకారు. అందుకే - ఏ కొందరు మాత్రమో సమాజానికీ ఉపయోగపడటం తమ బాధ్యతగా భావిస్తారు.

"నీవు మేధావివికావంటే ప్రతివాడికీ కోపంవస్తుంది". మేధావి ఏ వర్గానికి చెందినవాడైన అయ్యుండవచ్చు, ఏ వృత్తిచేపట్టినవాడైనా అయ్యుండవచ్చు, ఏ పనిచేయనివాడైనా అయ్యుండవచ్చు.

"కలము, కుంచె కదలాడెను
గళము తోడుగా పాడెను"

—కాళోజి.

అవును అవసరమేర్పడినపుడు - అన్నీ కదలి రాగలిగినప్పుడే వాటి ఉనికికి సార్థకత. అవసరమేర్పడనంతవరకు వేటిమానాన అవి "కళ కళకోసమే" అన్నట్లు జీవిస్తే, అభ్యంతరంలేదు. అవసరమేర్పడినప్పుడు - దేశంకోసం, సంఘంకోసం, జాతికోసం, సమాజంలోని తోటివారికోసం - అన్నీ ఉపయోగపడగలగాలి. ఎలాగైతే - భౌతిక, రసాయనశాస్త్ర విజ్ఞానము మానవుని జీవితం మరింత మెరుగుపర్చేలా చేయడానికి ప్రయత్నిస్తున్నాయో - అలానే, సాహిత్యమూ, లలిత కళలూ కృషిచేయాలి. ఇందులో సందేహంలేదు. కేవలం - ప్రస్తుతాన్ని ఆనందమయం చెయ్యడానికి ప్రయత్నించడమే కాకుండా, భవిష్యత్తుకు అవసరమైన పునాదుల్ని - ప్రస్తుతంలోనే నిర్మించగలగాలి. పునాదుల్ని నిర్మించడం బాధ్యతతో కూడుకున్నపని.

రచయితలు - బాధ్యతలు

అందరుమేధావులూ ఒక ఎత్తు. రచయితలు ఒక ఎత్తు. మిగిలిన మేధావులందరి పరిధి పరిసీమితం. కాని రచయితకు పరిధిలేదు. అనుక్షణం తన ఆవృత్తాన్ని పెంచుకుంటూపోతాడు. పాఠకుడి (దాదాపు తెలిసేట్టుకాకుండా) ఆలోచనా ధోరణులను దిద్దుకుంటూ, సరిదిద్దుకుంటూ, మారుస్తూ, ఏర్పరుస్తూపోతాడు. అందుకే, ఏ కాస్తో కూస్తో, రచయితలకు బాధ్యత వుందనే మా అభిప్రాయం.

"సత్యహరిశ్చంద్ర" నాటకం చూసి నిజమెంతమంది చెప్పారు? "రామాయణం" చదివి ఏకపత్నీవ్రతం అవలంబించిన పెద్దమనుష్యుల సంఖ్య ఎంత? "భారతం" చదివి లేక "భాగవతం" చదివి లేక మరియింకేవేవో చదివి అందులో పోగేసిపెట్టిన మంచినంతా పాటిస్తూ కూర్చున్న జనం ఎంతమంది? అంటూ ప్రశ్నల పరంపరలతో 'నిజం'లా కల్పించే కమ్మనిమత్తు మందులాంటి మత్తుజల్లి "దేనికీ ఎవ్వరూ బాధ్యులుకారు. రచయితలు అసలేకారు" అని నచ్చచెప్పేవారూ

ఉన్నారు. నిజమే సత్యహరిశ్చంద్ర నాటకం చూసినతరువాత కూడా అన్నివేళలా సత్యమే చెబుదామని భీష్మించే వ్యక్తిని ఎక్కడా చూడము. ఒక్కటిమాత్రం నిజం-మంచిచెబితే విని నేర్చుకునేవాళ్ళు తక్కువ. విలాసాలు, బలహీనతలూ, చెడుమార్గాలూ, మనస్సు నాకర్షించినంతగా మంచి ఆకట్టుకోదు. అయస్కాంతం ఇనుమునే ఆకర్షిస్తుంది. పసిడి విలువ దానికేంతెల్సు? దరికిజేరనివ్వదు. సమాజంలోఉన్న మంచికి, రచయితకు ఏమాత్రమూ బాధ్యతలేదన్న వాదం ప్రస్తుతానికి అంగీకరించినా ఉన్న చేదు నిజంలాంటి చెడుకు, దాని ఉనికికి కాస్తో కూస్తో బాధ్యుడనక తప్పదు. రోడ్డున అమ్మే బఠాణీలను కొనుక్కున్నంతతేలికగా అపరిమిత సెక్సు స్వేచ్ఛను ప్రబోధిస్తూ వెలువడుతున్న పుస్తకాలు, పత్రికలు దొరుకుతూ ఉన్నందు వలన కాస్తయినా, కనీసం రవంతయినా యువతరం ఆలోచనలలోని మార్పుకు, దిగజారిన నైతిక విలువలకు రచయితలు బాధ్యులు కారని అనగలరా? మంచి సాధించలేకపోవచ్చుగాని కనీసం చెడుమార్గాన్ని పట్టకుండా నైనా చూడటం బాధ్యతకాదా?

"ఏది మంచి? ఏది చెడు? నువ్వెవరు నిర్ణయించడానికి?" అని అడిగినా, లేక "మాకు బాధ్యతలేదు. రచన సృజనాత్మక కృషి దానికి స్వాతంత్ర్యంకావాలి. బాధ్యతలపేరిట అడ్డుగోడలు కట్టకూడదు, శృంఖలాలు వెయ్యకూడదు. సమాజమేమయితేమాకేం" అంటూ చెప్పినవారి తర్కానికీ, తెలివితేటలకీ దూరంనుండి నమస్కారంపెట్టడం మినహా బహుశా చేయగలిగిందేమి లేదనుకుంటాము.

మా యువభారతి సమావేశాలలో అనేక విషయాలపై చర్చలు నిర్వహించుకున్నప్పుడు ఇవే ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. విలువలకు యిచ్చే నిర్వచనాలు - వ్యక్తి వ్యక్తికీ వేరు. అడుగుకూడా ముందుకు చూడలేనివాడు ఒకడయితే, అరవై అడుగుల ఆవలనున్నదాన్ని గురించి ఆలోచన సాగించేవాడు మరొకడు. "పాత అంతా చెత్త అనీ, పరమరోత అనీ ఉన్నదంతా సమూలంగా సర్వనాశనం చేసి ఒక శూన్య స్థితిని సృజించి అందులోంచి మళ్ళీ మరేదో పునరావిర్భా

వానికి కృషిచేయాలి" అన్న వాదమూ కనబడుతుంది. "అలాకాక మంచికై ప్రయత్నిద్దాం ! మంచి ఎక్కడవున్నా తీసుకుందాం. శూన్యం సృష్టించాక అసలు యిక సృష్టిఅంటూ జరగదేమో. అందుకని ఉన్నదాంట్లోని మంచిని రక్షించుకుందాం" అన్న వాదనా వినబడుతుంది. ఈ ప్రశ్నలకు మాకు సమాధానం కావాలి. మాకు దొరికిన సమాధానాలు కేవలం మాకే కాక పదిమందికీ అందుబాటులో ఉపయోగపడేలా ఉండాలని, మా సందేహాలకొక స్వరూపాన్నిచ్చి మా సమస్యలకొక సమాధానం సూచిస్తుందేమోనని ఈ గోష్ఠిని నిర్వహిస్తున్నాము.

మారుతున్న విలువలు-రచయితల బాధ్యతలు అను విషయంపై నిర్వహిస్తున్న ఈ గోష్ఠిలో - ఉపయోగపడేందుకని, విభిన్న దృక్కోణాలతో పరిశీలించిన ముప్పైఏడు వ్యాసములను "రచన" రూపములో కూర్చినాము.

చుట్టూ చీకటి ఆవరిస్తున్న నేటి పరిస్థితుల్లో మేంవెలిగిస్తున్న ఈ చిట్టిదీపం ఏ కొంత వెలుగునయినా ప్రసాదింపజేస్తే మేంపడ్డ శ్రమంతా - ఫలించినట్లే. అట్టి ప్రయోజనాన్ని సాధించి ఈ గోష్ఠిని ఉపయోగపడేలా విజయవంతం చేసే బాధ్యతమీది, రచయితలుగా బాధ్యత ఉందనుకున్నా లేదనుకున్నా సరే !!

—వి. విశ్వనాథం

సమావేశకర్త

యువభారతి

మా గురించి....



"చుట్టూరా ఆవరించుకొని వున్న చీకటిని తిట్టుకుంటూ కూర్చోవడం కంటె ప్రయత్నించి ఎంత చిన్న దీపాన్నయినా వెలిగించటం మంచిది." అన్న వాక్యంలోని నిజం మా ఊపిరి. మా ప్రయత్నం కేవలం "ఉడుతాభక్తి"గా అని మాకు తెలుసు. కాని ఒడ్డుననిలిచి సముద్రాన్ని దాటలేమని అనుకుంటూ ఊరికే గోళ్ళు గిల్లుకుంటూ నిల్చోవడం కన్న, మనస్సుకు హృదయానికి పదునుపెట్టి ప్రయత్నించడం మిన్న.- అన్నది మా ధ్యేయం. నేటి యువతరాన్ని ఓ లక్ష్యంవైపు మరల్చుకోలేని అసహాయ స్థితిలో వున్న సమాజాన్ని చూసి నిర్మాణాత్మకంగా ఆలోచించటం, కృషి చేయటం నేర్పిద్దామన్నది - మా ఉద్దేశం.

ప్రతి వ్యక్తిలోనూ అంతర్లీనంగా కొన్ని ప్రతిభలుంటాయి. ఆదరణ, అవకాశము, ప్రోత్సాహము లేక అవి వెలికిరాక అవరోధాల మధ్య ఇంకి పోవచ్చు ఆ అవరోధాలను తొలగించి మానవుడ్ని పరిపూర్ణ వ్యక్తిత్వంగలవాడిగా, సమ్యక్ దృష్టిగలవాడిగా తీర్చిదిద్దడం సమిష్టిగా సమాజ బాధ్యత.

ఒక వ్యక్తి తన తీరిక సమయాన్ని వినియోగించుకొనే తీరును బట్టి ఆ వ్యక్తి సంస్కారాన్ని గుర్తించవచ్చు. 'యువభారతి' యువకులలో ఉత్తమ సాహిత్యాభిలాషను, వచోనైపుణిని, రచనాసామర్థ్యాన్ని పెంపొందింప జేయడానికి గత సప్తవర్షాలుగా యథోచితమైన కృషి చేస్తున్నది.

ప్రతి నెలలో మొదటి మరియు మూడవ ఆదివారాలలో మధ్యాహ్నం 2-30 గంటలకు హైద్రాబాద్‌లో సుల్తాన్ బజార్‌లోని శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో 'యువభారతి' నిర్వ

హిస్తున్న సాహిత్య సమావేశాలు పెద్ద ఎత్తులో కాకపోయినా, పరిసీమితంగానైనా సాహిత్యాభిరుచిని ఉద్దీపింపజేయడానికి ప్రయత్నం చేస్తున్నవి.

మా కార్యక్రమాల సంక్షిప్త వివరణ :

పుస్తక చర్చ : సాధారణంగా మనం చదివే కథలూ, పుస్తకాలూ - మనం పట్టించుకోంగాని మన మెదడుకు మేత పెడ్తాయి, పుస్తకాలలోని మంచిని గ్రహించడం, మంచి పుస్తకాలను గమనించడం అవసరం. పాఠకులు దిట్టమైన వాళ్ళయినప్పుడే విలువగల రచనలు వెలువడ్తాయి. ఉత్తమ సాహితీ సృష్టికి, ఉత్తమ పాఠకుల ఉనికి, ప్రోద్బలం అవసరం. అలాంటి విచక్షణ గలిగిన పాఠకులనుగా మార్చుకోవడమే మా పుస్తకచర్చ ధ్యేయం.

నెలకొకసారి పుస్తకచర్చ జరుగుతుంది. నియమితమైన కొన్ని అంశాలపైన చర్చ సాగుతుంది. చర్చనీయమైన గ్రంథం ఒక నెలకు పూర్వమే ఉచితంగా, సభ్యులకు అందజేయబడుతుంది. సాహిత్యంలో ఉత్తమాభిరుచిని పెంపొందించి విమర్శనాదృష్టి, విలువలను అవగాహన పరచటమే మా పుస్తకచర్చ ప్రధాన లక్ష్యం.

క్లుప్తగోష్ఠి : భాష ఏదయినా భావవ్యక్తీకరణకు తోడ్పడాలి. కనీసం మన మాతృభాషలోనయినా మనం అందంగా, క్లుప్తంగా, స్పష్టంగా, నిర్భయంగా మాట్లాడ గలగాలి. అందుకే మాక్లుప్తగోష్ఠి. అందుకే ప్రతి సమావేశంలోనూ ఇవ్వబడే ప్రోత్సాహం బహుమతి. ఇవ్వబడ్డ విషయాన్ని గురించి రెండునిముషాల్లో సద్యఃస్ఫూర్తితో, సమయనియమాన్ననుసరించి, సమగ్రంగా, సభికుల హృదయాలలో ముద్రితమయ్యేట్లు మాట్లాడడాన్ని అలవర్చుకోవడానికి, సభాకంపాన్ని వదల్చుకోవడానికి ఏర్పరచబడ్డ క్లుప్తగోష్ఠిలో - ఇవ్వబడే విషయాలు - అందరికీ తెలిసి, అందుబాటులో వుండేవే. ఈ కార్యక్రమం మాటకూ, మేధస్సుకూ వ్యాయామ శిక్షణగా భావిస్తున్నాం.

క్లుప్త ఉపన్యాసాలు : ఉపన్యసించడం ఒక కళ. వజ్రానికి కూడా సానబెట్టడం అవసరమే. ఒక అయిదు నిమిషాలపాటు తనకిష్టమయిన విషయం గురించి సమగ్రంగా ఆలోచించి, పరిపూర్ణంగా

తయారై వచ్చి ఉపన్యసించటం అలవాటు చేసుకోవటం, ఆ అలవాటు లోని మేలును, మంచిని శ్రోతలలోని నలుగురూ విని తెలియచెప్పగా గ్రహించి మంచిని పెంచుకోవటానికి కృషి చేయిద్దామన్న లక్ష్యమే మా క్లుప్త ఉపన్యాస కార్యక్రమ లక్ష్యం.

నా ఊహాపథంలో : అవకాశం చిక్కినప్పుడల్లా అందమైన భావాలను స్వగతంగా అనుకుంటూంటాము. అనుకోకుండా మనస్సు తలుపులు తట్టిన ఆలోచనలే అందంగావుంటే, మనస్సుకు అందంగా ఆలోచించే అలవాటు నేర్పితే మరింకెంత అందమయిన "ఆలోచనల గని" అని బుజువవుతుందో! అలా ఆ ఆలోచనలు ఆవిరిగాకమునుపే, ఇంకా ఆ భావాలలోని ఆర్ద్రత ఆరకమునుపే తెల్లకాగితం మీద నీలాల అక్షరాలుగా పేర్చి వుంచుకోవటం మంచిదనిపిస్తుంది. అందరి అనుభవాలలోకి వచ్చే సామాన్య విషయాలమీద వారి వారి అభిప్రాయాలు వ్రాసి అట్టే పెట్టించడమే మా 'ఊహాపథమ్' ధ్యేయం.

ఇతరకార్యక్రమాలు : ప్రముఖులను పిలిచి, నూత్న విషయాలు తెలుసుకోవడం, యువకవుల 'కావ్యాగానాలు' ఏర్పరచడం అడపాదడపా జరుగుతూంటాయి. అప్పుడప్పుడు ముఖ్య విషయాలపై చర్చలూ నిర్వహించబడతాయి. ప్రాచీన సాహిత్యపు అందాలను తెలుసుకునేందుకు, 'కావ్యపరిశీలన' కార్యక్రమమూ, నచ్చిన విషయాలను నలుగురితో పంచుకునేందుకు 'నాకు నచ్చిన నాలుగు భావాలు' మొదలైన కార్యక్రమాలు అవకాశం కలిగిస్తాయి.

ఇది మా గతం :

"యువభారతి" స్థాపించిన తొలి సంవత్సరంలో యువభారతి పేర సైక్లోస్టయిల్డ్ మాస పత్రికను సంవత్సరంపాటు, 12 సంచికలూ వెలువరించి, ఆఖరు నెలల్లో సుమారు 1000 ప్రతులదాకా సాహిత్యాభిమానులకు అందించడం జరిగింది. అది గతం. ప్రస్తుతం,- సభ్యుల రచనలను కనీసం మరో నలుగురయినా చదివే అవకాశం కలిగించాలని చిన్న యెత్తున లిఖిత పత్రికను నిర్వహిస్తున్నాం ! ఉత్సాహవంతులైన నటులెందరో యువభారతిని కొన్ని సందర్భాలలో నాటకకళతో ఆరాధించారు. సాహిత్యాసక్తిని ఇతోధికంగా ఇనుమడింపజేయడానికి

ప్రచురణకు పూర్వమే విరాళాలు స్వీకరించి శ్రీ అనుముల కృష్ణ మూర్తిగారి 'సరస్వతీ సాక్షాత్కారం' అనే కావ్యాన్ని, శ్రీ కాళోజి తెనిగించిన ఖలీల్ జీబ్రాన్ The Prophet (జీవనగీత) ను యువభారతి ప్రచురించింది. అయిదవ వార్షికోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని నలుగురు యువభారతి సభ్యుల కవితాసంకలనం 'వీచికలు' ప్రచురించాము. ఆ మధ్యకాలంలో వెలువడిన కవితాసంకలనాలలో అత్యధిక సమీక్షకులచే ఔననిపించుకోబడిన మా 'వీచికలు' నిజంగా 'యువభారతి' కి గర్వకారణం.

ఇక మా ప్రస్తుతం :

పుస్తక పథకం : తెలుగువారికున్న చాలా ప్రత్యేకమైన గుణాలలో పుస్తకాలు కొనకుండా వుండడం ఒక గొప్పగుణం. తక్కువ పెట్టుబడితో ఎక్కువ పుస్తకాలను న్యాయంగా ఆర్జించి పెట్టగలిగే పద్ధతిలో మా 'యువభారతి' పుస్తక పథకాన్ని రూపొందించాము. కేవలం మూడు రూపాయలకు తక్కువ మేమే నాలుగు రూపాయల పుస్తకాలు, ఆ తరవాత దశలవారీగా మరో తొమ్మిది రూపాయల విలువగల పుస్తకాలు లభించేట్లు రూపొందించాము. ఇప్పటికి దాదాపు వెయ్యిమందికి పైగా పుస్తకపథకంలో చేరి లాభాలు పొందారు. పుస్తకపథకం సభ్యుల ప్రత్యేక ప్రచురణగా అయిదుగురు ప్రఖ్యాత కథకుల కథాసంపుటి 'పంచవటి' ప్రచురించాం. పుస్తకపథకం నిర్వహణ నిమిత్తమే సోదరసంస్థ 'స్పందనసాహితి' వారితో కలసి శ్రీమతి డి. కామేశ్వరిగారి 'వానచినుకులు' వెలువరించాం.

విద్యార్థి రచయితలకు కథానికల పోటీ (1970) : విద్యార్థులలో సృజనాత్మక రచనాశక్తిని పెంపొందించేనిమిత్తం ప్రఖ్యాత ప్రచురణ కర్తలు శ్రీ యం. శేషాచలం అండ్ కంపెనీ వారి సహకారంతో అఖిల భారత స్థాయిలో ఆంధ్ర విద్యార్థులందరికీ తెలుగులో కథానికల పోటీ నిర్వహిస్తున్నాం! ప్రవేశరుసుము లేని ఈ పోటీకి ఆకర్షణీయమైన నగదు పారితోషికాలే కాకుండా పెద్దెత్తున పుస్తకరూపంలో కూడా బహుమతులు యివ్వనున్నాం! మన్నికైన పదిహేనుకథలూ

1970 దసరానాటికి (యువభారతి సప్తమ వార్షికోత్సవం) ఎమెస్కో పాకెట్‌బుక్‌గా అవతరిస్తాయి.

"మారుతున్న విలువలు రచయితల బాధ్యతలు" గోష్ఠి: విలువలు వడివడిగా మారుతున్న ఈ రోజులలో మేధావివర్గానికి కూడా హక్కులు గుర్తున్నంతగా బాధ్యతలు గుర్తురాని ఈ రోజులలో ఒక బేరీజు వేద్దామని, జాగ్రత్తగా అంచనా కడదామని, కనీసం రానున్న తరానికైనా కాస్తయినా కనువిప్పు కలిగిదామనే అభిప్రాయంతో ఈ మా సప్తమవార్షికోత్సవ కార్యక్రమాలలో ముఖ్యమైనదిగా "మారుతున్నవిలువలు-రచయితల బాధ్యతలు" గోష్ఠిని తలపెట్టాము. మా కృషికి నిదర్శనం ఇదిగో మా "రచన" మీ చేతిలోవుంది.

యువభారతి కృషి, కార్యక్రమాలు సాహిత్య, సాంస్కృతిక రంగాలకు పరిమితమయినవి. మానవుడి సంస్కారానికి గీటురాయి సంస్కృతీ ప్రియత్వమే కదా! సంస్కృతి నిగ్రహాన్ని నేర్పుతుంది. సృజనాత్మక, శక్తికి దోహదమిస్తుంది. మానవుడు సంఘజీవి. సమాజ వికాసానికి సామూహిక కృషి అవసరం. సామూహిక కృషికి మొదటి అవసరం సహృదయత. అదిలేనినాడు స్వరమేళకు బదులు అపస్వరాలు వినిపిస్తాయి. ఇదీ యువభారతి కృషి. స్థూలంగా వివరించాము. చైతన్య పూరితమైన ఆశయ సాధనా సంరంభాన్ని జడమైన అచ్చుసిరాద్వారా అందించకలగడం కష్టం. మా కృషివెనుకనున్న చైతన్య స్రవంతిని సహృదయులు పోల్చుకోగలరని ఆశిస్తున్నాము.

యువభారతి

ఎందరో మహానుభావులు అందరికీ మా వందనములు



నిజానికి ఈ ఒక్క రెండుమాటలు చెప్పివేయటంతో మా ఎడదల్లోంచి బరువులు చాలావరకు దించివేసుకున్నాం. కాని ఒక్కోసారి చెప్పుకున్నా ఇంకా తరగకుండా ఏదో మిగిలిపోయినట్లు మనస్సుకనిపిస్తూనేవుంటుంది. అందుకే ఈ ప్రయత్నం.

గోష్టికి ప్రత్యేక వ్యాసాలు వ్రాసి పంపండని దాదాపు 50 మందికి మేం ఉత్తరాలు వ్రాశాం. అర్థించాం. కొందరు వ్రాయలేమన్నారు. కొందరు వ్రాయటానికేముందన్నారు. మరికొందరు వ్రాయమన్నారు. గడువుతేదీని గడపవతలకు నెట్టివేసినవారు చాలమంది. ఎలాగైతేనేం అందరూ కలిసి, అనివార్య కారణాలతో కలిసి జూన్ ఆరంభంలో నిర్వహిద్దామనుకున్న ఈ గోష్ఠి జూలై అఖరుకు అవతరించడంలో సహాయపడ్డారు. మేం అడిగినంతనే ప్రత్యేకంగా మేం కోరిన పద్ధతిలో వ్యాసాలు వ్రాసి పంపి సహకరించిన ఈ పెద్ద లందరికీ మా నిండు కృతజ్ఞతలు.

"ధనమూలమిదం జగత్" అని ఎవరన్నారో గాని వారు నాటికీ నేటికీ మాత్రమే కాక రానున్ననాటికికూడ విలువైన సత్యాన్ని కాచి వడబోశారు. డబ్బులేనిదే - నిజం - ఏమీలేదేమో ! "బిందువు బిందువును చేరి సింధువగును"- అన్నట్లు చిన్నా, పెద్దా అన్నీ కలిసి, మేమనుకున్నంత కాకపోయినా, కనీసం ఊపిరిమిగిలేలా తోడ్పడ్డాయి, ఈ "రచన" లోని వ్యాపార ప్రకటనలు. ఒక చక్కని కార్యక్రమానికి తాము వ్యాపారప్రకటన రూపంలో యిస్తున్న ఆర్థిక సహాయం దోహదం చేయగలదనే ఉదారబుద్ధితో మమ్మల్ని మా కృషిలో ఉత్సాహపరచిన ప్రకటనకర్తలందరికీ మా నమస్సులు. ముఖ్యంగా మా కృతజ్ఞతలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార

శాఖవారికీ, వజీర్ సుల్తాన్ టుబాకోకంపెనీవారికి — చెప్పుకోవాలి. ఈ వ్యాపార ప్రకటనల సేకరణలో తోడ్పడ్డ మా మిత్రులు, సభ్యులు, సన్నిహితులు చాలమంది ఉన్నారు. ముఖ్యంగా శ్రీ కె. రంగనాథ్, శ్రీ టి. పాంచజన్యం, శ్రీ యస్. పాండురంగారెడ్డి, శ్రీ ఎ. సీతా రామారావు, శ్రీ యమ్. పాండురంగారావు, శ్రీ యస్. పి. చారి, శ్రీ శంకరయ్య, శ్రీ యస్. యస్. ప్రసాద్, శ్రీ రంగనాథరావు గౌతమ్‌గార్లకు మా మనఃపూర్వక కృతజ్ఞతలు తెలియజెప్పు కుంటున్నాం.

అవసరమైనప్పుడు మేమున్నామని మా అండనిలిచి ఆర్థికంగా ఆదుకున్న శ్రీ వి. రామకృష్ణయ్య, శ్రీ యస్. పి. చారి, శ్రీ ఇరివెంటి కృష్ణమూర్తి, శ్రీ ఎన్. పాండురంగారెడ్డి, శ్రీ డి. రామచంద్రరావు, శ్రీ సి. మల్లిఖార్జునరావు గార్లకు మాకృతజ్ఞతలు.

గోష్ఠి నిర్వహణలో వివిధభాగాల అధ్యక్షులుగా ఉండటానికి అంగీకరించిన డా॥ అడపా రామకృష్ణారావు, శ్రీయుతులు పి. యల్. యన్. శర్మ, డా॥ఎమ్. కులశేఖరరావు, డా॥ నాయని కృష్ణకుమారి, డా॥ ముదిగొండ వీరభద్రశాస్త్రి, కలపటపు రామగోపాలరావుగార్లకు మా కృతజ్ఞతలు.

గోష్ఠి సందర్భంగా జరిగిన చర్చల్లో పాల్గొనేందుకు మా ఆహ్వానాన్ని పురస్కరించుకొని విచ్చేసిన కళాశాలల ప్రతినిధులకు, వారిని పంపడానికంగీకరించిన ఆ యా కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు, ఇతర ప్రతినిధులందరికీ మా కృతజ్ఞతలు.

అధ్యక్షతవహించి గోష్ఠికి ఆందాన్ని చేకూర్చిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీ దేవులపల్లి రామానుజరావుగారికీ, మీ చేతుల్లోనున్న ఈ "రచన" ను తమ చేతులతో ఆవిష్కరించిన అమాత్యవర్యులు, ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖామాత్యులు గౌరవనీయులైన శ్రీ పి. వి. నర్సింహారావుగారికి మా కృతజ్ఞతలు.

ఇది మా నాలుగునెలలకృషి ఫలితం. జంట నగరాలలో దూరదూరంగా విసిరివేయబడినట్లున్న మా సభ్యులు చాల కష్టనష్టాల కోర్చి ఈ కృషి జయప్రదంకావటానికి తోడ్పడ్డారు. ముఖ్యంగా

శ్రీ ఎస్ వేంకటేశ్వర్రావ్, శ్రీ డి. కృష్ణప్రసాద్, శ్రీ నాగినేని భాస్కరరావు, శ్రీ సి. సూర్యనారాయణ తదితరులు.

అచ్చువేసేపని అచ్చాఫీసువారిదే అయినా పుస్తకం పురిటి నొప్పుల గొడవ చాలాఉన్నది. ఈ సందర్భంలో విరామమెరుగక తోడ్పడిన మా సభ్యులు, ముఖ్యంగా శ్రీ అల్లంరాజు వెంకట్రావుకు (దారితప్పి దొర్లిన తప్పులకు తాను బాధ్యతపుచ్చుకుంటాడనే నమ్మకం నాకులేదు) నిజంగా మా మనఃపూర్వక కృతజ్ఞతలు. ఈ కృషిలో పాలుపంచుకొన్న శ్రీ నాగినేని భాస్కరరావు, శ్రీ జె. కామేశ్వర్రావుకు కూడ మా కృతజ్ఞతలు.

ఈ గోష్ఠి విషయం మా మనస్సుల్లో యింకా స్పష్టంగా అవతరించకముందునుంచీ మా ఆలోచనల బరువు దింపి ఒక రూపాన్నివ్వడానికి తోడ్పడిన శ్రీ ఇరివెంటి కృష్ణమూర్తి, డా॥ భీమసేన్ నిర్మల్, శ్రీ యం. నాగభూషణశర్మగార్లకు మా కృతజ్ఞతలు.

ఈ కార్యక్రమం జరపాలన్న మా నిర్ణయానికి నిజంగా అండగానిలచిన మా మిత్రులు శ్రీ రాఘం వీరేశలింగంగారికి, శ్రీ యస్. పి. చారిగారికి, కె. విఠల్ రెడ్డిగారికి, శ్రీ గుత్తికొండ సుబ్బారావుగారికి, శ్రీ వి. ఆర్. ప్రబలగారికి మా కృతజ్ఞతలు.

కృషికి కార్యరూపం ఇవ్వటంలో ఎంత కష్టముందో ఆలోచనకు రూపం యివ్వటంలోనూ అంతేకష్టం ఉండిఉంటుంది. మా హృదయాలకు హత్తుకునేట్టు, నిజంగా గుచ్చుకునేట్టు బలంకల్గిన కలంపాళీలను అందమైన ముఖచిత్రంలో మలచియిచ్చినవారు - మాకు దగ్గరివారు శ్రీ శీలా వీర్రాజుగారు.

అట్టను అచ్చులో సింగారించిన విస్టాస్ ప్రింటర్స్ వారికి మా కృతజ్ఞతలు.

పని ఎక్కువైనపుడు, విసుగు సహజం. మేం విసిగించినా విసుక్కోక, పనిచేసుకుంటూపోయి అచ్చుపోసిన శ్రీపాద ఆర్ట్ ప్రింటర్స్‌వారికి మా కృతజ్ఞతలు.

అందుకే ఎందరో మహానుభావులు - అందరికీ మా వందనములు.

—వి. విశ్వనాథం
సమావేశకర్త, యువభారతి

ఇదీ మేం వ్రాసిన ఉత్తరం



యువభారతి

సాహితీ సంస్కృతిక సంస్థ

5, కింగ్స్‌వే, సికింద్రాబాదు-3.

శ్రీ.....గారికి

మా సాహితీ సాంస్కృతిక సంస్థ "యువభారతి"ని మీకు పరిచయం చేయడానికి ఆనందిస్తున్నాము. రాయిరాయికిమధ్య పరాయితనము తగ్గింపగ ఉడుతరాల్చినట్టి ఇసుకమాదిరిగా – ఉడుతాభక్తిగా – జంటనగరాల సాహిత్య సాంస్కృతిక జీవితములో ఈ ఆరు సంవత్సరాలలో మేము చెప్పుకోదగ్గ పాత్రను నిర్వహించాము. నాలుగు ప్రచురణలు, రవీంద్రభారతిలో మరో నాలుగు సాంస్కృతిక కార్యక్రమాలు మా కృషికి పతాక శీర్షికలు. కేవలం సంవత్సరానికొకసారి కళ్లుతెరచి, ఏదో కార్యక్రమం జరుపుకొని, మా బాధ్యత తీరిపోయిందనుకొనే మనస్తత్వం కాదుమాది. ప్రతి నెల రెండు సమావేశాలు - ఆ రెండు సమావేశాల్లోను వ్యక్తిని విశిష్ట వ్యక్తిత్వం గలవాడుగా తీర్చిదిద్దేందుకని దాదాపు తాలింఖానాలాంటి కృషి. స్పష్టంగా ఆలోచించి ఎదుటివాడి హృదయం మెచ్చుకోగలిగినట్లు మాట్లాడగలిగినప్పుడే మనిషి ఏదైనా సాధించగలుగుతాడని మా నమ్మకం. అందుకనే అటు ఆలోచించటం, ఇటు మాట్లాడటం, అటు చదవటం, ఇటు వ్రాయటం, అన్నీ తగుపాళ్ళలో మేళవించి వ్యక్తి జీర్ణంచేసుకోగలిగిన మోతాదుల్లో తరిఫీదు నిచ్చే శిక్షామందిరం మా యువభారతి.

నేటి యువతరం క్రొత్తపోకడలు పోతోంది. వింతపోకడలు కూడా పోతోంది. ప్రతీదాన్ని సూటిగా ప్రశ్నించే మనస్తత్వం అలవరచుకొంది. అనాదిగా అందరు అవునని తలలూపిన విషయాలను, వాస్తవాలను ధిక్కరిస్తోంది నేటి యువతరం. నిలదీసి అడుగుతోంది సమాధానం చెప్పమని.

ఒక్కోసారి అలజడి, అరాచకం మా జన్మహక్కని అనిపించేట్లు ప్రవర్తిస్తోంది. ఇది నడుస్తున్న చరిత్ర. సాంఘిక విలువలు త్వరత్వరగా మారిపోతున్నాయి. క్రొత్తరూపం దాల్చే పాతవిలువలు కొన్ని అయితే మరీ క్రొత్తవిలువలు మరికొన్ని. పాతవిలువల నన్నింటినీ పాతరపెట్టేసెయ్యాలనే కంఠాలుకూడా వినిపిస్తున్నాయి.

దేశ భవిష్యత్తుకోసం, సోదర మానవుడి భవితవ్యంకోసం కృషిచెయ్యాల్సిన బాధ్యత అందరిపైనున్నా, చదువుకొన్నవారిపై, నలుగురినీనడిపించగలిగిన శక్తిగలవారిపై మరింకాస్త ఎక్కువగావుంటుంది – ముఖ్యంగా రచయితలకు. "మారుతున్నవిలువలు – రచయితల బాధ్యతలు" అన్న విషయంపై రచయితలకు, పాఠకులకు, విమర్శకులకు గల నిశ్చితాభిప్రాయాలను ఒకచోట కూర్చి ఒక నిశ్చిత రూపం ఇద్దామని మేము తలపెట్టాము.

మేము నిర్వహిద్దామనుకొంటున్న "మారుతున్న విలువలు-రచయితల బాధ్యతలు" అను శీర్షికపై "సెమినార్" సందర్భంగా వివిధ సాహిత్య ప్రక్రియలలో పేరెన్నికగన్న వ్యక్తులనుండి వ్యాసాలరూపంలో అభిప్రాయాన్ని సేకరించి ప్రత్యేక సంచికగా అచ్చుపోద్దామని మా ప్రయత్నం.

మీరు పేరెన్నికగన్నవారు. మీ అభిప్రాయాలను తెలుగు జనానికి తెలుపటానికి మేము ఆరాటపడుతున్నాము. మా కార్యక్రమ విజయానికి తోడ్పడమని చనువుతో మీపై చిన్న భారాన్ని మోపుతున్నాము. మీ రచన పంపమని ప్రార్థిస్తున్నాము.

అసలు విషయాన్ని చిన్నచిన్న విషయాలుగా విభజించాము. నాలుగయిదు పేజీలకు మించకుండా అయా విషయాలపై అభిప్రాయ సేకరణ చేద్దామని మా అభిప్రాయం. పదిహేను రోజులకన్నా ఎక్కువ గడువు ఇవ్వకుండా మిమ్మల్ని తొందరపెడుతున్నందుకు మీరు మమ్మల్ని మన్నించాలి. తేదీ దాటకుండా మీ రచన మాకు చేరేటట్లు చూడండి. మీ రచనకై దిగువనున్న విషయాన్ని సూచిస్తున్నాము.

యువభారతి

అంటూ..... మేము వ్రాసిన ఈ ఉత్తరానికి .....

ఇవిగో! ఇవీ రచనలు

మొదటి భాగము

విలువలు – నాడు, నేడు	17	ఆచార్య మామిడిపూడి వెంకట రంగయ్య
మారుతున్న విలువలు – రచయిత బాధ్యత	25	శ్రీ సంజీవదేవ్
రచయిత : సాంఘిక బాధ్యత	33	శ్రీ ఆర్. యస్. సుదర్శనం
మారుతున్న విలువలు, విమర్శకుల కర్తవ్యము	37	డా॥ దివాకర్ల వేంకటావధాని
రచయితలు – విమర్శకులు	43	శ్రీ కె. వి. రమణారెడ్డి
రచయితలు – ప్రభుత్వం	47	శ్రీ ఏ. వాసుదేవరావు (సమాచార, పౌరసంబంధ శాఖామాత్యులు)
రచయితలు – ప్రచురణకర్తలు	51	శ్రీ యం. యన్. రావు
సాహిత్యం – సంఘం – మారుతున్న విలువలు	59	మంజుశ్రీ
రచయితలు – క్రమశిక్షణ	67	డా॥ భీమసేన్ "నిర్మల్"
సాహిత్యమూ – జాతీయకరణ	71	డా॥ సుప్రసన్న
విద్యార్థి రచయితల విలువలు	75	శ్రీ యన్. ఇన్నయ్య
పాఠకులు – రచయితలు	79	శ్రీ ఇరివెంటి కృష్ణమూర్తి
సంఘంలో మార్పు : శాస్త్రీయ దృక్పథము	83	డా॥ సి. లక్ష్మన్న

రచయితల సంఘాలు	89	శశాంక
విలువలు మారిన సాహిత్యము	97	డా॥ కేతవరపు రామకోటిశాస్త్రి
రచయితలు - గ్రంథాలయాలు	103	శ్రీ యస్. పాండురంగారెడ్డి
రచనలలో సామాజిక స్వరూపం	107	శ్రీ కొడవటిగంటి కుటుంబరావు
జీవితం - సాహిత్యం	113	శ్రీ కాళోజి
మారుతున్న విలువలు - రచయిత బాధ్యత	123	శ్రీ గోరాశాస్త్రి
మారుతున్న విలువలు - భాషా సమస్య	139	శ్రీ చేకూరి రామారావు

రెండవ భాగము

మారుతున్న విలువలు	151	శ్రీ పాములపర్తి సదాశివరావు
నేటి సాహిత్యంలో ప్రతిబింబించే మారుతున్న విలువలు	155	శ్రీ పోతుకూచి సాంబశివరావు
మారుతున్న విలువలు – రచయిత	161	శ్రీ శీలా వీర్రాజు
మారుతున్న సాహిత్యం – విమర్శ	171	శ్రీ సంపత్కుమార
మారుతున్న విలువలు – విమర్శ	181	శ్రీ జి. వి. సుబ్రహ్మణ్యం
మారుతున్న విలువలు – నవల	191	శ్రీ అక్కిరాజు రమాపతిరావు
మారుతున్న విలువలు – నవల	199	శ్రీమతి సి. ఆనందారామం
మారుతున్న సమాజంలో – నవల	203	శ్రీమతి కె. రామలక్ష్మి

మారుతున్న విలువలు "కథానక"	211	శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మ
మారుతున్న విలువలు – నాటకం	215	శ్రీ గొల్లపూడి మారుతీరావు
సాహిత్యంలో మారినవిలువలు – కవిత	221	శ్రీ కుందుర్తి
మారుతున్న విలువలు : నేటి కవిత	231	డాక్టర్ అరిపిరాల విశ్వం
మారుతున్న విలువలు – రేడియో రచన	239	శ్రీ పన్యాల రంగనాథరావు
మారుతున్న విలువలు – రేడియో రచన	247	శ్రీ జనమంచి రామకృష్ణశర్మ
మారుతున్న విలువలు – సినిమా రచన	253	శ్రీ కపిల కాశీపతి
మారుతున్న విలువలు – పత్రికలు	257	శ్రీ నార్ల చిరంజీవి
పత్రికలూ, మారుతున్న విలువలు	263	సంఘమిత్ర

★

మొదటి భాగము

17

విలువలు - నాడు, నేడు

శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్య

మానవ జీవితములో విలువల మూలమున తీరు అవసర మెట్టిదో ప్రప్రథమ మున తెలుసుకొనవలెను

సమాజములో మానవులు విశ్వసించు విలువలు ప్రధానముగ మూడు అవసరములను తీర్చుచున్నవి. వీటిలో మొదటిది జీవితమునకు లక్ష్యమేదైన ఉన్నదా? ఉన్నపక్షమున అది ఎట్టిది? అను ప్రశ్నలకు సమాధానము చెప్పుట; రెండవది సామాజిక జీవితమును, సమాజములోని వ్యక్తుల జీవిత మును నియమబద్ధముగ చేయుట; మూడవది సమాజములోని తరతమ భేద ములను సమర్థించుట. ఈ మూడు అవసరములు తీరినప్పుడే సమాజము నిల బడగలదు. ఇవి తీరనినాడు సమాజము విచ్ఛిన్నమగును.

మనదేశమందును, సమాజమందును వేలకొలది సంవత్సరములుగ ప్రాధాన్యము గాంచిన విలువలు ఈ మూడు అవసరములను తీర్చగలవిగ నుండెను విలువలకు మానవుల విశ్వాసమే ప్రధానాధారము. వాటిలోని సత్యమును హేతువాదముచేతగాని యుక్తి చేతగాని రుజువుచేయుట సాధ్యము కాదు.

ఆనాటి విలువలు జీవితమునకు పారలౌకిక సౌఖ్యమే పరమార్థమని ప్రతిపాదించినవి. అనేక పరిస్థితుల కారణముగ ఐహికజీవితము దుఃఖ మయముగ నున్నది. దుఃఖమును పూర్తిగ తప్పించుకొని సుఖముగ జీవితము నంతను సాగించిన మానవుడెవ్వడు లేడు. అట్టి వాడు భవిష్యత్తులో ఉండ గలడని చెప్పుటకు హేతువులేమియు లేవు. కాని ప్రతి మానవుడు సుఖమును వాంఛించుచున్నాడు. అది అతనికి సహజ లక్షణము. అది దుర్లభ్యముకాదు. కాని అది మరణానంతరము పరలోకమందు మాత్రమే లభించును. ఐహిక జీవితమునకు అట్టి సౌఖ్యమే లక్ష్యము. దానిని సంపాదించుటకు అనుగుణ ముగ ప్రతి మానవుడు వాని జీవితమును సాగించవలెను.

ఇదివరలో మన సమాజమందు ప్రాబల్యము గాంచిన విలువలు జీవిత మును నియమబద్ధముగ చేయగలిగెను. నియమములేక సామాజిక జీవితము

సాధ్యము కాదు. ఎవడు ఎవరిపట్ల యేవిధముగ ప్రవర్తించవలెనో ఏ విధముగ ప్రవర్తించరాదో నిర్ణయించు సూత్రమునకు నియమమని పేరు. ప్రతి సమాజములో ఇట్టి నియమములు అసంఖ్యాకములుగ నున్నవి. భర్త భార్యపట్ల, తల్లిదండ్రులు పిల్లలపట్ల, శిష్యులు ఉపాధ్యాయులపట్ల, యజమానులు కార్మికులపట్ల, సామాన్యముగ ఒక వ్యక్తి మరియొకనిపట్ల ఏ విధముగ ప్రవర్తించవలెనో ప్రతి సమాజములోని వారికి స్పష్టము. ఒక సమాజములోని నియమములకును మరియొకదానిలోని నియమములకును భేదము ఉండవచ్చును. కాని నియమమన్నది లేక ప్రతి వ్యక్తికి ఇష్టానుసారము ప్రవర్తించుటకు పూర్తిగ స్వేచ్ఛను ఇచ్చు సమాజము ఏదియులేదు. తోటి మానవుడు సాధారణముగ ఎట్లు ప్రవర్తించునో తెలిసిన కారణముననే ప్రతి వ్యక్తియు దానిని గుర్తించి, తన జీవితమున కొక మార్గమును కల్పించుకొని, నిర్భయముగను, నిస్సందేహముగను అందు నడవగలిగియున్నాడు. నియమమువలన కలుగు ప్రయోజనమిదియే. అందుచేతనే మన పూర్వులు, "మానవులందరికి అహింస, సత్యము, శుచిత్వము, అనసూయ, దయ, క్షమ స్వధర్మ"మనిరి. సామాన్యముగ మనతో వ్యవహారము చేయువారు సత్యమును తప్పరను నమ్మకమున్నకారణముననే వర్తకవ్యాపారములు, అప్పులను యిచ్చి పుచ్చుకొనుట మొదలగు వ్యవహారములు జరుగుచున్నవి. దౌర్జన్యమునకు, హింసకు ఉపక్రమించు దారిదోపిడిగాండ్రు ఉండరను విశ్వాసముచేతనే ధారాళముగ రాకపోకలు, వస్తువుల రవాణాలు జరుగుచున్నవి. ఉపాధ్యాయులు శిష్యులకు విద్యను నేర్పుదురను నియమముండునంతవరకె విద్యావ్యాప్తి సాధ్యమగుచున్నది. నియమములేనిజీవితము స్థిరత్వములేనట్టి జీవితము. భవిష్యత్తును ఉద్దేశించి జీవితమును రూపొందించుకొనుట నియమబద్ధమగు సమాజములోనే సాధ్యము కాగలదు. అహింస, సత్యము మొదలగు వాటికి ప్రాధాన్యము కల్పించి ఆ నాటి మన విలువలు సామాజిక జీవితమును నియమబద్ధముగ జేసి, మానవజీవితము శాంతియుతముగ నుండునట్లు చేసెను.

సమాజములో నుండదగిన నియమములను ఒక్కొకతరమువారికి నేర్పవలసిన అవసరమున్నది. కుటుంబము, విద్యాలయములు, మత సంస్థలు మొదలగునవి దీనికి సాధనములు. ఈ సాధనములు సొష్టవముగ పనిచేసినప్పుడే కొత్తతరమువారు తాము అనుసరించవలసిన నియమముల నేర్చుకొనుటయు తదానుసారము ప్రవర్తించుటయు వీలగును. ఈనాడు ఇట్టి సాధనములు

చక్కగ పనిచేయకపోవుట చేతనే సామాజిక జీవితము రోజు రోజునకు నియమరహితమగుచున్నది.

విలువ మూలమున తీరుసట్టి మూడవ అవసరమును గుర్తించుటలో సామాజిక జీవితము తరతమభేదములలో కూడుకొనినట్టిది అను విషయమును విస్మరించరాదు. అన్నికాలములలో అన్ని సమాజములకు తరతమ భేదములు ఒకప్రధాన లక్షణము. ఈసందర్భములో మూడురకములగు సామాజిక వ్యవస్థలను గమనించవలెను.

మానవుడు వాంఛించు ప్రయోజనములన్నియు వానికి కావలసినంత మట్టుకు (సమృద్ధిగ) లభించునట్టివికావు. మితత్వము వాటి అన్నిటికి లక్షణము. ఆహారపదార్థములు, బట్టలు, ఇండ్లు, ఇతరవాడకపు సామానులు, ఆరోగ్యసాధనములు, వినోదసాధనములు, విలాససాధనములు—అన్నియు మితములుగ లభించునట్టివి. ఇవిగాక అతడు గౌరవ మర్యాదలను, అధికార పదవులను వాంఛించుచుండును. కాని ఇవికూడ మితముగలభించునట్టివే. ఈకారణముచేత అన్నిసమాజములలో వీటి పంపకము ఒక సమస్యగ పరిణమించినది. ఇవి కొందరికి ఎక్కువ దామాషాలో లభించుటయు, మరి కొందరికి తక్కువ దామాషాలో లభించుటయు జరుగుచున్నది. కొందరు ధనికులుగను, కొందరు మధ్యవర్గమునకు చెందినవారుగను, కొందరు దరిద్రులుగను ఉన్నారు. ఇదేవిధముగ కొందరు మాత్రమే గౌరవపదవులను అనుభవించువారుగనున్నారు. ఈ తరతమ భేదములు న్యాయమా? వీటిన న్నిటిని సమానముగ పంపకము చేయుట సాధ్యముకానిపని. వాంఛితము కూడ కాజాలదు. కాని ఈతరతమభేదములు అనేకులకు అంగీకారయోగ్యములుగలేవు. దారిద్ర్యము అనుభవించువారు, పదవులు లభించనివారు దీనిని ఆక్షేపించుట సహజము, వారికి సమాధానము చెప్పవలసియున్నది. తృప్తికరమగుసమాధానము చెప్పని పక్షములో దౌర్జన్యము వృద్ధిగాంచి, శాంతిభద్రతలకు ప్రమాదము సంభవించి, సామాజిక జీవితము దుస్సాధ్యమగును, సమాజములోని విలువలు ఈ తరతమ భేదములను సమర్థించుచున్నవి. ఎట్లు సమర్థించుచున్నవో తర్వాత సూచింపబడును.

రెండవ వ్యవస్థ సమాజములోని వృత్తివిభాగము. (మనపూర్వులు దీనికి వర్ణవిభాగమని పేరుపెట్టిరి). వృత్తి విభాగము మూలమున ఆయా వృత్తులలో పనిచేయు వారినైపుణ్యము పెరుగుటయు, ఉత్పత్తి అధికమగు

టయు జరుగుచున్నది. సమాజములో అన్నివృత్తులకు అవసరమున్నది. ఉపాధ్యాయవృత్తికి ఎంతఅవసరమో చాకలి వృత్తికి, వీధులు తుడుచు వాని వృత్తికి, చర్మకారుని వృత్తికి అంత అవసరమున్నది. కాని సమాజములో అన్నివృత్తులకు సమాన గౌరవములేదు. కొన్ని వృత్తులు ఉచ్చములుగను, కొన్ని నీచములుగను పరిగణింపబడుచున్నవి. నీచములుగ పరిగణింపబడునవి ఎక్కువకష్టముతో కూడుకొని యున్నను వాటికి గౌరవములేదు, గౌరవకరములని భావింపబడు వృత్తులలో పనిచేయు వారికి ఎక్కువ ఆదాయము కూడ లభించుచున్నది. ఇది ధర్మమేనా? వృత్తి మూలమున ఆయావృత్తులలో పనిచేయువారికి ఆదాయము లభించి జీవనము గడచుటయేగాక సమాజముయొక్క అవసరములుగూడ తీరుచున్నవి. తమ ఆదాయము స్వల్పముగనున్నదని భావించి, వారు తమతమపనులను నిజాయతితో నిర్వహించని పక్షమున సమాజమెంతయో నష్టపడును. ఈ అసమానతలను తగువిధముగ సమర్థించ గలిగినప్పుడే వారివారిపనులను చక్కగ నిర్వహించుటయు, సమాజము నష్టపడకుండుటయు జరుగును. విలువలు ఈ సమర్థనములో సాధనములుగనున్నవి.

నియమానుసారము తమ జీవితములను సాగించుటకు వ్యక్తులు సిద్ధపడినపుడే సమాజమునకు స్థిరత్వము లభించుచున్నది. అందుచేతనే శాస్త్రవేత్తలనేకులు సమాజమునకు నీతియే ఆధారమని చెప్పుట. కాని ప్రతి సమాజములో నియమములను ఉల్లంఘించువారు కొందరు ఉందురు. అటివారిని శిక్షించి సమాజపు నియమములను రక్షించుటకు ప్రభుత్వము అవసరమగుచున్నది. ప్రభుత్వములేని సమాజముండదు. అవసరమైనపుడు బలప్రయోగముచేసి తన అధికారములను నిలబెట్టుకొనగల సంస్థ ప్రభుత్వము. కాని, ఎవరు అధికారములో ఉండతగినవారు? కొందరుమాత్రమే అధికార పదవుల సంపాదించుటయు, తక్కినవారికి అవి లభ్యముకాకపోవుటయు న్యాయమా? దీనిని సమర్థించుటకుగూడ విలువలు ఉపయోగపడుచున్నవి.

ఆనాటి విలువలు ధనము, వృత్తి. అధికారములకు సంబంధించిన తరతమ భేదములను అసమానతలను, ప్రధానముగ ఏలాగు సమర్థించినవో తెలుసుకొనుట అవసరము.

ప్రపంచము, మానవులు, మానవ సమాజములు — వీటినన్నిటిని నిర్మించినవాడు భగవంతుడు. సమాజములోని తరతమ భేదములకుకూడ

ఆతడే కర్త. వాటిని ఖండించుటయు విమర్శించుటయు భగవంతుని ఖండించుటయే అగును. కావున అవి సమర్థనీయములుకావు. ఇదిగాక మానవుడు కర్మఫలములను అనుభవించవలసినవాడు. ప్రతిమానవునికి జన్మలనేకములున్నవి. దారిద్ర్యము, నీచవృత్తులను అనుసరించవలసివచ్చుట – ఇవిఅన్నియు పూర్వజన్మ దుష్కృత ఫలితములు. ఈజన్మలో ఎవనివృత్తినివాడు నిజాయితితో నిర్వహించిన పక్షమున మరుజన్మలో గౌరవప్రదములగు వృత్తులనను సరించగలవాడై జన్మించును. కర్మసిద్ధాంతము, పునర్జన్మ సిద్ధాంతము — వీటిని ఆధారము చేసుకొని మనపూర్వులు సమాజములోనిరతరతమభేదములను సమర్థించి వాటిలో అన్యాయముగాని అధర్మముగాని లేనట్లు ప్రచారముగావించిరి. ప్రజలకు ఈ సిద్ధాంతములలో పూర్తివిశ్వాసమున్నందునను, వీటికి విరుద్ధములగు సిద్ధాంతములేవియు వారి అందుబడిలో లేనందునను, వారుసమాజములో మొత్తముమీద శాంతియుతముగ జీవితమును సాగించగలిగిరి. నాటివిలువలన్నిటికి భగవద్భక్తి. కర్మసిద్ధాంతము, జన్మాంతర సిద్ధాంతము మూలాధారములు.

ప్రస్తుతము భారతీయ సమాజము యుగసంధిలోఉన్నది. ఇట్టి కాలములో విలువలు మారుచుండును. కాని అవి ఏవిధముగ మారుచున్నవో నిర్ణయించుట సులభసాధ్యముకాదు. అయినను రెండుమూడు విషయములు స్పష్టములగుచున్నవి.

జీవిత పరమార్థము పారలౌకికసౌఖ్యము అనువిలువలో విశ్వాసము సన్నగిల్లినది. జీవితమునకు ఎట్టి పరమార్థములేదనియు, ఏదియో ఇష్టము వచ్చినట్లు దానిని సాగించుటయే పరమార్థమని కొందరు, ఐహికసౌఖ్యమునుభవించుటయే పరమార్థమని మరికొందరు భావించుచు, తదనుసారము జీవితమును సాగించు పరిస్థితులు ఏర్పడుచున్నవి. ఇటీవలకాలమున ప్రకృతిశాస్త్రజ్ఞానము ఎన్నియో రెట్లు అభివృద్ధిగాంచినది. ప్రకృతిశక్తులనేకములు— విద్యుచ్ఛక్తి, మొదలగునవి—మానవునికి వశమైనవి. దూరము, కాలము అనువాటిని అతడు జయించగలిగెను. అందుచేత అతనిలో ఆత్మవిశ్వాసము అధికమయ్యెను, మానవునికి అసాధ్యమెట్టిదియులేదను భావము వ్యాపించెను, భగవంతుని అస్తిత్వమును శంకించుటయు, పుణ్యపాపములకు జన్మాంతరకర్మసిద్ధాంతములకు స్వస్తిచెప్పుటయు కొంతవరకు సంభవించినది. ఐహికసౌఖ్యమే వాస్తవమగు సౌఖ్యమను భావము ప్రబలుటచేతను, జన్మాంతరము

లేదను భావము, భగవంతుడు లేడనుభావము ప్రాబల్యము గాంచుటచేతను జీవితము నియమరహితమగు ప్రమాదమేర్పడినది.

మితముగ లభించు ధనము, అధికారము — వీటిలో తనకుగల భాగమును ఏవిధముగనైన వృద్ధిచేసుకొని తనసౌఖ్యమును పెంచుకొనుటయే అనేకులకు పరమార్థమగుచున్నది. జన్మలనేకములున్నవి; ఈజన్మలోకాక పోయినను మరియొకజన్మలో సుఖమునను భవించుటకు అవకాశమున్నది. పాపఫలను అనుభవించక తప్పదు". అను విశ్వాసము ధనకాంక్షకు ఒక హద్దును కల్పించుచువచ్చెను. కాని ప్రస్తుతము ఇట్టి హద్దునకు బలములేకున్నది. తోటి మానవుని కష్ట సుఖములను. సామాజిక సౌఖ్యమును గమనించక ప్రతి వ్యక్తియుపదియో ఒకవిధమున ఎక్కువధనమునో, ఎక్కువఅధికారమునో సంపాదించుటయందు నిమగ్నుడగుచున్నాడు. ఇదియే నియమరహిత జీవితము. దౌర్జన్యము, హింస, దీని బాహ్యస్వరూపము.

కాని నియమములేక ఎట్టి సమాజము నిలబడజాలదు. నియమరహిత జీవితము వృద్ధి కానుకాను నియంతృత్వ ప్రభుత్వాధికారమును వాంఛించు ప్రజలసంఖ్య పెరుగుట తప్పదు. నియమములను విధించి అమలుజరుపు ప్రభుత్వమునకు ఎక్కువ అవసరమేర్పడుచున్నది. నాస్తికత్వము ప్రాబల్యము గాంచిన కమ్యూనిష్టుదేశములన్నిటిలో నియంతృత్వ పరిపాలన విధానము నాటుకొన్నది. కావున విలువలలో ఇట్టి విధానమునకు ప్రాబల్యముగాంచును. అనాదిగా భగవంతుని దాసుడుగానున్న మానవుడు నియంతలకు దాసుడు కావలసిన వాడగుచున్నాడు.

ఆనాదిగ ప్రతిసమాజములో తరతమభేదములు నాటుకొనియుండినవి. కాని ఈనాడు అట్టిభేదములను సమర్థించువారి సంఖ్య తగ్గినది. విలువలలో మానవసమత్వము ప్రాధాన్యము వహించుచున్నది. వర్ణ భేదములు, కుల భేదములు, స్త్రీ పురుషులమధ్య భేదములు, ధనవంతులు ధనహీనులమధ్య తదితర ఆర్థిక సాంఘిక భేదములు ఉండరాదను సిద్ధాంతము ప్రాబల్యము గాంచినది. మానవులందరు ఎందులో సమానులు? ఏయే రంగములలో ఎంతెంతవరకు సమత్వ సిద్ధాంతము ఆచరణయోగ్యము? అను ప్రశ్నలు అనేకములు బయలుదేరినవి. వీటికి తగిన సమాధానములు యింకను లభించ లేదు. ఎట్టి సమాధానములు లభించునో వాటినిబట్టి ఈనాటి విలువలు ఏవిధముగ మారునో చెప్పవలసివచ్చును.

మన పూర్వులు 'విలువలు' అనుమాటను వాడినవారుకారు. ఈ మాటను మనము పాశ్చాత్య ప్రపంచమునుండి ఎరువు తెచ్చుకొన్నాము. ఇదే అర్థమును సూచించుటకు మనవారు 'ధర్మము' అనుమాటను వాడిరి. అన్నియుగములలో ధర్మమొకరూపమున ఉండదనియు, ఒక్కయుగమునకు ఒకవిధమగు ధర్మము లక్షణము కాగలదనియువారు విశ్వసించిరి. వారి భావములో మనము ఈనాడు కలియుగధర్మమును పాటించుచున్నాము. కలియుగ ధర్మములెట్టివో వారు పురాణములలో చెప్పియున్నారు. నాటి విలువలకు నేటి విలువలకు మధ్యనుండుభేదమును తెలియకోరినవారికి పురాణములలో యుగధర్మముల వివరణము కొంతవరకు తోడ్పడగలదు. అధునిక తత్వదృష్ట్యా, ఐహిక సౌఖ్యమే జీవిత పమార్థమగుట, సామాజిక నియమములను ప్రభుత్వాధికారమును వహించినవారు విధించుట, మానవులందరు సమానులు అనిభావించుట—ఇవి ఈనాటి విలువలలో ప్రధానములని చెప్పవచ్చును.

★

చితిమంటల యుద్ధానికి
ప్రతి కవి ఒక ఫైర్ బ్రిగేడ్,
అణ్వాస్త్రపు గ్రీష్మానికి
ప్రతి పద్యం మబ్బు ముక్క.

— దాశరథి

("పునర్నవం" నుండి)

LET YOUR MONEY GROW

WITH

STATE BANK OF HYDERABAD

IT TAKES ONLY Rs. 5/- TO OPEN A

SAVINGS BANK ACCOUNT WITH

THE STATE BANK OF HYDERABAD.

OPEN AN ACCOUNT TO-DAY.

WE WOULD LIKE TO BE OF SERVICE TO YOU



STATE BANK OF HYDERABAD

మారుతున్న విలువలు - రచయిత బాధ్యత

శ్రీ సంజీవదేవ్

ఉదయం మధ్యాహ్నం కావటం మార్పు; మధ్యాహ్నం సాయాహ్నం కావటం మార్పు; సాయాహ్నం రాత్రి కావటం, రాత్రి తిరిగి ఉదయం కావటం మార్పు; మారని ఋణం అంటూ ఉండదు. విశ్వసృష్టి అంటేనే మార్పు. ఈమార్పు మానవుడు సృష్టించేదానిలోకూడ ప్రతిబింబించకుండా వుండడం అసంభవం. మానవుడు సృష్టించే సాహిత్యం, సంగీతం, శిల్పం, చిత్రం, నర్తన, నటన, ఇవన్నీ పుట్టినప్పటినుండీ ఎన్నో మార్పులను చెంది నయి, చెందుతున్నయి, చెందుతుంటయి.

మానవజీవితమే అనంతరూపాల్లో మారుతూవచ్చింది. ఒకమార్పుకూ, మరొకమార్పుకూ విలువల్లో ఎంతో ప్రభేదం. ప్లిస్టసీన్ యుగారంభపు మానవజీవితపు విలువలకూ తరువాతి ప్రాచీన శిలాయుగ, మధ్యశిలాయుగ, నవ్యశిలాయుగ మానవజీవితపు విలువలకూ సామ్యమేలేదు. నవ్యశిలాయుగ మానవజీవితపు విలువలకూ, తామ్రయుగ, కాంస్యయుగ, లోహయుగపువాటికి భూమ్యాకాశాలంత తారతమ్యం.

ఈనాడు మనం నివసిస్తున్నది లోహయుగం దాటిన పరమాణు యుగంలో. ఈనాటి జీవితపు విలువలు పూర్తిగా భిన్నమైనవి. జీవితపు విలువలననుసరించే సృజనాత్మక కళల విలువలుకూడ భిన్నంగానేవుంటయి. అందుకే మారుతున్న విలువలు రచయితమీద నూతన ప్రభావాలను ప్రసరిస్తయి. ఈ ప్రభావాలను గుర్తించక తన కల్పనా ప్రపంచములోనే మునిగి, తామరపూలనుతిని ఆకలి తీర్చుకొంటూ, దంతపు శిఖరాల్లోనే నివసించే రచయిత సజీవరచయితగా వుండజాలడు. అందుకని మారుతున్న ప్రతివిలువా గొప్పదేనని భ్రమించి, నవ్యమైనదంతా సవ్యమేనని అపార్థం చేసుకొని, మారుతున్న ప్రతినీడనూ అమాయకంగా అనుసరించి ఎండ మావులను వేటాడే రచయితకూడా సక్రమ రచయితకాదు.

మారుతున్నది మాత్రమే మంచిదని విశ్వసించటం, మారనిది మాత్రమే మంచిదని విశ్వసించటం ఎంత బేసబబో అంత బేసబబు. మారని

దానిలో మంచీ చెడూ రెండూ వున్నట్లే మారుతూన్నదానిలో కూడ మంచీ చెడూ రెండూ వుంటయి. నిజానికి మారనిదంటూ ఏమీ వుండదు. అంతా మారేదే. మారనిది అన్నప్పుడు నేటిదికాక నాటిది అనిఅర్థం. అంటే మారేది అర్వాచీనమనీ, మారనిది ప్రాచీనమనీ. నిజానికి ఇది సరైన నిర్వచనంకాదు.

ఈ మారుతున్న విలువల మూలం ప్రత్యేకంగా క్రీ. శ. 1789 లో జరిగిన ఫ్రెంచి విప్లవంలోకి చొచ్చిఉంద. పద్దెనిమిదో శతాబ్దంలో జరిగిన ఈ ఫ్రెంచి విప్లవం పాశ్చాత్య ఖండాల్లో ప్రథమంగానూ, ప్రాచ్య ఖండాల్లో తరువాతా, మానవజీవితపు ప్రతిరంగంలోనూ, విజ్ఞానంలో, ప్రజ్ఞానంలో, సాహిత్యం, సంగీతం, ఇంకా మిగతా లలితకళల్లో చెప్పరానంతమార్పును తెచ్చి సరికొత్త విలువలను సృష్టించింది. ఈ మార్పుల్లో ప్రధానంగా గోచరించేది స్వేచ్ఛ. నైతిక విషయాల్లో, రాజనైతిక విషయాల్లో, ఆర్థిక విషయాల్లో, పారమార్థిక విషయాల్లో, సాంఘిక విషయాల్లో, సాంస్కృతిక విషయాల్లో, మానవతా విషయాల్లో, మనోవైజ్ఞానిక విషయాల్లో, ఒకటేమిటి, జీవితానికి సంబంధించిన సర్వవిషయాల్లో ప్రవేశించింది ఈ స్వేచ్ఛాప్రవృత్తి. జీవితంలోని ధ్యేయం, శ్రేయం, ప్రేయం అన్నీకూడ స్వేచ్ఛవైనే ఆధారపడినవని, స్వేచ్ఛను ప్రతిబింబించని జీవితం మృత్యువనీ, స్వేచ్ఛను ప్రతిధ్వనించని రచన రచనేకాదనీ.

స్వేచ్ఛ దేనినుండి? నియతినుండి స్వేచ్ఛ, నియమాలనుండి స్వేచ్ఛ, సంప్రదాయంనుండి స్వేచ్ఛ, రీతిరివాజులనుండి స్వేచ్ఛ, నిబద్ధతనుండి, క్రమబద్ధతనుండి, పరపీడననుండి, పాతవిధానాలనుండి స్వేచ్ఛ. బంధనఅనేది ఏదైనాసరే, అది బహిరంగమైంది కావచ్చు ,అంతరంగమైంది కావచ్చు, అటువంటి బంధనమీద తిరుగుబాటు. ఇటువంటి నూతన చైతన్య స్రవంతిని ప్రవహింపచేసింది ఆనాటి ఫ్రెంచివిప్లవం, క్రమేణ, సాహిత్యంలోని ఛందోబద్ధ కవిత సగంఛందోబద్ధ కవితగా (Blank verse), సగం ఛందోబద్ధ కవిత ముక్తఛంద కవితగా (Free verse or verse libre) ప్రాధాన్యం వహిస్తూ వచ్చింది. ఇదేవిధంగా చిత్ర, శిల్ప, సంగీత, నాట్యకళల్లో ఈ నూతన స్వేచ్ఛా ఉద్యమం రూపొందుతూ, నిబద్ధ సృష్టిలోని ప్రాధాన్యాన్ని పోగొట్టి అనిబద్ధసృష్టికి ప్రాధాన్యాన్నిస్తూ వచ్చింది.

నేడు వ్యాప్తిలోవున్న ఆధునిక కవిత, ఆధునిక కథానిక, ఆధునిక నాటిక, ఆధునిక చిత్ర, శిల్ప, సంగీత, నాట్యకళలు మొదలైనవాటన్నిటిలో ఈస్వేచ్ఛ, యీ అనిబద్ధత సర్వత్రా ప్రత్యక్షం. నూతనమైన విషయ వస్తువుల ఎన్నిక, నూతన రచనా విధానాల సృష్టి ఈనాటి రచనల్లోని ప్రముఖ విశిష్టత.

మారుతున్న విలువల్లో రచయితబాధ్యత ఏమిటిఅనేది అంతవిశిష్టమైన సమస్యఏమీకాదు. తన ఇష్టమైన విలువలననుసరించి తానూమారుతుంటాడు, తన రచనలనూ మారుస్తుంటాడు. ఈ సత్యం ఈకాలానికి మాత్రమే సంబంధించిందికాదు; అన్నికాలాల్లోనూ ఈ ధోరణి అమల్లోవుంది. వాల్మీకి మొదలు ఇటీవలనే మరణించిన టి. యస్. ఇలియట్ వరకూ తమ కాలాల్లో మారన్న విలువలను గమనించినవారే. అయితే, కవిదూరదర్శి. తాను జీవిస్తూన్న సమకాలీన వాతావరణాన్నేకాక రానున్న వాతావరణాన్నికూడ చిత్రిస్తాడు. కవి తానుంటున్న వర్తమానకాలానికే కాక రానున్న భవిష్యత్తుకు కూడ ప్రతినిధి; అంటే మారుతున్న విలువలకేకాక మారుతున్న విలువలకుకూడ రూపం ఇస్తాడు. ఇటువంటి వ్యక్తినే He is in advance of his times అంటారు.

అసలు లోతుగా ఆలోచించిచూస్తే ఈనాడు, పరమాణుయుగం అనుకొనే ఈనాడు విలువలు అనేవి ఎంతవరకు మారుతున్నవాఅని సందేహం వేస్తుంది. నేటి వైజ్ఞానిక యుగంలో, హేతువాదయుగంలో మనం జీవించాల్సిన స్థితిలో జీవిస్తున్నట్లు కనుపించదు. కులతత్వాలూ, మూఢ నమ్మకాలూ లేకుండా జీవించటం ఈనాటి యుగధర్మం. కాని ఈ రెండూ కూడ వెర్రితలలు వేస్తున్నయి. నవీనుల్లోకూడ కులతత్వాలు విపరీతంగా పెరిగిపోయినయి. నవీనుల్లోకూడ తిరుపతివెళ్లి తలలు గొరిగించుకవచ్చే భక్తి ఇదివరలోకంటే చాలా ఎక్కువవుతున్నది రోజుకిరోజు. మంత్రులు, సినిమా తారలు, విద్యార్థులు, (యీ విషయంలో విద్యార్థినులు చాలనయం!) తిరుపతి భక్తిలో పోటీలు పడుతున్నారు; రచయితలుకూడ వెనుకబడిలేరు యీ విషయంలో! జీవితంలో తాత్వికదృక్పథం వుండకూడదనికాదు, ఆధ్యాత్మిక చింతన అవసరంలేదనీకాదు, కాని తిరుపతిభక్తి తాత్వికదృక్పథమూకాదు, ఆధ్యాత్మిక చింతనా కాదు. అదొక మూఢ నమ్మకం.

ఇటువంటి చౌకబారు మానసిక విధానం వృద్ధిపొందుతున్నరోజుల్లో విలువలు మంచివైపుకు ఎంతవరకు మారుతున్నవోమరి!

పాఠకుల మనస్తత్వాన్నిబట్టి రచయిత బాధ్యతవుంటుందా? అంటే పాఠకులు రచయితను మారుస్తారా లేక రచయితయే పాఠకులను మారుస్తాడా? లేక ఉభయులూ ఒకర్ని మరొకరు మారుస్తారా? లేక, ఎవర్ని ఎవరూ మార్చరా? ఇవన్నీకూడా జరగటానికి అవకాశంవుంది.

రచయిత ప్రధానంగా రసస్రష్టమాత్రమేకాని ఉపదేశకుడూ, సంఘ సంస్కర్తా కాదు. ఆయన రచనల్లో ఎక్కడైనా అప్పుడప్పుడు ఉపదేశాలు, సంఘ సంస్కరణ భావాలు పరోక్షంగా కనుపించుతుండవచ్చు. అంతేకాని లోకం మరమ్మతు చేయాలని రచయిత కంకణం కట్టుకొని రచనచేయ ప్రారంభిస్తే ఆ రచనలోని రసపుష్టి నశించి అదొక ప్రచార సాహిత్యంగా తయారవుతుంది. కనుక ఇటువంటి విశ్వశ్రేయస్సు బాధ్యత వహించాల్సింది సంఘసంస్కర్తలూ, ప్రజాసేవకులేకాని రచయితలుకాదు. సంఘసంస్కర్తల మీద రసవంతమైన సాహిత్యాన్ని సృష్టించాల్సిన బాధ్యతలేనట్లే రచయితల మీదకూడ సంఘాన్ని సంస్కరించాల్సిన బాధ్యతలేదు.

మనిషిలోని శక్తిసామర్థ్యాలను పెంపొందించడానికి జరిగే మార్పుల విలువలు చాలగొప్పవి. మారుతున్న విలువల్లో శాశ్వతత్వంపై వ్యతిరేకత గమనార్హం; ఏపనిచేసినా, ఏది రచించినా అది నాలుగు కాలాలపాటు వుండాలి అనే ఆకాంక్ష కొంతకాలంక్రిందటివరకూ ఉంటుండేది. నేడుదాని విలువ మారిపోయింది. శాశ్వతంగా నిలవగలిగిన రచనమాత్రమే గొప్పది కాదు. అది ఎంతతక్కువకాలం నిలచినప్పటికి అ రచన గొప్పదికాకుండా పోదు. రచనలో గొప్పరసంవుంటే అదిఎక్కువకాలం నిలుస్తుందని, తక్కువ తనంవుంటే అదికొద్దికాలం నిలుస్తుందనీ తలంచడం ఒక భ్రమమాత్రమేఅని. ఒక రచనలోని గొప్పతనాన్ని కొద్దితనాన్ని కొలవటానికి ఎక్కువకాలం తక్కువకాలం అనేవి కొలతబద్ధలుకావని. శాశ్వతత్వంలో ఎంత విలువ వున్నదో క్షణభంగురతలోకూడ అంతవిలువఉన్నదని. ఇంద్రధనస్సు చాలా సుందరమైనది. అయితే, అదిక్షణభంగురమైంది. అది క్షణభంగురమైందికదా అని దానివిలువ తగ్గిందా? ప్రతిభావంతుడు ఎంతకొద్దికాలం బ్రతికినా గొప్పవాడే. పనికిమాలినవ్యక్తి నూరేళ్లు జీవిస్తేమాత్రం ఏమి? అతడు

అల్పుడే. ఇటువంటి క్రొత్తవిలువలకు రచయిత తన రచనల్లో రూపకల్పన చేయాలి.

లైంగిక విషయాల్లోకూడ విలువలు మారిపోయినయి. కొత్తవిలువలు ప్రవేశించినయి. లైంగిక సంబంధాలలో నియతిరాహిత్యం, స్వేచ్ఛ, వరస కానిప్రేమ (incest) మొదలైనవన్నీ ఫ్రాయిడ్ స్థాపించిన మనోవిశ్లేషణ ద్వారా ప్రజల్లో ప్రవేశించినయి. సాంప్రదాయిక నైతికపు విలువలు పెట్టి కొలిస్తే ఇవి మంచివి కాకపోవచ్చుకాని మారుతున్న విలువలకొలతకు ఇవి చెడ్డవికావు. ఈ విషయాలుచాలా సూక్ష్మమైనవి. వీటిని సంపూర్ణంగా స్వీకరించినా లేక సంపూర్ణంగా నిరాకరించినా ప్రమాదంవుంది. వీటిని అసంపూర్ణంగా స్వీకరించడంలోనూ అసంపూర్ణంగా నిరాకరించడంలోనూ ప్రమాదంవుండదు. ఇటువంటి విలువలకు రచయితవిలువ ఇవ్వకపోతే తాను అసత్యంలో సంచరిస్తున్నట్లే అవుతుంది; జీవితపువాస్తవానికి దూరమవుతాడు. అందుకని ఈ విలువలనే సర్వస్వం అని నమ్మి వీటిని గురించి తనరచనల్లో అద్భుతాలను చిత్రించ ప్రారంభిస్తే ఈ విలువలు వెర్రితలలువేసి వెగటు జనింపచేస్తవి పాఠక బృందంలో. ఆందుకే మారుతున్న విలువలను ఉపయోగించుకోవటంలో రచయితబాధ్యత చాలాసున్నితమైంది. మారుతున్న విలువలను ప్రదర్శించేనిమిత్తం రచనచేస్తే ఆరచన నీరస రచనమాత్రమే అవుతుంది. తాను రచనచేస్తుంటే మారుతున్న విలువలు అందులో ప్రవేశించాలి.

రచయిత బాధ్యత అద్దమూ, దీపమూ రెండు రూపాల్లోనూ రూపొందాలి. అద్దం తనఎదుట వున్నవాటన్నిటినీ వున్నవివున్నట్లుగా ప్రతిబింబిస్తుంది. దీపం కనపడని వాటిని కనుపించచేస్తుంది. అద్దం వాస్తవవాదానికి చెందితే, దీపం ఆదర్శవాదానికి చెందుతుంది. రచయిత అద్దాన్ని మాత్రమే ఆదర్శంగాతీసుకొంటే తనచుట్టూవున్నసమాజాన్ని, ఆ సమాజంలో జరిగే సంఘటనలనుమాత్రమే చిత్రించి కేమెరాయంత్రంగా వుండిపోతాడు. రచయిత సమకాలీన జీవితాన్ని చిత్రించితే మాత్రమేసరిపోదు. జీవితం "ఎట్లావున్నది" అని చిత్రించినట్లే "జీవితం ఎట్లాఉండాలి" అనేదాన్నికూడ చిత్రించాలి. దీపాన్నివదిలి కేవలం అద్దంమీదే ఆధారపడితే రచన కేవలం అనుకరణమాత్రమే అవుతుంది, అద్దాన్ని వదలి కేవలం దీపంమీదనే ఆధార

పడితే రచనవాస్తవానికి దూరమైన కేవలం ఊహాగానంగానే వుండిపోతుంది. ప్రతిభగల రచనలో వాస్తవరూపమూ ఊహాగానమూ రెండూ వుండాలి సమభాగాల్లో కాకపోయినాకూడ. భౌతిక జగత్తులో నివసిస్తున్నాం కనుక వాస్తవికత అవసరం. మానవ జగత్తులోకూడ జీవిస్తాం కనుక కల్పన అవసరం. కొందరి రచనల్లో మొదటిది ఎక్కువగావుండి రెండవది తక్కువ వుండవచ్చు. మరి కొందరి రచనల్లో రెండూ సమభాగాల్లో వుండవచ్చు. ఇంకొందరి రచనల్లో మొదటిది తక్కువగాఉండి రెండవది ఎక్కువగా వుండవచ్చు.

మారుతున్న విలువలు రచయితను మార్చటంతో మాత్రమేసరిపోదు. రచయితకూడ విలువలనుమార్చాలి. కనుపించేవాటినిఅద్దంవలె ప్రతిబింబింప చేయడం మాత్రమేగాక కనుపించనివాటిని దీపంవలె కనుపించేట్లుచేయడం రచయిత బాధ్యత.

ప్రజాస్వామ్యదృక్పథం మారుతున్న విలువల్లో ప్రాధాన్యంవహించి వుంది. అన్నీ అందరికీ అందుబాటులో వుండాలి. ప్రతివారి జీవనవికాసానికి సమాన అవకాశాలు లభించాలి. సాంస్కృతిక విషయాలు అందరికీ అర్థ మయేట్లు వుండాలి. ప్రతివానికీ సులభ గ్రాహ్యంగావుండేటట్లు సాహితీ రచన జరగాలి. ఇటువంటి ప్రజాస్వామ్య దృక్పథాన్ని ఎంతవరకు అనుస రించాలిఅని నిర్ణయించే బాధ్యత రచయితమీదఉంది. అందరకూ అర్థమయే విధంగా రచనచేయాలి అనేది ఎంతవరకు సమంజసమా అని? ఎంత సులభ శైలిలో రచించినాకూడ ఆ రచనను సులభంగా అర్థంచేసుకోలేని పాఠకులు ఇంకా ఉండిపోతూనేవుంటారు. పాఠకులంతా ఒకేమానసికస్థాయికి చెందిన వారుకారు. ఒకరిదృష్టిలో కఠినం అనుకున్నరచన మరొకరిదృష్టిలో సరళంగా వుంటుంది. ఏవిషయాన్నయినా తెలియజేసే భోగట్టాకు చెందిన రచనను కొంతవరకు అందరకి అర్థమయే విధంగా వ్రాయవచ్చుకాని సృజనాత్మక సాహిత్యరచనను మాత్రం అందరికీ అర్థమయే విధంగా రచించడం అసాధ్యం. పోని, భాషను సరళపరచినప్పటికి భావాలను సరళ పరచడం సులభంగాదు. భావౌన్నత్యంలేని సాహిత్యరచన వార్తాపత్రికల్లోని వార్తమాత్రమే అవుతుంది.

మారుతున్న విలువలను రచయిత నిర్లక్ష్యంతో చూడకూడదు. కాని మారుతున్న విలువలన్నిటినీ తు. చ తప్పకుండా అనుసరించాల్సిన బాధ్యత కూడ రచయితకు అవసరంలేదు, ఏ విలువలను ఎంతవరకు స్వీకరించాలో, ఏ విలువలను ఎంతవరకు నిరాకరించాలో అనేస్వేచ్ఛ రచయితకున్నది. ఆ స్వేచ్ఛనుసరించే సంచరిస్తాడు రచయిత. తన రచనలు సమాజానికి అద్దం గానూవుంటయి, దీపంగానూవుంటయి. మారుతున్నవిలువల ప్రతిబింబాలూ వుంటయి, మారాల్సిన విలువల కాంతిరేఖలూ వుంటయి అందులో.

★

పరమ పవిత్రుడు, మహాపుణ్యాత్ముడు ఎవడైనను,
మీలోని దైవాంశము యొక్క ఔన్నత్యమునన్న పైకి పోషాలడు.
ఎంతటి దుర్మార్గుడైన, పతితుడైన
మీలోని మురుగుజ్జు నీచత్వమునన్న క్రిందికి దిగజారలేడు,
చెట్టంతయు మౌనముగా ఎరుగనిదే
మార్పులకు గురికానిదే,
ఏ ఆకుగూడ పండుటాకుగా మారదు, రాలదు.
అదే తీరుగ,
సంఘము - సంపూర్తిగ ప్రచ్ఛన్నముగానైనను
సంకల్పము చేయనిదే,
యే ఒక్కడు నేరము చేయలేడు.

—కాళోజి
("జీవనగీత" నుండి)

FOR OFFICIAL PUBLICATIONS

Contact :

BOOK LINKS CORPORATION

★

NARAYANAGUDA

HYDERABAD

Phone : 51471

రచయిత : సాంఘిక బాధ్యత

శ్రీ ఆర్. యస్. సుదర్శనం

రచయిత అంటే ఎవ్వరు? పత్రికలకి చైనందినపరిణామాలను గురించి వ్యాసాలు వ్రాసేవాళ్లున్నారు. రాజకీయ, సాంఘిక, ఆధ్యాత్మిక విషయాల్లో నిర్దిష్టాభిప్రాయాలూ, దృక్పథాలు ఉన్నవాటినిఎంచుకుని ఆయాపరిధుల్లోరచనసాగించేవాళ్లున్నారు. వాళ్లు వ్యాసాలేకాదు,కవిత్వం,కథ,నాటకం, నవల వంటి సృజనాత్మక సాహిత్యంకూడా రచిస్తున్నారు. వీళ్ళందరూ రచయితలే అయినప్పుడు, వీళ్ళసాంఘికబాధ్యతను గూర్చి ప్రత్యేకంగా చర్చించవలసినఅవసరంలేదు. ఎందుకంటే వీళ్లు అందరూ ఏదోవిధంగా సంఘ పురోభివృద్ధిని కాంక్షిస్తూ, వాళ్ళకు తోచినవిధంగా నిర్దిష్టంగా ఆ బాధ్యతను నిర్వర్తిస్తూ ఉన్నవాళ్లే కాబట్టి! ఉదా॥ కమ్యూనిస్టు లేదా సోషలిస్టు దృక్పథాన్ని ఆలంబనంచేసుకున్న వాళ్ళకి సాంఘిక బాధ్యతలను గూర్చి క్రొత్తగా చెప్పేదేముంటుంది? అలాగే ఒకానొక మతాన్ని పునరుద్ధరిస్తేగాని సంఘం బాగుపడదు అనే విశ్వాసమే ఏది వ్రాసినా వ్యక్తంచేసే రచయితకి, ఆయనకి ఉండవలసిన సాంఘికబాధ్యతనుగూర్చి ఎవరూచెప్పనక్కరలేదు! అందువల్ల రచయితయొక్క సాంఘికబాధ్యతను చర్చించడమంటే ఎవరికివారు మళ్ళీ తమ తమ ప్రత్యేక దృక్పథాన్నీ, విశ్వాసాన్నీ ఏకరువుపెట్టడమే అవుతుంది అలాకాకుండా దృక్పథవైవిధ్యంగల రచయితలందరికీ, వాళ్లు రచనచేస్తూ ఉండడంకారణంగా, అన్వయించే ముఖ్య విషయాలు అంటే రచయితకూ సమాజానికీ గల మౌలికమైన సంబంధంతాలూకు విషయాలు, ఉన్నవేమో పరిశీలించి చూడాలి.

వృత్తిగా రచనచేపట్టిన పత్రికా రచయితలవంటి వారికి ఒక దృక్పథం అంటూ పత్రికాధిపతులూ లేక సంపాదకులూ నిర్దేశం చెయ్యడంవల్ల, అటువంటి రచయితల ప్రసక్తి యిక్కడరాదు. అలాగే రచనలో ఆసక్తికంటే, రాజకీయ ప్రయోజనం ప్రధానంగా వ్రాసేవాళ్ళని గూర్చి పట్టించుకోనవసరంలేదు, పోతే కేవలం రచనలో ఆసక్తికారణంగా కథ లేక కవిత్వం లేక నవల వ్రాసి, సమాజంతో రచనద్వారా ఒక సంబంధం ఏర్పరచుకున్న వర్గ

మాన రచయితకు, సృజనాత్మక రచయితకు, "నా బాధ్యత ఏమిటి" అనే ప్రశ్న ఒకానొక సందర్భంలో ఎదురవుతుంది? అతడు వ్రాసిన మొదటి నవల పాఠకుల్ని ఆకర్షించింది. ఇంకావ్రాయాలని ఉత్సాహం, ఆసక్తిఉన్నాయి ఏమివ్రాయాలి? ఎలా వ్రాయాలి? అని ప్రశ్న. అంటే ఏది వ్రాస్తే పాఠకులకు నచ్చి మరిన్ని కాపీలు అమ్మడుపోయి డబ్బా, పేరూ వస్తుందో అదే వ్రాయడమా? అలా చేయడంకూడా ఏమంత సులువుకాదనుకోండి, పోనీ అలా చెయ్యడం సులువైతే అటుతర్వాత అలాచెయ్యకుండా ఉండడం అవసరమా? ఎందుకు? ఒకవైపు ధనమూ, కీర్తి ఆకర్షిస్తున్నవి; కానీ ఆ ఆకర్షణే ప్రధానంకానివిధంగా ఆలోచించి తన ధ్యేయాన్ని ఏర్పరచుకోవడం రచయితకు ముఖ్యమా? అది అతని సాంఘిక బాధ్యతా? ఈ విషయం ఆలోచింపదగ్గది. డబ్బుకోసం పేరుకోసం, పదిమందికీ నచ్చేవిధంగా వ్రాసే వెరవు తెలిసినతర్వాత, అలా చెయ్యడం, చేస్తూవుండడం సాంఘిక బాధ్యత కాకపోతుందా? రచయిత పదిమందికీ సరదాకలిగిస్తూ ఉండడం సాంఘికంగా తన కర్తవ్యం నిర్వర్తిస్తున్నట్లుకాదా? అని యిక్కడ ప్రశ్న.

రచన మొదలుపెట్టకపూర్వం రచయితకు సమాజంలో గల సంబంధం సామాజికుడిగా తప్ప విశేషమైనదికాదు. రచనద్వారా, ఆ రచన సమాజంలో కొంత ఆసక్తిని (అంటే ఆమోదమయినాకావచ్చు, చర్చ, వివాదము, ఖండనము అయినా కావచ్చును) రేకెత్తించడంద్వారా రచయితకు సమాజంతో ఒక విశేషమైన సంబంధం ఏర్పడుతుంది. సమాజాన్ని ఒక వ్యవస్థగా, ఒక సంప్రదాయంగా, ఒక పరిణామంగా చూచినప్పుడు దాన్నిగూర్చిన సమర్థనమో, విమర్శనమో, వ్యాఖ్యానమో, రచనలో సూటిగాకాని, వ్యంగ్యంగా కాని ఉండకతప్పదు. సంఘం స్వభావసిద్ధంగా మారుతూ ఉంటుంది. ఈ మార్పులో ఏది వాంఛనీయం. ఏదికాదు అనే నిర్ణయం ఎవరుచేయాలి? ప్రభుత్వం, రాజకీయపక్షాలు, మేధావివర్గాలు ఈ నిర్ణయాన్ని ఏదోవిధంగా చేస్తూనే ఉంటాయి. తద్వారా సంఘంలో సమకాలీన భావసంచలనం ఒకటి ఏర్పడేఉంటున్నది. రచయిత ఈ భావాలకు, అంటే సర్వత్ర ఒక నినాదంగా అంగీకరింపబడుతున్న భావాలకు, కేవలం మద్దతునిచ్చేవిధంగా రచన చేయాలా? లేక ఆ భావాలను రచనలో పరీక్షకు పెట్టి వాటిలో గట్టి, పొల్లుతేల్చి చూపాలా? ఏది అతని బాధ్యత? ఇది తెలుసుకోవలసిన ప్రశ్న.

మొదటిదానికంటె రెండవమార్గం కష్టతరమైంది. నేటి సమాజపరిస్థితుల దృష్ట్యా యువత చర్చించదగిన అంశం యిది.

ఒక సిద్ధాంతం ఉంటే అది సూత్రప్రాయంగా చాలామందికి సామూహికంగా వర్తించేవిధంగా ఉంటుంది. అన్వయంలో, ఆచరణలో వ్యక్తులమీద ఆ సిద్ధాంతం ఎలా పనిచేస్తుందో సామాన్యంగా ఊహకు అందేవిషయం కాదు. సమాజాన్ని సంస్కరించి, మార్చి, ఒకానొక మార్గంలో దాని పరిణామాన్ని నిర్దేశింపబూనుకున్నవాళ్లు – వీరేశలింగంకావచ్చు, కార్ల్ మార్క్సు కావచ్చు – సమూహంమీద కొన్ని లక్షణాల్ని, ధోరణుల్ని ఉద్దేశించి సిద్ధాంతీకరిస్తారేకాని, వ్యక్తికీ, వ్యక్తికీ గల సూక్ష్మ భేదాల్ని అజలోకి తీసుకుని పరిణామాల్ని ఊహించరు; అలా ఊహించడం సాధ్యంకాదు. ఇక్కడే రచయిత. ముఖ్యంగా సృజనాత్మక రచయితయొక్క బాధ్యత, నిర్దిష్టమై ఉన్నట్లు నాకు తోస్తుంది. సాంఘిక పరిణామ దృక్పథానికి మద్దతు నిచ్చినా, దాన్ని సర్దుబాటుచేసినా, విమర్శించినా, సృజనాత్మక రచయిత తన వైయక్తిక దృక్పథంనుంచే ఆపని చేయాలి. అలాకాక రచయితకూడా సామూహికమైన, సిద్ధాంతప్రాయమైన సూచనలుచేస్తూ వ్రాస్తే, ఆ రచన సిద్ధాంత ప్రచారసాధనమై, సాహిత్యప్రతిపత్తికి నోచుకోనిదిగా ఉంటుంది. ఇది నా అభిప్రాయం. (ఈ దృష్టితోచూస్తే మార్క్సుగ్రంథం "కేపిటల్" సాహిత్యగ్రంథం కాక శాస్త్రీయగ్రంథం అవుతుంది).

మానవుడు సంఘజీవే అయినా వ్యక్తిగా ఒంటరివాడు. అతని ఊహలూ, ఉద్వేగాలూ, వ్యాపకాలూ, వ్యవహారాలూ అన్నింటిలోనూ సంఘంతో ఏదో ఒక సంబంధాన్ని మనంచూడవచ్చు. సంఘంనుంచి సంక్రమించని భాగంఅంటూ ఏదీ కనిపించదు. విశ్లేషణకూ పరీక్షకూ యిలా తోచినా వాటి అన్నింటివెనుకా మనిషిని వ్యక్తిగా నడుపుతున్న జీవశక్తి, చైతన్యశక్తిమాత్రం నిర్దేశింపడానికి వీల్లేని విశిష్టమైన వస్తువు. అది కారణంగానే ఇవాళ ఆమోదించినదాన్ని రేపు కాదనటం, ప్రాతనుకాదని క్రొత్త వైపు వ్యక్తి ఉన్ముఖుడుకావటం జరుగుతున్నది. ఆ చైతన్యశక్తి కొందరిలో జిగీషగా కార్యరూపేణా వ్యక్తంఅవుతూఉంటుంది. రచయితలో ప్రతిభావంతమయిన రచన రూపేణా వ్యక్తం అవుతూఉంటుంది. పచ్చికబయలులో యథేచ్ఛగా పచ్చికమేస్తున్న ఆబోతుకీ, గాట కట్టివేయబడి యజమాని పెట్టిన ఎండుగడ్డి ఆకలితీర్చుకోడానికి అలవాటుగామేసే ఎద్దుకీ ఎంతోభేదం

ఉన్నది. ఒక రకంగా చూస్తే ఆబోతుకంటె ఎద్దు ప్రవృత్తి మానవసంఘానికి ఎక్కువ ఉపయోగకరంగా కనిపిస్తుంది ! కాని ఆబోతుకి ఉన్న చైతన్యం తాలూకు విశిష్టలక్షణం ఎద్దులోకనిపించదు ! ఇక్కడ రచయిత రచనావ్యాసంగం విషయంలోనూ యించుమించు అదేప్రశ్న ఎదురవుతుంది. అతడు ఆబోతులా ఉండాలా ? ఎద్దులాఉండాలా ? ఆబోతులా ఉంటూ ఎద్దులా పనిచేస్తే ఎంత బాగుంటుంది. అని మన ఆశ ! కాని అది సాధ్యమో కాదో స్వయంగా రచయితకానివాడు చెప్పలేడు ! రచయిత కాబోయే ప్రతియువకుడూ, యువతీ, రచయిత కావడంతోటే ఎదుర్కోవలసిన ప్రశ్నే యిది! దానికి రచయితే వ్యక్తిగతంగా సమాధానం చెప్పుకోవాలి. దీన్ని గురించి ఆత్మవిమర్శ చేసుకుంటూ, రచయితలు పరస్పరం అనుభవాలు అభిప్రాయాలూ వ్యక్తం చేసుకోవడం అవసరం. అప్పుడు రచయిత సాంఘిక బాధ్యత అనేవిషయం కొంతకుకొంత అవగాహనకురావచ్చు. ఆత్మవిమర్శ, స్వానుభవప్రస్తీ లేని చర్చ యీ విషయంమీద నిరుపయోగమని నా అభిప్రాయం.

రచయితలో చైతన్యశక్తి అంటే ప్రతిభ (క్రొత్తఊహలుచేసి క్రొత్త దారులు త్రొక్కేచొరవ) ఎప్పుడూ వ్యక్తంఅవుతూవుండాలని నా ఆకాంక్ష. నిజాయితీ, ధైర్యంవంటి గుణాలు జీవితానికేకాదు రచనకూ అవసరమే. అప్పుడే ఆరచన సమాజానికి రచనగా (ప్రచారసాధనంగాకు) ఉపయోగిస్తుంది. సమాజంయొక్క జీవలక్షణమైన మార్పుకి నిజంగా దోహదం చేసుంది. నిరంకుశాఃకవయఃఅంటే భాష, ఛందస్సువిషయంలో రచయిత నిరంకుశుడనీ, పండితులకి కవి జవాబు చెప్పనక్కరలేదనీ మాత్రమే అన్వయంకాదు. నేడు మన తెలుగు రచయితలు చాలామంది ఈమాత్రం స్వేచ్ఛతోనే తృప్తిచెందుతున్నారు ! రచయిత సంఘానికి క్రాంతదర్శి కావడమే కాదు, తోటిరచయితలకుకూడ మార్గదర్శి అయ్యే ప్రతిభకోసం తపస్సు చేయాలి. ప్రతిభఅనేది అనుకరణ అనే పొగమంచుతో ఆవృతమయ్యేవుంటుంది. ప్రతి రచయితలోనూ. తపస్సుద్వారా దాన్ని మంచునుంచి బయల్పరిస్తేతప్ప అది ప్రకాశించదు ! అలా స్వయంప్రతిభను ఆవిష్కరించుకొనే ప్రయత్నం ఏకమనస్కతతో చేసేకంటె, రచయిత చేపట్టవలసిన మరొక బాధ్యత నాకుతోచదు. అందులోనే వ్యక్తిబాధ్యతా, సాంఘిక బాధ్యతా రెండూ సమన్వయం చెంది ఒకటవుతాయి !

మారుతున్న విలువలు, విమర్శకుల కర్తవ్యము

డాక్టర్ దివాకర్ల వేంకటావధాని

కవి, రచయిత, కథకుఁడు మున్నగువారెంత ప్రతిభాసంపన్నులైనను సంఘమునందలి సభ్యులే. వారి మానసములపై సాంఘికాది పరిస్థితుల ప్రభావమెన్నో విధములఁ గానిపించు చుండును. అందుచే సంఘమునకును సారస్వతమునకును సన్నిహిత సంబంధముండుట అపరిహార్యము. సాంఘిక పరిస్థితులెప్పుడు నొకే మాదిరిగా నిశ్చలములై యుండవు దేశకాలముల ననుసరించియు బాహ్య సంపర్క సంబంధముల ననుసరించియు నవి పరివర్తనము చెందుచుండును. ఆ పరివర్తనమును బట్టి సారస్వతమునఁగూడ మార్పులు గోచరించును. ఏ వాఙ్మయముయొక్క పరిణామమును బరిశీలించినను ఈ విషయము విస్పష్టము కాఁజాలును.

ఆంధ్ర వాఙ్మయ మారంభకాలమున నప్పటి సాంఘిక మతపరిస్థితుల ననుసరించి పురాణేతిహాసముల యనువాదములతో నారంభించినది. తరువాత శైవమత ప్రచారమునకు ఫలితముగా శైవ వాఙ్మయముద్భవించినది. పిమ్మట కథాకావ్యములు కావ్యానువాదములు బయలుదేఱినవి విజయనగర సామ్రాజ్యకాలమున స్వతంత్రములు, తత్కాలభోగైశ్వర్య సూచకములు నైన ప్రబంధములు రచింపఁబడినవి. దక్షిణాంధ్రయుగమున వచనైక రచనలు, యక్షగానములు, పద్యకీర్తనాదులు వెలువడినవి. ఆంగ్ల భాషాసారస్వత సంపర్కమలవడిన పిమ్మట భావకవిత్వము, ఖండకావ్యములు పుట్టినవి. తరువాత నభ్యుదయకవిత్వము, వచన కవిత్వము ప్రచారము పొందినవి. ఈ విధముగా సంఘకాల పరిస్థితులననుసరించి ఆంధ్ర సారస్వత మున భాషా ప్రక్రియా రచనా విధానములందుగూడఁ బరివర్తనము కాని పించుచున్నది.

విమర్శకుఁడనఁగా దోషైక దర్శనుఁడని భావించుట పరిపాటియైనది. కాని యది పొరపాటు. వస్తువును సమగ్రముగా పరిశీలించి యందలి గుణ

దోషములను రెండింటిని నిష్పక్షపాతబుద్ధితో వెల్లడించుటయే సద్విమర్శకుని లక్షణము. అతని విమర్శ దోష పరిహరణమునకును గుణవర్ధనమునకును దోడ్పడును. కావ్య విమర్శనకునికి విమర్శనవిధానమున ప్రతిభావంతులైన పూర్వ మేధావులు వెలువరించిన లక్షణ గ్రంథములు, ప్రజల అభిరుచులు, బాహ్య ప్రభావములు మున్నగునవి మార్గదర్శకములుగా నుండును. విమర్శించునెడ నతడొకప్పుడు తనలో నాటుకొనియున్న గాఢములైన యభిరుచులనుగూడ నుపేక్షింపవలసియుండును అనగా నతడు తనకేది రుచించును అను దృష్టితోడనేకాక లోకమునకేది రుచికరము, అభ్యుదయావహము అగుననుదృష్టితోబరిశీలింపవలయును. ఈ విధముగా ద్వంద్వ రహితుడైన యోగికి వలెనే విమర్శకునికిని మమతా పరిత్యాగపూర్వకమైన సమదృష్టి అవసరము. నిజమునకు సారస్వతమునకు సరియైన విలువ నిర్ణయించువాడతడే. కాలమునుబట్టి సారస్వతపు విలువలుకూడ మాఱు చుండును.

కావ్యమునకు కీర్తి, అర్థము, వ్యవహార నేత్తృత్వము, అమంగళ పరిహరణము, సద్యఃపరనిర్వృతి, ఉపదేశము ప్రయోజనములని సంస్కృత లాక్షణికులు నిర్వచించిరి. వీనిలో మరల నానందమునకే వారధిక ప్రాధాన్యము నొసంగిరి. ఉపదేశమును వారుపేక్షింపక పోయినను దాని కానందము తరువాతి స్థానమునే యొసంగిరి. ఆనందోపదేశములు రెండు నొసంగు కావ్యమత్యుత్తమమని వారియభిప్రాయము. ఆంధ్రవాఙ్మయమును పరిశీలించినచో దొల్లింటి కాలమునఁగవులు ధర్మనీతి తత్త్వరూపమైన యుపదేశమునకు దరువాతి కవులానందమునకును అధిక ప్రాధాన్యమొసంగి నట్లు కనుపించును. దక్షిణాంధ్రయుగమున పలువురుపదేశము విషయమును పూర్తిగా విస్మరించిరని చెప్పవచ్చును. అందుచేతనే అప్పుడు అహల్యా సంక్రందనము, తారాశశాంక విజయము సారంగధరచరిత్ర మున్నగు కావ్యములు వెలువడినవి. మొత్తముమీఁది ఆధునిక యుగారంభము వఱకును వెలువడిన వాఙ్మయమున సంఘదృష్టి తక్కువగాఁగనిపించును.

"కావ్య మానందము కొఱకే; కావ్యముపదేశము కొఱకే; కళ కళ కొఱకే; కళా కావ్యములు సంఘశ్రేయమునకే" అనునభిప్రాయములలో నొకొక్కకాలమున నొకొక్కదానికిఁ ప్రాచుర్యము లభించినది. ఆ ప్రాచుర్యమునుబట్టియే కవులు రచనలు సాగించిరి, వాని విలువయుఁ దదను

గుణముగనే వర్తిల్లినది. ఉపదేశదృష్టితోఁజూచిన నానంద ప్రధానమైన కావ్యమధమమనిపించును. సంఘశ్రేయోదృష్టితోఁజూచిన కళాప్రధానమైన కావ్యము కమనీయమనిపించును. అందుచే విమర్శకులు విమర్శించునప్పుడు మాఱుచున్న విలువలనుగూడ దృష్టియందుంచుకొనవలసిన ఆవశ్యకమెంతైన నున్నది. అట్లుచేయనిచో సారస్వతము నందలి కొంత భాగము కొఱమాలినదిగాఁగనిపించును. రచయితలు సహితము మాఱుచున్న విలువలు గుర్తించవలసిన అవసరమున్నది. సంఘ తత్కాలపరిస్థితులే కొంత వఱకు వారియందట్టి పరివర్తనము కలిగించును. వారది గ్రహించి ప్రతిభా సంపదచే దానికి ప్రశంసనీయము, పరమోదాత్తమునైన రూపమొసంగి రచనలు సాగింపవలయును. "శ్రీ శ్రీ" 11వ శతాబ్ధిలో జనించియుండినచో నే పురాణమునో యనువదింపఁబూనియుండును; అట్లే నన్నయ యిరువదవ శతాబ్దమున నవతరించిన అభ్యుదయ కవితామార్గమును బట్టియుండును. మాఱుచున్న విలువలు గుర్తింపనివారు మార్పునకిష్టపడక గతానుగతికమైన విధానమునే యనుసరింతురు.

విలువలెంత మాఱినను ప్రాణభూతమైన లక్షణమేదోవిధముగా నిల్చి ప్రాభవము వహించుచునేయుండును. కవులను రచయితలను మాఱుచున్న విలువలదృష్టితో సానుభూతితో పరిశీలింపవలసిన యావశ్యకత సద్విమర్శకుల కెంతకలదో విమర్శకుల విమర్శలను పరిశీలించి తమరచనలందలి దోషములను బరిహరించి వానిని గుణోత్తరములుగా చేయవలసిన యావశ్యకత రచయిత లందును అంతకలదు. విమర్శకులును రచయితలును ఈఆవశ్యకతను గుర్తింపని నాఁడు వారి విమర్శల వలనను రచనలవలనను సారస్వతమునకుఁగాని లోకమునకుఁగాని యెట్టిలాభము నుండదు. సద్విమర్శకుఁడు రచనలందలి గుణమును చక్కగా గ్రహించి తదభివర్ధన మార్గములను సూచింపవలయును రచయితలు సద్విమర్శక సూచితమార్గముల నవలంబించి గుణవద్రచనా సృష్టిచే వాఙ్మయమును పెంపొందింపవలయును.

వస్తువు, భావము, భాష, ఔచిత్యము, విలువ లేక ప్రయోజనము అనునవి కవిబ్రహ్మ సృష్టికుపాధులైన పంచభూతములు. కవులీపంచ భూతముల విషయమున నెంతైనశ్రద్ధ వహింపవలయును. విమర్శకుఁడు దేశకాల పరిస్థితుల ననుసరించి యవి యేవేవి యెట్లుండవలయునో యెట్లుండిన లోకమునకును సారస్వతమునకును శ్రేయమావహిల్లునో సూచింప

వలయును. రచయితలా సూచనలను బరిశీలించి యుపాదేయము లైనవానిని గ్రహింపవలయును. ఈ విధముగా విమర్శక రచయితలకపరిహార్యమైన సంబంధమున్నది. ఆ సంబంధము గుర్తింపఁబడనినాఁడు విమర్శకులదారి విమర్శకులది, రచయితలదారి రచయితలది అగును. అప్పుడొకదానివలన నింకొకదానికి ప్రయోజనముండదు. ఆధునికకాలమునన్లే జరుగుచున్నది. విమర్శకులును,రచయితలును తమకర్తవ్యమును గుర్తించి వాఙ్మయమును శ్రేయస్కరమైన అభ్యుదయమార్గమున ప్రవర్తింపఁ జేయుదురుగాక.

卐

శ్లో॥ ఇదమంధం తమః కృత్స్నం జాయేత భువనత్రయం
యది శబ్దాహ్వాయం జ్యోతి రాసంసారం నదీప్యతే॥

卐 卐

ఏమైనా జీవితాన్ని సమగ్రంగా దర్శించడమూ,
జీవిత వైవిధ్యాన్ని గుర్తించి స్పందించడమూ
చాలా అవసరమేమో అనుకుంటాను. పాఠీకవాదులు
జీవితంలో ఒకవైపే, ఒకభాగాన్నే చూసి ఎంతో
విశిష్టమైన అనుభూతి ఆవరణని miss అయిపోయా
రేమోనని అనిపిస్తుంది.

—తిలక్.

For Bumper Crops ANDHRA BANK GIVES YOU 'BUMPER SEEDS'!

...That is, bagfuls of MONEY
Money, the essential 'seed'
of Agri-Business.



For Agricultural finance, contact:

THE ANDHRA BANK LTD.

(The Bank with the widest network of Branches in Andhra Pradesh)

Central Office: Sultan Bazar, Hyderabad

K. GOPAL RAO, *Chairman*

M. V. Subba Rao, *General Manager*

FDSAB 1228

Compliments from :

K A M A L

P R I N T E R S

PHOTO-OFFSET & LETTER PRESS PRINTERS

Phone : 77747

1-7-155, Bakaram : HYDERABAD-20

(ANDHRA PRADESH)

రచయితలు - విమర్శకులు

శ్రీ కె. వి. రమణారెడ్డి

ప్రతికూల విమర్శల తీవ్రతకు తట్టుకోలేక సుకుమార హృదయుడైన కీట్సుకవి కృశించి నశించాడనే కథ ఒకటి తరచూ వినబడుతుంది. ఇది కట్టుకథ. విమర్శకుడు కామరూపియై క్షయవ్యాధి క్రిమిగా మారి కీట్సు ప్రాణాన్ని బలితీసుకొంచేనే ఈ కథకు కాళ్లూచేతులూ ఉంటాయి. అయితే దేహానికి తగిలిన గాయాలు మరునాటికల్లా చెక్కుగట్టి త్వరలో మానిపోతాయి గాని "సుకుమారపు హృదయానకు" తగిన గాయాలు చాలాకాలం సెలవేస్తూ సలుపుతూ పోతాయి.

విమర్శలవల్ల ఏ రచయితా కలందించి రచనా సన్యాసంచేసి ఉండడు. అలాగే అయితే, ఇటీవలి కాలంలో ఇబ్సెన్ నాటకాలు గానీ విట్మన్ వచన పద్యాలుగానీ లోకానికి దక్కిఉండేవేకావు. విమర్శల సుడిగాలి కెదురుగా నడిచి ఆ ఇద్దరూ తమ వ్యక్తిత్వాన్ని నిలుపుకోగలిగారు. విమర్శకులు వీగి పోయారు. సాహసమంచే సరికొత్త ప్రయోగమంచే భూతంలా కనుపించడం సాంప్రదాయవాదులకు రివాజే. మూసలో పోసి తీసినట్లుగా రచనలు వెలువడే రోజుల్లో కొత్తపుంతలు తొక్కేవాళ్ళకు విమర్శకులవైపునుంచి తీవ్రమైన వ్యతిరేకత వెలువడుతుంది. ఆ రచయితలకు ఇది అక్షరాలా అగ్ని పరీక్ష. దానిలో నెగ్గినవాడే చరితార్థుడు.

అంచే విమర్శకుడు త్రికాలవేది కాడు, కాలేడు, అన్న మాట. అలా అహంకరించేవాడు దూరుపడకతప్పదు. ఉదాహరణకు మేక్స్ నోర్డోనే తీసుకుందాం. ఆధునిక కవిత్వ రీతులమీద పరశుధాటిగా విరుచుకుపడి అందులో చెడునే గాని మంచిని ఇసుమంతైనా చూడలేక పోయాడు. చివరి కేమయ్యాడు? చూపుపోయినవాడిగా, కటిక మనిషిగా తన పేరును చలామణి చేసుకున్నాడు. తెలుగులో భావకవిత్వం రెక్కలు పూన్చుకొంటూన్న రోజుల్లో అక్కిరాజు ఉమాకాన్తుడు కూడా ఇలా ఏటికి ఎదురీదబోయి రెక్కలు విరుచుకున్నవాడే. ఇంకా ఇటీవలికివస్తే రా. రా. వంటి విమర్శ

కులమీద వాళ్ళచేత చావుదెబ్బలుతిన్న రచయితలవై పునుంచి రాతుస మనస్కులనే నింద వచ్చిపడుతున్నది.

గుణ దోష నిరూపణంలో దోషాలను అవగణించి, గుణాలను నిరూపించగలవాడే మంచి విమర్శకు డనిపించుకుంటాడని అంటారు. దోషాలను అవగణించడమంటే వాటికి కళ్లు మూసుకోవడంకాదు. అవి ఎంత కొమ్మ్రీలిరిగిన రచయితలోనైనా ఉంటాయి. వైకికనిపించకపోయినా వెదకడం మొదలుపెడితే మంచంలో నల్లుల్లా బయటపడకపోవు. అయితే దోషనిరూపణమొక్కటే విమర్శకుని పనికాదు. అందులో సగమైనాకాదు సగమే అని లెక్కవేసి ఒప్పించినా, మేలైన సగంకాదు. చంద్రుడిలో కళంకాన్ని మాత్రమే చూస్తే ఎట్లా? మేఘంలోని నల్ల డాగునే చూసి దాని మెరుగంచును చూడకపోతే ఎట్లా? గుణాన్ని గ్రహించి, దాన్ని వివరించి చెప్పి, రచయితకూ రచనకూ న్యాయం చేకూర్చడమే నిజమైన విమర్శక ధర్మం. రాయప్రోలు సుబ్బారావుగారి పద్యాల్లోంచి కీతసరుకును మాత్రమే ఏరి తమ గ్రంథంలోని దోషప్రకరణానికి ఉదాహరణలు చూపించిన అలంకార శాస్త్రపండితుడేమనిపించుకొన్నాడు?

విమర్శకుడు సహృదయుడు అయితీరాలి. సహృదయుడనే మాట ఈ రోజుల్లో బాగా వాడుకలోకివచ్చి బాగా తేలికపడిపోయింది. కృష్ణశాస్త్రిగారి ఊర్వశిని గురించి నేనొక వ్యాసంవ్రాశాను. రవీంద్రుని ఊర్వశికంటె ఇది భిన్నమని వివరించాను. కృష్ణశాస్త్రిగారిని అనరాని మాట లంటున్నాననుకొన్న పత్రికాసమీక్షకు డొకరు నా విమర్శలో సహృదయత లోపించిందన్నారు, ఇలా రచనను ఏమాత్రం "విమర్శగా" చూసినా అదిగో నీలో సహృదయత కొరవడిందని ఎత్తిచూపే సహృదయులు ఎందరో ఉన్నారు. వీరి ఉద్దేశంలో సహృదయత అంటే సుహృదయతమాత్రమే. హృదయం మంచిది అయి ఉండాల్సిందే విమర్శకుడికి, సందేహంలేదు. అయితే అది పాదరసం పెలిసిన అద్దంలాంటిది కాకూడదు. దానిలో ప్రతిబింబాలు స్పష్టంగా పడాలి. రచనలోని నాయికా నాయికలయొక్కగాని, ఘటనలయొక్కగాని మారురూపాలు ఎవని స్వచ్ఛమైన మనోముకురాన పడి రచయిత ఉద్దేశించిన భావాల్లాంటివి ఎవనిలోకూడ కదలాడుతాయో వాడే సహృదయుడు. అతగాడు పాఠకోత్తముడు కాగలగాలి. రచయిత కోరుకొనేటట్లా అలాంటివాణ్ణే. రచన సఫలమయ్యేదట్లా అలాంటివాడుంటేనే

రచయితే విమర్శకుడు కాగలిగితే ఎలా ఉంటుంది? బాగానే ఉంటుందేమోగాని అలాంటి విమర్శకుడు నిర్మమంగా ఉండడం సాధ్యపడక పోవచ్చు. అయితేనేమి, కనీసం తన రచనలో పొదివిపెట్టుకున్న సొగసులను పూర్తిగా తన దృక్పథం నుంచయినా అనన్యంగా విమర్శించి చూపగలడు కదా! రచయితకూ పాఠకుడికీ మధ్య విమర్శక నామధేయుడై మూడో మనిషి వచ్చిదూరి ఉభయులకూ అన్యాయం చేయడంకంటే రచయితే విమర్శకరూపం తాల్చివస్తే నయంకాదూ? స్విన్‌బర్న్‌ గురించి రాస్తూ టి. యస్. ఇలియట్ ఇలాంటి మాటలే ఒకచోట అంటాడు. నిజానికి తానూ ఆలాటి ఇంకో ఉభయచరజీవేకాబట్టి ఈ మాటలు తనకూ అన్వయిస్తాయి.

అయితే ఒక చిక్కు. అది పెద్దదే. ఏమిటంటే, విమర్శకవ్యాపార మనేది స్వతంత్ర రచనోత్సాహంమీద నీళ్లుచల్లి రచయితను చల్లబరచి వేస్తుందని కొందరంటారు. అంటే, స్వతంత్ర రచనావ్యాసంగమూ విమర్శక వ్యాపారమూ పరస్పర బాహ్యాలని ధ్వని. అంతేకాదు, విమర్శఅనేది పరోపజీవి మాత్రమేననికూడా ధ్వని. ఇది అందరికీ అన్ని కాలాల్లో వర్తించవలసిన సార్వజనీనమైన సత్యం కానక్కర్లేదు. స్విన్‌బర్న్‌, ఇలియట్‌లకంటె ముందు కోలరిజ్, డ్రైడన్‌లు ఇటీవలి ఆర్నాల్డ్, ఆడెన్‌లు అపవాదంగా నిలుస్తారు. మన శ్రీశ్రీ నే తీసుకొందాం. లేకుంటే విశ్వనాథవారిని తీసుకొందాం. ఇతర విమర్శకులకు ఎందులోనూ తీసిపోనివిధంగా, సామాన్యవిమర్శకులకు కనిపించని రచనా రహస్యాలనూ, శిల్ప సూక్ష్మాలనూ ఆ ఇద్దరు రచయితలు అనాయాసంగా చూపించగలుగుతున్నారు. కాబట్టి విమర్శకజాతి, రచయితల జాతి అంటూ రెండు విడివిడిగా, ఆ యింటిమీద వాలిన కాకి ఈ ఇంటిమీద వాలకూడదన్న చందంగా ఎడపెడగా, జీవించనక్కర్లేదు.

ఇంతకీ విమర్శకుడూ రచయితా శత్రువులేమీకాదు. వెనకటికి మన కవులంతా కుకవి నింద పేరిట తమ రచనల విమర్శకులను దుయ్యబట్టారనే ఊహ ఒకటి ఉంది. "కుకవి" విమర్శకు డెలాగయ్యాడో! కవిగా రాణించలేక విమర్శకు పూనుకొనేట్లు విమర్శకులను ఆక్షేపించడమనేది అన్ని కాలాల్లోనూ, దేశాల్లోనూ ఉంది. ఇదికూడా సార్వజనీనమైన యథార్థంకాక పోవచ్చు. జమీందారీయుగానికి ముందునుంచి కూడా, పండితులకూ కవులకూ మధ్య పచ్చిగడ్డివేసినా భగ్గుమనేంత వైరం మన తెలుగుదేశంలో

ఉంటూ వచ్చింది. విద్వత్కవుల మాట అటుంచి పాండిత్య సంభారం శిరోభారంగా మారి రచయితను విమర్శకుడిగానో ఆక్షేపకుడుగానో మారుస్తుందనడంకూడా అలాంటి పాక్షికసత్యమే. అడిదంసూరన, కేకపల్లి సోమప్ప కవుల పద్యవివాదం, పాండిత్య, కవిత్వాల అంతరాన్నిమట్టుకే పురస్కరించుకొని వెలువడింది కాదు. నియోగి వైదీకి కాట్లాటలు. సంస్కృతాంధ్రాల పోట్లాటలు – ఇవికూడాఅందులో దూరి ఉన్నాయి.

విమర్శకుడు పరోపజీవి (Parasite) మాత్రమేనా? నిజమే, రచన అనే ఆధారంలేకుండా విమర్శ సాగదు, సాగే వీలూలేదు. అట్లని? విమర్శలో కూడా రకాలు, అంతరాలు ఉంటాయి. ఉత్తమమైన విమర్శ గొప్ప రచనగా తన కాళ్ళమీద తానే నిలువగలదు. విమర్శకుని సాయంలేకుండా గొప్ప రచనకూడా నిర్లక్ష్యంవాతపడి మాటుబడి ఉండవచ్చు.

రచయిత – విమర్శకుడు కులవైరులుకారు, దాయాదులుకారు. ఒకే చేతిలోని పక్కపక్క వేళ్లు అంటే బాగుంటుంది.

★

"చావు పుట్టుకలమధ్య సందేహంలాంటి
జీవితంలో నలువైపులా అంధకారం
మంచిగంధంలాగ పరిమళించే మానవత్వం
మాకున్న ఒకే ఒక అలంకారం."

—తిలక్.

రచయితలు - ప్రభుత్వం

శ్రీ ఏ. వాసుదేవరావు
(సమాచార, పౌరసంబంధ శాఖా మంత్రి)

సాహిత్యకారునికి సమాజంలో అనాదిగా గౌరవస్థానంవుంది. నవపథ నిర్దేశకునిగా, ప్రగతి రథచోదకునిగా అతను పరిగణించబడుతున్నాడు. చరిత్రను పరిశీలించినట్లయితే సాహిత్యకుడు అన్ని కాలాలలోనూ అటు పాలకుల ఆదరణనూ, యిటు ప్రజల అభిమానాన్నీ పొందినట్లు విదితమవుతుంది. ఈ విధంగా రచయిత సంఘంలో విశిష్ట ప్రతిపత్తిని కలిగివుండడానికి అతని కార్యక్షేత్రమే కారణం. ప్రజలకు ఉత్తమ వినోదాన్నీ, విజ్ఞానాన్నీ, ప్రబోధాన్ని కలిగించే ఉత్కృష్టమైన, మార్గదర్శకమైన సాహిత్యాన్ని సృష్టించడం రచయిత ధర్మం. ఇట్టి ఉదాత్త ధర్మాన్ని ఆచరించవలసినవాడు కనుకనే అతను గౌరవనీయుడయ్యాడు.

రవికి సాధ్యంకానిదికూడా కవికి సాధ్యమవుతుందనీ, అతను నిరంకుశుడనీ అన్నారు. అంటే అతని భావనాపరిధి ఎల్లలులేనిదనీ, అతని సాహితీ కృషికి అసంబద్ధమైన పరిమితులు, నిర్బంధాలు విధించే అధికారం ఎవ్వరికీ లేదనీ అనుకోవచ్చు.

తనకాలానికీ, యుగానికీ సంబంధించిన ధర్మాన్ని తన రచనల్లో ప్రతిఫలింపజేయడం ఉత్తమ రచయిత లక్షణం. సార్వజనీనమైన సంప్రదాయాలనూ, మర్యాదలనూ అతను సాధించవలసివుంటుంది. ప్రవాహానికి ఎదురీదే నిరర్థకమైన ప్రయత్నాలకు అతను స్వస్తిచెప్పవలసివుంటుంది. అప్పుడే అతను జనరంజకుడైన సాహిత్యకుడుగా మనగలుగుతాడు. కనుక అతను నిరంకుశుడే అయినప్పటికీ ఈ మినహాయింపునకు మాత్రం అతీతుడు కాడు.

రచయిత వర్తమాన యుగధర్మాన్ని తన రచనల ద్వారా ప్రబోధించాలని పైన చెప్పాను. నేటి యుగధర్మం ప్రజాస్వామ్యం. కనుక ప్రజాస్వామిక విధానం, వ్యవస్థ, మూడుపూలు, ఆరుకాయలు చందంగా పరిఢవిల్లడానికి రచయిత తోడ్పడాలి. సమాజంలో చైతన్యం వెల్లివిరియు

డానికీ, అభ్యుదయకరమైన మార్పులు రావడానికీ అతను తన "కలం" ద్వారా ప్రజలను సమాయత్తంచేయాలి ఆరోగ్యప్రదమైన ఆలోచనలను, భావాలను ప్రోత్సహించడానికీ, అవాంఛనీయమైన ధోరణులను అరికట్ట డానికీ అతని లేఖని ఉపకరించాలి.

కవులకు లభించిన ఆదరణలోనూ, వారి రచనా ప్రయోజనంలోనూ నాటికీ, నేటికీ వ్యత్యాసంవుంది. పూర్వకాలంలో కవిపండితులను చక్ర వర్తులు, రాణులు, జమీందార్లు యితర కులీన వంశస్థులు ఆదరించారు, పోషించారు. దీనికి తగ్గట్లుగా వారు తమ కవితా ప్రతిభను, పాండితీ ప్రకర్షను తమ పోషకుల గుణగణాలను, ఔదార్యాన్ని స్తుతించడానికి, వారికి ప్రియములై నటువంటి విషయాలను వర్ణించడానికీ వినియోగించవలసి వసుండేది. అయితే ఆనాటి కవిత్వమంతా యిలాంటిదేనని నా ఉద్దేశంకాదు. ఈ కోవకుజెందని అపూర్వమైన గ్రంథాలు ఎన్నోఆకాలంలో వెలువడ్డాయి. వాటి సృష్టికి ఎందరో ప్రభువులు ప్రోత్సాహం యిచ్చారు.

ప్రజాస్వామ్యంలో పాలకులంటూ ఒకవర్గం వుండదు. ప్రజలు ఎన్ను కున్న ప్రతినిధులు పరిపాలన నిర్వహిస్తారు. అందరికీ తెలిసిన ఈ విషయా లను వివరించి చెప్పనవసరంలేదు. పరిపాలనా వ్యవస్థలో వచ్చిన ఈ తీవ్ర మైన మార్పు ప్రభావం కవుల అస్తిత్వంలో, వారి కవితాప్రయోగంలో కూడా ప్రతిఫలిస్తున్నది. ఈనాడు కవులకు రాజపోషకులు, మహారాజపోష కులులేరు, అతని జీవన భారాన్ని అతనే మోయవలసివుంటుంది. అలాగే తమను కీర్తిస్తూ కృతులు కూర్చమనికానీ, ఫలానా విషయంపై కవిత్వం చెప్పమని కానీ, కవిని శాసించేవారుకూడా యిప్పుడులేరు. కనుక లోకహిత మైన, ప్రయోజనాత్మకమైన అంశాలను తన రచనకు వస్తువుగా స్వీకరించి సమాజంపట్ల తనకుగల బాధ్యతకు పూర్తిగా న్యాయంచేకూర్చడానికి యిప్పుడు రచయితకు మంచి అవకాశంవుంది. యీ అవకాశాన్ని చక్కగా ఉపయోగించుకొనినట్లయితే అతను తన బాధ్యతను విస్మరించినవాడు, నిర్లక్ష్యంచేసినవాడు అవుతాడు.

స్థూలంగా ప్రభుత్వ ధ్యేయం ఏమిటో రచయిత లక్ష్యం కూడా అదే. ప్రజాశ్రేయస్సుకోసం, సమాజకళ్యాణంకోసం వీరుభయులూ పాటు

పడాలి. కనుక ప్రభుత్వం అనులుజరిపే అభివృద్ధికరమైన కార్యక్రమాలకు రచయిత తగు విధంగా మద్దతునివ్వాలి. ఇదేవిధంగా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు ప్రజాహితమునకు వ్యతిరేకంగావున్నయెడల అతను నిర్భయంగా ఖండించాలికూడా.

తన రచనల ద్వారా సమాజాన్ని ప్రభావితంచేసే శక్తి రచయితకు వుంది. దీనికి దృష్టాంతరాలు చరిత్రలో అనేకం కనిపిస్తాయి. ఫ్రెంచివిప్లవం సందర్భంలో ప్రజలను ప్రభావితులను చేయడంలో రచయితలు అత్యంత ప్రధాన పాత్ర వహించారు.

అటు జాతిని జాగృతంచేసే వైతాళికుడుగానూ, ఇటు ప్రభుత్వానికి కనువిప్పుకలిగించే మార్గదర్శిగానూ రచయితను చెప్పుకోవచ్చు, ఒక విధంగా అతను ప్రజలకూ, ప్రభుత్వానికీ మధ్య అనుసంధాతకూడా. ప్రజాభిప్రాయాన్ని తన రచనలో వ్యక్తంచేయడం, ప్రభుత్వం నిర్వహించే అభ్యుదయకరమైన ప్రణాళికలనుగురించి ప్రజలకు వివరించడం అతను చేయాలి. అతను చేసే వ్యాఖ్యలు, విమర్శలు పాటికమైనవిగా కాక నిర్మాణాత్మకమైనవిగా వుండాలి. అతను చేసే సూచనలు, సలహాలు ప్రజలను పెడత్రోవలు పెట్టించేవిగా కాక సక్రమ మార్గంలో నడిపించేవిగా వుండాలి.

ఇటీవల మనరాష్ట్రంలో విపరీతమయిన ధోరణులు తలెత్తిన సందర్భంలో రచయితలు వాటిని గట్టిగా వ్యతిరేకించినందుకు వారు అభినందనీయులు, ఇటువంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు మౌనంగా, ముభావంగా వుండిపోకుండా విజ్ఞతతో వ్యవహరించినప్పుడే వారికి సార్థకత్వం వుంటుంది.

సాహిత్యకుడు ప్రభుత్వంపట్ల, ప్రజలపట్ల కొన్ని బాధ్యతలను నిర్వర్తించవలసివున్నట్లే వీరుభయులు కూడా సాహిత్యకుని విషయంలో కొన్ని విధులు నిర్వహించవలసివుంది, రచయిత తన రచనావ్యాసంగాన్ని నిరాటంకంగా కొనసాగించడానికి అనువైన పరిస్థితులను ప్రజలూ, ప్రభుత్వమూ కల్పించవలసివుంటుంది.

రచయితల కష్టనిష్టూరాలను గురించి ప్రభుత్వానికి తెలుసు. తాము వ్రాసిన పుస్తకాలను అచ్చువేసుకోవడంలోనూ, అమ్ముకోవడంలోనూ

వారు ఆనేక అవస్థలు పడుతున్నారు. రచయితల సంక్షేమాన్ని గురించిన ఆలోచన ప్రభుత్వానికివుంది. సాహిత్య అకాడమీ, రచయితల సహకార సంఘాలు మొదలైనవి యీ ఆలోచనతో ఏర్పాటు చేయబడినవే.

ఏమయినప్పటికీ రచయిత, సమాజంలో తాను నిర్వర్తించవలసిన గురుతరమయిన పాత్రను గుర్తించి తదనుగుణంగా నడుచుకున్నప్పుడు ప్రభుత్వము, ప్రజల సహాయ సహకారాలు అతనికి అవశ్యం లభించితీరు తాయి. కనుక యీ విషయంలో చొరవతీసుకొనవలసిన బాధ్యత రచయితల మీదనేవుంది.

★

సమానదర్శుల హృదయస్పందనం శిరశ్కంపనం
అదే గీటురాయి అసలైన కవిత్వానికి
వానలాగ ప్రజల హృదయాల్లో వర్షించి
కొత్తభావాల బీజాలు జల్లేది కవిత్వం.

卐 卐

ప్రజాస్వామ్యాన్ని అంగీకరిస్తూనే కవి
మెజారిటీకి అందని ఊహలు వెదకాలి.

—శ్రీశ్రీ

రచయితలు - ప్రచురణకర్తలు

శ్రీ యం. యన్. రావు

ఈ వర్తమానకాలంలో – సాంఘిక విలువలు త్వరత్వరగా మారిపోతున్న రోజుల్లో రచయితల, ప్రచురణ కర్తల పరస్పరానుబంధము ఏమిటి? ఎలా వుండాలి? ఈ ప్రశ్నకు సమాధానము వెతకటమే ఈ వ్యాసము యొక్క ఉద్దేశ్యము.

రచయితల భావాలపట్ల, ఉద్దేశ్యాలపట్ల ప్రచురణకర్త ఏకపక్ష వాదిగా వుండరాదు. ఏ ఉద్దేశ్యమైనా, ఏ భావమైనా, దానిలో నిజాయితీ, కొత్తదనము, సరిగా, సవ్యముగా, అర్థమయ్యేటట్లుగా ఉంటే దానిని ప్రచురణజేసి ప్రజాబాహుళ్యానికి భావనా ప్రపంచానికి అందజేయటం ప్రచురణకర్త యొక్క కర్తవ్యము. ఆ భావములో ప్రజలకు ఆసక్తి ఉంటుందా? ఉన్నట్లయితే ప్రజాబాహుళ్యమునకు ఆ భావనలు, ఉద్దేశ్యాలు తెలుసుకునే అర్హత, హక్కు వున్నది. దాని మంచి చెడులు నిర్ణయించేది ప్రజలేకాని ప్రచురణకర్త కాదు.

పుస్తక ప్రచురణ ఒక వ్యాపారమూకాదు, ఒక వృత్తికాదు, ఒక కళాకాదు — యీ మూడింటి సమన్వయమే పుస్తక ప్రచురణ. యీ సమన్వయము చాలా కష్టమైనపని. దీనికి కావలసిన గుణగణాలుకూడ అతి క్లిష్టమైనవే. ప్రచురణకర్తకు కొంచెము సాహిత్యములో అభిరుచి ఉండాలి. దానికోసం ఎక్కడ వెతకాలో కొంత తెలిసివుండాలి. దానికంటే గూడా వ్రాతప్రతులు ఎన్నుకోవడంలో ఒక విధమయిన చురుకుదనము, చురుకుదనముతోకూడిన ఆస్థ వుండాలి. ఇవే కాకుండా దానిని ఆకర్షణీయంగా పుస్తకరూపంలో ఏవిధంగా తయారుచేయాలి అనేటటువంటి సాంకేతిక విజ్ఞానము, కళాదృష్టి కొంతకావాలి. దానికి కావలసిన కాగితము, అచ్చు అక్షరముల కుదింపు, దానికి కావలసిన బైండింగు ఇత్యాది విషయములలో సాంకేతిక విజ్ఞానము, నిపుణత, దానిని అందముగా తయారు చేయాలనేటువంటి కళాదృష్టి వుండాలి. తాను తయారుచేసిన పుస్తకములకు సరిగా న్యాయము చేకూరాలంటే వాటిని ప్రజల దృష్టిలోనికి,

అందుబాటులోనికి తీసుకొనివెళ్లి అగ్గిపగలిగి వుండాలి. ఏ విధముగా ఎక్కడ వానిని అమ్మవలెనో, ఎక్కువమంది పాఠకుల అందుబాటులోనికి ఏవిధముగా ససరమైనధరలో అందజేయవలెనో అతనికి బాగుగా తెలిసిఉండాలి. ఇవన్నీ కూడా చాలవు. ఇంకా అతనికి కొంతన్యాయశాస్త్ర పరిజ్ఞానము అవసరము. రచయితలతో ఎగ్రిమెంటులు రాయడము, వారితో సవ్యముగా సంబంధం బాంధవ్యాలు పెట్టుకోవడము, ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడము, కాపీ రైటు ఆక్టుకు సంబంధించిన వివరాలు తెలుసుకోవడం ఇవన్నీ చాలా అవసరము. యీ విధముగా పుస్తక ప్రచురణలోని అన్ని విభాగములందు కొంత పరిజ్ఞానము కలిగివుండటము కొంత క్లిష్టతరమే. కాని ఈ రోజుల్లో పుస్తక ప్రచురణ కొంత వృత్తినిపుణతతో చేయాలంటే ఇవి చాలా అవసరము.

ప్రచురణకర్తలంటే కొన్ని అపోహలు, కొన్ని వేరే అభిప్రాయాలు వున్నాయి. ప్రచురణకర్తలు పూర్తిగా పరోపకారులుకారు. పూర్తిగా దొంగలూకారు. ఆలాగే వారు కుబేరులుకారు. అడుక్కుతినే బైరాగులు కారు. ఒక క్లిష్టతరమైన వృత్తిలో జీవనోపాధి సంపాదించుకునేందుకు ప్రయత్నంచేసే సామాన్య మానవుడే. ప్రచురణకర్త గావటము తేలికే, గాని దాంట్లో నిలబడటము చాలాకష్టము. దీనిలో బాలారిష్టాలు చాలా ఎక్కువ.

రచయితలకు ఒక మనవి. ప్రచురణకర్తకు మీమీదకంటే మీరచనలో ఎక్కువ ఆసక్తి వుంటుందని గ్రహించాలి. మీరచనే మిమ్మల్ని గురించి ఎక్కువగా చెప్పేటటువంటి రాయబారి. అందుచేత మీ రచనలనుగురించి వేరే సిఫార్సులను తీసికొనివెళ్లి ప్రచురణకర్త కాలం వృధాచేయకండి. మీరచన బాగుంటే మీదగ్గరకే వెంటనే వస్తాడు ప్రచురణకర్త.

మీరచన ప్రతిభావంతముగావచ్చు. కాని అది ప్రతిభావంతమని మీరే చెప్పకండి. ఎందుకంటే ప్రచురణకర్తవద్ద ఆ విధముగా ప్రతిభావంతములని చెప్పియిచ్చిన రచనలు చాలా వుండివుండవచ్చు. ఒక్కొక్కప్పుడు ప్రతిభావంతమైన రచనలు వానినిగురించి గొప్పగా చెప్పకుండానే వస్తూవుంటాయి. వానికోసమే ప్రచురణకర్త ఎదురు చూస్తుంటాడు.

మీరచన మీ ముద్దులబిడ్డ కావచ్చు. ఈమాదిరి చాలా ముద్దుబిడ్డలు ప్రచురణకర్త కార్యాలయంలో అతని దృష్టికోసము ఎదురుచూస్తుంటాయి. అందరికీ ఒక్కసారిగా శ్రద్ధచూపలేడు కదామరి. ఎంత ఉదారుడైనా మీ

ముద్దుబిడ్డమీద అతను చూపగలశ్రద్ధ కొంతవరకేనని గ్రహించండి. అది ఎక్కువగా చూపలేదని అనవసరంగా ఆతన్ని విసిగించకండి.

మీ రచన – మీ ప్రాతప్రతి – సరిగా ప్రచురణకర్త దృష్టిలోనికి పోవాలంటే మీ ప్రాతప్రతిని తయారుచేయడంలో శ్రద్ధచూపండి. మీరు ఎంతజాగ్రత్తగా మీ ప్రాతప్రతిని క్రమపద్ధతిలో తయారుచేస్తారో ప్రచురణకర్తకు దానిమీద శ్రద్ధ చూపి ఎన్నికచేయటం అంత తేలిక. ప్రచురణకర్తతో సమావేశముకంటే మీ ప్రాతప్రతిని తగురీతిలో తయారుచేయటము ఎక్కువ ముఖ్యము.

ప్రచురణకర్త సామాన్య మానవుడే కనుక అతని ఎన్నికలలోను అతని నిర్ణయాలలోను లోపాలు, పొరపాట్లు వుండవచ్చు. ఈ ప్రచురణ పొరపాట్లు ప్రచురణకర్త వ్యాపార ఖాతాలో చాలా ఖరీదైనపద్దు.

మీ రచనను ప్రచురణకు వీలులేదని మీకు తిప్పిపంపుతే ఆ నిర్ణయం పొరపాట్లుచేయగల ప్రచురణకర్త చేశాడని అనుకోండి. దానికి కారణాలు ఏమిటని గట్టిగా అడక్కండి. సామాన్యముగా అతను కారణాలు చెప్పనట్టి అవివేకిగా వుండడు. ఎవరి రచన ఆ రచయితకు ముద్దుబిడ్డ కాబట్టి ఆ ముద్దుబిడ్డ పొగడ్తలే వినాలనుకుంటాడు రచయిత.

మీ రచనను ప్రచురణకు తీసుకున్నట్లయితే, చివరకు దానియొక్క విలువలు, రాబడి నిర్ణయించేది, పాఠకులే. ఒక్కొక్కప్పుడు పాఠకుల ఆస్థలు నిలుకడలేనివిగా వుంటాయన్నసంగతి గుర్తుంచుకొండి. ఒక్కొక్కప్పుడు సాహిత్య విలువలులేని రచనలు ఎందుకో తెలియకుండా వారు విపరీతముగా ప్రోత్సహించవచ్చు. అదే సమయములో మంచిసాహిత్యపు విలువలను వారు సరిగా ఆదరించకపోవచ్చు. దీనికి బాధ్యుడు ప్రచురణకర్తకాడు. పాఠకులు మీ పుస్తకాన్ని కొనకపోయినచో తనకి డబ్బుచేసుకోలేడు, మీకు డబ్బు చేసిపెట్టలేడు.

తళతళా మెరిసేదంతా బంగారముకాదు, దినపత్రికలలోను, వార పత్రికలలోను పెద్ద పెద్ద ప్రకటనలు కనిపించనంత మాత్రాన అది బాగా అమ్ముతున్నదని భ్రమపడరాదు. పుస్తకాలను విరివిగా పంపిణీచేసి దేశం నలుమూలలా పాఠకులకు అందుబాటులో వుండేటట్లు చేయడం చాలా శ్రమతోకూడినపని. ఇది వేకమేడలా కాకుండా ఇటిక ఇటికతోను చాలా జాగ్రత్తగా కట్టుకురావాలి. ఒక పుస్తకాన్ని ప్రచురణ అయిన వెంటనే

రెండు మూడు నెలలు అమ్మటము ఒక ఎత్తు, దానిని ఎక్కువ కాలము అనగా పది పదిహేను సంవత్సరములు పైగా అమ్మటము ఇంకొక ఎత్తు.

మీ మీ ప్రచురణకర్త లను ఎన్నుకోవడములో గమనించదగ్గ విషయాలు ఇవి. ఇవేకాకుండా ముఖ్యముగా చూసుకోవల్సినవి మీ ప్రచురణకర్తకు తన వృత్తిలో నిపుణతవుందా ? తన విద్యుక్తధర్మాలు తెలుసా ? అని తెలుసుకోండి. అవి అతనికి తెలుసునుఅని మీరు అనుకుంటే అతనికి మీ రచనను అప్పచెప్పి వూరుకోండి. అవి తెలియదు అనుకుంటే అతని దగ్గరకు పోవద్దు. ఇంకొకటి ఆతనికి ఆర్థిక స్థోమత సరిగావుందా ? లేక ఒకవేళ ఒక ప్రత్యేక అవకాశముబట్టి ప్రచురణ మొదలుపెట్టాడా ? అని తెలుసుకోండి. ఎందుకంటే మీకు రావలసిన రాయల్టీలుగాని పారితోషికాలుగాని సరిగా సకాలానికి రావాలికదా మరి ?

ఏ ప్రచురణసంస్థ అయినా ఆర్థికంగా నాలుగు కాలాలపాటు నిలబడాలంటే వారిప్రచురణ జాబితాలో ఎవ్వుడూ విరివిగాఅమ్మే ప్రచురణలు ఎక్కువగా పుండాలి. అప్పుడే వారు కొత్తప్రచురణలతో జూదమాడగలరు.

మీ ప్రచురణకర్తను ఎన్నుకున్న తర్వాత అతనితో సహకరించండి. అతను తనపని ఎలాచెయ్యాలి అని మీరు పాఠాలు చెప్పకండి.

మీ పుస్తకము తమ వూరిలోని స్థానిక పుస్తక విక్రేతవద్ద కనిపించ లేదని మీ స్నేహితులెవరైన ఆశ్చర్యపోయి మీకువ్రాస్తే మీరు ఆశ్చర్య పోకండి. ఆంగ్లనానుడి ప్రకారం ఏవిధముగానైతే గుఱ్ఱాన్ని నీటిదగ్గరకు తీసుకొని వెళ్ళగలమేగాని, నీరు తాగించలేమో, ఆవిధముగానే ప్రచురణకర్త పుస్తకాలను పుస్తక విక్రేతవద్దకు తీసుకొని వెళ్ళగలడేకాని, అతనిచేత కొనిపించలేడు. సంవత్సరానికి కొన్నివందలూ వేలూ పుస్తకాలు ప్రచురణ అవుతున్నప్పుడు అవన్ని పుస్తకవిక్రేత కొనలేడు అమ్మలేడు. కాని ఎవరైన కోరితే ఏపుస్తక విక్రేత అయినా ఆ (మీ) పుస్తకాన్ని వెంటనే తెప్పించి ఇవ్వగలిగి వుండాలి. అట్లా కానిపక్షములో ఆవిషయము మీ ప్రచురణకర్త దృష్టికి తీసుకొనివెళ్ళండి. అపుడు ప్రచురణకర్త తగుపర్యాట్లు చేసేందుకు వీలవుతుంది.

మరోవిషయము గుర్తించుకోవడం మంచిది. నేటి ప్రఖ్యాత రచయితలు ఒకప్పుడు అజ్ఞాత రచయితలే. మీ అజ్ఞాత రచనలను ముందుకు తీసుకొనివచ్చి ప్రచురణచేసి మిమ్మల్ని వెలుగులోనికి తీసుకొని వచ్చిన

ప్రచురణకర్తను విడువకండి. మీకు పేరు ప్రఖ్యాతులు రాగానే మీరు ఇంకో ప్రచురణకర్తను చూసుకొని మీకు మొదటసహాయపడిన ప్రచురణకర్తను విడవడం భావ్యంకాదు. అది ఏరు దాటినతర్వాత తెప్పను తగులబెట్టడము వంటిది.

ఇంకొక ముఖ్యవిషయము. ప్రచురణకర్త మీకు వ్రాసియిచ్చిన కాంట్రాక్టు; లేక ఎగ్రిమెంటు జాగ్రత్తగా చదువుకోండి. మీరు ఏవిధముగా అయితే మీ ప్రచురణకర్తను తన ఎగ్రిమెంటును పాటించాలనుకుంటారో అతనుకూడా మిమ్మలను మీ ఎగ్రిమెంటు అదేవిధముగా పాటించాలను కుంటాడు.

ఈ విధముగా రచయితలను గురించి చెప్పటములో అందరు రచయితలు ఒకేకోవకు చెందుతారన్న ఉద్దేశముకాదు. వారిలో ఎందరో మహానుభావులున్నారు. వారు ప్రచురణకర్తల పాలిటి దేవతలు. వారికి ఇవేవి వర్తించవు.

రాను రాను ఈ రోజుల్లో సాహిత్యము వ్యాపారముగా మారుతూ వుంటే, రచనా; పుస్తకమూ బజారులోకొనిఅమ్మే వర్తకపు సరకుగా తయారవుతున్న ఈరోజుల్లో రచయితలకు ప్రచురణకర్తలకు మధ్య సన్నిహిత సున్నిత సంబంధాలకు తావులేకుండాపోయే అవకాశమున్నది. కాని ఇది పోకుండా కాపాడేబాధ్యత ప్రచురణకర్తమీద రచయితమీదకూడ వున్నది.

ప్రచురణకర్తలో రెండు పాత్రలున్నాయి. ఒకటి వ్యాపారి. రెండవది సంపాదకుడు. కొన్నికొన్ని ప్రచురణ సంస్థలలో ఈ పాత్రను ఒక్కడే నిర్వహిస్తాడు. కొన్ని సంస్థలలో ఈ పాత్రలు వేరువేరుగా వుంటాయి. రచయితలపట్ల వర్తించేది ముఖ్యముగా ఈ రెండవపాత్రే — సంపాదకుడు. ఈ సంపాదకత్వమే రచయితల ప్రచురణకర్తల సన్నిహిత, సున్నిత సంబంధాలను పెంచేది. యీ సంపాదకుడు రచయిత దృష్టితో, రచయిత కళ్ళతో చూస్తాడు. ఏ రచనలో ప్రతిభవుందో ఆచరనను వెంటనే గుర్తు పట్టగల సామర్థ్యముండాలి. ఆప్రతిభను గుర్తించడమేకాకుండా దానిని ప్రోత్సహించి దానిని రాణింపచేయడము అతనివిధి, కర్తవ్యము.

ఈ సంపాదకునకు చాలా నెమ్మదితనము. ఓర్పు చాలా అవసరము. ఇతరులుచెపితే ఓర్పుగా, శాంతముగా వినగలశక్తి వుండాలి. శ్రద్ధగా

విన్నప్పుడే రచయితల దృక్పథం తెలుస్తుంది ఒక్కొక్కప్పుడు విసిగించి నప్పటికి విసుక్కోకూడదు.

ముఖ్యముగా తెలుసుకోవలసినది ఆ రచయిత భావనలో, ఆ రచయిత దృక్పథములో, ఆరచనల్లో ప్రతిభవున్నదా? లేదా? ప్రతిభ వున్నట్లయితే పాఠకులకు, ప్రజాబాహుళ్యానికి అందజేయాలని ఇది భావనా ప్రపంచానికి చేరవలెనని ప్రచురణకర్తలోని రెండవపాత్రకు (వ్యాపారికి) నచ్చచెప్పాలి. ఈ రోజుల్లో సాంఘిక విలువలు అతిత్వరగా మారుతున్నకాలంలో కొత్త కొత్త విలువల్ని, కొత్త రచనలద్వారా వస్తున్నట్లయితే వాటిని గుర్తుపట్టి వాటిని పాఠకలోకానికీ, ప్రజాబాహుళ్యానికీ అందజెయ్యడం ప్రచురణ కర్తలవిధి. అంచే ప్రచురణకర్త అన్నీ ప్రతిభావంతమైన రచనలే ప్రచురణ చేసాడని కాదు.

ఈప్రతిభ భావనా చాతురిలో వుండవచ్చు, భాషాపటిమలో వుండవచ్చు, సామాన్య పాఠకుని ఆకట్టుకునేటట్టుగా వుండవచ్చు, కథా సంవిధానములో వుండవచ్చు, కాని సాహిత్య విమర్శకులను వుత్సాహపరచేవిగా వుండకపోవచ్చు. అట్లయినప్పటికి కొంతప్రతిభ వుండవచ్చు. గొప్పరచనలనేవి రెండు తరగతుల పాఠకులకూ – సామాన్య పాఠకులకూ సాహితీవేత్తలకు ఇద్దరికీ అర్థమయ్యి, ఇద్దరి మెప్పుపొందేవిగా వుంటాయి. గొప్పపుస్తకాలనేవి అందరిమెప్పు ఆదరణ పొందుతాయి. ఆ గొప్పపుస్తకాన్ని సరిగా గుర్తించ గలిగినప్పుడే ప్రచురణకర్త తన ఆదర్శానికి చేరుకో గలుగుతాడు.

★

కవిత్వం అంతరాంతర జ్యోతిస్స్రవంతి బహిర్గతం చెయ్యాలి
విస్తరించాలి చైతన్యపరిధి—
అగ్ని జల్లినా, అమృతం కురిసినా
అందం ఆనందం దాని పరమావధి.

—తిలక్.

With Best Compliments from :

M/s. KERAMIC AGENCIES

ABIDS CIRCLE, HYDERABAD–1

Phone : 4 2 69 7

★

Authorised Stockists for

'SIGCOL' SUPERIOR SCIENTIFIC GLASSWARES

'SUR' Quality ENAMELWARE

" INDER " PLASTICWARE FOR STORAGE

And All Lab Requisites

With Best Compliments from :

KALLE PALLY

SRI RAMULOO & BROS

Wholesale Bombay Cloth Merchants

3–4–407, TOBACCO BAZAR

SECUNDERABAD

★

KALLE PALLY BROTHERS

Prop : K. LAXMIAH

Fancy Cloth Merchants

1–1–254, CHIKKADPALLY

HYDERABAD–20

సాహిత్యం - సంఘం - మారుతున్న విలువలు

మంజుశ్రీ

మారుతున్న విలువల ప్రసక్తి వచ్చినప్పుడు, అసలు సాహిత్యపు విలువలనుగూర్చిన నిశ్చితాభిప్రాయం, ఒకటి ఉండాలిగదా ! సాహిత్యపు విలువలంటే ఏమిటి? అవి ఎలావుండాలి. ఇదివరలో ఎలావుండేవి? ఇక ముందు ఎలావుండాలి. ఇప్పుడువచ్చిన మార్పేమిటి? ఈ మార్పు మనం కోరుకోదగినదేనా ! కాకపోతే ఏంచెయ్యాలి? అన్నప్రశ్నలు తలఎత్తటం సహజమే. ఇటువంటి ప్రాథమికమైన విషయాలనుగూర్చిన జిజ్ఞాస, చాలా కాలాలలో, చాలాదేశాలలో, ఇదివరలోనే తలయెత్తకపోలేదు. అందరికీ సంతృప్తికరంగా, సిద్ధాంత ప్రతిపాదనం చెయ్యడం శ్రమసాధ్యం. ఎందు వల్లనంటే, అసలు సాహిత్యానికీ, వ్యక్తివికాసానికి సంబంధంవున్నదా, తద్వారా, సాంఘిక విలువలను సాహిత్యం అనుశాసించగలదా, లేక కనీసం ప్రభావితం చెయ్యగలదా, అన్న ప్రాథమికమైన ప్రశ్నలకు, అవును, కాదు అన్న సమాధానాలనుకూడా, వితర్కించే అవకాశం లేకపోలేదు. గాంధీ గారిని ప్రభావితంచేసిన సాహిత్యం, అందరినీ ఎందుకు ప్రభావితులను చేయలేక పోయింది అన్న ప్రశ్నకు సమాధానం ఏమిటి? నన్నుమార్చిన పుస్తకం అని గానీ, నన్ను ప్రభావితుణ్ణి చేసిన రచయిత అనిగాని ఎవరైనా, సాహిత్యం వ్యక్తిజీవితంపైన, తన ప్రభావం నెరపగలదన్న, స్వానుభవాన్ని ప్రతిపాదించి నంతమాత్రాన, ఆ ప్రతిపాదనను సార్వజనీనమైన సిద్ధాంతంగా అంగీక రించాలా, అన్న ప్రశ్న ఎదురుకావటంలేదా? మనిషి జీవితంలో అంచే, అభిరుచుల్లో, దృక్పథంలో, విశ్వాసాలలో, ఏదైనా ఒక సంఘటనకూడా, అటువంటి మార్పునే తేవచ్చు. తాను గౌరవించేవ్యక్తి సాన్నిహిత్యంవల్ల కూడా, వ్యక్తిగతమైన అభిప్రాయాలూ, నమ్మకాలూ మారిపోవచ్చు. ఫలానిగ్రంథం చదివినందువల్ల, నా జీవితం ఈ విధంగా రూపొందిందని

ఎవరైనా చెప్పగలరా? ఉంటే వాళ్ళు, సామాన్యమైన ప్రమాణాలకు అతీతులనే చెప్పాలి.

అసలు సాహిత్యానికి, వ్యక్తిజీవితంలో ఎటువంటి స్థానంవున్నది సాహిత్యంతో మానవుడి సంబంధం ఏమిటి? ఇవి చాలా చిక్కు ప్రశ్నలు. మనిషి జీవితంలో, శారీరకమైన అవసరాలను, ఆకర్షణలను, ఒప్పుకుంటూనే వీటికి భిన్నమైన అనుభూతికూడా, కోరుకొన్న వాడికి, ఉన్ముఖమైన చిత్తవృత్తికలవాడికి, లభించే అవకాశం ఉన్నది అనిచెప్పవచ్చు. అదేసాహిత్యం వల్ల కలిగే అనుభూతి. అయితే కేవలం, రసానందము, మానసికమైన అనుభూతి, చిత్తవిద్రుతి మొదలైన పెద్దపెద్ద మాటలు, స్ఫురింపజేసే ప్రయోజనం మాత్రమేనా, సాహిత్యం కూర్చేది?! తదన్యమైనదేదీ లేదా అన్న ప్రశ్నకూడా వెంటనే కలుగుతుంది. సాహిత్యం సాధించే సాంఘిక ప్రయోజనం పరిమితమైనదే. అయినా సాంఘికమైన సుస్థితికి, ఉత్తమ సాహిత్యం ఎంతో పోషకకారి. ఉత్తమ సాహిత్యానికి ప్రమాణాలను ఏవిధంగా నిర్ణయించటం?

అభిజ్ఞాన శాకుంతలము, ఉత్తరరామ చరిత్రము, మనుచరిత్రం, వసుచరిత్రం, వంటి గ్రంథాలు ఉత్తమసాహిత్యమా, కాదా? అయితే అవి ఏ సాంఘిక ప్రయోజనాన్ని సాధిస్తున్నాయి. కాకపోతే ఎందుకుకాదు!

దీనివల్ల తెలుసుకోవలసింది ఏమిటంటే, విలువలనేవి, అవి నిజంగా విలువలే అయితే, ఎప్పుడూ మారవు. అంటే న్యాయంగా వాటి విలువలు తగ్గిపోగూడదు. ఉత్తమమైన విలువలు, ఎప్పుడూ తమ ప్రమాణాన్ని కోల్పోవు. యిక మారిపోయేవి అభిరుచులు. సాంఘికావసరాలు. ఆ యా కాలాలకు, అవసరాలకు అనుగుణమైన ఆచారాలు, అభిప్రాయాలు. అంతే కాని సాహిత్యానికి సంబంధించినంతవరకు మౌలికమైన విలువలలో మార్పు అంటూ ఉండదు.

పాతకొత్తలకు ఎప్పుడూకూడా సంఘర్షణ వుంటూనే వుంటుంది. సంప్రదాయమూ, సంప్రదాయనిరాసమూ, వెలుతురూ, వెన్నెలలాగా, ఒకదానిని వొకటి వెన్నంటి వుంటూనే వుంటాయి. అంటే అవి అహోరాత్రాలవంటివి, ఇందువల్ల సంప్రదాయం పగలూ, సంప్రదాయనిరాసం చీకటి అనుకోకూడదు. చీకటికూడా అవశ్యం అనుభవనీయమైనదే. ఎందుకంటే చీకటిలేకపోతే వెన్నెలలేదు. సంప్రదాయాన్ని నిరసించడంలో తప్పు

లేదు. సంప్రదాయాన్ని అనుసరించటంలోనూ తప్పులేదు. కాని పాత అంతా అవశ్యం పరిహార్యమనికాని, కొత్త అంతా అపరిహార్యమనికాని, అనుకోవాల్సిన అవసరం లేదు. ఇవాల్టినవ్యత రేపటి సంప్రదాయం కావచ్చు, ఈ విధంగా కొత్త కొత్తగా నెలకొన్న సంప్రదాయాలన్నీ అవసరానుగుణ్యమైన నవ్యతలనే చెప్పాలి. భావకవిత్వం, నవ్యకవిత్వం, అభ్యుదయ కవిత్వం, అటుతరువాత దిగంబర కవిత్వం, ఇలాంటి నవ్యతాదృష్టితో పుట్టినటువంటివే. వీటివల్ల సాంఘిక ప్రయోజనమేదో సిద్ధిస్తుందనుకోవడం భ్రమ. సాంఘికమైన సమస్యలను, ఆర్థికమైన, రాజకీయమైన పరిణామాలే చాలవరకు పరిష్కరించగలుగుతాయి. అంతేకాని సాహిత్యంలో బయలుదేరే చిల్లర మల్లరధోరణులు, సాంఘికమైన గతిని మార్చడంకల్ల. అవి తాత్కాలికమైన వినోదాన్నో, విప్లవధోరణినో, వింతపోకడలనో మాత్రమే, ఆశ్రయిస్తాయి. ఇవన్నీ అల్పకాలికమైన సంప్రదాయాలుగా మాత్రమే, పరిణమిస్తాయి. సాహిత్యం విధిగా సాంఘిక ప్రయోజనాన్ని సిద్ధింపజేయాలంటే, అటువంటిదే ఉత్తమ సాహిత్యమనుకొంటే కృష్ణశాస్త్రి కవికాడు. కాళిదాసు అంతకుముందేకాడు. వీళ్ళెవరూ సాహిత్యకులుకారు. అట్లా అనుకోవటంలో ఔచిత్యంలేదు కాబట్టి, సాహిత్యానికి సాంఘికదృష్టికూడా ఒక ప్రయోజనమనిమాత్రమే అనుకోవాలి, ఉత్తమ సాహిత్యానికి సంబంధించిన విలువలు, ఎప్పుడూ మారవు. మార్పులన్నీ విలువలుకావు.

మారకద్రవ్యాలు, మత్తుపదార్థాలు, సేవించడం, అభిలషణీయంకాదు. శరీరంపైనా, మనస్సుపైనా, అవి ప్రసరింపజేసే ఫలితాలదృష్ట్యా. కాని, అధిక సంఖ్యాకుల వినియోగందృష్ట్యా, అదివొక విలువ కాలేదు. ఎక్కువ మంది లంచాలు తీసుకుంటూన్నారు కాబట్టి, సాంఘిక విలువలలోని మార్పుగా దానిని స్వీకరించలేము.

ఒక ప్రొఫెసరుగారుకాదు, అధికసంఖ్యాకులైన ప్రొఫెసర్లే అనుకుందాము, అనుచితమైన, అన్యాయమయిన మార్గంతొక్కి, డబ్బుతీసుకొని మార్కులువేసి, లేదా యితరత్రా ప్రయోజనాలను ఆశించి, అపమార్గంలో నడిచి విద్యారంగంలోని పావిత్ర్యాన్ని భ్రష్టుపరచినంత మాత్రాన, సర్వసంగ పరిత్యాగులమని చెప్పుకొనే ఆధ్యాత్మికాచార్యులు, ప్రచారంకోసం, వేరు ప్రతిష్టలకోసం, రాజకీయనాయకులను, అధికారవర్గాన్ని చేరదీసినంతమాత్రాన, వీటిని ఆయా రంగాల కొత్తవిలువలుగా జమకట్ట

గలమా ! అవి విలువలుకావు. దిగజారిపోయిన, పరిస్థితులను మాత్రమే వ్యక్తంచేస్తాయి. పదిచోట్ల జరిగిన సాహిత్యసమావేశంలో ఒకరినొకరు వక్తలు పొగడుకొన్నమాత్రంచేత, వెకిలి ప్రసంగాలు చేసినంతమాత్రంచేత, మారినవిలువలు అవి అనలేము. విలువలెప్పుడూ మారవు. గాంధీగారు ప్రతిపాదించిన సిద్ధాంతాలు, నేడు అక్కరకు రానివై పోయినంతమాత్రంచేత, ఆచరణయోగ్యమయినవికావని నిరూపణం అయిపోయినతరువాత కూడా అవే విలువలుకాని ప్రచురంగా కొనసాగుతున్న అస్తవ్యస్త పరిస్థితులే నేటి విలువలని చెప్పకూడదు.

అధికారంలో వున్నవాళ్ళూ, అజమాయిషీ చేయవలసినవాళ్ళూ, అలసులైతే అక్రమపరులైతే, సంఘంలోని సామూహిక బలహీనతలన్నీ, విజృంభిస్తాయి. అవకాశాన్నిబట్టి వ్యక్తిగతమైన బలహీనతలు, తలఎత్తేట్లుగానే, స్వార్థపరులు, కుత్సితులు, అధికారులైనప్పుడు, సాంఘికవ్యవస్థలో అక్రమాలు తలఎత్తుతాయి. చీకటిపడగానే, గుడ్లగూబలూ, గబ్బిలాలు, ఇంకా వివిధజంతువులూ, ఆహారంకోసమూ, బయలుదేరినట్లుగా, సామూహికమైన అక్రమాలు బయలుదేరుతాయి. అంతటితో అశాంతి, దౌర్జన్యం, సంఘర్షణలు, రక్తపాతాలు, తిరుగుబాట్లు చెలరేగుతాయి, సకాలంలో వర్షాలుపడి. ఇంకేమీ ఆధివ్యాధులులేకుండా వాటికిగురికాకుండా, పంటలు బాగా పండితే, ఆహారధాన్యాల ధరలు నిలకడగా వుంటాయి. నలుగురికీ దొరుకుతాయి. అంతేకాని తుఫానులు, ఉప్పెనలు, వర్షాభావం, మొదలైన విపత్తులన్నీ ఎదురైన సంవత్సరం, ఘోరపరిస్థితులు, ఆక్రోశం, పగలూ, కార్పణ్యాలు, దొంగతనాలూ, ఎక్కువవుతాయి. అట్లానే పాలకులు బుద్ధిమంతులై, సాంఘికన్యాయాన్ని చక్కగా అమలుజరిపితే, అనుశాసిస్తే, ఈ తిరుగుబాటుధోరణులు, హింసాత్మక ప్రవృత్తి, అశాంతి, కలిమిలేముల మధ్య కలహాలు, కార్పాణ్యాలు తలెత్తవు.

ఇప్పుడు మనం దేశంలో చూస్తున్న పరిస్థితులివి. ఈ పరిస్థితులను సాహిత్యం ప్రతిఫలిస్తున్నదా ?! అంటే లేదనే చెప్పాలి. అయితే ఈ పరిస్థితులవల్ల కలిగిన అయోమయం, అనిశ్చిత విప్లవధోరణులు, హింసాత్మక ప్రవృత్తివలన కలిగిన తదితర ప్రభావాలు, సాహిత్యంలో కూడా కొంత కొంత కనబడుతున్నాయి. దిగంబరకవిత్వం ఆ ధోరణి ప్రతిధ్వని. ఇంకా కొన్నిరకాల ధోరణులున్నాయి. ఆ ధోరణులు వాస్తవ విషయాలను గమ

నించకుండా, కలల్లోకి, కల్పనలలోకి వెళిపోతున్నాయి, శిల్పం దృష్ట్యాకాని, సాంఘిక ప్రయోజనం దృష్ట్యాకాని, ఉత్తమమైన కళాత్మకరూపాలు, సాహిత్యంలో ఇప్పుడు వెలువడటంలేదు. దీనికికారణం ఏమిటి ? సాంఘిక పరిస్థితులే ! అక్రమార్జనపట్ల, సుఖలాలసత్వంపట్ల, మానవుడి అభిప్రాయాలు మారిపోయినయ్. పోటీపరిస్థితుల్లో, ఐహికభోగపరత్వం, ప్రాపంచిక విషయాలపట్ల, విపరీతమైన తగులమూ, తప్పుకాకపోవచ్చునేమోకాని, వాటిని పొందడానికి తొక్కే మార్గమూ, ఉచితమైనదిగా ఉండాలి. కాని సంఘంలో, ఈ దృష్టి ఇప్పుడు బాగా తగ్గిపోయింది. ఏదోఒకవిధంగా, డబ్బుసంపాదించటం, కీర్తిసంపాదించటం, సుఖపడటం, పరమప్రాప్యాలై పొయినయ్. అలాంటి ప్రయత్నాలు ఫలించడం జరుగుతున్నది. దాంతో, సంఘంలో వర్గసంఘర్షణం అనివార్యమైంది. ఒకడు తన అవసరాలకు మించి కూడబెట్టుకొని కులుకుతున్నాడు, ఒకడు తన అవసరాలైనా తీరక అలమటిస్తున్నాడు. దీంతో ఈర్ష్యాద్వేషాలు పెచ్చుపెరిగిపోయినయ్. ప్రభుత్వం సాంఘిక దురన్యాయాల పట్ల, అసహాయంగా వుండిపోవడమే కాక, కొన్ని కొన్ని సందర్భాలలో వేరువేరు కారణాలను పురస్కరించుకొని, అక్రమాలను ప్రోత్సహించడంకూడా జరుగుతున్నది. ఇవన్నీ సామాన్యుడికి, విశదంగా, విశ్లేషించిచూపేవాళ్ళు లేకపోతున్నారు? ఈ పని ఎవరుచేయ్యాలి. రచయితలుచెయ్యాలి. కాని వాళ్ళు చెయ్యటంలేదు. నవలకాని, కథకాని, కవిత్వంకాని, నేడు వెలువడుతున్న ఏ ప్రక్రియను పరిశీలించిచూసినా, అయోమయం, ఆక్రోశం. అశాంతి, సరైనరూపంలో ప్రతిధ్వనించటంలేదు. లేకపోగా కాల్పనికమైన పన్నివేశాలతో, ఊహాలోకంలో, విహరిస్తున్నారు. కొందరు సాంఘిక చైతన్యాన్ని ప్రబోధించాలని, ఆరాటపడుతున్నవాళ్ళు కూడా, ఆ పనిని సక్రమంగా నిర్వహించలేకపోతున్నారు. మన్నుదిన్న పాములాగా నిద్రపోవడమూ; వీధుల్లో విశృంఖలంగా కేకలువేసి కనపడిన దానినల్లా నాశనంచేయడము, రెండూ విపరీతధోరణులే. ఇవాళ మన దేశంలో, మన సంఘంలో, మనం అనుభవిస్తున్న, అసంతృప్తికి, అరాచకానికి, ఆందోళనలకు, అయోమయ పరిస్థితులకు, బాధ్యులయినవాళ్ళు పాలకులే. వాళ్ళవల్లనే ఈ పరిస్థితులు వచ్చాయి. ఒక కుటుంబములో నలుగురు వ్యక్తులుంటే, వాళ్ళందరి బాగోగులు చూసే యజమాని, అందరి మంచిచెడ్డలకు, సుఖదుఃఖాలకు, బాధ్యత ఎట్లా వహించవలసివుంటుందో,

అట్లానే పరిపాలనా యంత్రాంగాన్ని నడుపుతున్న నాయకమ్మన్యాలు, అవినీతిని, ఆశ్రితపక్షపాతాన్ని, అలసత్వాన్ని, అన్యాయాలను, తమ కళ్ళ ముందు-గోళ్ళు, కోరలు పెంచుకొని పెరిగిపోతుంటే, చూస్తూవూరుకున్నారు. అలసభావం వహించారు. ప్రోత్సహించారు. పాముకు పాలుపోస్తే కరవ కుండా వుండదు. ఎప్పుడో ఆ రోజు రాకపోదు, బహుజన హితము, బహుజనసుఖము, అని నినాదాలు వల్లించినంతమాత్రంచేత ఈపత్తా ప్రయో జనం వుండదు. ఇవీ ఇప్పటి సాంఘికపరిస్థితులు. వీటిని పురస్కరించుకొనే యువతరం తిరగబడుతున్నది. ఇదివరకు అంగీకరించిన ప్రతిసిద్ధాంతాన్ని, విసుగుతో, కసితో, హింసాత్మకప్రవృత్తితో, నిరసించటానికి కారణం ఈ పరిస్థితులే. భీతావహమైన పరిస్థితుల్లో, మనుషులు చల్లాచదరై పోయే విధంగా, పాత ఆలోచనలు, పాత పద్ధతులు, పాతకాలపు ఆశయాలు, ఆచా రాలు, కకావికలై పోతున్నాయి. కదిలేదీ, కదిలించేది, మారేది మార్పించేది పెనునిద్దుర వదిలించేది, పరిపూర్ణపు బ్రతుకిచ్చేది కావాలోయ్," అని కవి అంటే, పాతకాలపు అలంకారాలకన్నా, ప్రత్యేకత ఏమున్నదికనుక ! పొగ గొట్టపు భూంకారధ్వని, అరణ్యమున హరీంద్రగర్జన, కలకత్తాకాళికనాలిక, రుద్రాళికనయనజ్వాలిక .... ఏమిటివన్నీ .... పులి చంపిన లేడినెత్తురు.... అంటే కవిగారు, అనాలోచితంగా బలవంతులు, అధికారులు, ధనవంతులు, బలహీనులను, దోపిడిచేసిన చారిత్రక సత్యాన్నే ప్రతిపాదించారు, ఉద్రేకంతో వొళ్ళుమరిచిపోవడం, కేకలువేస్తూ చిందులుతొక్కడం, ఆక్రోశంతోగొంతు చించుకోవడం, ఇవికాదు సాహిత్యం సాధించవలసింది.

మనిషిని మానవత్వపు విలువలపట్ల మగ్నమానసుణ్ణిచేయడమే ఉత్తమ సాహిత్యపు ధోరణిగా ఉండాలి. మనస్సుకి ఒక బలమూ, సంస్కారమూ, అన్యాయాలనుప్రతిఘటించగలశక్తి, జీవితానికి వొక ధ్యేయమూ, అలవరిచేదే సాహిత్యపు ముఖ్య ప్రయోజనంగా వుండాలి.

ఫిజిక్సులో పదార్థ భౌతికలక్షణాలను వివరించే ఒక సిద్ధాంతం వుంది. అది ఏటవాలుబల్లసిద్ధాంతం, వాలుతలకోణం పెరిగినకొద్దీ, బల్లమీదవున్న పదార్థం అమితవేగంగా పడిపోతుంది. వాలుకోణం తగ్గించినకొద్దీ, పైనుంచి కిందకి పడిపోయే కాలవ్యవధి ఎక్కువవుతుంది. ఈ సిద్ధాంతాన్ని సాహిత్యపు విలువలతో సమన్వయం చేస్తే, మనిషిలోని మేలిమి భావాలను జారిపోకుండా, వేగంతో కిందికి పడిపోకుండా, వాలుకోణాన్ని, సంఘంలో

మనం బాగా తగ్గించాలి. ఇటీవల ఉత్తమాభిరుచులను ప్రోదిచేసే సాహిత్యం వెలువడటంలేదు. చెక్కుసాహిత్యం విపరీతంగా విజృంభిస్తున్నది. పత్రికల వాళ్ళుకూడా, సాంఘికాభ్యున్నతి దృష్టితో కాక, వ్యాపారదృష్టితోను, వ్యక్తిగతాభిమానాలతోను, రచనలను, రచయితలను ప్రోత్సహిస్తున్నారు. ఇప్పుడు పత్రికలలో వెలువడుతున్న కథల్లోనూ, నవలల్లోనూ, ఎక్కువగా, కాల్పనికధోరణే కనిపిస్తున్నదికాని, వాస్తవికమైన ధోరణి కనిపించటంలేదు. ఇది ఒక సంధియుగం. పాతవిశ్వాసాలు సడలిపోయినాయి. కాని కొత్తదైన వొక, సంస్కారం, బహుజనహితంకరమైన వొక వ్యవస్థ రూపొందలేదు, భ్రాంతీయమయిన దురభిమానాలు, నైతికవిలువలపతనం, సంఘర్షణ, కులం మతం, భాష, రాజకీయసిద్ధాంతపరమైన అభినివేశాలు, దేశాన్ని అల్లకల్లోల పరుస్తున్నాయి. తన కుటుంబాన్ని తాను బాగుపరచుకోవాలని మనిషిపడే తాపత్రయమే, తన సంఘం, తన దేశం, తన వారసులు, ఒక సువ్యవస్థలో జీవించాలని, తాపత్రయపడితేతప్ప ఈ పరిస్థితులు మారవు.

ఇంత అశాంతిలో, జీవిస్తున్నాం కనుకనే నైతిక విలువలపట్ల నిరాదరణం ప్రబలిపోతున్నది. నైతిక విలువలపట్ల, శ్రద్ధాశక్తులు సన్నగిల్లిన కాలంలో ఉత్తమ సాహిత్యం వెలువడే అవకాశంలేదు. అశాంతి, ఆందోళనలమధ్య, మానసికమైన వినోదంకొరకు, మనిషిలోని బలహీనతలను, రెచ్చగొట్టే రచనలకే ప్రాచుర్యం లభిస్తుంది.

యువతరం మేలుకోవాలి, సామూహికమైన శాంతి, భద్రతలకోసం, తమ మార్గాన్ని సువిస్పష్టం చేసుకోవాలి. ఆ గమ్యానికే పయనించాలి. సాంఘిక పరిస్థితుల ప్రభావం, సాహిత్యంపైనా. సమకాలీన సాహిత్యవిలువల ప్రభావం, సంఘంపైనా ఎప్పుడూ వుంటూనేవుంటాయి. మనిషి మనిషిగా మనుగడ సాగించనినాడు, ఎన్ని ధర్మపన్నాలు వల్లించినా, ఎన్ని నినాదాలు సృష్టించినా, ఎన్ని సద్బోధలు చేసినా ఏమి ప్రయోజనం వుండదు. మనిషి తప్పుచేసినప్పుడు. ఆ తప్పును శిక్షించగల, సరిదిద్దగల, ప్రభుత్వమూ వుండాలి. దీనిని ఉద్బోధించగల, ఈ విధమైన సంస్కారాన్ని నేర్పగల సాహిత్యం ఇప్పుడు మనకు అత్యంతావశ్యకం,

With

best compliments

from :

ATLAS COPCO (INDIA)

PRIVATE LIMITED

★

BOMBAY CALCUTTA DELHI

MADRAS & HYDERABAD

WORKS : POONA

రచయితలు - క్రమశిక్షణ

డా. భీమసేన్ 'నిర్మల్'

పోలీసులకు; సైనికులకువలె, రచయితలకు కూడా క్రమశిక్షణ ఏమిటి అన్న ప్రశ్నకలిగింది. రచయిత "స్వాంతఃసుఖాయ" రచనలు చేస్తాడనే వారు, "ఆర్ట్ ఫర్ దిసేక్ ఆఫ్ ఆర్ట్" (Art for the sake of Art) అనే సిద్ధాంతాన్ని అనుసరించి, రచయిత స్వేచ్ఛగా తన అభిప్రాయాలను అభివ్యక్తికరించవచ్చుననేవారు, దీనినిత్రోసి రాజనవచ్చును. ఏవిధమైన నిబంధనలను నియమాలను కాని వారు అంగీకరింపక పోవచ్చును. కాని ఎవరు ఏమన్నా, పాఠకుల హృదయాలను ప్రభావితంచేసి, తనుపొందిన అనుభూతినే వారు పొందేట్లు చేయగలగటమే ప్రతిరచయిత లక్ష్యంకదా! సాధనచేయని, క్రమశిక్షణలేని రచయిత తన మనోభావాలను, సిద్ధాంతాలను పాఠకుల హృదయ ఫలకంపై హత్తుకుపోయేట్లు వ్రాయలేడు. జనసంకులమైన రాజమార్గంలోవాహనాన్ని నడిపే రథ చోదకుడు (Driver), అతిజాగ్రత్తగా, చాకచక్యంతో తన గమ్యాన్ని చేరుకోవటానికి ప్రయత్నించినట్లే, రచయిత కూడాతన లక్ష్యసాధనకు ప్రయత్నంచేయాలి. అంటే పాఠకుని హృదయాన్ని ప్రభావితం చేయకలగాలి, దానికై ఒక క్రమబద్ధమైన పంథాను అనుసరించాలి.

పాఠకుడు లేనినాడు రచయిత ప్రయత్నం వ్యర్థమేకదా! అనంత కాల సాగరంలో, విపులమైన పృథ్వీమండలంలో, ఎన్నడైనా, ఎక్కడనైనా తన రచనకు పాఠకుడు దొరకకపోతాడా అని అనుకున్న మహాకవికూడా తన రచనకు పాఠకుడు కావాలని కోరుకున్నాడు. కనుక రచయితకు పాఠకునికి గల అవినాభావ సంబంధం త్రోసిరాజనడానికి వీలులేనిది.

ప్రయత్న పూర్వకమైనది లేక ప్రయత్నజన్యమైనది ప్రచారసాహిత్యం అవుతుంది కాని సార్వజనీనమైన, శాశ్వతత్వంగల సాహిత్యం ఎలా అవుతుందనే సందేహంకలుగవచ్చును. ఇక్కడ సాధన, క్రమశిక్షణఅంటే అప్రయత్నంగా (Sponteneous) దొర్లుకువచ్చే కవితాప్రవాహాన్ని సరియైన

పంథాలో ప్రవహింపచేయటము. ఈ ప్రయత్నము బాహిరమైనదేకాని, అంతరికమైనదీ, కవితోద్వేగానికి చెందినదికాదు. ఆ ఉద్వేగం కలిగి, కవిత్వం పొర్లుకొని వచ్చినపుడు. దానికి సరియైన మార్గం కలిగించడమేనని భావం. ఇలా అనటంతో కవిత్వానికి ఒక ప్రయోజనం ఆపాదించినట్లవుతుంది. ప్రయోజనరహితమైన పదార్థం ఈ జగత్తులోనే లేదని ప్రతివారు ఒప్పుకొనకతీరదు. కళయొక్క మనోముగ్ధకరమైన సౌందర్యమే దాని పరమ ప్రయోజనమని చెప్పవచ్చును. కాని ఆ సౌందర్యభావనను, శ్రేయోభావనతో జోడించిననాడే, అది మంగళమయం కాగలదు. ప్రాచేతసుని మొదలుకొని, నేటి యువకవి వరకుగల రచయితల రచన లన్నింటికి ఏదో ఒక ప్రయోజనం, అభిప్రాయం ఉండనే ఉన్నవి. నిరుద్దేశ్యమైన నిర్మాణం ఉంటుందనడానికి వీలులేదు. కనుక ఆదర్శవాది అయిన రచయితకానివ్వండి యథార్థవాది అయిన రచయితకానివ్వండి, ఏదోఒక ప్రయోజనాన్ని ఆశించే రచన సాగిస్తాడు. ఆదర్శవాది అయిన రచయిత సమస్తసృష్టిలోగల గుణాలనే, మంచివిషయాలనే – పద్మపాణి అయిన బుద్ధుడు, పంకంనుండి పద్మాన్ని పైకి లేవనెత్తినట్లు – చెడులోకూడా అంతతః మంచినే చూసి వర్ణిస్తాడు. తన రచనలవల్ల మానవజాతి సాంస్కృతికంగా పురోభివృద్ధి చెందుతుందని, లోకకళ్యాణం. విశ్వశ్రేయస్సు ఉపలబ్ధమవుతవని ఆశిస్తాడు, యథార్థవాది మంచిచెడులను, గుణదోషాలను యథాతథంగా వర్ణించి, విషయాన్ని పాఠకుని నిర్ణయానికి వదిలేస్తాడు. దృక్పథంవేరయినా, సమకాలీన జీవితంలోని సార్వజనీన సత్యాలను అభివ్యక్తికరించి, వీరిద్దరు కూడా పాఠకుని ప్రభావితం చేయాలనే అనుకుంటారు. దీనినే శాస్త్రీయపరిభాషలో "సాధారణీకరణం" అంటారు. తనకు కలిగిన అనుభూతే, పాఠకునికీ కూడా కలగచేయడం కవికర్మయొక్క సార్థకత్వం. రచన సార్థకంకావాలంటే, రచన పాఠకుని హృదయాన్ని కదిలించాలంటే రచయిత తన రచనలోని భావపక్షాన్ని, కళాపక్షాన్నికూడా సమన్వయపరచుకొని, కలంసాగించాలి.

ప్రాచీనకాలంలో రచయితలకు శక్తి, నిపుణత, అభ్యాసము అవసరమనుకునేవారు !* ఈనాడు గుణగణాలు అవసరమని తలంచబడటంలేదు.

---

*శ్లో॥ శక్తిర్నిపుణతా లోకశాస్త్ర కావ్యాద్యవేక్షణాత్
కావ్యజ్ఞశిక్షాభ్యాస ఇతిహేతుస్తదుద్భవే॥ —(మమ్మటుడు).

కాని ఇంతో అంతో ప్రతిభలేకుండా ఎవరూ రచనసాగించలేరు. ఒకవేళ సాగించినా, అది పుబ్బలో పుట్టి మఖలో మాడిపోవడటం జరుగుతుంది. ప్రతిభ కలిగిఉండి, నైపుణ్యాన్ని సముపార్జించుకొని, దాన్ని అభ్యాసంతో మెరుగుపెట్టుకోగలిగితే రచయిత తన రచనకు సార్వజనీనమైన శాశ్వతత్వాన్ని ఆపాదింపచేయగలడు. భాషమీద సరియైన అధికారంలేని రచయిత రచనలవల్ల అర్థంకంటే అనర్థమే ఎక్కువ జరుగుతుంది. ప్రభావోత్పాదకములయిన విషయాలను ప్రకటించడానికి గల సాధన భాషతప్ప మరొక్కటి లేదు. భాషలోని పదాలను ఏర్చి, కూర్చి, తీర్చి రసవంతంగా విషయాన్ని వెల్లడించగల నేర్పు నిరంతర సాధనచే వచ్చేదేకాని తనంతట తానుగా వచ్చేదికాదు.

రచనచేయటమన్నా. రచనను చదివి ఆనందించటమన్నా సులభమయినపనికాదు. కనుకనే రచయితల సంఖ్యవలెనే, సహృదయులయిన పాఠకుల సంఖ్యకూడా పరిమితమే. పరిమితమైన సంఖ్యకల అట్టిపాఠకులను మెప్పించకలిగేట్టు రచయిత రచనసాగిస్తే, అది మిగతావారిని గూడా ఆనందపరచగలదు. ఇతరుల దూషణ–భూషణలతో నాకు నిమిత్తంలేదనుకునే రచయితకు ముద్రణతో నిమిత్తంలేదు!

కళాకారుని హృదయంలోని వేదన, ఆర్తి అతన్ని ఆత్మాభివ్యక్తికై పురికొల్పుతాయ్. రసోద్రేకం, భావనాశక్తి, ప్రజ్ఞావిశేషంకలిగి, రచనా పద్ధతితో చక్కగా పరిచితుడైన రచయిత పాఠకులను ప్రభావితంచేయగలడు. పరిష్కృతమనస్కతతో. క్రమబద్ధమయిన పద్ధతిలో చేయబడిన రచన జీవన మహాసాగరంలోని ఒక ఉత్తుంగ తరంగం కాగలదు.

★

కవిత్వం సైన్సు కారాదు. కవిరచన కఠినమైన థీసిస్సు.
కావాలి అది ఎడారిలో ఒయాసిస్సు, అనుభవాలతేట సరస్సు.

—శ్రీ

Whatever your Banking Problem is

STATE BANK OF INDIA

has an answer for it !

State Bank of India offers you a range of banking services-from big scale help to small scale industry and foreign exchange facilities to minors accounts an d safe deposit vaults !

So bring your banking problems to us,
at any of over 2600 offices of
the State Bank of India
and its Subsidiaries.

STATE BANK FOR SERVICE

సాహిత్యమూ - జాతీయకరణ

డా. సుప్రసన్న

దేశ రాజకీయ సాంఘిక రంగంలోని అవ్యవస్థయే నేటి సాహిత్య రంగంలోనూ ప్రతిఫలిస్తున్నది. రాజకీయ ధోరణుల్లో సాంస్కృతిక వ్యవహారాల్లో వైదేశిక ముద్ర సర్వతః కానవస్తున్నది, సాహిత్య రంగంలో కూడా రూప విషయంలో, వస్తు విషయంలోనూ ఇదే విదేశీయ ప్రాబల్యం కానవస్తున్నది. పరాసు దేశంలో చేసి పాతపడ్డ ప్రయోగాల విషయంలో మోజు, రష్యా దేశంలో చెప్పబడే సిద్ధాంతాలపై ఆసక్తి, అమెరికాలో కొందరు మానసిక అవ్యవస్థగల యువకులు ప్రవర్తిస్తున్న తీరుపై మోహం ఇలా మొత్తంమీద ఆధునికధోరణిపేర స్వదేశీచింతన లోపిస్తున్నట్లు తోస్తున్నది.

మనకు జాతీయ జీవనంలో స్వదేశీ మంత్రం గాంధీజీ చెప్పింది. ఈ జాతి సర్వతోముఖాభివృద్ధికి దీన్ని మించిన మార్గంలేదు. సాహిత్యంలో, ముఖ్యంగా కవిత్వంలోకూడా ఈ మార్పు అవసరం. భావకవిత్వం రోజుల్లో దాని అభివ్యక్తిలో, ప్రగతివాద ధోరణిలో దానివస్తువులో, ప్రయోగవాద మార్గంలో దాని అనేక లక్షణాల్లో ఈ విదేశీముద్ర ఉండేది. స్వాతంత్ర్యం తరువాతవచ్చిన 'నవకవితా' మార్గంలో ఈ లక్షణం కొంత సన్నగిల్లినది.

మనసాహిత్య విమర్శలో ఈకాలంలో ఏర్పడ్డ అవ్యవస్థకుకూడా ఇదే కారణం. మన దేశము సాహిత్యాన్ని విదేశీ ప్రమాణాలతో కొలవడం, దానిని ఏలాగో అన్వయించాలనే కోరిక ఎన్నో తప్పుడు నిర్ణయాలకు కారణం అవుతున్నది. ఆ దేశాల్లో సంస్కృతి. సాంఘిక పరిస్థితులు, దాని వల్ల ఉద్భవించిన సారస్వతమూ, తద్విమర్శా మనదేశంలో తద్భిన్న పరిస్థితుల్లో యథారూపంలో అన్వితం కావడం ఎలా జరుగుతుంది?

ఈ సంక్లిష్టవేళలో మన సారస్వతాన్ని విమర్శననూ అన్ని విధాలా జాతీయం చేయవలసి యున్నది. ఈ జాతీయీకరణంవల్ల సారస్వతంలోని ఎన్నో అనారోగ్య లక్షణాలు వాటంతట అవి తొలగిపోగలవు. మన పరి

స్థితులు, మన భాషల జీవలక్షణం, మన అవసరాలు, మన సంస్కృతీ సంప్రదాయాలూ, మనసాహిత్య శాస్త్రసంపద ఇవన్నీ ఆధారంగా మనం ఆధునిక సాహిత్య దర్శనాన్ని నిర్మించుకోవలసి ఉన్నది. అది ఆధారంగా ఒక వ్యవస్థ ఏర్పరచవలసి ఉన్నది.

మన సువ్యవస్థితమైన పరిస్థితిలో ఏ వైదేశికమయిన సంప్రదాయమయినా మనం స్వీకరించదలిస్తే అది మనవ్యవస్థలో అంతర్భవించిపోతుంది. ఈ సువ్యవస్థయే మనను ఆధునిక జీవన చైతన్యాన్ని స్వీకరించేందుకు అనువుగా తీర్చగలుగుతుంది, ఆ వ్యవస్థ లేనప్పుడు మనం ఏది స్వీకరించినా అది పైపై మెరుగుల్లాగానే ఉంటూ జాతి జీవన ప్రవాహంలో లీనమయి ప్రవహించదు. మార్పు ఏ వ్యవస్థలోనూ తప్పదు. కాని అది క్రమంగా జరుగుతుంది. ఈ దశలన్నింటికీ ఒక అనుస్యూతి ఉంటుంది.

జాతీయీకరణంవల్ల సారస్వతం ఎప్పుడూ సజీవంగా నవం నవంగా సార్వజనీనంగా ఉంటుంది. దేశీయ సంపదలో భాగమౌతుంది.

సారస్వతాన్ని జాతీయం చేయడం అంటే ఈ దేశ ప్రజల జీవనాడిని దానిలో స్పందింప జేయడం. ప్రజల అనుభూతులు, భావనలు ఆసేతు శీతాచలం వ్యాపించిఉన్న ఏకభావన ఇవన్నీ సారస్వతంలో ప్రతిఫలించడం, అంతవరకూ అవిదితంగా ఉన్న విభిన్న భారతీయ భాషల మధ్య సాన్నిహిత్యాన్ని పెంపొందించడం – ఆ విధంగా ఈ సమైక్యతకుఎక్కువ దోహదం చేయడం

దేశమంటే మట్టికాదని పెద్దలు చెప్పినారు. దేశమంటే జీవిస్తూవున్న మనుష్యులు మాత్రమేకాదు. ఇదివరలో జీవించిన, భావికాలంలో జీవింపబోతున్న మనుష్యులూ, వారి సఫల జీవనానికి కారణాలైన నదీనద పర్వతములు మాత్రమేకాదు–ఇంకా వారి తాత్త్విక, కళాత్మక. సారస్వత సంప్రదాయాలుకూడా. వీటన్నింటి సమాహారమయిన సమన్వితమయిన లక్షణమే జాతీయత. ఇదీ కాలంవంటి అవిచ్ఛిన్న ప్రవాహమే. మన సారస్వతానికి ఈలక్షణం అంతఃస్రోతస్సు కావాలి.

స్వాతంత్ర్యానంతరం తెలుగు కవితా రంగంలో ప్రచండమైన మార్పు ఈ జాతీయీకరణకు అభిముఖంగా జరిగింది. తత్పూర్వం విజృంభించిన తిరుగుబాట్లు త్వరలోనే సమసి ఒక సమన్వితమైన దృక్పథం ఆ స్థానంలో నెల

కొంటున్నది. కవితలో పరిచ్ఛిన్నమైన వైయక్తిక ప్రతీకల స్థానంలో ప్రజాసామాన్యం వ్యక్తం చేసే భాషామార్గం నెలకొన్నది. దేశాన్ని విడిచి "మరో ప్రపంచం" వైపు పరుగులెత్తే ధోరణి తొలగి స్వదేశీయుల సౌభాగ్య సాధనలో కవి కంఠమెత్తి పలుకడం జరిగింది. సర్వ సారస్వతాన్నీ సర్వ సంప్రదాయాన్నీ తిరస్కరించిన ప్రగతివాద స్థానంలో అవిచ్ఛిన్నమైన సంప్రదాయం పునాదిగా వర్తమానంలోకి ఎదుగుతున్న వర్తమాన కవుల తరం ఒకటి వెలసింది.

ఈ మార్పు నిజంగా స్వాగతించ దగిందే, సారస్వతంలో సంప్రదాయమూ ఆధునికతా ఆరంభంలో పరస్పర విరుద్ధంగా యుద్ధ సన్నద్ధాలు అన్నట్లుగా కానవస్తవి. కాని ఇవి ఈ విధంగా సమన్వయం కావడానికి భారతజాతి యొక్క కొత్తదనాన్ని స్వాయత్తీకరించుకునే తత్త్వం కారణం.

వర్తమానకవుల దృష్టి ప్రయోగాలనుంచి రసనిర్భరమయిన కావ్యాల నిర్మాణం వేపుగా మళ్ళింది. ఇది మానవజీవనంలోని ఏక దేశాన్ని కాక సర్వసమగ్రంగా అన్ని పార్శ్వాలనూ దశలనూ, ఎత్తులనూ, లోతులనూ చిత్రించడానికి ఆధునిక భారతీయ జాతీయాత్మను దర్శించడానికీమార్గం.

ఆధునిక సాహిత్య పునరుజ్జీవనంలో భారతీయ భాషలు మిక్కిలి సన్నిహితమవుతున్నవి. పరస్పర భావ వినిమయంతో, ఆదాన ప్రదానాలతో, తమలో తమకు ఒక ఐక్యతా బంధాన్ని భావించడం జరుగుతున్నది. ఇది క్రమంగా ఒక భారతీయ సాహిత్యవిర్భావానికి కారణం కాగలదు.

★

మనిషికోసం కవిత్వం
మంచికోరి నవ్యత్వం
నవ్యత్వం ప్లస్ మానవత్వం ఈజిక్వల్ టు కవిత్వం.

—శ్రీశ్రీ

With best compliments from

DIVYA DUTTA FILMS

MOTION PICTURE DISTRIBUTORS

134, RASHTRAPATHI ROAD

SECUNDERABAD–3

FOR

QUALITY SWEETS

INSIST

ON

BOMBAY SWEETS

★

BOMBAY HALWA HOUSE

BANK STREET
HYDERABAD
Phone : 44871

MARKET STREET
SECUNDERABAD
Phone : 72533

విద్యార్థిరచయితల విలువలు

శ్రీ ఎన్. ఇన్నయ్య

విలువలచర్చ:

విలువలన్నీ మానవసృష్టి. ఆధ్యాత్మిక, నైతిక విలువలకు విపరీత ప్రాధాన్యత యిచ్చిన దీ మానవుడే. కనుక విలువలంటే మానవ విలువలన్న మాట. ఇందులో స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, న్యాయం, సమానత్వం, నీతి మొదలైనవి బేరీజువేసి చూస్తే, స్వేచ్ఛకు ప్రథమస్థానం లభిస్తుంది. మిగిలిన విలువలన్నీ అందులోనుండి వ్యుత్పన్నమయ్యేవే.

విలువ అంటే యేది అనుసరించటంద్వారా మానవుడు ప్రగతి చెందగలడో అదే. అధ్యాత్మిక, మానవత విలువలకు స్వార్థమాత్రమే గాక, పరస్పర విరుద్ధత్వంకూడా వున్నది.

ఆధ్యాత్మిక విలువలుకూడా మానవుని సృష్టి అయినప్పటికీ, వాటికి అలౌకికశక్తి అపాదించి, అవి శాశ్వతమనీ, అపౌరుషేయమనీ, దైవం చెప్పాడనీ మానవుడు శాసించాడు. అవి పాటించకపోతే పాపమన్నాడు. ఆధ్యాత్మిక విలువలు పాటించటం భయంవలననే. మరణానంతరం ఆత్మకు యేదో జరుగుతుందనే భయమే యిందుకు కారణం. అందుండి చాలా సంస్థలు జనించి మానవుని స్వేచ్ఛకు సంకెళ్లువేశాయి.

మానవ విలువలలో అలాంటి భయాలేవీ లేవు. విజ్ఞాన శాస్త్రీయ పంథాననుసరించే యీ విలువలు యేర్పడినవ్. అవి పాటించకపోతే సమాజం సరిగా నడవదు. ప్రగతి వుండదు. కనుక యీ విలువలు తప్పనిసరి. అంతకుమించిన పవిత్రతవాటిలో లేదు. స్వేచ్ఛకావాలనుకోటం, యితరుల స్వేచ్ఛనుకాపాడటం, తద్వారా వ్యక్తి ప్రతిభావ్యుత్పన్నతలు విప్పారజేసుకోటం మానవత. అందరి స్వేచ్ఛను అరికట్టి కొద్దిమంది చెప్పినట్లు శాసించటం అమానుషం. మానవ విలువలు సరిగా పెంపొందటానికి రాజకీయ ఆర్థిక, సాంఘిక వ్యవస్థలుకూడా దోహదంచెయ్యాలి. ప్రజాస్వామ్యంలో యివి పనిచేస్తయ్. నియంతృత్వం వీటికి చుక్కెదురు. ప్రజాస్వామ్యం

ప్రాతిపదికగా అంగీకరించినంతమాత్రాన చాలదు. అందులో ఆర్థిక సాంఘిక సమానత్వం, న్యాయంచేకూర్చుతూ, దోపిడీలేని విధానం రూపొందించుకోవాలి. మానవవిలువలన్నీ నియంతృత్వంలో అమలుపరచగలిగితే తప్పేముంది అనే ప్రశ్న వేసుకుంటే కూలంకషచర్చ అవసరం. ప్రజాస్వామ్యంలో తప్పులుచేస్తాం. దిద్దుకుంటాం విమర్శించుకుంటాం. అదిపురోగతి, నియంత్రత్వంలో నిర్ణయాలు, విమర్శకు గురికావు. తప్పులు దిద్దుకునే పద్ధతిలేదు. కనుక బాగోగులు విడమరచి చూసే అవకాశంలేదు. అలాంటప్పుడు వారు అనుసరించేదే సరైనది అని నిర్ధారించటం యెలా? కనుక ప్రజాస్వామ్యంలోనే విలువలు అమలుపరచటం సాధ్యం.

అంతరాత్మను ప్రాతిపదికగా అధ్యాత్మిక విలువలు వుంటయ్, అక్కడ హిమాలయాలంత దోషాలు చేసినా, నియంతృత్వంలోవలె కనుగొనటం దుర్లభం. విలువలు వ్యక్తి ప్రయివేటుజీవితానికి సంబంధించినవి కావు. సమాజంలో యితరవ్యక్తులతో సంబంధం యేర్పడినప్పుడే విలువల ప్రశ్నకి వస్తుంది. కనుక ఆచరణ అనేది విలువలకు కొలమానం.

ఈ చట్రంలో, రచయితగా విద్యార్థిపాత్ర చూడటం సబబు.

విద్యార్థి రచయిత లక్షణాలు :

సర్వసాధారణంగా రచయితలు తమ ఆలోచనలను యితరులకు చెప్పాలని కాంక్షిస్తారు. యువరచయితలు తమ ఆలోచనలు యితరులకు చెప్పటమే గాక, ఆచరణలో రావాలని కోరతారు. విద్యార్థిదశలో రచయితకు వివేచనతోపాటు ఉద్వేగం జాస్తి. ఉద్వేగంమోతాదు హెచ్చుగావున్న రచయిత తన రచనలకు వివేచనతో పదునుపెట్టలేడు మానవులందరిలోనూ ఉద్వేగం సహజప్రేరణ లక్షణం. విద్యార్థిరచయిత తన రచనల ద్వారా ఈ ఉద్వేగ లక్షణానికి నచ్చేటట్లు వ్రాస్తాడు. దేశభక్తి, అవినీతి ఖండన, ఆదర్శాలు వల్లెవేయటం, కామం, అపరాధపరిశోధన యిలాంటి యితివృత్తాలు యేవి స్వీకరించినా ఉద్వేగలక్షణాలు విపరీతంగా ద్యోతకమౌతయ్. కనుక వైన చర్చించిన మానవ విలువలు అతనికి యింకా అపక్వాలే. విద్యార్థిదశలో వూహించేవన్నీ సరైనవికాదని తాత్పర్యం కాదు. కాని తాము చెప్పేది చిత్తశుద్ధితో చెబుతున్నామని, సమాజం బాగుపడాలని కోరుతున్నామని, కనుక తమదే మంచి మార్గమని వారు

భావిస్తారు. అలా భావించటంలో దోషం లేదుగాని, ఆ భావన సరైనదో కాదోననే విమర్శ చూడరు. విమర్శ సహించలేని వయస్సు విద్యార్థిది. ఒక విధంగా విద్యార్థి నియంత. రచయితగా అతనిలో ఆ లక్షణాలు తొంగి చూస్తుంటయ్. ఈ సున్నిత దశలో ప్రజాస్వామిక మానవ విలువలు సరిగా వంటబట్టకపోతే ఆ విద్యార్థి రచయిత సరిగా పెంపొందడు. కనుక విద్యా విధానం సరిగా మలచబడటం అవసరం. ఇదొక వలయం.

వివేచనకు పదునుపెట్టే విద్యావిధానం వుంటే విద్యార్థి రచయిత మానవ విలువల్ని సరిగా అవగాహనచేసుకుంటాడు. అప్పుడు భిన్నాభిప్రాయంవున్నా ఫరవాలేదు. అది నిజమైన ప్రజాస్వామ్య భవిష్యత్తుకు పునాది.

ఇంతవరకు జరిపిన చర్చ దృష్ట్యా చూస్తే నేడు విలువలకు ప్రాధాన్యత యివ్వటంలేదనీ, విద్యార్థి రచయిత అపక్వంగా పెంపొందుతున్నాడనీ సులభంగా అర్థంచేసుకోవచ్చు.

ఉన్నపళంగా తాముకోరింది అమలుజరపకపోతే వీల్లేదంటూ ఘెరావ్, ధర్నా, సమ్మె, నిరాహారదీక్షలు వివిధరంగాల్లో వ్యాపించినట్లే, రచనల్లోనూ విద్యార్థులు యీ ధోరణి చూపుతున్నారు. ఇక్కడ విద్యార్థి అన్నప్పుడు కొంతవరకు యువతరంవారినికూడా స్వీకరిస్తున్నాను. ఉదాహరణకు దిగంబరకవులు బయలుదేరి పచ్చినిజాన్ని నగ్నంగా చెబుతున్నామంటూ జుగుప్సకలిగించే భాషలో తిట్లతో రచనలుచేస్తే, అనుకున్న ప్రయోజనం చేకూరకపోగా సమాజం తిరగబడుతుంది. సమాజం బాగులేదనేది నిర్వివాదాంశం. బాగుచేయటానికి యేమార్గం అవలంబిస్తా మనేది ప్రశ్న. కొందరు రచయితలు ఒక మార్గాన్ని సూచించారనుకోండి. అదే సరైనది అని యెలా భావించడం? ఆ చర్చ రచయితలు చేయటంలేదు. యువ రచయితలు బొత్తుగా దూకుడుగా వున్నారు,

అయితే కాలం మారుతున్నది. విలువలపట్ల ధోరణి మారుతున్నది. అన్ని మార్పులూ చెడ్డవికావు. మారిందంతా మంచిదికాదు. ఆ విషయం చూద్దాం.

సమాజంలో పెత్తందారీతనం విపరీతమైపోయింది. యువరచయితలు కర్రపెత్తనంపై ధ్వజమెత్తి చాలావరకు విజయం సాధించారు. ఈ విజయం

NARLA MEMORIAL LIBRARY V.R. NARLA D.P.R.I. Acc. No. 1923

కవిత్వంలో ఛందస్సు, భాష మొదలు, భావాలు, ధోరణులు, కట్టుబాట్లు, ఆచారాలు మొదలైన అనేక విషయాలలో పేరొక్కనవచ్చు. ఇందుకు యువ తరాన్ని అభినందించాలి. పెద్దలు మార్పుల్ని గమనించకపోవటం కూడా ఒక పెద్ద లోపమే. అయితే స్వాతంత్ర్యం, స్వేచ్ఛ పొందిన యువరచయితలు వెర్రితలలువేయకుండా, నిలబెట్టుకోగలరా అనేది ప్రశ్న. సమాజంలో అస్థిరత్వాన్నే వారూ ప్రతిబింబిస్తున్నారు. కాని దారిచూపటంలేదు. ఆధునిక పరికరాలువాడటం, సాంకేతిక జ్ఞానార్జన వున్నంతగా, ఆధునిక భావాలు లేవు. సంప్రదాయాల్నే అనుసరిస్తున్నారు. సమాజంలోగల కుల, మత, ప్రాంతీయ తత్వంపైనా, కట్నాలపైనా రచయితలు ఆచరణలో తిరుగుబాటు చేయలేకపోతున్నారు. ఆధ్యాత్మిక జ్ఞానిసత్వంనుండి బయట పడలేకపోతున్నారు. రచయితలో కుతూహలంవున్నంతగా పట్టుదలలేదు.

విద్యార్థిదశ విలువల ప్రాతిపదికకు మంచి దశ, అవి సరిగా పాదుకుంటే రచనలు మంచివి వస్తయ్, నేడు ఆలోపం కనిపిస్తున్నది. రచనలలో అయోమయం, పులుముడు, శాఖాచంక్రమణం వున్నదంటే రచయిత ఆలోచన గందరగోళంగా వున్నదని తాత్పర్యం. విలువలు విస్మరించిన రచనలు వుత్తరోత్తరా చాలా హానికలిగిస్తయ్.

రచయితభావాల ప్రభావం సమకాలీనులపైనే గాక వుత్తరోత్తరా చాలా వుంటుంది. కనుక రచయిత పట్ల శ్రద్ధవహించటం అవసరం. విలువలు తెలియని యువ రచయిత సమాజానికి చేటు. ఉద్వేగాన్ని వివేచనతో పదునుపెట్టని రచన నిలబడదు. ఈ దృష్టితో పరిశీలిస్తే మన యువ రచయితల స్థాయి, ప్రమాణం అవగాహనచేసుకోవచ్చు.

卐

అనుకరణం అనవసరం
అంతేకాదు అనర్థకం.

—ఆరుద్ర

పాఠకులు - రచయితలు

శ్రీ ఖరివెంటి కృష్ణమూర్తి

చూసే వాళ్ళులేని నాటక ప్రదర్శనాన్ని ఊహించుకోలేనట్లే, పాఠకులు లేని రచయితను ఊహించలేము, అనందమో. ఉద్వేగమో కలిగినప్పుడు రచయిత మనస్సు స్పందింస్తుంది. ఆ స్పందనమే అతణ్ణి రచనకు పురికొల్పుతుంది. ఈ స్పందనగుణమే ఆదికాలమునుంచి మానవునికి బ్రతుకుమీద, బ్రతుకులోని కమ్మదనంమీద ఆసక్తిని, విశ్వాసాన్ని కలిగిస్తూన్నది. ఈ స్పందనానికి దేశంతోకాని, కాలంతోకాని, ఒక ప్రత్యేక సిద్ధాంతంతోకాని సంబంధం అంతగా ఉండదు. ఆకాశంలో మేఘాలు అనేక రూపాలతో మనకు కన్పిస్తూంటాయి. ఏపటం లో ఏ మేఘం ఏరూపం దాలుస్తుందో మనం చెప్పలేము. ఆవిధంగానే మనిషి ఊహాస్వరూపాన్ని అది బహిర్గత మయ్యేవరకు కనుగొనలేము. దేశకాల పరిస్థితుల ప్రభావం మనిషిపై ఉంటుందన్నమాట వాస్తవమే అయినా అతని ఊహలెల్లప్పుడూ వీటికి అతీతంగానే ఉంటాయి. అలా ఉన్నప్పుడే అవి ఇతరులకు ఆనందాన్ని కలిగిస్తాయి.

పాఠకులు అందుకోలేని ఆనందాన్ని రచయిత సృష్టిస్తే అది రచనా పరిధిలోనికిరాదు. పాఠకులందరు ఆరచనా స్థాయికి సరిపోయిన సంస్కారం, కలిగి ఉన్నప్పుడే అదిసాధ్యం. మరి ఈ సంస్కారం వివిధంగా ఉంటుంది - కనుక ఒకరకమైన రచయిత పాఠకులందరికీ సమానమైన అనుభూతిని కలిగించలేదు. రచయితకుగూడ కొన్ని ఆటంకాలున్నాయి. అతడు జన సామాన్యంలోనికి తన రచనలద్వారా చొచ్చుకొని పోవటానికి వాళ్ళ ఆలోచనా పరిధులను, మనస్తత్వాలను, దైనందిన జీవితవృత్తాలను అర్థం చేసుకోవలసి ఉంటుంది. ఈమాత్రపు సంస్కారం కలం పట్టినవానికి ఉండి తీరవలసినదే. ఆపైన తాను చెప్పదలచుకొన్నది చెప్పినపుడు అతణ్ణి అనుసరించటానికి పాఠకులకు క్లేశం ఉండదు.

నాటికీ నేటికీ ప్రాయకంగా అక్షరాస్యులే పాఠకులు. చదువుతుండగా విని, లేక చెప్పుతుండగావిని విషయపరిజ్ఞానాన్ని పెంచుకునేవారినీ, రసా

స్వాదనం చేసేవారిని మనము పాఠకుల కోవలోనికి చేర్చుకొనవచ్చును. ప్రాచీనకాలంనుంచి నిన్నమొన్నటిదాకా మనదేశంలో అక్షరాస్యుల సంఖ్య తక్కువ. ఆనాడు హరికథా పురాణ కాలక్షేపాలమూలంగా, బొమ్మలాటలమూలంగా, పెద్దలవల్ల అనేక విషయాలు తెలుసుకొనేవారు. ఆనందం పొందేవారు. మరి పుస్తకాల నుపయోగించుకొనేవారికి పాండిత్యం, సంస్కారం ఉండేవి. తమకు కావలసిన పుస్తకాలను తిరిగి వ్రాసుకొని, చదువుకొనేవారు, అంతేకాని జనబాహుళ్యానికి పుస్తకాలు అందుబాటులో ఉండేవికావు. కులవృత్తికి సంబంధించిన అనేకవిషయాలు పరంపరాగతంగా పైతృకంగా లభించేవి కనుక ఆయావిషయాలడు చదువుకోవలసిన అవసరం ఉండేదికాదు. పుస్తకాల అవసరంలేకుండానే అనేక విషయాలను తెల్సుకునే అవకాశాలు సహజంగా దైనందిన జీవనంలో, సామూహిక జీవనంలో అయాచితంగా లభిస్తూండేవి.

నాటి సమాజంలోని ప్రతి ఆలోచనకు మతం, ధర్మం ప్రాతిపదిక అయ్యేవి. ప్రతి విషయాన్ని ధర్మదృష్టితో పరిశీలించేగుణం రచయితలకు సంప్రదాయబలంవల్ల అబ్బేది. కనుకనే నాటిరచయిత ఏదివ్రాసినా ధర్మ దృక్పథాన్ని దృష్టిలో ఉంచుకొని వ్రాశేవాడు. అందుతే నాటికాలంలో రచన ఒక ఆరాధనా విశేషంగా పరిగణింపబడింది. వారి రచనల్లో కళాదృష్టి గౌణమేగాని ప్రధానంగాదు. తమకు ఒకవేళ నాటిప్రజల ఆలోచనలకు అతీతమైన భావంకలిగినా దాన్నికుదించి సంప్రదాయపు మూసలలోపోసి బయలుపరిచేవారు. ఎందుకంటే రచనకు ఉద్దేశ్యం ఉపదేశమే. విశ్వ శ్రేయస్సు కావ్యానికి లక్ష్యమని వాళ్ళఉద్దేశ్యం. నాటికీ నేటికీ ఇంచుమించు ఇదేదృష్టి రచయితకు వుండితీరాలని ప్రాచీన లక్షణికులు, నేటివిమర్శకులు వేరొక్కంటున్నారు. మతం ప్రభావం ఉన్నన్నాళ్ళు శ్రేయస్సు స్వరూపం అదేనిర్ణయించేది. కాని ఇప్పుడు దానిప్రాబల్యం తగ్గిపోవడంవల్ల శ్రేయస్సుకు రాజకీయ సిద్ధాంతాలే అప్పటికప్పుడు రూపకల్పన చేస్తున్నయి. ఈ రాజకీయ సిద్ధాంతాలలో వైవిధ్యమేకాదు, పరస్పర వైరుధ్యంకూడా ఉన్నది. వైజ్ఞానిక, సాంకేతిక శాస్త్రాభివృద్ధివలన నేటి ప్రపంచంలోని దేశాలు పొరుగిండ్లుగాను, మహాసాగరాలు చిన్న చిన్న సరస్సుల్లాగా కన్పిస్తూన్నాయి. ప్రపంచాన్నంతా తమగుప్పిట్లో వుంచుకోగలమనే అహంకారంతో యీనాడు కొన్నిశక్తులు నిర్లజ్జ్యంగా ప్రవర్తిస్తున్నాయి. కాని మరోపక్క

ప్రపంచమంతా ఒక్కచేనని, మానవులంతా ఒక్కచేనని, మానవుని కష్ట, సుఖాల స్వరూపం ఒక్కచేననే భావాలుకూడా శక్తిని పుంజుకుంటున్నాయి. మానవాత్మ ఎప్పుడూలేనంత వ్యాప్తంగా ఇప్పుడు మనకు కన్పిస్తున్నది. నేటి రచయితలు యీ మార్పును గమనించాలి. గడచినకాలం, దాని విలువలు చాలాగొప్పవని ఇప్పుడవి నశిస్తున్నాయని వాపోవడంకంటే మేధావియైన రచయిత నేటిపరిస్థితులను పరిశీలించాలి. ఇది స్థూలంగా రచయితల బాధ్యత. కాని హృదయమున్న రచయిత పొట్టకూటికోసం వ్రాయని రచయిత అన్నికాలాల్లోనూ ఉన్నాడు. అతనికి అన్యాయమని తోచిన విషయాన్ని గొంతెత్తిచాటాడు. అతన్ని గొంతు నొక్కటానికి ప్రయత్నాలు జరిగాయి. కాని వాడు చచ్చిబ్రతుకుతున్నాడు. దీనికి కారణం అతనిహృదయం. ఏ రాజకీయ సిద్ధాంతాలకు లొంగనిమనస్సు స్పందించి కళాసృష్టికి పూనుకుంటుంది. శత్రువు రక్తాన్నిచూచినా, మిత్రుని రక్తాన్ని చూచినా గాయపడే హృదయం ఉన్నపుడే రచయిత కళాసృష్టిగా మన గలడు. లోకం పోకడనుబట్టి తన రచనలను మలచుకొనేవాడు అతి సామాన్యుడైన రచయిత. పోకడలు మారగానే ఆ రచనకు విలువ నశిస్తుంది.

సూక్ష్మంగా పరిశీలిస్తే రచయిత బాధ్యతలు అనేమాట అచ్చమైన కళా సృష్టికి గొడ్డలిపెట్టు వంటిది. తనకుతోచిన, తన మనస్సును కదిపిన, తన మెదడును ఊహాధీనం చేసిన సంఘటనను నిర్భయంగా చాటగలిగినపుడే రచయిత సత్యాన్ని ప్రకటించ కలుగుతాడు. మరి ఆ సత్యాలు కటువుగాను తోచవచ్చు. తీయగాను తోచవచ్చు. కాలానికి విరుద్ధంగాను తోచవచ్చు. అనుకూలంగా తోచవచ్చు. ఆమాత్రం స్వేచ్ఛ రచయితకు ఉండాలి. అది లేనప్పుడు రచనలు వార్తాపత్రికలుగా, పంచాంగాలుగా, దస్తావేజులుగా, మారే ప్రమాదముంది. ప్రజాస్వామ్యంమీద నమ్మకమున్న సమాజంలో రచయితలకున్న యీ స్వేచ్ఛను గుర్తించాలి, రక్షించాలి.

ఇప్పుడు మహారచయితలుగా, క్రాంతదర్శులుగా, వైతాళికులుగా ఆరాధింపబడుతున్న రచయితలందరూ, ఒకకాలంలో, కాలానికి, సంఘానికి కరడుగట్టిన సంప్రదాయాలకు ఎదురుతిరిగినవారే.

ముద్రణా సౌకర్యాలు అధికంగాపెరిగిన యీ రోజుల్లో రచయితలకు స్వేచ్ఛవుంటే వాళ్ళభావాలు, పుస్తకాలద్వారా బహుళ వ్యాప్తికావచ్చు.

మరి ఆ స్వేచ్ఛను రచయితలు దుర్వినియోగపర్చుకొనే ప్రమాదంకూడా లేకపోలేదని కొందరి విమర్శకుల అభిప్రాయం. కాని పాఠకులు లేనిదే రచయిత బ్రతకడు. తన రచనలకు చలామణి వున్నందుకే అతడు వ్రాయ కలుగుతున్నాడు. అశ్లీలమైన, జుగుప్సాకరమైన సాహిత్యం సృష్టి అవు తున్నదే అని మనం భయపడనవసరములేదు. మానవాత్మ సహజంగా అభ్యుదయాన్నే ఆకాంక్షిస్తుంది. రచనా స్వేచ్ఛగల దేశాలలోకూడ కొందరు మాత్రమే విశ్వజనీనమైన సాహిత్యాన్ని సృష్టించకలుగుతున్నారు. కనుక రచయితలకేదో బాధ్యతలుండటను అవసరమని అనుకోవటం పొరపాటు. ఆలోచనలను అరికట్టలేము. అరికట్టటను బర్బరత్వం. మానవత్వంమీద నమ్మకము ఉన్నవాడు స్వేచ్ఛకోసం పోరాడుతాడు. స్వేచ్ఛకోసం పోరాడే వాళ్ళలో రచయితలేకాదు రకరకాల మానవులుంటారు. స్వేచ్ఛకోసం పోరాటం సల్పడం రచయిత బాధ్యతకాకపోవచ్చు. కాని అది అతని లక్షణం.

అందుకే మన భారతరాజ్యాంగం ఆలోచనా స్వేచ్ఛను ప్రసాదించింది. రాజ్యాంగంచూపిన వెలుగుబాటలో మనం పయనిస్తున్నాం.

రచయితలకు బాధ్యతవున్నా, లేకపోయినా వాళ్లు మానవునికి బ్రతుకు మీద ఆశను, మమతను కలిగిస్తారు. ఆదర్శశిఖరాలకు చేరువగా తీసుకొని పోతారు. చెప్పినట్లు వ్రాస్తే చెప్పినవానిమాటే చెప్పినట్లవుతుంది గాని తన మాటగాదు. రాచరికాలు, మూఢ విశ్వాసాలు నశిస్తున్నాయి. విజ్ఞానం పద్మంలాగా విచ్చుకొంటోంది. పొడుస్తున్న సూర్యునిలాగా అనుక్షణం అధికాధిక ప్రకాశంతో వెల్గునుప్రసరిస్తున్నది. తర్కానికి, హృద యానికి అంటే మేధకు హృదయానికి జరుగుతున్న సంఘర్షణలో హృదయమే జయించి తీరుతుందని రచయితకు నమ్మకముంటే చాలు. మరే బాధ్యతా నిర్దేశంలక్ష్యంలేదనే విశ్వాసంఉన్న వాళ్ళుమనదేశంలోనేకాదు, ప్రపంచమంతా వ్యాపించిఉన్నారు. ఇటీవల వెలువడుతున్న విశ్వసాహిత్యం ఈ యాథార్థ్యానికి ప్రమాణం. సదసద్వివేక పరిజ్ఞానాన్ని, దారిద్ర్య నిర్మూలమార్గాలను సూచించే రచనలుసాహిత్యపరిధిలోనికిరావు. ఆయా విషయాల రచయితలు తాత్వికులు శాస్త్రజ్ఞులు, తార్కికులు. వారికి బాధ్యతలున్నవి. అది వేరేవిషయం. కాని హృదయసంబంధి అయిన సాహిత్యసృష్టిచేసే రచయితలకు బాధ్యత లుండవు. వారి రచనల్లో సందేశంసూచింపబడవచ్చును. అంతేకాని సందే శమే రచనోద్దేశం అయినప్పుడు, మరి ఆ సందేశం దేశకాలపరిస్థితుల చట్టాల్లో బంధింపబడే ప్రమాదం ఉంటుంది. అప్పుడు స్వేచ్ఛను కోల్పో యిన రచయిత వ్రాసినా వ్రాయకపోయినా ఒరిగేది ఏమీవుండదు.

సంఘంలో మార్పు :

శాస్త్రీయదృక్పథము

డా॥ సి. లక్ష్మన్న

నవభారత సమాజము పరిణామానికి మారుపేరుగా వుంటున్నది. సంఘములో అనేక మార్పులు వస్తున్నవి. స్వాతంత్ర్యము సాధించడముతో పరిపాలనా వ్యవస్థలో మార్పువచ్చింది. ప్రజాస్వామ్యబద్ధమైన పరిపాలనా యంత్రాంగము నెలకొనింది. భారత రాజ్యాంగము విభిన్నమైన హక్కులను గుర్తించింది. సామాన్యమానవుని పాలన యేర్పడాలని ఆకాంక్షించింది. రాజకీయ స్వాతంత్ర్యము ఆర్థిక విధానములో మార్పును సూచించింది. సమాజ సామ్యవాద సిద్ధాంతాల ప్రాతిపదికగ నూతన ఆర్థిక వ్యవస్థను సాధించాలని భారతప్రభుత్వము, ప్రజలు–ఆసక్తి, ఉత్సుకత చూపుతున్నారు. ఈ విధంగ మార్పులు చేందుతున్న ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు నూతన సాంఘిక వ్యవస్థతోనే సాధ్యమవుతాయి. అంచే అనాదిగా దేశంలో నెల కొన్న సాంఘిక వ్యవస్థ మార్పుకు అనుకూలంగాలేదు. కాలంతోపాటు, సమాజము కొన్ని మూఢనమ్మకాలను, సాంఘిక నియమాలను వుత్పన్నము చేసి, వాటిని పాతుకొనిపోయేలా చేసింది, ఈ మూఢనమ్మకాలు, అహేతుక వాదాలు పరిణామానికి అడ్డంకులుగ వుంటున్నాయి.

నేటి పరిస్థితిని సంధియుగంగా పేర్కొనవచ్చును. ఈ యుగసంధిలో పాత విలువలకు స్థానము. హోదా, ప్రతిపత్తి, స్థిరత్వము లేకుండపోతున్నది. వాటికి హేతుబద్ధత సన్నగిల్లి పోతున్నది. సనాతన సంఘానికి, సనాతన కట్టుబాట్లకు గీటురాళ్ళగా మాత్రమే మిగిలిపోతున్నాయి. సాంఘిక ప్రయోజనాలకు, సాంఘిక లక్ష్యాలకు, యీ విలువలకు యెలాంటి సంబంధములేకుండ పోతున్నది. గట్టిగ చెప్పాలంచే, అవి కేవలము శిథిలావస్థలో వున్న సాంఘిక వ్యవస్థకు నిష్ప్రయోజనమైన పునాదులగ మాత్రమే వ్యవహరిస్తున్నాయి. కాని పునాదులన్ని కదిలిపోయి, యిప్పుడో అప్పుడో కూలి

పోతూంది. అనే భావాన్ని మరి మరి గుర్తుచేస్తున్నాయి. అయితే దుర దృష్టమేమిటంటే, అటువంటి సంధియుగములో నూతన విలువలకు ఒక ప్రస్ఫుటమైన రూపురేఖ యేర్పడి వుండలేదు. మసక మసకగ నూతన వ్యవస్థ యొక్క ఆకృతి కనిపిస్తూ వుంటున్నది. అంటే నూతన విలువలు, సాంఘిక ప్రయోజకారి అయివుండికూడా, సామాజిక వ్యక్తుల సంపూర్ణ ఆమోదాన్ని పొందలేదు. వాటినిగూర్చిన సంశయము, అనుమానము కొట్టవచ్చినట్లు కనీసము కొన్ని వర్గాలలోనైన కనిపిస్తుంటున్నది. అందు చేత, నూతన విలువలను స్వంతము చేసుకొనడములో, సామాజీకరణ యంత్రాంగంగ రూపొందడములో కొంత సంకు, తడబాటు. బిడియము అగుపిస్తుంది. ఇది కాకుండ యింకో అంశముకూడ తలెత్తుతుంది. ఒకసారి పాతుకుపోయిన, స్థిరపడిపోయిన విలువలను త్రోసిపుచ్చినప్పుడు, వాటి వునికిని ప్రశ్నించినప్పుడు, క్రొత్తరూపు దాల్చుకొంటున్న నూతన విలువల పట్లకూడ కొంత సంశయాత్మక దృక్పథము చెప్పకుండానే ప్రజానీకములో ప్రస్ఫుటమవుతున్నది. అందుచేత సమాజము కొంత గందరగోళంగ వుంటున్నది. చలనము సంఘములో ఒక విధమైన అస్థిరత్వము (Unrest)ను కలుగజేసి, ప్రజలలో నిస్పృహ, చేతగాని తనము (helplessness) వగైరా లను కలిగిస్తున్నది. దాదాపుగ నేటి భారత సమాజము అటువంటి స్థితి లోనేవుంది. గ్రామీణ ప్రజానీకము నగరవాసులవైపు దృష్టిని నిలిపి. వాళ్లను అనుకరిస్తున్నారు. నగరవాసులు పాశ్చాత్య నాగరికతా లక్ష్యాలపై, లక్షణాలవైపు మొగ్గుచూపుతున్నారు. అంటే నేడు ఒకవిధమైన భయాత్మక సందిగ్ధ స్థితిలో సంఘము వుంటున్నది. విచక్షణ, హేతుకత పూర్తిగ సన్నగిల్లిపోయింది. పాశ్చాత్య సమాజములో ధృఢత్వముకలిగి, సాంఘికాభి వృద్ధిక్రితోడ్పడి, తోడ్పడుతున్న విలువలను మనము పాటించటము మనవిధి. పాశ్చాత్య సమాజము శాస్త్రీయ సాంకేతిక రంగాలలో 'అనర్గళమైన కృషి' సాధించింది. శాస్త్రీయ, సాంకేతిక అంశాల ఆధారంగా కొన్ని స్థిరమైన విలువలను పెంపొందించింది. వాటిని మనము అనుసరించడములోకాని, మనవిగా చేసుకోవడములోగాని యెటువంటి తప్పులేదు. పైగా వాటిని మన సంస్కృతిలోనికి. నాగరికతలోనికి, మన సాంకేతికాభివృద్ధిలోనికి అంగాలుగా చేసుకోవడము అతిముఖ్యము. పోతే పాశ్చాత్య సమాజములో రేకెత్తిన అసంతృప్తి సూచకమైన పై పై మెరుగులను మాత్రమే అనుక

రిస్తూ, అంతర్లీనమైయున్న వుత్తమ విలువను (Intrinsilc values) ను మరిచిపోవడముతోనే తప్పుటడుగు వేస్తున్నాము. అంటే సాంఘిక మార్పుల పట్ల సహేతుకమైన శాస్త్రీయ దృక్పథము నేడు చాల ముఖ్యమని నొక్కి చెప్పవచ్చు. సంఘంలో కలుగుతున్న ప్రతి మార్పును తూలనాత్మకంగ పరిశీలించి. శాస్త్రోక్తంగ సమాజ ప్రయోగకారి అయినప్పుడే, యే మార్పు నైన ఆమోదించి, ప్రోత్సహించవలసివుంది. పాతకొత్త విలువల బాగోగులు తుణ్ణంగ అవగాహన చేసుకోవలసివుంది. అంటే సమాజాన్ని పరిశోధనాత్మక దృష్టితో నిరంతరము సమీక్షించి, విశ్లేషించి, విచక్షణా జ్ఞానముతో మెలుగవలసివుంది. అప్పుడే నవసమాజానికి గట్టి పునాదులు వేయగలుగుతాము. ప్రజానీకములో సుఖశాంతులకు స్థానము యేర్పాటు చేయగలుగుతాము.

అటువంటి దృక్పథము పెంపొందాలంటే, సమాజిక పరివర్తనము యొక్క రూపురేఖలు, గతి, వేగము మొదలైన అంశాలగూర్చి సూక్ష్మంగ తెలుసుకోవడము అవసరము. స్థూలంగ చెప్పాలంటే సంఘములో మార్పు సామాజిక పరివర్తనము రెండు రకాలు. (1) సామాజిక వృద్ధికోసము. (2) యోజనాత్మకమైన ప్రణాళికాబద్ధమైన సాంఘిక పరివర్తనము. ఇంతో కొంతో సంఘము నిరంతరముగ మార్పుచెందుతూనే వుంటుంది. పోతే కొన్ని సార్లు (చాలామారులే కావచ్చు) యీ మార్పు కంటికందక, మందకొడిగ వుండి, అచలనంగా వుందా అనే అపోహకు, సంశయానికి దారి తీస్తుంది. గాని సూక్ష్మంగ పరిశీలించినట్లైతే, మార్పును సూచించడము అంతకష్టముగాదు. సమాజములో అంతర్లీనమై కొన్నిశక్తులు నిరంతరంగా పనిచేస్తుంటాయి. జనన మరణాలవల్ల, స్థానచలనమువలన. నైసర్గిక మార్పులవలన, సాంఘిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలలో కొద్దికొద్ది మార్పుల వలన సంపూర్ణసమాజము కొంతకు కొంత మార్పుచెందుతూనే వుంటుంది. ఈ అంశములోగూడ సంఘములో ప్రజానీకము యొక్క కార్యకలాపాల యొక్కయు, దృక్పథము యొక్కయు ప్రభావము కొంతవరకు ఉంటుంది గాని యీ పరివర్తనము చాలవరకు ప్రజానీకము యొక్క ప్రమేయము లేకుండానే జరిగిపోతూ వుంటుంది.

రెండో కోవకు చెందిన సాంఘిక పరివర్తనమే (పస్తుతము) మనకు ముఖ్యము. అంటే సమాజములో సమాజగతిలో వున్న (పస్తుత) పరిణామముతో

MEMORIAL LIBRARY V.R. NARAYANA DP Acc. No

సంతృప్తి పొందలేక నూతన సమాజ నిర్మాణానికి అంచనాలు, పథకాలు, వేసి, సాంఘిక పరివర్తనానికి కృషి ప్రయాసలు చేస్తుండడంలోనే మనకు చాల సంబంధము వుంటున్నది. ఈ ప్రణాళికా రచనలో, మార్పుల నుద్దేశించడములో శాస్త్రీయ దృక్పథము ప్రస్ఫుటము కావాలి. ఈ పరిణామాలను సాధించడములో సమాజములో నూతన శాస్త్రీయ దృక్పథాన్ని మలిచి, దానిని ప్రోత్సహించవలసివుంది. ఈ కోవకు చెందిన సాంఘిక పరివర్తనము అర్థవంతము, ప్రయోజనాత్మకము గావాలంటే, ప్రజానీకము యావత్తుకు దానితో సంబంధ బాంధవ్యాలు నెలకొల్పుకోవాలి. ఈ నూతన సమాజ నిర్మాణములో తాము భాగస్వాములు అనే భావము వ్యక్తంగావాలి. ప్రజలలో వివేచనా జ్ఞానము, హేతుకత్వము. సమీక్షక దృష్టి, శాస్త్రీయ దృక్పథము కలిగిననాడే ఆ భావము సాధ్యమవుతుంది, మూఢనమ్మకాలు పిడికట్టు వాదాలు వున్నంతకాలము యిలాంటి సంపూర్ణ ఆమోదముతో గూడిన కలుపుగోలుతనము, భాగస్వామ్యత్వము నెలకొనదు.

ఒక విధంగా చెప్పాలంటే సామాజిక ప్రగతిలో సాంఘిక అభ్యుదయములో, మానవ పరిణామములో నేటి 'మానవ' సమాజము శాస్త్రీయ యుగంగ పేర్కొనవచ్చును. అనేక అంగాలలో, రంగాలలో యీ శాస్త్రీయత పాతుకునిపోతూ వున్నది. ఇంకా యేమైనావుంటే, యీ శాస్త్రీయత, శాస్త్రీయవాదము ఒకవిధమైన నూతన మూఢనమ్మకాలకు దారితీసేటంతగా సమాజములో శాస్త్రీయ సంచలనము కలిగివుంది. ఆగష్టుకోమ్టు (Auguste comte) మహాశయుడు అనాదినుండి నేటివరకు సాంఘికాభివృద్ధిని, మానవ పరిణామాన్ని మూడు దశలుగా విభజిస్తాడు. (1) ధార్మిక (మతసంబంధమైన) సమాజము (Theological) (2) తార్కిక (అతిభౌతిక) (Metaphysical) సమాజము (3) శాస్త్రీయ (నిర్మాణాత్మక) (Positive) సమాజము. వీటికి అనుగుణంగా వరుసగా 1 .సైనిక (Military) 2, చట్టమూలమైన (Legalistic) 3. పారిశ్రామిక (Industrial) సమాజాలూ యేర్పడుతాయి. అంటే అధునాతన సమాజము పారిశ్రామిక యుగంగా రూపొందిందన్నమాట. ప్రపంచము మొత్తము పర్యావలోకన చేసినప్పుడు, యీ విషయము సత్యసహితమే అన్నదాంట్లో యెలాంటి సందేహములేదు, ప్రపంచములో పరిణతి చెందిన దేశాలు, పరిణితి చెందుతున్న దేశాలు, అన్ని కూడ పారిశ్రామిక పురోభివృద్ధికి నిరంతరంగ కృషిచేస్తున్నాయి.

భారీపరిశ్రమలు విస్తృతంగ నెలకొన్ననాడు, ప్రజలలో ధృఢమైన శాస్త్రీయ దృక్పథము యేర్పడితేనే, పారిశ్రామిక వ్యవస్థ యొక్క సమస్యలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని, యంత్రాంగముపై తగిన చాకచక్యము, అధికారము, దక్షత యేర్పడజాలవు.

అంచే పారిశ్రామికీకరణము ఆధునీకరణానికి గీటురాయి. ఈ పారిశ్రామికీకరణము చిరకాలంగ గృహాంగణానికి సమితులైన స్త్రీవర్గాన్ని బంధవిముక్తులను చేయడములాంటి చర్యలకు దారితీస్తుంది. ఈ మారుతున్న విలువను గుర్తించకుండ, సనాతనధర్మానికి కట్టుబడి స్త్రీ గృహిణిమాత్రమే అని యెంత ఆరాటపడినా ప్రయోజనముండదు. అలాగే సమానత్వము. స్వాతంత్రము, సహోదరత్వములాంటి నూతన విలువలకు యెక్కడలేని బలము ప్రాప్తమవుచున్నది. వ్యక్తి వ్యక్తిపై, వ్యక్తీవర్గముపై, వర్గము వర్గముపై పెత్తనముచలాయిస్తూ, దోపిడికి దారితీసే విధానానికి స్వస్తిచెప్పవలసి వస్తూన్నది. అంచే సమాజవాద ఛాయలు నలుమూలల ప్రాకుతున్నాయి. ఇది నూతనచరిత్రగతికి ప్రస్ఫుట తారాకణము. ఈ చరిత్రగతిని శాస్త్రీయ దృక్పథముతో అర్థముచేసికొని, ఆ గతివేగాన్ని పెంచడానికి సహాయపడాలేకాని, మొండిగ అడ్డుకోడానికి ప్రయత్నిస్తే, కదులుతున్న రథచక్రాల క్రింద పడి నలిగి నశించిపోవలసి వస్తుంది.

సంఘములో మార్పు, శాస్త్రీయ దృక్పథము అన్న అంశాన్ని రెండు కోణాలనుండి చూడవచ్చును. 1) సంఘములో వస్తున్న మార్పులపట్ల శాస్త్రీయ దృక్పథము అలవర్చుకొని, హేతుబద్ధంగ, వివేచనాత్మకంగ పరిశీలించి, నూతనవిలువలను సక్రమ మార్గములో సాధించడము. అంచే శాస్త్రీయ, సాంకేతిక అభివృద్ధివలన వస్తున్న ప్రతి పరిణామము యెంత వరకు సాంఘిక ప్రయోజనాలకు దోహదకారిగవుంది, యెంతవరకు సుఖ శాంతులకు నిలయమైన నూతన సమాజ నిర్మాణానికి అవుసరము, వుపయోగము అనేదాన్ని క్లిష్టంగ, సూక్ష్మంగ పరిశీలించగలగిన ఒరవడి, దక్షత సమాజములో అభివృద్ధి అవడానికి తగిన వాతావరణాన్ని సృష్టించ కలగాలి. ప్రతి వ్యక్తి స్వశక్తిపై, స్వంత ఆలోచనపై సామాజిక ప్రక్రియ లను అవగాహన చేసుకొని ఆచరించ కలిగిన స్థోమత కలుగజేసే ప్రయత్నాలు సంఘములో జరగాలి. మూఢనమ్మకాలను అట్టిపెట్టుకొనడమువలన సాంఘి

కంగ. వ్యక్తిపరంగ యెలాంటి లోటుపాట్లకు. అనర్థాలకు దారి తీస్తుందో స్వతహాగా విమర్శించుకొనే శక్తి ప్రజానీకములో పెరగాలి. ఆ నాడు శాస్త్రీయ దృక్పథము దానంతటదే ప్రజలలో యేర్పడుతుంది.
2) సంఘములో రచింపబడిన. తీసుకురాబడిన ప్రతి మార్పు సహేతుకము, శాస్త్రోక్తము కావాలి. అంటే ప్రణాళికరచనలో. అభివృద్ధిపథకాలలో యా శాస్త్రీయత స్వస్థంగ కానరావాలి. ఇది జరగాలంటే పాలకవర్గము, మేధావివర్గము అప్రమత్తత, సామర్థ్యముకలిగి, అటువంటి పరిణామాలను భావితరాలవారికి అందజేయకలిగివుండాలి. అంటే యీవర్గాలపై గురుతర మైన బాధ్యత వుందన్నమాట. సమాజములో ఉపరితలములో గానవస్తున్న రూపురేఖలనుకాకుండ, అంతర్గతమై, అంతర్లీనమైవున్నశక్తులను, అంశాలను అవగాహనచేసుకొని వానిని ప్రణాళిక రచనలో ఉపయోగించుకొనే శక్తి సామర్థ్యాలు కలిగివుండాలి. అలా సమస్తప్రజానీకము సూక్ష్మంగ; తూలనాత్మకంగ, చిత్తశుద్ధిగ సాంఘిక పరివర్తనమును ఆకాంక్షించి. కృషిచేసిన నాడు, సమాజము కొత్త తొడుగులను తొడిగి, శాంతికి సహనతకు, సమానత్వానికి మారుపేరు గాగలదు. అటువంటి శాస్త్రీయ దృక్పథము పెంపొందుతుందనే ఆశిద్దాము.

★

కుహనా సంస్కారాల కుటిలతనుండి, కృత్రిమతనుండి
సుడులనుండి, జడులనుండి
వలలనుండి, జలగలనుండి
విడివడే స్వేచ్ఛ, స్వేచ్ఛ స్వేచ్ఛ
స్వేచ్ఛ కావాలి నాకు.
పాడవోయి సోదరుడా!
కవీ! కవీ! మానవుడా!

—వే. నరసింహారెడ్డి.

రచయితల సంఘాలు

శ శాంక

రచయితల ఆర్థికమైన అభివృద్ధికి పాటుపడే ట్రేడ్ యూనియన్లవంటి సంఘాలేవీ ఈనాటికి మనదేశంలో ఏర్పడకపోయినా వారి వారి సాహిత్య వ్యాసంగానికి దోహదంచేసిన సమితులో, సంఘాలో, పరిషత్తులో ఈ శతాబ్ది తొలిరోజుల్లోనే తెలుగుదేశంలో ఏర్పడినట్లు చెప్పుకోవచ్చు. అటువంటి సంఘాల్లో, పిఠాపురం మహారాజావారి సహాయ సహకారాలతో 1911 ప్రాంతంలో ఏర్పడిన ఆంధ్రసాహిత్య పరిషత్తును మొట్ట మొదటి సంస్థగా వేరొక్కనవచ్చును. పూర్వాంధ్ర సాహిత్యంలో సుసంపన్నమైన తాళపత్రగ్రంథాలను సేకరించడం ఆ విధంగాసేకరించిన గ్రంథాలను పరిష్కరించి ముద్రించడం, సూర్యరాయ నిఘంటువునుపేర సమగ్రమైన తెలుగు నిఘంటువు తయారుచేయడం ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక అనే సాహిత్య పత్రికనునడిపించడం, గ్రాంథికభాషా ఉద్యమానికి పెట్టనికోటగా నిలవడం, ఇవన్నీఅరవై ఏండ్లుగా ఆంధ్రసాహిత్య పరిషత్తు సాధించిన అపూర్వమైన విజయాలు. ఈ పరిషత్తు స్థాపనలోనూ ఆనాటి పండిత ప్రకాండులైన శ్రీయుతులు కందుకూరి వీరేశలింగంపంతులు, వేదము వేంకటరాయశాస్త్రి, కొమర్రాజు లక్ష్మణరావు, వావిలికొలను సుబ్బారావు, జయంతి రామయ్యపంతులు, గారలు సల్పినకృషి చిరస్మరణీయమైనది. అయితే యీ పరిషత్తు ఆధునిక సాహిత్యాన్ని చిన్నచూపు చూసింది. అప్పటికే వెల్లువైవ వెల్లుబుకుతోన్న వ్యావహారిక భాషాఉద్యమానికి అడ్డుకట్టలు కట్టబోయి విఫలమైంది. ఆ కారణంగానే పూర్వాంధ్ర సాహిత్యానికి ఎంతసేవ చేసినా ఆంధ్ర సాహిత్యపరిషత్తు ఆధునిక సాహితీపరుల మన్ననలను అందుకొనలేకపోయింది.

కాలానుగుణంగా వస్తోన్న మార్పులను గమనిస్తూను, ఆధునిక సాహితీపరులైన రచయితలకూ, కవులకూ ప్రోత్సాహం కల్పిస్తూనూ అనేక సంఘాలు ఆతర్వాత వెలిశాయి. అందులో శ్రీతల్లాప్రగడ శివశంకరశాస్త్రి, నోరి నరసింహశాస్త్రి ప్రభృతుల ఆధ్వర్యంలో వెలసిన సాహితీ

సమితి, శ్రీ పురిపండ అప్పలస్వామి, శ్రీ శ్రీ రంగం శ్రీనివాసరావు, వడ్డాది సీతారామాంజనేయులుగార్ల కృషిఫలితంగా ఆవిర్భవించిన కవితా సమితి ముఖ్యమైనవి. వీటిని సంఘాలని వ్యవహరించడంకన్న సాహితీ మిత్రబృందాలుగా పరిగణించడం మంచిది. ఇవి రెండూ తను తమ కవి మిత్రులను ప్రోత్సహిస్తూ, వెన్నుతట్టి ముందడుగు వేయించడంలో మంచి కృషిచేశాయి. తత్ఫలితంగానే కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ మొదలైన కవులకు తమశక్తిపై అపారమైన ఆత్మనిశ్వాసం కుదురుకొనడం, ఆ తర్వాత వారిరువురూ నవ్యసాహిత్యోద్యమ నిర్మాతలుగా రూపుదిద్దుకొనడం జరిగింది.

అటుపిమ్మట అంతకన్న విస్తృతమైన ప్రాతిపదికమీద నెలకొల్పబడి విశేషంగా కవులనూ, రచయితలునూ ఆకర్షించి, నవ్యసాహిత్యాన్ని ప్రచారంచేసిన సంస్థ నవ్యసాహిత్య పరిషత్తు. యీ సంస్థలన్నీ తమ తమ సభ్యుల గ్రంథాలను ప్రచురించడం, వార్షికోత్సవాలను జరపడం, పత్రికలను ప్రచురించడంద్వారా నవ్యసాహిత్య అభివృద్ధికీ, ప్రచారానికీ ఎంతగానో తోడ్పడ్డాయి.

అటుతర్వాత వచ్చిన ఆంధ్ర అభ్యుదయ రచయితలసంఘం భారతీయ అభ్యుదయ రచయితల సంఘానికి అనుబంధసంస్థ. భారతీయ రచయితల నందరినీ మొట్టమొదటిసారిగా ఒకే వేదికమీద సమీకరించిన గౌరవం యీ సంస్థకే దక్కుతుంది. భారతీయ భాషల్లో వెలసిన అభ్యుదయ రచయితల సంఘాలన్నీ సాహిత్య దృక్పథంతోనే విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి, సంఘశ్రేయస్సే సాహిత్యప్రయోజనంగా నిర్వచించాయి. ఆ ప్రభావానికి లోనైన రచయితలు సమకాలీన సాంఘికేతి వృత్తాలనూ, సమస్యలను కావ్యవస్తువులుగా గ్రహించి, వాటి పరిష్కారమార్గాలను అన్వేషిస్తూ రచనలుసాగించారు.

ఇవన్నీ 1940 ప్రాంతాలకే ఆంధ్రప్రాంతంలో ఏర్పడిన సాహిత్య సంఘాలు. యీ సంఘాల ప్రభావం అప్పటి నైజాం రాజ్యంలోఉన్న తెలంగాణా సాహితీపరులపైన విశేషంగా ప్రసరించింది. ఆంధ్రదేశంలో ఏర్పడిన ఆంధ్రసాహిత్య పరిషత్తు మాదిరిగానే హైద్రాబాద్‌లోనూ 1943లో ఆంధ్రసారస్వత పరిషత్తు ఉదయించింది. యీసంస్థ నిర్మాణ, నిర్వహణ కార్యకలాపాల్లో శ్రీయుతులు లోకనంది శంకర నారాయణరావు,

సురవరం ప్రతాపరెడ్డి, దేవులపల్లి రామానుజరావు, నూకల నరోత్తమరెడ్డి ప్రభృతులకృషి ప్రశంసనీయమైనది. సభలూ, సమావేశాలూ జరిపి, రచయితలను ప్రోత్సహించి, గ్రంథాలను ప్రచురించి, యీసంస్థ ఎనలేని సాహిత్య సేవ చేసింది. అన్నిటికన్నా ముఖ్యంగా భాషా విషయకంగా వెనుకబడివున్న తెలంగాణా ప్రాంతంలో సారస్వత పరీక్షలు ప్రవేశపెట్టి యీసంస్థచేసిన కృషి ప్రశంసార్హమైనది

ఆ తర్వాత 1953 ప్రాంతాలలో శ్రీయుతులు దాశరథి, నారాయణ రెడ్డి, కాళోజీ ప్రభృతుల కృషితో వెలుగులోకి వచ్చిన తెలంగాణా రచయితల సంఘం, యువకవులనూ,రచయితలనూ సమీకరించి తెలంగాణా ప్రాంతంలో ఆంధ్రప్రదేశ అవతరణకి పూర్వమే బ్రహ్మాండమైన సాహిత్య చైతన్యాన్ని కలుగజేసింది.

ఇలాగే అఖలాంధ్రదేశంలోనూ చిన్నవీ పెద్దవీ అయిన అనేకసంస్థలే రచయితల సంఘాలుగా యీదశాబ్ది ప్రారంభదశనుండే పనిచేస్తూ, ఆంధ్ర సారస్వత వ్యాప్తికి అవిరామమైనకృషిని సాగించాయి. ఇటీవల ఏర్పడిన ఆంధ్రప్రదేశ సాహిత్యఅకాడమీ ఇప్పుడే భాధ్యతలన్నీ స్వీకరిస్తున్నది.

మరి యీ సంఘాలన్నిటినీ రచయితల సంఘాలుగానే పరిగణించ వలసివస్తుంది. అయితే యీ సంఘాల లక్ష్యాలనన్నిటినీ దృష్టిలోపెట్టు కొంటే మూడు ముఖ్యమైన ప్రయోజనాలను సాధించడానికే రచయితల సంఘాలు ఎప్పుడూ పనిచేయవలసి వున్నట్లుగా విశదమౌతుంది.

ఒకటి : పూర్వాంధ్రకవుల కావ్యాలను పరిష్కరించి ప్రకటిస్తూ ఉండడం, నిఘంటువులూ మాండలికపదకోశాలూ, వ్యాకరణాలూ, భాషా శాస్త్రాలవంటి గ్రంథాలను రచింపజేసి ప్రకటిస్తూ ఉండడం వంటి పనులు ఒక సంఘంచేయాలి. ఇటువంటి సంఘాలే ఎక్కువగా సాహిత్య భవితవ్యాన్ని తీర్చిదిద్దగలవు. అయితే ఈ సంస్థల్లో ఎక్కువగా దిగ్దంతులైన పండితులే సభ్యులుగా ఉండవలసివస్తుంది. ఒకరకమైన స్థాయిలేనటువంటివాళ్ళు ఇటు వంటి సంఘాల్లో సభ్యులై సారధ్యంవహిస్తే, ఇంక ఆ సాహిత్యానికి పుట్ట గతులుండవు. ఇటువంటి సంఘాలే ప్రాచీనాంధ్రగ్రంథాలను సేకరించే పథకాన్ని కూడా చేపట్టాలి. ప్రతిభామణులైన సమకాలీన రచయితల కృషిని గుర్తిస్తూ వారిని సత్కరిస్తూ, వారి గ్రంథాలకు బహుమతులను

ప్రకటిస్తూ ఉండాలి. భాషాభివృద్ధికీ, సాహిత్యాభివృద్ధికీ తోడుపడే పత్రిక లను నడపాలి. మారుతోన్న సాహిత్యపు విలువలను సూచించే సూత్రాలను కనుగొనాలి. ఏచేటా దేశంలో జరుగుతోన్న సాహిత్య కృషినికూడా ఇటు వంటి సంఘాలే సమగ్రంగా పరిశీలించి సమీక్షించాలి. యీ సంఘాలు దేశంలో వ్యాప్తిలోఉన్న ఏ రకం సాహిత్యంమీదా ప్రత్యేకాభిమానం వహించక, అన్నిరకాల సాహిత్యాలయెడా నిష్పక్షపాత వైఖరిని అవలం బించేవిగా ఉండాలి. యీ పనులన్నీ సక్రమంగా జరిగితే యీ సంఘమే దేశీయసాహిత్యాన్ని అజరామరం చేయగల ఏకైక సంస్థ కాగలదు.

రెండు : యీ సంఘాలు పూర్తిగా సృజనాత్మకమైన రచనలు చేయ గల వ్యక్తులకు మాత్రమే పరిమితమై ఉండాలి. ఆయా రచయితలు స్వీకరించే రచనా మార్గాన్ని బట్టి ఇటువంటి సంఘాలు ఎన్నైనా ఉండవచ్చు. ఒకే మార్గాన్ని అనుసరించే పదిమంది రచయితలు ఒక మిత్రమండలిగా వ్యవహ రిస్తూ, పరస్పరం ప్రోత్సహించుకొంటూ, సహకారాన్ని అందించుకొంటూ, రచనల్లోని లోపాలను సహృదయతతో సరిదిద్దుకుంటూ యీ సంఘాలు వ్యవహరించాలి. ఇటువంటి సంఘాలే రచయితలకు ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తూ వారి రచనా వ్యాసంగానికి విశేషంగా తోడుపడగలవని నిస్సందే హంగా చెప్పవచ్చు.

కేవలం లాభాలు సంపాదించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న పత్రికాధిపతులూ, ప్రచురణకర్తలూ, సాహిత్యంలో సరికొత్త ప్రయోగాల మీద పెట్టుబడి పెట్టడానికి ముందుకురారు. ఏ రకమైన సాహిత్యం తేలిగ్గా అమ్ముడు పోతుందో, అటువంటి సాహిత్యాన్నే సేకరించి ప్రచురించడానికి వారు ప్రయత్నిస్తారు. అందువల్ల నూతనమార్గాల్లో పురోగమించడానికి రచయితలకు అవరోధం ఏర్పడుతుంది. ఈ అవరోధాలనుండి బయటపడి నవనవోన్మేషమైన సాహిత్యాన్ని సృష్టించడానికి యీ సంఘాలు ఎక్కు వగా తోడ్పడగలవు. అటువంటి సంఘాలు ఎన్ని ఎక్కువగావుంటే అంత వైవిధ్యం సాహిత్యంలో రావడానికి సావకాశం ఉంటుంది. ఈ సంఘాలే పాఠకులలో వినూత్నమైన అభిరుచులను కల్పించడానికి దోహదం చేయ గలవు; రచయితల వ్యక్తిత్వాన్ని పెంచగలవు.

ఎటువంటి నూత్న ప్రయోగాలకైనా మొదటిలోనే విశేషంగా ప్రజాదరణ లభించదు. అయితే వాటిని పనిగట్టుకుని ప్రచారంచేసి పలుకుబడి సంపాదించిపెట్టే కృషి ఆ ప్రయోగ రహస్యాలు తెలిసివున్న వారేచెయ్యాలి. అప్పుడు అందులోని సత్తాని బట్టి ఆ ప్రయోగాలకు క్రమంగా ప్రజాదరణ లభిస్తుంది. ఈ పని రచయిత ఒక్కడుగా చేయలేడు. తన కృషిని మెచ్చుకుని ప్రోత్సహించే మిత్ర రచయితల సహకార సంపత్తిమీదనే ఆ ప్రయోగం యొక్క విజయం ఆధార పడివుంటుంది.

ఏమైనా ఒకే లక్ష్యశుద్ధితో రచనా వ్యాసంగంచేసే రచయిత లందరూ కలిసి సాగించే సమిష్టికృషియే లోకంలో ఒక సంచలనం తేగలుగుతుంది. దాని మంచి చెడ్డలు ఆ తర్వాత చరిత్ర నిర్ణయిస్తుంది, అయితే సాహిత్యంలో నూత్నప్రయోగాలు రావాలంటే మాత్రం దానికి తగిన ప్రోత్సాహం కావాలి. ఇందు కీ విధమైన మిత్రమండలులే ఎక్కువగా ఉపకరిస్తాయి. వర్తమాన సాహిత్యంయొక్క మంచిచెడ్డలెప్పుడూ యిటువంటి సంఘాలమీదనే ఆధారపడి ఉంటాయి.

మూడు : రచయితల ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచే సంఘాల అవసరం ఎంతగానోఉన్నది. ఒక విధంగాచూస్తే పూర్వం రాజాస్థానాలను ఆశ్రయించుకున్న కవుల పరిస్థితులే బాగున్నాయేమో అనిపిస్తుంది. ఎవడో ఒక రాజుని పట్టుకొని ఇంద్రుడో చంద్రుడో అని అతణ్ణి పొగిడి ఒక కావ్యం అంకితమిస్తే జీవితాంతం వారికి సుఖంగా జరిగిపోయేదేమో. కారణాలు ఏమైనా వారి జీవితాలు పూర్తిగా సాహిత్య వ్యాసంగానికే అంకితమై ఉన్నట్లు తోస్తుంది. ఇప్పుడు అలా కేవలం గ్రంథరచన మీదనే ఆధారపడి జీవించే సావకాశం ఎంతటి పెద్ద గ్రంథకర్తకీ లేదు. కనుక ఏస్కూల్లోనో, కాలేజీలోనో, ఆఫీసులోనో పనిచేస్తూ తీరిక వేళల్లో సరదాగానే రచనా వ్యాసంగాన్ని చేపట్టే రచయితలే అందరూ! కనుక వీరికందరికీ రచన చేయడమన్నది ఒక హాబీయేగాని జీవిత సర్వస్వం కాదు. అందువల్ల లక్ష్యశుద్ధిగా రచనలు రావడానికి తగిన సావకాశం అరుదైపోతున్నది. ఈ పరిస్థితి ఇలా నిరాటంకంగా కొనసాగినట్లయితే వర్తమాన సాహిత్యానికి పెద్ద విఘాతమే పర్వడుతుంది.

వాస్తవానికి యీవేళ విదేశాల్లోని రచయితలందరూ రచనా వ్యాసంగం మీదనే ఆధారపడి జీవితం కొనసాగిస్తున్నారు. అయితే మన సాంఘిక వ్యవస్థలోకూడా ఇంకా డబ్బుపెట్టి పుస్తకాలు కొనుక్కుని చదువుకొనే ఆర్థిక స్తోమత అందరికీ రాలేదు. అంతేకాదు, జనసామాన్యాని కంతకీ ఎప్పుడూ ఎదో విధంగా పొట్టకూటికై దేవులాడడంతోనే సరిపో తున్నది. విశ్రాంతిగా విజ్ఞాన సముపార్జనకు సల్పేకృషి నేటి సమాజంలో బొత్తిగా శూన్యమనే చెప్పాలి. ఇతర దేశాల్లో అయితే ఫ్యాక్టరీలు, ఆఫీ సులు, పొలాలు పెందరాళే వదలివచ్చి, తీరికకాలమంతా గ్రంథపఠనానికే వినియోగిస్తారు. ఇటువంటి పాఠకులు లేని ఏ దేశంలో అయినాసరే రచ యితల జీవితాలు ఆర్థికంగా హెచ్చరికగా ఉండే సావకాశం ఉండదు.

అటువంటి పరిస్థితులు దేశంలో ఏర్పడేవరకూ చేతులు ముడుచుకు కూర్చుంటామంటే కర్తవ్యాన్ని విస్మరించడమే అవుతుంది. కనుక ఒక ప్రక్క దేశపరిస్థితులను మెరుగుపరిచే కృషిసాగిస్తూనే వేరొకప్రక్క నుంచి తమ పరిస్థితులను రచయితలే మెరుగు పరచుకొనే సంఘాలు ఏర్పడాలి. రచయితల కృషిఫలితాలమీద ఆధారపడి లాభాలు చేసుకొంటోన్న పత్రి కలూ, ప్రచురణకర్తలూ, రేడియోలూ, సినిమాలు రచయితలకిచ్చే పారితోషికాలరేటు బాగాపెంచే ఏర్పాట్లు చేయాలి. అన్నిటికన్నా ముఖ్య మైనది కాపీరైటు హక్కు! ఏ పరిస్థితుల్లోనూ కూడా పుస్తకాల కాపీరైటు హక్కులు రచయితల చేజారిపోకుండావుండే బలమైన శాసనం వంటిది ఒకటి ఉండాలి. అందుమీదవచ్చే తృణమో, పణమో ఎప్పుడూ రచయితకే ముడుతూ ఉండాలి. కాపీరైటు హక్కుఅనేది ఇతర ఆస్తి హక్కుల వలెనే రచయితకు జీవనాధారమై ఉండాలి. దేశంలో ప్రైవేటు ఆస్తులు వున్నంత వరకూ కాపీరైటు హక్కుకూడా వంశపారంపర్యంగా సంక్రమిస్తూ రచ యితకు తనకుటుంబ పురోగతి విషయమై ఏ బెంగాలేకుండా నిశ్చింతగా జీవింపగలిగే అవకాశాన్ని కలుగచెయ్యాలి. అప్పుడే రచయితకు కొంత స్థిమితమూ, స్తోమతా కలగడానికి వీలవుతుంది.

మరొక ముఖ్యవిషయం : గ్రంథప్రచురణ కార్యక్రమంలో రచయి తలూ, ప్రచురణకర్తలూ, పుస్తక విక్రేతలూ సమాన భాగస్వాములేకనుక

ఈ ముగ్గురికీ కూడా ఇందులో బ్రతకడానికి సమానావకాశాలే ఉండాలి. యీ ముగ్గురూ పరస్పర సహకారభావంతో వ్యవహరింపగలిగితే పరిస్థితులు ఇంతకన్నా మెరుగవడానికీ, రచయితలు తమ కృషి ఫలితంపై ఆధారపడి స్వతంత్రంగా జీవించడానికీ మంచిసావకాశం లభిస్తుంది. మరి యీ విషయాలన్నీకూడా రచయితలసంఘాలే దృష్టిలోఉంచుకొని పనిచెయ్యాలి.

యీ మూడు ముఖ్య ప్రయోజనాలను అశించి రచయితల సంఘాలు కనుక పనిచేసినట్లయితే మన దేశీయ సాహిత్యం మూడు పువ్వులూ ఆరుకాయలుగా సర్వతోముఖాభివృద్ధిని సాధించగలదని దృఢంగా విశ్వసించ వచ్చు.

★

"సామాజిక జీవితం నుండే సాహిత్యం ఉత్పన్న మవుతున్నది. జీవితంతోపాటు సాహిత్యం మార్పు చెందు తున్నది. నిజమైన సాహిత్యానికి జీవితపు విలువలు మార్చగలిగే శక్తి వుండాలి."

ANDHRA PRADESH
LALIT KALA AKADEMI PUBLICATIONS

LEPAKSHI

By

AMANCHARLA GOPAL RAO

In this monograph on the art treasures of the 16th Century temple of Lepakshi one can appraise and appreciate the hazel eyed brunettes of Vijaynagar period, the gamboling cows and calves, Natyasundaris, vast Hindu Pantheon including the world's largest single figure painting of Veerabhadra which is a symphony in gray, and Raja Rishis and Brahma Rishis. The genre themes holding a mirror to the 16th Century social life and the presentation of the Hindu Pantheon is on an encyclopaedic magnitude; presented in 8 colour and 48 black and white plates with 108 pages text.

Size : 10.75″ x 13.25″ Price : Rs: 80/–

ANDHRA PAINTINGS OF THE RAMAYANA

By

JAGDISH MITTAL

Inthis book the author has provided for the first time a detailed historical and aesthetic study of painting in Andhra Pradesh region. Besides that he has discussed the style, technique and various other characteristics of the Ramayana manuscript painted in Andhra.

With ten colour plates 53 halftone illustrations.

Size : $8\frac{3}{4}$″, x $10\frac{3}{4}$″ Price : Rs. 25/–

For further particulars write to :

ANDHRA PRADESH LALIT KALA AKADEMI
Kala Bhavan, Saifabad, Hyderabad–4

విలువలు మారిన సాహిత్యము

డాక్టర్ కేతవరపు రామకోటిశాస్త్రి

భారత దేశమునకు స్వాతంత్ర్యము వచ్చినది. ఇక పని అయిపోయినది.

స్వాతంత్రోద్యమము సాగినంత కాలము మనకొక లక్ష్యమున్నది. అప్పుడు మనకొక శత్రువు వున్నాడు. మన మందరము కలిసి వానిమీద విరుచుకపడితిమి. వానిని వెళ్ళదరిమి మన దేశమును మనము స్వాధీనపరచు కొనుటయే అప్పటి మన లక్ష్యము. ఆ లక్ష్యసాధనకై మనము జలపాతముల వలె సాగితిమి. ఆ ఉద్యమ కాలమున మనదన్నిరంగముల యందును జలపాత ప్రవృత్తియే. ఆధునికాంధ్ర సాహిత్యమున మహాకవు లందరును ఆ ఉద్యమాగ్నియందు తపులై నిర్మలాంతఃకరణముల బోల్చి నిల్చిన హిరణ్మయులు. లక్ష్యశుద్ధిగల ఉద్యమము నడిపించు కాలమున జనుల కున్న నిష్కామ కర్మ ప్రవృత్తి లక్ష్యసిద్ధి కలిగి ఉద్యమము లేని కాలమున నుండదు. స్వాతంత్రోద్యమమున నడుము బిగించి దూకిన సామాన్య మాన వున కప్పటి యావేశము పొంగున స్వాతంత్ర్యము వచ్చిన తరువాత తనకీ ప్రయోజనము కలిసివచ్చునన్న జ్ఞానము గాని, కలిసిరావలయునన్న ఆశ గాని లేదు. దేశమున కసలు స్వాతంత్ర్య మెందుకు కావలయునో కూడ వానికి తెలియదు. కావలయును. అది అంతే.

స్వాతంత్ర్యము వచ్చినది. జాతీయోద్యమము పని యైపోయినది. రాజకీయోద్యమము మొదలయినది. జాతీయోద్యమమునకున్న ఏకైక లక్ష్యశుద్ధి రాజకీయోద్యమమున కుండదు. రాజకీయోద్యమము బహురూప ప్రజాస్వామ్యమున ఎన్ని రాజకీయపక్షములైనను లేవవచ్చును. ఒక్కొక్క పక్షము దాని ఉద్యమమును కొన్నాళ్ళొక దిక్కుగా నడుపును. ఏ పక్షమును పరిశుద్ధమైనది కాదు. అన్ని పక్షములందలి వారును అవకాశములను చూచుకొని పక్షములు మారుదురు. కొన్ని కొత్తపక్షములను నెలకొల్పు దురు, కొన్ని పాత పక్షములను విలీనము చేయుదురు. జాతీయోద్యమము

వలని లాభమును పంచుకొనుట లక్ష్యముగా రాజకీయోద్యమము బయలు దేరినది. సాధారణముగా పంపకములు కుదురవు. బలాబలములు చూచు కొందురు. స్వాతంత్ర్యానంతరము వచ్చిన మన రాజకీయోద్యమము స్వరూప స్వభావములవ్వి.

బలా బలములు చూచుకొను స్థితి వచ్చినాదిగా జయాపజయములు రెండే ప్రాథాన్యము వహించుచున్నవి. ఎట్లయినను జయమును పొందుటయే ముఖ్యము. ఈ మార్గ మనుసరింపవచ్చును, ఈమార్గమనుసరింపరాదనిలేదు. ఇక్కడ మానవుడెంత పతనముగా వీలున్నదో అంతకంటె కొంచె మెక్కువ గనే అగుచున్నాడు. రాజకీయముగా మన మెంత శోచనీయావస్థలో నున్నామో సాంస్కృతికముగను అట్లే యున్నాము. ఈ నాడు సంఘ మంతయు రాజకీయ ప్రవృత్తియే కలిగియున్నది.

రాజకీయ నాయకుల ఉపన్యాస వస్తువే కవులకావ్యవస్తువు. రాజకీయ నాయకుల చిత్తశుద్ధి వంటిదే. కవుల చిత్తశుద్ధియును. రాజకీయవాక్కు సర్వత్ర రాజ్యము చేయుచున్నది. మనోవాక్కాయ కర్మలకు స్వతంత్ర భారత దేశమున సంబంధము తెగిపోయినది. మనస్సులో అనుకొన్నది చెప్పుటలేదు. చెప్పినది చేయుటలేదు. తమ కిష్టముకాని పనులను కూడ రాజకీయ నాయకు లెన్ని యిష్టములయినట్లే చేసిచూపుచున్నారో కవులును అట్లే తమ హృదయములు స్పందింపని అనేక విషయములను గూర్చి సమయాను కూలముగా కవితలు వెలయించుచున్నారు. రాజకీయ కవిత ఎక్కువగా వ్రాయబడుచున్నది.

ప్రతివానికిని ఒక రాజకీయ నాయకుడు కావలయునని ఉన్నట్లే కలము పట్టిన ప్రతి కవికిని తన రచనా రీతి అదొక ప్రత్యేక మార్గమని - దానికి తానే ప్రతినిధినని మిగిలినవారందరును ఆ మార్గమును బట్టి రావలయు ననియు నున్నది, పదిమందితో కలిసియుండి వారి జీవిత సమస్యల నవగా హన చేసికొని ఒక పరిష్కార మార్గమును భావించి వర్ణించుట తన కర్తవ్య మన్న మాటనే ఇప్పుడు కవి విస్మరించినట్లు కన్పించుచున్నది. ఎంత సేపటికిని తాను తన నాయకత్వము ఇవితప్ప కావ్యవస్తువును గూర్చి ఈనాడు కవి ఆలోచించుటలేదు. ఆలోచించనివాడు అనుభవము లేనివాడు ఏమి వ్రాయును ? శుష్క ప్రియములు వ్రాయును. శూన్యహస్తములు చూపును–

ఇంత వరకు ఏది చెప్పబడినదో అది స్వాతంత్ర్యము వచ్చిన తరువాతి మొదటి తరమువారి మాట.

ఇక వర్తమాన కవి తరమునుగురించి కూడ విచారింపవలయును. వర్తమానాంధ్రకవులందరును కూడ – సంప్రదాయమార్గమున బోవువారు కాక – మొత్తముమీద సోషలిస్టు దృక్పథము కలవారు. ఇంతవరకు మంచిదే.

వీరందరును యువకులు. అనగా కాలేజి విద్యార్థులును విద్యార్థుల వంటి వారును అన్నమాట. వీరిలో ఎక్కువమంది రెంటికిం జెడిన జేవడలు. ఏమనగా వీరికి సంప్రదాయబలము లేదు. ఆధునికమైన విజ్ఞానము లేదు. చదువుసంధ్యలయందు విశ్వాసము లేదు. ఒక సంప్రదాయమును నిందించి త్రోసి రాజని నూత్నవిజ్ఞానమును ఆకళింపుజేసికొనుట కెంత చదువు కావలయును ? ఎంత శ్రద్ధ కావలయును ? ఈ తరమువారియం దీరెండును లేవు. చదువక్కరలేదు. చదువు లేవివాడు గొప్ప గొప్ప పదవులలో నుండుట లక్షలకు లక్షల నార్జించుటను ప్రత్యక్షముగా యీ తరమువారు చూచుచున్నారు. జీవితమున సాధింపవలసిన లక్ష్యములు — పదవి - డబ్బు - యీ రెండింటికిని చదువక్కరలేదు. అక్కరలేదు కనుకనే చదువుకొనుట లేదు. పదవి డబ్బు ఉన్నచో ఇక మిగిలిన వన్నియును వానిని వెదకికొనుచు వచ్చి చేరును. వాడు కవికూడ అగును.

పాపమీ తరమువారిలో కొందరికేదో వ్రాయవలయు నన్న మంచి యుత్సాహ మున్నది. నిజమే. వ్రాయుట కేమి కావలయును ? మంచి భాష కావలయును. మంచి భావము రావలయును. మంచి భాష ఎక్కడ దొరుకును? కావ్యములయందుదొరుకును. చదువుటనె మానుకొన్నవారు కావ్యములనేమి చదువుదురు? అందువలన యీ యువతరము వారికి చేతిలోచెప్పినట్లొదుగులు పోవుభాషలేదు. నిత్యవ్యవహారపుభాషయే వారికి కావ్యభాషకూడ,అందువల్ల యువతరమువారు భాష విషయమున వట్టి దరిద్రులు. ఉత్సాహమున్నది గనుక ఉన్నదానితోడనే ఏదో తంటాలు పడుచున్నారు. ఇకమంచి భావము స్వామ్యవాద తత్త్వపు ప్రచార భావములే యీ యువతరమున కందుచున్న భావములు. వాని కవిగా కవిత్వమున కనుకూలమైనవి కావు. సమాజములోని అట్టడుగు మానిషిని చూడుమన్న పెచ్చరిక లవ్వి, కవియైన వాడా మానిషిని చూడవలయును, వానితో కలసి మెలసి బ్రతుకవలయును,

వాని సమస్యలను సానుభూతితో అర్థము చేసికొనవలయును. యీ పని చేయకుండ యీ కవులందరును కూడ ఆ పెచ్చరికలనే మాటలు మార్చి చేయుచున్నారు. సామ్యవాద సిద్ధాంత గ్రంథముల లోను పెచ్చరికలే. సామ్యవాద సాహిత్యములోను పెచ్చరికలే. అందరును పెచ్చరికలు చేయువారే గాని వినువారు లేరు. ఇక ఆ పెచ్చరికల వల్ల ప్రయోజన మేమున్నది? మరియు నీ యువతరము వారి నిత్యానుభవమున పాశ్చాత్య దేశముల సంస్కృతీ సభ్యతలయందాదరము కనిపించుచున్నది. అవి ధనవం తములయిన దేశములు. వాని మర్యాదలును అట్లే యుండును. దేశమున ఏమూల చూచినను పాశ్చాత్య సభ్యత ఏదో రూపమున ప్రత్యక్షమగుచునే యున్నది. ఇదియే యువతరము వారి నాకర్షించుచున్నది. అది సహజము కూడ. యీనాడు మన యువ సమాజ మెట్లున్నదనగా పైకి డబ్బులో కన్పించును. లోపల సోషలిస్టుగా కన్పించును. పైకి కన్పించినది ప్రత్యక్షము, లోపల విషయము కన్పించదు. అది వట్టి భావము. యీ విధముగా పైకి ఒకటి - లోపల ఒకటిగా సమాజమున్నపు డాసమాజము చేయు ప్రతి పనియు నట్లే యుండును. కవిత్వము కూడ అట్లే యుండును. కవిత్వ మట్లుండరాదు. నీవు లోపల ఏమనుకొనుచున్నావో అది బైటకు రావల యును, సమాజమునకు కవి తాను భావించినదానిని ప్రదర్శింపవలయును. సమాజమును తాను మహోన్నత పథమునకు నడిపింపవలయును. అట్లుకాక సమాజ మనుకొనుచున్న దానిని కవి తిరిగి వినిపించుటను పెట్టుకొనరాదు యీనాటి యువ కవి సమాజమునకీ దోషము చేయక తప్పుట లేదు.

వస్తువు పుష్కలముగా చేతిలోలేక భాషచేత దరిద్రులై, అనుభవము లేని - స్వాభిమానములేని నిజాయితీ నశించిన, కావ్యప్రయోజనము నాశించని, అన్య భాషా, అన్య దేశాభిమానములుగల కవులున్నచో ఎట్టి కావ్యములు సృష్టింపబడునో అట్టి కావ్యలక్షణములు, చాలవర కీనాటి సాహిత్యమున ప్రతిబింబించుచున్నవి. ఈ విధముగా విలువలు మారిన సాహిత్యము ఉత్పత్తియగుచున్న రోజులివ్వి. మన యిష్టాయిష్టములతో నిమిత్తము లేకుండ మార్పు ప్రకృతి లక్షణము గనుక - ఈ దశ ఇక ముం దెప్పటికిని ఇట్లే యుండదుకదా!

ఇంతవరకు ఏది చెప్పబడినదో అది వట్టి కవిత్వమును గురించియే. అందువలన మిగిలిన సాహిత్య ప్రక్రియలంతకంటె మహోదాత్తములుగా

రచింపబడుచున్నవని యర్థముకాదు. అన్నింటి స్థితియు నశ్లేయున్నది. అందరి స్థితియునశ్లే యున్నది. మనము స్వతంత్రులమైన తరువాత మనకు మనదేశభక్తి నశించినది. మన భాషాభిమానము నశించినది. మన సాహిత్యాధ్యయన శీలము నశించినది. మరియు మన సంస్కృతీ సంప్రదాయముల మీద ఏహ్యభావ మేర్పడినది. ఈ దృశమైన మినఃప్రపంచమునుండి ఇప్పుడు సాహిత్యము సృష్టింప బడుచున్నది. మన నవలలు - మన కథలు మన నాటికలు ఈ మొదలైన ప్రక్రియలన్నియునశ్లే యున్నవి. రాజకీయ వాతావరణమెంత కలుషితముగా నున్నదో సాహిత్య రంగమంతకే మాత్రమును తక్కువగాలేదు. Writers and artists of the Russian Federation portray not only the lives of their own peoples but of other peoples as well : This extends the bounds of their aesthetic cognition of reality and enriches their works with descriptions of the life, character, culture and geography of the fraternal peoples populating the Vast Soviet Union (PROBLEMS OF MODERN AESTHETICS - Pavel Trofimou. P. 95) ఈ దృష్టితో చూచినచో మన నేటి సాహిత్యమున సాహిత్యము కానరాదు.

ఇది ఒక పరిణామ దశావిశిష్టమైన కాలము. ప్రజాస్వామ్యము - సామ్యవాదము - కమ్యూనిజము ఈ దృశమైన పరిణామము జరుగుచున్నది. భూమి తిరుగుట మనకు తోచనట్లే యీ పరిణామము జరుగుటకూడ తత్కాలమున తోచదు. ఈ నాడు జనసామాన్య మట్లున్నది. రచయితలయినను బుద్ధిమంతులు కావలయును. అందుకు తగిన శిక్షణకవులకు కరువైనది. ప్రజాహితము కొరకు ప్రభుత్వము, ఆనందానుభవము కొరకు ఆర్థిక విధానము, విజ్ఞానముకొరకు విద్య, సర్వమానవ విశిష్టానుభవాభివ్యక్తి కొరకు సాహిత్యము - ఇవన్నియు ఇప్పుడులేవు. యీ నాటి సాహిత్యమున వీనిలేకపోవుటయే ప్రతిబింబించుచున్నది. వీని కలిమిని ప్రతిబింబించుట ముందు జరుగవచ్చును.

For all your requirements in

Books and Stationery

VISIT

Murali & Company

BOOK SELLERS AND STATIONERS

★

opp. R. B. V. R. Reddy Womens' College

NARAYANAGUDA, HYDERABAD

రచయితలు - గ్రంథాలయాలు

శ్రీ ఎన్. పాండురంగారెడ్డి

గ్రంథాలయాలు భావసమర క్షేత్రాలన్నాడు జోనాథన్ స్విఫ్ట్. పరస్పర విరుద్ధాలైన భావాలు సహజీవనం చేస్తూఉంటవీ గ్రంథాలయాల్లో. పాఠకుల కుత్తేజం కలిగిస్తూ, మనోవికాసానికి తోడ్పడుతూ, భావపరిపుష్టికి దోహదం కలిగించే కేంద్రాలు గ్రంథాలయాలు. ఇప్పుడిప్పుడే సామాన్యుడైన అక్షరాస్యుడుకూడా గ్రంథాలయం అవసరాన్ని, ప్రాధాన్యాన్ని గుర్తించి తన పురోభివృద్ధికి, విజ్ఞానానికి వినోదానికి సాధనంగా ఉపయోగించు కోవడానికి ముందుకు వస్తున్నాడు.

కాని గ్రంథాలయాలకు రచయితలకు ఏమి సంబంధం? అని తర్కించుకుంటే అవినాభావ సంబంధముండి తీరుతుందని తేల్చుకోవచ్చు. ఈ సంబంధాన్ని గూర్చి వివరించడమే ఈ వ్యాసోద్దేశం.

రచయితలకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ప్రోత్సాహాన్ని ప్రసాదించగలిగేశక్తి గ్రంథాలయానికున్నది. రచయితకు శాశ్వతకీర్తిని ఆర్జింపజేస్తూ, భావప్రచార కేంద్రంగా తోడ్పడుతూ తరతరాలకు రచయిత భావాలను అందిస్తూ ఉంటుందీ సంస్థ. మానవుని శరీరంలో నరాలు ఏ పని చేస్తుంటాయో, దేశంలోని నదీనదాలు ఏ పని చేస్తుంటాయో, జ్ఞాన ప్రసారణంలో గ్రంథాలయాలు తద్వారా రచయితలు ఆ పని చేస్తుంటారు.

విజ్ఞాన పరిధులు బహుముఖంగా విస్తృతమవుతున్న నేటియుగంలో విజ్ఞాన సముపార్జనా ప్రయత్నంలో పరిపూర్ణత, పరిపక్వతను ఏ ఒక్కవ్యక్తి తనకు తానై సాధించలేడు. వివిధ దేశాలలోని రచయితల రచనలు, సాహిత్యకృషి మనకు గ్రంథాలయంలో ఒక్కసారిగా లభ్యమౌతవి.

విదేశాలలో రచయితల, పాఠకుల ఆర్థికస్తోమతతో మనకు పనిలేదు. మనదేశంలో రచయితలేమి, పాఠకులేమి పుస్తకాలను కొని నిరుపహతి స్థలంలో కూర్చుని శాంతంగా, నెమ్మదిగా చదువుకోగలిగే స్థితిలో లేరు.

ముందు ప్రజోద్యమంగా ఉన్న గ్రంథాలయాలు ఇప్పుడు ప్రభుత్వ పరమైనవి గాను, ప్రభుత్వ సహాయంతో నిర్వహింప బడేవిగాను రూపొందుతున్నవి. కనుక నిన్నటిమాట ఎలా ఉన్నా ఇప్పుడు విద్యార్థులకు కళాశాలల్లో, విద్యాలయాల్లోనేకాక ఇతర ప్రదేశాల్లో గ్రంథాలయాలు సహాయపడుతున్నాయి. అన్నిశాస్త్రాలకు సంబంధించిన గ్రంథాలు ఉచితంగా, సవ్యంగా చదువుకోగలిగే అవకాశాలు లభిస్తున్నాయి.

రచయితల్లో రకరకాల వాళ్ళున్నారు. కేవలం కల్పనాత్మకసాహిత్య సృష్టికి పూనుకునేవారికి గ్రంథాలయాలు అంతగా ఉపయోగపడకపోవచ్చు. కల్పనా సాహితికికూడా కొంచెం అధ్యయనం అవసరం. అప్పుడే ఆ రచనలో చిక్కదనం, చక్కదనం గోచరిస్తాయి. నిన్నటిదాక మన దేశభాషల్లో ముఖ్యంగా తెలుగులో కేవలం కల్పనా సాహిత్యమే పెంపొందుతూ వచ్చింది. విశ్వవిద్యాలయస్థాయిలో తెలుగులో బోధన జరుపబడుతున్న ఈ తరుణంలో, రకరకాల పాఠకులు అక్షరాస్యుల్లో నానాటికి సిద్ధమౌతున్నారు. శాస్త్రీయ, సాంకేతిక, వైజ్ఞానిక, సాంఘిక. రాజకీయ విషయాలపై అనేక పుస్తకాలు ప్రచురింపబడుతున్నాయి. వానిస్థాయి పెరిగే కొద్ది రిఫరెన్సు గ్రంథాల అవసరం పెరిగిపోతుంది. అపార గ్రంథసామగ్రిని ఒక వ్యక్తి సమకూర్చుకోలేడు. ఒక పద్ధతిలో అమర్చుకోలేడు. కనుక రచయితలకు గ్రంథాలయాలు కల్పతరువులుగా సాక్షాత్కరిస్తాయి.

రచయితలకు ప్రోత్సాహాన్నిచ్చే మరో అంశం విమర్శ. పుస్తకాల మంచిచెడ్డలను స్థూలంగా నిర్ణయించేది పాఠకులే. ఆయా పాఠకులకు నచ్చని గ్రంథం మరుగున పడిపోతుంది. రచయితలను పలువురికి పరిచయంచేసి పాఠకులలో పఠనాభిలాషను అభివృద్ధిపరచే కార్యక్రమాన్ని గ్రంథాలయాలు సుగమంగా నిర్వహించగలుగుతవి. అనేక విషయాలను సేకరించి జిజ్ఞాసువులకు అందించే బాధ్యత గ్రంథాలయాలది. మనన శీలతను, ప్రజాభిరుచులను, ప్రజల ఆలోచనాస్థాయిని రచయితలు గ్రంథాలయాలద్వారా తెలుసుకోగలుగుతారు.

భావాలకు అపారమైన శక్తిసామర్థ్యాలున్నవి. భావాలను ప్రకటించిన రచయిత ఈ లోకాన్ని వదిలివెళ్ళినా, అతని భావాలు సజీవంగానేఉండి పఠిత్ల లోకానికి స్పందనం కలిగిస్తూనే ఉంటాయి. గ్రంథాలయం ఆ సజీవ భావాలకునికి పట్టుగా వ్యవహరించగలుగుతుంది. చాణుక్యుడు, ప్లేటో,

అబ్రహాంలింకన్, షేక్స్పియర్, కాళిదాసు, వాల్మీకి ఇప్పుడు మన మధ్య లేకపోయినా వారి రచనలు మనలను ప్రభావితం చేస్తూనే ఉన్నవి. ప్రతి కొత్తతరం తన అనుభూతిని వాళ్ళ రచనల్లో పొందుతూనే ఉన్నది. ఆ మహా రచయితల భావదీప్తి లిప్పటికి వెలుగులను విరజిమ్ముతూనే ఉన్నవి. రచయితలను సమాజాన్ని కలుపడానికి సారథిగా ఉపయోగపడగలుగుతుంది గ్రంథాలయం. రచయితలను పాఠకులిక్కడ గ్రంథరూపంలో దర్శనం చేసుకుంటే, రచయితలు తాము తమవంటివారి భావాలకు ఏ యే విధంగా విలువకట్టుతున్నదీ తెలుసుకోగలుగుతారు.

గత కాలంలోని రచనలను భద్రపరుస్తూ, కొత్తగా వస్తున్న రచనలను సేకరిస్తూ గ్రంథాలయం పాత కొత్తల మేల కలయికకు కూడలి అవుతుంది.

గ్రంథాలయం ఒక వినూత్న లోకం. రుచిమరిగిన పాఠకుల కది సుధాభాండం. చరిత్రలో ఎందరి జీవితాలనో మలచిన శ్రేయస్సు గ్రంథాలయానికి దక్కింది. నాటినుంచి నేటి గ్రంథాలయాలు అనంత రూపాలతో నిలిచిఉన్నాయి. సావర్కర్, అంబేడ్కర్, కారల్మార్క్స్ మెకాలే వంటి మేధావులు గ్రంథాలయాల్లోనే ఎక్కువకాలం గడిపి గ్రంథాలను మథించి అమృతం పిండుకొని తెచ్చి తమ భావామృతాలను చేర్చి తమ పుస్తక భాండాలుగా మలచి తిరిగి గ్రంథ భాండాగారాలకు అందించారు. రచయితలు పెరుగుతున్న కొద్దీ గ్రంథాలయాలకు పని పెరుగుతుంది. రచయితలకు అధ్యయనావకాశాలు ఎక్కువౌతున్న కొద్దీ సునిశితమైన రచనలు వచ్చే అవకాశాలు ఏర్పడుతవి. నూత్న రచనలు చేసేందుకు ఎందరికో యీ గ్రంథాలయాలు ప్రోత్సాహిన్నిస్తాయి. గ్రంథాలయాలు సక్రమంగాపాఠకుల, రచయితల సహకారంతో పెంపొందితే ఒక భావ విప్లవం వచ్చి తీరుతుంది.

గ్రంథాలయాల్లో మంచి రచనలతో పాటు కాలానుగుణంగా పాఠకులు పట్టించుకోని గ్రంథాలుకూడా ఉండవచ్చు. ఒక కాలంలో అశ్లీలమైనవి, ప్రమాదకరమైనవి మరొకకాలంలో పాఠకులనాకర్షించవచ్చు. ఒకప్పుడు త్తమ శృంగార కావ్యంగా భావింపబడిన గ్రంథాన్ని మరొకప్పుడు తృణీకరించవచ్చు. కనుక గ్రంథం అంటూ ఉండాలి. నిన్నటిదో, మొన్నటిదో, నేటిదో, మంచిదో, చెడ్డదో, చిన్నదో పెద్దదో అన్నీఉండాలి. అప్పుడుకాని తార

తమ్యత, తులనాత్మకపరిశీలనం ఏర్పడదు. మంచిచెడ్డలూ అన్నీ కలిసిఉంటవి. ప్రవాహంలో అన్నీ కొట్టుకువచ్చినట్లే గ్రంథాలయంలో అన్నీ వచ్చిచేరుతవి. ఆదరింపబడుతవి. వాటి భాగోగులను విలువలను కాపాడవలసింది, త్యజింప వలసింది పాఠకులే. సమకాలీన పరిస్థితులవల్ల నిరాదరణ పొందిన రచనలు ఉత్తరోత్తరంగా బహుళప్రజాదరణ పొందవచ్చు. సాధారణంగా పాఠకుల తీర్పులకు నిలబడగలిగిన రచయిత ధన్యుడు.

గ్రంథాలయాలు నిష్పాక్షిక నిక్షేపాలు, రచయితలకు అవి మార్గ దర్శకం కావాలె. అప్పుడే లోకానికి ఉపయోగపడగలిగే రచనలు సృష్టి అవుతాయి. ఒక మహాత్ముని జీవిత రక్తమే ఒక మంచి పుస్తకం అన్న సూక్తి ననుసరించి మహారచయితను గ్రంథరూపంలో దర్శించుకోగలిగే భాగ్యం గ్రంథాలయం కలుగజేస్తుంది. రచయితకు ఇంతకంచే కావల సిందిలేదు.

★

"చావు పుట్టుకలమధ్య సందేహం లాటి
జీవితంలో నలువైపులా అంధకారం
మంచిగంధంలాగ పరిమళించే మానవత్వం
మాకున్న ఒకే ఒక అలంకారం."

—తిలక్.

"గ్రంథాలయం మౌన విద్యాలయం
ఉత్తమ గ్రంథాలే, ఉపాధ్యాయులు
అవి రేకెత్తించే, అనుభూతులు, ఆలోచనలు
వెలలేని పాఠాలు."

—డా॥ సి. నారాయణరెడ్డి.

రచనలలో సామాజికస్వరూపం

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

లేఖనం రాక పూర్వమే మానవులు రచనలు ప్రారంభించారు. తొలికాలపు రచనలు బుక్కులుగానో, గేయాలుగానో, శ్లోకాలుగానో, పద్యాలుగానో మనుషుల నోళ్ళద్వారా ప్రచారమయాయి. ఆనాటినుంచి ఈనాటిదాకా జరిగిన రచనలన్నీ జీవితానికీ, సమాజానికీ సంబంధించినవే. సామాజికుల కోసం రచించబడినవే.

ఒక్క వ్యక్తికోసమే రాయబడి, చదవగానే చించివేయబడే ప్రేమలేఖ వెనకకూడా సామాజిక శక్తులున్నాయి. రహస్యప్రేమ సామాజికం. అలాగే ఊహా ప్రేయసికి రాసే బహిరంగ ప్రేమలేఖలలో కూడా సమాజం ప్రతిబింబిస్తుంది.

మనం సమాజమనే పంజరంలో బంధించిఉన్న పశువులం. కొందరు పంజరాన్ని మనస్ఫూర్తిగా ఆమోదిస్తారు. మరికొందరు ఏదోవిధంగా సమాధానపడతారు. ఇంకా కొందరు ఆ పంజరం యొక్క స్వరూపాన్ని మార్చటానికి ప్రయత్నపడతారు. దాన్నుంచి పూర్తిగా బయటికి పోవటానికి ఎవరూ చూడరు. అలా ఎవరైనా పోతే వారికి ఆశ్రయం ఉండదు. దిక్కులేని పశువులై పోతారు.

అయితే ఈ పంజరం మార్పులేనిది కాదు. అది మారుతున్నది, మార్చబడుతున్నది కూడా.

"సంఘం అంటే ఇలా ఉండాలి" అని ఏనాడు ఎవరుచెప్పినా వారి మాటలు అబద్ధమయాయి. సంఘం ఎలావుండాలి? అన్న ప్రశ్న అంత ముఖ్యమైన ప్రశ్న కాదు. దానికి సమాధానం స్పష్టంగా తెలిసే లోపుగా మరికొంత మార్పుకు అవసరం కలగనే కలుగుతుంది. అసలు ప్రశ్న, "ఇప్పుడున్న సంఘం ఎలా మారాలి?" అన్నది.

ఈ ప్రశ్నకు సరిఅయిన సమాధానం కనుక్కున్నవాళ్ళే సమాజం

యొక్క పరిణతికి దోహదంచేశారు. వేదకాలం నాటి ఆర్యుల అభ్యున్నతికి మిత్రుడూ, వరుణుడూ, ఇంద్రుడూ మొదలైనవారు దోహదం చేశారు. ఈ యుగంలో మానవ సమాజాలలో జరగవలసిన మార్పులు నిర్ణయించిన లెనిన్, మావోలవంటి వాళ్లు తమ తమ దేశాలలో విస్మయకరమైన సామాజిక పరిణామాలను సాధించారు.

ఎన్నో వేలమంది ఎన్నో వేల శతాబ్దాలమీదట సమాజంయొక్క పాటలను నిర్దేశించిన కారణంగానే రాతియుగం నాటి మానవులు ఈ అణు యుగం దాకా రాగలిగారు.

రానురాను సాంఘిక పరిణామ వేగం అధికమవుతున్నది. గడచిన 50 ఏళ్ళలో కలిగిన పరిణామాలతో పోలిస్తే అంతకు పూర్వం 50 ఏళ్ళలో కలిగిన పరిణామాలు చాలా అల్పమైనవి.

ఈ మార్పును గురించీ, దాని ఆవశ్యకతను గురించీ మన సాహిత్యం మనకు తగినంతగా జ్ఞాపకం చెయ్యటంలేదు. రచనలు చేసేవాళ్ళు ఎప్పటి కప్పుడు తామున్న సమాజం శాశ్వత స్వభావంకలదన్నట్టూ, అది ఎప్పుడూ ఇలాగే ఉన్నదన్నట్టూ రాయటం ఆచారంగా ఉన్నది. (దేనికీ ఎవరూ బాధ్యులు కారు; అంతా విధికృతం; విధిని ఎవరూ తప్పించుకోలేరు!)

కొందరు సమకాలిక సమస్యలను చిత్రిస్తారు. కాని వాటికి పరిష్కారం ఉంటుందనీ, ఉండవచ్చుననీ వారికి తెలీదు. అందుచేత దారిద్ర్యం పూర్వజన్మదుష్కృత ఫలమనీ, దురాశ నాశనానికి దారితీస్తుందనీ, పాపానికి శిక్ష – ఎప్పుడో! ఎక్కడో! – ఉండకపోదనీ అంటారు. సామాజిక నియమాలను ఉల్లంఘించి దారిద్ర్యం నుంచి తప్పించుకున్న వారు, దురాశ ఫలించి కోట్లకు పడగెత్తినవారు, సమస్తమైన పాపాలు బహిరంగంగా చేసి నెగ్గుకొచ్చినవాళ్ళూ తమ ఎదుటే ఉన్నా వారినుంచి ఏమీ గుణపాఠం నేర్చుకోరు. సామాజిక వ్యవస్థలో లోపాలు ఏర్పడ్డాయనీ, వాటిని ప్రయత్నపూర్వకంగా సరిచేసుకోవచ్చుననీ వారికి తట్టదు.

ఈనాడు పురుషస్వామ్యం అమలులో ఉన్నది. ఈ సమాజంలో స్త్రీకి పురుషుడితో సమానత్వం అన్నది అసాధ్యం. అది గుర్తించని స్త్రీలు తప్పంతా పురుషుల దృక్పథంలో ఉన్నదనీ, దాన్ని హితోపదేశాల ద్వారా మార్చితే స్త్రీకి జీవితం లోపరహితంగా ఉంటుందనీ భ్రమపడుతున్నారు. వివాహ వ్యవస్థా, కుటుంబ స్వరూపమూ, సమాజ వ్యవస్థా గొప్ప మార్పులకు గురి

అయితేనేగాని స్త్రీ పురుషుల సమానత్వం సాధ్యంకాదు. ఇప్పుడు వారిమధ్య ఉండే అసమానత కేవలమూ వ్యక్తిగతమైనదికాదు – సామాజికమైనది.

అలాటి అసమానతే ధనికులమధ్యా దరిద్రులమధ్యా ఉన్నది, ధనికులు గాంధీగారి మాట నమ్మి తమకున్న సంపద యావత్తూ పేదలదేననీ తాము దానికి ధర్మకర్తలమనీ లక్ష సంవత్సరాలపాటు అనుకున్నా ఈ అసమానత పోదు. మనం జీవిస్తున్నది ధనస్వామ్యంలో. ఈనాటి దారిద్ర్యం ఆ భావంవల్ల ఏర్పడినది కాదు. ధనస్వామ్యంవల్ల సృష్టి అయినది. పేదలకు కావలసిన వన్నీ అంగళ్ళలో ఉన్నాయి. పేదల చేతిలో డబ్బులేదు – నోట్లో శనిఉన్నది. ప్రపంచ జనాభాలో చాలా శాతం ఆకలితో బాధపడుతున్నారు; అమెరికా, కెనడాల వంటి దేశాలలో వ్యవసాయ క్షేత్రాలు సంక్షేపిస్తున్నారు. అదే ధనస్వామ్య మంటే.

ఒక్క తిండేకాదు. ఈనాడు నిరుద్యోగమూ, తిండీ, బట్టా ఇళ్ళూ, రోగాలకు మందులు లేకపోవటమూ, నిరక్షరతా – అన్నీ కృత్రిమంగా ఏర్పడినవే, వాటన్నిటికీ ధనస్వామ్యమే కారణమని అతి సులువుగా ఎవరన్నా గ్రహించవచ్చు. ఇవన్నీ విధి నిర్ణయం వల్లా, పూర్వజన్మ దుష్కర్మల ఫలితం గానూ, ఏర్పడతాయని రాస్తున్న పేరుబడ్డ రచయితలున్నారు. వారి అజ్ఞానం ఆశ్చర్యకరం.

రచయితల అజ్ఞానం కళారూపంలో ఎంతగా ప్రచారమవుతున్నదో చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఒకరు పేదవాళ్లు పడేపాట్లను హృదయ విదారకంగా చిత్రిస్తారు. హీరోకు చదువుసాగదు. ఉద్యోగం దొరకదు. అవమానం పాలవుతాడు. అప్పులపాలవుతాడు. వాడికి అందరూ శత్రువులే అవుతారు. భార్యకూడా చీదరించుకుంటుంది. చివరకు ఉరిపోసుకు చావడమో ఏదో చేస్తాడు. ఇటువంటి రచన సామాజికులకు ఏ విధంగా ఉపకరిస్తుంది ?

ఇలాంటి కథలోని హీరో ఎంత అసమర్థుడో, రచయిత అంత అసమర్థుడే. ఇదే రచయిత ఈ హీరోకు ఒక ధనికుడి ప్రాపకాన్నో, అపురూప సౌందర్యవతి అయిన భార్యనూ, ఉద్యోగాలలో ప్రమోషన్లనూ, అంతర్జాతీయఖ్యాతినీ సంపాదించి కథను సుఖాంతం చెయ్యగలడు ! అదీ నిరుపయోగమైన కథే !

కుటీరపరిశ్రమల్లో సిమెంటురోడ్లూ, విద్యుద్దీపాలూ, కూల్‌డ్రింక్

V.R. NARLA MEMORIAL DPRT. Acc. No.

పాపులూ ఉండవు. ఈ నాటి సామాజికవ్యవస్థలో బీదవాళ్ళకు జీవితం ముళ్ళబాటే. వాళ్ళకు కనీస కోరికలుకూడా తీరేమార్గంలేదు. వాళ్లకు న్యాయం జరగదు. వాళ్ళు జీవితంతో పోరాడటమంటే సామాజికవ్యవస్థతో పోరాడవలసిందే. ఉన్న పరిస్థితిలో పోరాటం అవసరంలేని వర్గానికి, పరిస్థితులతో ఏదోరకంగా సర్దుకుపోయే అవకాశం ఉన్న వర్గానికి చెందిన రచయితలు దరిద్రులనుగురించి అశ్రుతర్పణాలు విడవటం చాలా నిరుపయోగంగా కనబడుతుంది. అందులో ద్యోతకమయ్యేదల్లా ఏమిటంటే, అయ్యో! ఈ పేదవాడికి నాలుగెకరాల సుక్షేత్రమైన భూవసతీ, ఒకచిన్న డాబా, ఓ నాలుగువందల రూపాయల నెలజీతమూ లేకపోయెనే అన్న విచారంతప్ప మరేమీకాదు.

చాలా మధ్యతరగతివాళ్ళ రచనలు వాళ్ల తరగతియొక్క చిత్తవృత్తిని ప్రతిబింబిస్తున్నాయి గాని, పేదల దృష్టితో సమాజ స్వరూపాన్ని కాదు. మనం "బార్బారిజం" నుంచి బయటపడలేదు. అందుకే మనలో నిమ్న జాతులున్నట్టు ఒప్పుకుని వారిని ఉద్ధరించటానికి గర్విస్తున్నాం. అస్పృశ్యులున్నారన్నది గుర్తించి వారికోసం ప్రత్యేక సదుపాయాలు చేస్తున్నాం! నిజమైన నాగరికజాతి ఎక్కువతక్కువ కులాల విచక్షణను తీవ్రంగా శిక్షిస్తుంది; అస్పృశ్యతను ఏరూపంలో పాటించినా శిక్షిస్తుంది. అతి ధనికుడైన వాడు తన ఔదార్యాన్ని ప్రకటించుకోవటానికి పేదలకు దానధర్మాలు చెయ్యటం ఎలాటిదో, మన ప్రభుత్వం నిమ్నజాతులనూ, హరిజనులనూ, ఉద్ధరించే కార్యక్రమం అచ్చు అలాటిదే.

కులాల పెచ్చుతగ్గులూ, అస్పృశ్యతా వాస్తవంగా ఉన్నవేగదా అనవచ్చు. ఉండదగనివి లేకుండా చేసుకోవటమే నిజమైన అభ్యుదయం. జలుబుచేస్తే ముక్కు చీదుకుంటూ ఉండటం చికిత్సకాదు. అలాంటి చికిత్సలు అభ్యుదయ మనిపించుకోవు.

ధనస్వామ్యం తొలగటానికి ఏమి చెయ్యాలో ఆలోచించలేక దాని దుష్ఫలితాలను గురించి అశ్రువులురాల్చి పాఠకులచేత అశ్రువులు రాల్పించాలని ప్రయత్నిస్తూ చేసే రచనలు చాలా చిరాకు పుట్టిస్తున్నాయి. దరిద్రుల కష్టాలకు దేవుణ్ణి, పూర్వజన్మలో చేసిన పాపాలనూ కారణాలుగా పేర్కొనే రచయితలను ఏంచేసినా పాపంలేదు. సామాజిక విషయాలను గురించి వారికి నోరెత్తే అర్హతలేదు.

ఇలాటి తుచ్ఛమైన రచనలు చేసేకన్న, బీదవాళ్ళకు స్పష్టంగా చెప్పండి. "ఈ సమాజంలో మీరు సుఖపడరు; మీ గొంతెమ్మ కోరికలు ఫలించవు; మిమ్మల్ని ధనికులు అజ్ఞానంలోనూ, దారిద్ర్యంలోనూ ఉంచుతారు; మిమ్మల్ని కడుపునిండా తిననివ్వరు; మీ పిల్లలూ, మీ భార్యా మీ కళ్ళ ఎదటే రోగాలతో కుమిలి చస్తారు; మీకు డబ్బులేదు సరేకదా, అప్పు పుట్టదు; తీర్చలేని వాడికి డబ్బు అప్పెవడిస్తాడు? ధనికులు లాభాలకోసం పరిశ్రమలు నడుపుతున్నారుగాని, మీకు ఉద్యోగాలివ్వటం కోసంకాదు; వాళ్ళకు మీవల్ల లాభంలేనప్పుడు మిమ్మల్ని ఉద్యోగాలనుంచి తీసేస్తారు; అద్దె రాకపోతే అద్దె ఇంటివాడు మిమ్మల్ని బయటకి గెంటుతాడు; మీ ఏ ఒక సమస్యా ధనికుల సమస్యలుకావు; డాక్టర్లు మీ రోగాలను నయంచెయ్యటానికే వైద్యం చేస్తున్నారనీ, ప్లీడర్లు మీకు న్యాయం జరగడంకోసమే ప్రాక్టీసు చేస్తున్నారనీ ఒక్కనాటికి అనుకోవద్దు; వాళ్ళూ డబ్బు కోసమే పనిచేస్తున్నారు. ఇది ధనస్వామ్యం. చేతనైతే దీన్నిమార్చండి. లేకపోతే దీనికిందపడి నలిగి చావండి. ఎవడన్నా మీ పట్ల సానుభూతి ఉన్నట్లు మాట్లాడినమాత్రాన వాడు మీకేదో తవ్వి తలకెత్తుతాడనుకోకండి! వాడు మిమ్మల్ని వంచిస్తున్నాడు సానుభూతితో కడుపునిండదు. రోగాలు నయం కావు. సమాజం మారదు. అది మిమ్మల్ని ఊబిలోకి తొయ్యటానికే పని కొస్తుంది".

ధనస్వామ్యం మారాలి. మారుతుంది. మీకీనాడు ఈ గుండెలు కరిగించే రచనలు ఏమాత్రమూ తోడ్పడవు.

నాలో జాలి లేదనుకోకండి. నేనూ జాలిపడుతున్నాను-కాలదోషం పట్టిన వర్గాలనుగురించి పాపం వాళ్ళు తమ రాజకీయపుటెత్తులూ, తమకు అండగా ఇంతకాలమూ ఉన్న శాసనాలూ, విచ్చలవిడిగా తాము సాగించే జులుమూ, సమిష్టి సమాజంపట్ల వాళ్ళకుగల ఆలుసూ-ఇవన్నీ శాశ్వతమనుకుంటున్నారు. ఇవి శాశ్వతం అనిపించడానికి కారణం ఏదన్నా ఉంటే అది అవసానదశే! ఆరిపోయే దీపం మహా వెలుగుతుంది. ఇంత విషం పుచ్చుకునేముందు హిట్లరు విజయగర్వంతో డాన్సు చేశాడు. ఈనాటి మన సాంఘిక వ్యవస్థకు చావుతెలివి పుట్టుకొస్తున్నది!

With Best Compliments from:

NAV BHARAT CORPORATION

★

LICENSED CUSTOM HOUSE AGENTS

ON APPROVED LIST OF BANKS,

PROMINENT BUSINESS HOUSES

AND

GOVERNMENT DEPARTMENTS

15, BOMBAY MUTUAL ANNEXE

GUNBOW STREET, FORT

BOMBAY-1

Grams : " DILICATE "

Phones : 263120
265389

జీవితం : సాహిత్యం

శ్రీ కాళోజి

మొట్ట మొదట ఒక విషయాన్ని స్పష్టం చెయ్యదలచినాను. ఈ "విమర్శ" అనేది అటు పాఠకులకూ ఇటు రచయితకూ సంబంధించినది కాదు. అంచే సాహిత్య నిర్మాణంలో విమర్శ ఒక అంగం కాదు. రచయిత అయినవాడు పరిసరాలను పరిశీలిస్తాడు; అధ్యయనం చేస్తాడు. పరిసరాలే రచయితను ప్రభావితుణ్ణిచేస్తాయి. ఆ ప్రభావంతో రచన చేస్తాడు. అంతే గాని విమర్శకుఁు తన రచనను చదివి ఏవిధమైన అభిప్రాయాలను వెలి బుచ్చుతారు? అన్నదాన్ని ఆధారంచేసుకుని ఏ రచయితా రచన చెయ్యడు. ఏ రచయితన్నా అట్లాచేస్తే అంత దిగువరకం రచయిత మరొకడు వుండడు. పరిసరాల నుండి పొందే స్పందనవల్ల రచన చేసేవాడే రచయితగాని విమర్శ కుణ్ణి దృష్టిలో పెట్టుకుని రాసే రచయిత రచయితేకాడు.

మానవజీవిత విమర్శకుడు రచయిత. సమాజం విలువలు; సంప్రదాయాలు; ఆదర్శాలు; ఆచరణ, ప్రేమ, కరుణ, ద్వేషం, దుఃఖం, ఆనందం ఇట్లాటి అనేకానేక భావపుంజం అయిన మానవజీవితం విమర్శే రచన. మళ్లీ రచన మీద విమర్శ ఏమిటి? అర్థంలేని మాటకాకపోతే!

ఇక పాఠకుని దృష్టితో చూద్దాం. పాఠకునికి విమర్శ ప్రయోజనం ఏమీ లేదు. రచనను నేరుగా చదివి అందులోని స్వారస్యాన్ని ప్రత్యక్షంగా ఆస్వాదించడానికి పాఠకుడికి స్వేచ్ఛకావాలె. ఈ స్వేచ్ఛకు విమర్శకుడు అడ్డు తగిలి తానేదో వ్యాఖ్యానం చేస్తానంటాడు. పాఠకుణ్ని ఎట్లాంటి తప్పు దారులు పట్టించినా పట్టించవచ్చు. రచన స్వయంగా చదివి ఆనందించగల వాడే పాఠకుడు. విమర్శకుని సలహాప్రకారం చదివేవాడు పాఠకుడుకాదు; విద్యార్థి కావచ్చునేమో. "విమర్శ"ను పాఠకుడు ఏనాడూ ఆదరించలేదు. ఏ పుస్తక విక్రేతను అడిగినా ఈ విషయం రుజువవుతుంది. విమర్శకుణ్ణి

పాఠకుడు పట్టించుకొనేలేదన్నది అనేకసార్లు అనేక సందర్భాలలో రుజువైంది. ఉదాహరణకు గురజాడను "అకవి" అని విమర్శకులు ప్రచారం చేసినంతమాత్రాన పాఠకులు ఆయన రచనలను ఆదరించడం మానినారా? విమర్శయొక్క ఉపయోగం మళ్ళీ విమర్శకులు కాదలచుకున్నవారికి తప్ప పాఠకులకూ లేదు ; రచయితలకూలేదు.

విలువలుమారటం సహజం. తరతరాలుగా విలువలు మారుతూనే ఉన్నవి. ముందుకూడా మారుతూనే ఉండగలవు. అయితే ఇక్కడ మరొక భ్రమ విషయం ప్రస్తావిస్తాను. సమాజంలో విలువలను మార్చగలనన్న విశ్వాసం, మారుస్తునాన్న ధీమా, మార్చవలెనన్న ఆతురత రచయితకు ఉంటుంది. అదంతా వట్టి భ్రమే. రచయితకు ఉండే ఆతురతనుబట్టిగాని, అతనికుండే ధీమాకు అనుగుణంగాగాని విలువలు మారవు.

సమాజంమీద సాహిత్యంవేసే ముద్ర అతిస్వల్పం ; అత్యంత తాత్కాలికం. ఉదాహరణకు వాల్మీకి రామాయణం రాయకముందు మానవసమాజంలో ఏక పత్నీవ్రతులు లేరా? ఇతరుల భార్యలను ఎత్తుకొనిపోయే రావణుని వంటివారులేరా? ఉండే ఉండాలె. ఎవడూ రామాయణం విన్నందువల్ల ఏకపత్నీవ్రతుడు కావటం లేదు. అదేవిధంగా ఇతరుల భార్యలను ఎత్తుకునిపోయే అలవాటు లేదా తత్వం ఉన్నవారు రామాయణం విని తమ అలవాటును లేదా తత్వాన్ని మార్చుకోవటం లేదు. అధునిక సాహిత్యంలోనుంచి ఉదాహరణలు తీసుకోండి. మునిమాణిక్యం వారి కాంతం కథలను చదివిన తర్వాతనే సంసార పక్షానికి మారిన స్త్రీలు ఎంతమంది ఉంటారు? చలం నవలలను చదివి కుటుంబజీవితాన్ని అరాచకంగా మార్చుకున్నవారెందరు?... ఉండరనే నా విశ్వాసం. ఉంటే బహుస్వల్పం. వారి పుస్తకాలు అమ్ముడుపోయినదానితో, ఆ గ్రంథాల పాఠకుల సంఖ్యతో పోల్చినప్పుడు ఇటువంటివారి సంఖ్య నగణ్యం.

ఎవరైనా ఒకవ్యక్తి ఏకపత్నీవ్రతుడో, సంసారపక్షో, లేదా విప్లవవీరుడో అవుతున్నాడంటే అతడు రామాయణం, కాంతం కథలు లేదా మహాప్రస్థానం పాఠకుడైనందువల్లకాదు. అతని వ్యక్తిగత ఎంపరిమెంటు వల్ల. ఎంపరిమెంటు వ్యక్తికి ఒక రకమైన సంస్కారాన్ని, అభిరుచులనూ అలవాట్లనూ కలుగజేస్తుంది. ఆ సంస్కారాన్ని అభిరుచులనూబట్టి ఆ వ్యక్తి తన అభిమాన రచయితలనూ, సాహిత్యాన్ని ఎంచుకుంటాడు. రచనపట్ల పాఠకునికి ఏర్పడే అభిమానం రచన యొక్క విశేషం కాదు.

'నా గొడవ' మొట్టమొదటిసారిగా అచ్చులో పుస్తకంగా వేసినప్పుడు నేను రాసిన నాలుగైదు వాక్యాలను ఇక్కడ మళ్ళీ వేరొక్కంటాను.

"ఆనందమో, ఆవేదనో కలిగినప్పుడు వచ్చిన భావాన్ని వెలిబుచ్చడం జరిగింది. అది ఇతరులకు కాకున్నా వెలిబుచ్చినవానికి బాగానచ్చింది. ఇతరులకుకూడా నచ్చుతే విశేషం. ఈ విశేషధర్మం కైతకేమాత్రం ఆధారం కాదు. దానికి మూలం, ప్రాణం కవికి అప్పుడప్పుడు కలిగిన ఆవేదన, ఆనందం మాత్రమే.

ఎన్నో సంఘటనలు జరుగుతుంటవి మన చుట్టుపట్టు. ఒకే సంఘటన అందరినీ ప్రభావితులనుచేయదు, ఒకే రీతిన అసలే చేయదు.

ప్రసారయంత్రం ఒకటే అయినా స్వీకరించే యంత్రాలు తమ తమ శక్తితో దానిని గ్రహిస్తవి. యంత్రాలలో అన్నివిధాల సమానశక్తి గల పరికరాలను నిర్మించవచ్చు. మానవుల నిర్మాణం అట్లా జరగలేదు. మనకు పైదైనా "శక్తినిబట్టి సాక్షాత్కారం–భావానుగుణ్యం రూపం".

... ...

మానవ జీవితానికీ సాహిత్యానికీ అనేక పోలికలున్నవి. జీవితం వంటిదే సాహిత్యం. జీవిత ప్రతిబింబమేకద! జీవితంలో ఉన్నంత వైవిధ్యం సాహిత్యంలోనూ ఉంటుంది. మానవ జీవితానికి ఒక ఖచ్చితమైన నిర్వచనం ఒక ఖచ్చితమైన పద్ధతీలేనట్లే సాహిత్యానికీలేదు. ప్రతి సాహిత్య స్రష్టదీ ఒక ప్రత్యేకమైనదారి. ఎవరిదారి వారిదే.

మానవులందరూ ఈ దారుల్లోనే నడవాలి; ఫలానా సమయాన దుఃఖించాలి; ఫలానా సమయంలో నవ్వాలి అని ఖచ్చితమైన సూత్రాలు చేస్తే – వాటి ఆచరణకన్నా ఉల్లంఘనే ఎక్కువ జరుగుతుంది. రచయితల విషయంలోనూ అంతే. సాహిత్యం అంటే ఇల్లా ఉండాలని ఖచ్చితమైన సూత్రాలుచేస్తే ఉల్లంఘనలో జరిగినంతగా ఆచరణలో జరుగదు.

అయితే విమర్శకులూ, అలంకార శాస్త్రజ్ఞులూ కొన్నిసూత్రాలనూ పద్ధతులనూ రూపొందిస్తూనే వుంటారు. ఆ పద్ధతులన్నీ ట్రంకురోడ్లవంటివి. కార్లు, సున్నితమైన వాహనాలను ఉపయోగించే స్వల్ప సంఖ్యాకులకు మాత్రమే వాటి ఉపయోగం. బహు సంఖ్యాకులైన పేదవారికి వాటి

ఉపయోగం ఉండదు. బహు సంఖ్యాకులైన వేదలు కాలిబాటనే వాడుతారు. ట్రంకురోడ్డుమీది నడకకు వేగం, దిశ మొదలైన కట్టుబాట్లు అనేకం వుంటాయి. వాటి ప్రకారం నడుచుకోవలసిందే. అంచే ట్రంకురోడ్డుమీది నడకలో నడిచేదానికి స్వేచ్ఛఉండదు. అడుగులు వేయటంలో తమ స్వీయ ధోరణిని చూపించడానికి "స్వ"ను ప్రదర్శించడానికి వీలులేదు. కాలిబాటలో అల్లాకాదు. ప్రతి బాటసారీ ఆ కాలిబాటమీద వేసే అడుగులు వేరువేరుగా వుంటవి. ప్రతి నడకలోనూ వైవిధ్యం ఉంటుంది. ఏ బాటసారైనా అంతకుముందునుంచి వేసివున్న కాలిబాట తనకు అసౌకర్యంగా ఉన్నదని భావిస్తే, అంతకన్నా సౌకర్యవంతమైన కొత్తకాలిబాటను నిర్మించుకుంటాడు. బహుజనుల బాట కాలిబాట. వైవిధ్యం ఉండగల బాట, బాటసారికి స్వేచ్ఛఉండేబాట.

ఒక పద్ధతిని - సిద్ధాంతాన్ని ఏరుకొని దానిప్రకారం నడకను సూత్రబద్ధం చేసుకోవటం-అట్లాంటి జీవితాన్ని ట్రంకురోడ్డుతోనూ, స్వేచ్ఛా జీవితాన్ని కాలిబాటతోనూ పోల్చవచ్చు. ట్రంకురోడ్డుమీద నడిచే బాటసారికీ, కాలిబాటన నడిచే బాటసారికీ ప్రయాణం సామాన్యగుణం అయినట్లు సూత్రబద్ధ జీవితానికీ, స్వేచ్ఛాజీవితానికి జీవితం సామాన్యగుణం.

ట్రంకురోడ్డు, వాహనాలమీద - కార్లమీద తదితర శకటాలమీద ప్రయాణం ప్రగతికి చిహ్నమని, లక్ష్యానికి వేగంగా త్వరగా చేరుస్తాయని ఒక భ్రమవున్నది. అది వట్టిభ్రమే. వాస్తవం దానికి పూర్తిగా భిన్నం. కాలిబాట అనేది పయనించిన చోటినుండి చేరవలసిన లక్ష్యానికి సర్వదా దగ్గరి దారి అయివుంటుంది. అంతేకాక, సాంకేతిక యంత్ర సంబంధ వైఫల్యాలు, తదితర ప్రమాదాలూ, కాలిబాట బాటసారికి ఉండవు. అందుకని కాలిబాట అనాగరిక, ఆటనిక సంప్రదాయమనీ, ట్రంకురోడ్డు అధునికమైనదీ నాగరికమైనదీ అన్న వాదంలో పసలేదు. పోతే జీవితలక్ష్యం ఆనందప్రాప్తి. ఆనందప్రాప్తి సులభంగా, సురక్షితంగా సాధ్యపడేది కాలిబాట వంటి స్వేచ్ఛా సాహిత్యంద్వారా ఆనందప్రాప్తి దూరం చేసేది, దుస్సాధ్యంచేసేది నాగరికత అయితే - నాగరికత కోసమే నాగరికతను ఆరాధించవలసివస్తుంది. ఆనందప్రాప్తిఅన్న లక్ష్యానికి తోడ్పడని నాగరికత ఎందుకు? సామాన్య మానవునికీ. రచయితకూ తేడా ఎక్కడ వుంటుందో పరిశీలిద్దాం. కట్టు, బొట్టులో, ఆచార వ్యవహారాల్లో ఈ ఉభయులకూ తేడా ఉండదు. తేడా అంతా భావవ్యక్తికరణ ప్రతిభలో ఉంటుంది.

ఏ కాలంలోనైనాసరే, అప్పటికి అమలులోవున్న రాజకీయ, సాంఘిక నియమాలూ, విలువలూ, కట్టుబాట్లూ అనేకమంది వ్యక్తులకు తమతమ వ్యక్తిగత జీవితంలో అసౌకర్యంగా ఉంటాయి. వాటిపట్ల సామాన్యునికి అసంతృప్తి ఉంటుంది. అయితే వాటిని ధిక్కరించడంవల్ల ఏర్పడే అసౌకర్యాలు మరింత దుర్భరంగా, భయంకరంగా ఉంటాయన్న భయంచేత నైతేనేమి, అసౌకర్యాలను చాటుమాటుగా దాటవేసుకునే సుళువులు ఉండటంవల్ల నైతేనేమి అమలులో ఉన్న సాంఘిక కట్టుబాట్లనన్నింటినీ ఖచ్చితంగా పాటిస్తున్నట్లే కనపడి, వ్యక్తిగత జీవితంలో చాటుమాటుగా, వీలు చిక్కినప్పుడల్లా, తన సౌకర్యంకోసం ప్రతివ్యక్తీ వాటిని ఉల్లంఘిస్తూ వుంటాడు. రచయితకూడా ఇందుకు అతీతుడుకాదు. నడక – లేదా ఆచరణ వరకు అతడు అందరివలెనే సాంఘిక కట్టుబాట్లను తన సౌకర్యంకోసం ఉల్లంఘిస్తూనేవుంటాడు. అయితే సామాన్యుల మనస్సుల్లోఉన్న అసంతృప్తిని, అమలులో ఉన్న విలువలు, కట్టుబాట్లు మారాలన్న ఆవేదనను ఆతురతను రచయిత వ్యక్తపరుస్తాడు. సామాన్యులు వ్యక్తం చెయ్యలేరు. రచయిత వ్యక్తం చేసిన భావాలు సామాన్యులు వ్యక్తం చెయ్యాలని తపన పడుతున్న భావాలే. కానీ వ్యక్తికరణ సామాన్యునికి సాధ్యపడదు. రచయితకు సాధ్యపడుతుంది. అంతే తేడా.

రచయిత ఏదో ఒక విశ్వాసానికి లేదా తత్వానికి కట్టుబడి ఉంటే– అనగా "కమిటెడ్" అయితే సదరు వ్యక్తీకరణముకూడా స్వేచ్ఛగా చెయ్యలేడు. "కమిటెడ్" లేదా కట్టుపడ్డ మనిషి రచయిత కాలేడు.

రచయిత అయినవాడు ఏదో ఒక సిద్ధాంతానికి లేదా తత్వానికి కట్టుబడి ఉండాలన్నవాదం ఇటు రచయితనూ, అటు సిద్ధాంతాన్నీ గోతిలోకి తోసే వాదమే. రెండువైపులా ప్రమాదాలే.

మనం ఒక్కసంగతి స్పష్టంగా గుర్తించాలి. మార్క్సిజం, గాంధిజం, సోషలిజం, కాపిటలిజంలాంటి సిద్ధాంతాలూ, తత్వాలు సామాజిక లేదా రాజకీయవ్యవస్థా విశేషాలు; కవితా విశేషాలో; కళావిశేషాలో లేదా కనీసం భావ వ్యక్తి విశేషాలో కావు.

రచయిత ఏదైనా తత్వానికి లేదా సిద్ధాంతానికి కట్టుబడిపోయినట్లయితే ఉభయభ్రష్టత్వానికి ఎలా గురవుతాడో పరిశీలించండి.

1. కట్టుపడిపోయి వున్నందువల్ల ఆ యా సిద్ధాంతాల ప్రచారకుల లేదా నాయకులకు ఉపకరించే రచనలు, వారి మార్గాన్ని సుగమం చెయ్యడానికి ప్రయోజనపడే రచనలనే చెయ్యవలసిరావడంవల్ల "స్వ"ను రచయిత వ్యక్తీకరించలేడు. ఈ విధంగా ఆత్మహత్యకు పూనుకొనవలసిన అగత్యం తప్పనిసరి అవుతుంది.

2. ఏ సిద్ధాంతానికి కట్టుబడతాడో దానికి కమాండరూ కాలేడు. సిద్ధాంతాన్ని నిర్వచించేవాడూ, నడిపించేవాడూ, సిద్ధాంతప్రకారం, లేదా సిద్ధాంతసాధనకోసంజరిగే పోరాటాలకు నాయకత్వం వహించే వాడు వేరే మరొక సిద్ధాంతకర్త. మావో - లెనిన్ - గాంధీ - లోహియా-బుద్ధుడు వంటివారు వేరే ఉంటారు.

3. తాను ఏ సిద్ధాంతానికి కట్టుబడిపోతాడో అందులో తన్మయుడై పోయి, భావావేశంలో పడి దాన్ని వర్ణించే పద్ధతిలో, ఆ సిద్ధాం తాన్ని అనుసరించదలచుకున్న అనేకమంది సామాన్యులను. అజాను లను స్వయంగా "మానిఫెస్టో" చదివి అర్థంచేసుకోలేని వారిని ఈ రచయిత రచనలద్వారా స్ఫూర్తిని పొంది రంగంలో దుమికే వారిని సిద్ధాంతపరంగా తప్పుదారి పట్టించే ప్రమాదంకూడా వున్నది. భారతీయ వేదాంతాన్ని బోధించడానికి పురాణాల్లో కవులు వాడిన ప్రతీకలన్నీ ప్రధానపాత్రలుగా తిష్ఠవేసుకుని, పూజలూ, పునస్కారాలూ అందుకుంటూ అసలు భావాన్ని గాలికి విసిరేసిన సంఘటనలు ఎన్నిలేవు ;

కట్టుబడిన రచయత తన రచనద్వారా మహాఅయితే "కంపెనీ వస్తువుల"ను విరివిగా అమ్మటానికి ఉపయోగపడే మంచిపోస్టరును సృష్టించ గలడు. మంచి పోస్టరుగా ఉపయోగపడగలడు. అంతే.

అయితే సాహిత్యానికి ఏ ప్రయోజనమూ లేదా ? అన్న ప్రశ్న రావచ్చు. ఉన్నది. సాహిత్యం సాధించవలసిన బృహత్తర ప్రయోజనం ఒకటి వున్నది. మరెవ్వరూ సాధించలేనిదది. సాహిత్యకారులు, రచయితలు పూనుకుంటేతప్ప సాధ్యంకాని ప్రయోజనం.

మన విజ్ఞాన శాస్త్రాలన్నిటికీ, సిద్ధాంతాలకూ తత్వాలకూ లక్ష్యం "సర్వేజనా సుఖినోభవంతు." దాన్నే మొట్టమొదటిసారిగా ఫ్రెంచివిప్లవం సందర్భంగా "స్వాతంత్ర్యం - సమానత్వం - సౌభ్రాతృత్వం" అని మరింత

స్పష్టంగా నిర్వచించారు. ఈ మూడూ ఉన్నప్పుడే సర్వేజనా సుఖినో భవంతు లక్ష్యం సిద్ధిస్తుంది. అయితే ఈ మూడింటిలో చివరన వేరొక్కన్న సౌభ్రాతృత్వం అనే లక్ష్యం మిగతా అన్నిటికీ మూలాధారం. స్వాతంత్ర్య రక్షణకైనా, సమానత్వ సాధనకైనా మొట్ట మొదటగా కావలసిన ప్రీరిక్విజిట్ సౌభ్రాతృత్వం.

రాజకీయ విప్లవాలద్వారా స్వాతంత్ర్యాన్ని సాధించవచ్చు. విప్లవానంతరం ఏర్పడిన ప్రభుత్వాలు తమ కృషిద్వారా సమానత్వాన్నీ స్థాపించవచ్చు. కాని సౌభ్రాతృత్వం లేనిదే ఈ రెండిటివల్ల కలిగే ఫలితం "సర్వేజనులకు" చెందదు.

ఇంతవరకూ ప్రపంచ మానవాళికి, రాజకీయ విప్లవాల ద్వారా స్వాతంత్ర్యం అందినది. విప్లవానంతర ప్రభుత్వాలు కొన్ని చిత్తశుద్ధితోనూ, నిజాయితీతోనూ కృషిసల్పి మానవత్వాన్నికూడా సాధించినాయి. కాని సౌభ్రాతృత్వం మానవజాతి అందుబాటులోనికి రాలేదు. ఎందుకని ?

రాజకీయ విప్లవాలద్వారా సౌభ్రాతృత్వం సాధ్యపడేదికాదు కనుక. సమానత్వస్థాపనకోసం రూపొందించే ప్రణాళికలుగానీ, సోషలిస్టు చట్టాలుగానీ సౌభ్రాతృత్వాన్ని సాధించజాలవు కనుక. సౌభ్రాతృత్వానికి కృషి చేయవలసింది రాజకీయ నాయకులూ, విప్లవకోవిదులూకారు ; రచయితలు.

రచయిత ఇన్నాళ్లూ తన స్థానాన్ని తాను వేరుగా ఏర్పరచుకోలేదు. స్వాతంత్ర్యానికి లేదా సమానత్వానికి జరిగే కృషికి, పోరాటానికి లేదా విప్లవానికి వత్తాసుగా నిలిచినాడు. అంచే మిగతావాని రంగాలలో పడిపోయి తన రంగాన్ని విస్మరించినాడు. అందువల్ల సాధించుకున్న స్వాతంత్ర్యమూ, సమానత్వ స్థాపనకు జరిగిన ప్రయత్నమూ ఫలించకుండా పోతున్నయి.

రచయిత తన విధిని, బాధ్యతను గుర్తెరిగి సౌభ్రాతృత్వసాధనకు కృషిచెయ్యడమే తన ధర్మంగా నిర్వచించుకుని ఆ పరిమితరంగంలో కృషి జరిపినట్లయితే రాజకీయ నాయకులు విఫలమైనచోట రచయిత విజయం సాధించి మానవజాతికి మ పకారం చెయ్యగలడు.

ఒక్కటే షరతు—మొదటి రెండింటిలో నిమగ్నమైపోయి, తన భాగాన్ని రచయిత విస్మరించరాదు.

రచయిత కృషివలన సౌభ్రాతృత్వం రాగలదా అను ప్రశ్న అటుంచి ఏ వర్గానికీ ఏ సిద్ధాంతానికీ కట్టువడకుండా వర్గాలు, సిద్ధాంతాలలో ఉన్న లోపాలకు తలవంచకుండా వారివర్గాల సిద్ధాంతాల తు. చ. తప్పని నడవడిని స్వీకరించే గొర్రెదాటు విధానం కాకుండా మానవసమాజములోని సమానతకు అది నెలకొలిపే స్వాతంత్ర్యానికి మూలాధారమైన సౌభ్రాతృత్వాన్ని దానికి సంబంధించిన భావనను తన రచనలద్వారా కలిగించి తన కనీసబాధ్యతను నెరవేర్చిన చాలని నా అభిప్రాయం.

★

"అధునికుడు ఒక జరాఫిలా తయారవుతున్నాడు
రోజురోజుకు అతని మెదడుకీ హృదయానికీ
దూరమెక్కువై పోతోంది".

"ఎప్పటికయినా మానవ పథికుడు చేరుకునే
గొప్ప విశ్రాంతి మందిరం కవిత."

—ఆరుద్ర.

"కవిత్వం అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతంచెయ్యాలి
విస్తరించాలి చైతన్య పరిధి
అగ్ని జల్లినా అమృతం పరిసినా
అందం ఆనందం దాని పరమావధి."

—శివ.

విశ్వరచన

(తెలుగు సాహిత్య మాస పత్రిక)

యూనిలిట్

(ఆంగ్ల సాహిత్య త్రైమాస పత్రిక)

సంపాదకుడు : పోతుకూచి సాంబశివరావు

రెండు పత్రికలకు సాలు చందా రూ. 10/-

ఆంధ్ర విశ్వసాహితి

పోషకుల చందా రూ. 25/-

(వీరికి పత్రికలు కాక ఇతర గ్రంథాలు కూడా యివ్వబడును)

రూ. 58/-

(వీరికి పత్రికలు, గ్రంథాలు, వినోద కార్యక్రమాల ప్రవేశపత్రాలు లభిస్తాయి)

జీవిత పోషకులు : రూ. 1,000/-

తెలుగుజాతిని ప్రపంచంలో బలవత్తరమైన
జాతిగా రూపొందించటానికి, తెలుగు జాతికి
వివిధరంగాలలో జరుగుతున్న అన్యాయాలను,
అక్రమాలను ఎదిరించటానికి
ఆరుకోట్ల సమైక్యవాణి

తెలుగుదేశం

విడిప్రతి 50 పైసలు సాలుచందా 5 రూ॥లు

వివరాలకు :

మేనేజరు, 'తెలుగుదేశం'
హుమయూను నగరు, హైదరాబాదు-28

మారుతున్న విలువ

→ రచయిత బాధ్యత

శ్రీ గోరాశాస్త్రి

శీర్షిక నడక సూటిగా లేదు;- అక్షరాలు గెంతులువేశాయి:- పోనీ,- ముద్రణలో వాటిని సరిగా పేర్చక, గెంతులువేయించారు.

ఎవరు ? బాధ్యతను ఏ ఒక్కరికో అంటకట్టడం సబబుకాదు- నలుగురూ చెయ్యివేశారు.

భావప్రకటనకు అక్షరాలు వాహకాలు;- శీర్షికను బనాయించినది భవదీయుడు కాదు;- దాని భావం భవదీయుడికి అర్థమైంది;- అనగా అర్థంకాలేదని అర్థమైంది. సందేహాలు జనించాయి, "మారుతున్న విలువ" లకు రచయిత బాధ్యుడా ? చదువరులూ, వారిలోని ప్రథిత పాండితులద్భుత ప్రజ్ఞ కలవారూ, ఆగ్రహించినా, మారుతున్న విలువలకు రచయిత బాధ్యుడనే అర్థం, ధ్వనీ, రెండూ శీర్షికలో ఉన్నాయని అంగీకరించాలి: ఇదిగో ఉదాహరణ: "పెరుగుతున్న ధరలు;- ప్రభుత్వ బాధ్యత". అంటే అర్థం ఏమిటి ? "పెరుగుతున్న ధరలను అరికట్టి తన బాధ్యతను ప్రభుత్వం సక్రమంగా నిర్వహించడం లేదు". అంతేగదా ? ధరలు పెరగడం అవాంఛనీయం. అదే విధంగా విలువలు మారడం అవాంఛనీయమా ?

ఉద్దేశించిన భావాన్ని గ్రహించాలిగాని, మాటలు సాగదీసి, లేనిపోని అర్థాలను కల్పించడం మంచి అభిరుచి కాదు; నిజమేకాని, భావశబలత సాధించాలంటే వాక్యనిర్మాణంపట్ల జాగరూకత వహించాలిగదా ?

ఈ వ్యాసరచనకు అనుశాసకుడు శ్రీ విశ్వనాథంగారితో కొంత వాగ్వివాదానంతరం శీర్షికభావం భవదీయుడికి చాలావరకూ బోధపడింది.

"సామాజిక విలువలు" మారుతున్నాయి. మారుతున్నగమనించే రచయిత, గమనించవలసిన రచయిత, ఎటువంటి సాహిత్యాన్ని సృష్టించాలి? రచయితగా సంఘంపట్ల తన బాధ్యతను ఏవిధంగానిర్వహించాలి?"

చాలా సంక్లిష్టప్రశ్న; అనేకానేక వృత్తులు చేబట్టినవారున్నారు కదా, అందరికి అంతోయింతో బాధ్యతలు ఉంటాయికదా, వారందరికంటె రచయిత ఉన్నతుడా? అనే ఎదురు ప్రశ్న సహజంగా ఉదయిస్తుంది.

ఇంకొక ప్రశ్న:- సమాజంపట్ల రచయితకు బాధ్యత - అనగా అదనమూ, ఉన్నతమూ ఐనది — ఉందని ఒకవేళ మాటవరసకు అంగీకరించినా, ఏకపక్ష బాధ్యతలుండనేరవు; సంఘానికికూడా రచయితపట్ల బాధ్యత ఉండితీరాలి; హక్కులూ,బాధ్యతలూ,"బొమ్మా-బొరుసూ" వంటివి.

"సాహిత్యాన్ని" లలిత కళలలో చేర్చారు; అన్ని దేశాలవారూ యుగయుగాల నుండి సాహిత్యానికి మహోన్నత స్థానం యిచ్చారు; గానం, శిల్పం, చిత్రలేఖనం, అలాంటివన్నీ లలితకళలనీ, కొండగుహలలో నివసించే ఆదిమ మానవుడు నేడు ఇంత నాగరికతనూ, విజ్ఞానాన్నీ సాధించి, ప్రకృతినే జయించగలిగాడంటే, అతడి సృజనాత్మకశక్తి కారణమని మేధావులన్నారు.

స్వాతిశయాన్ని దూరంగా ఉంచి, కొంచెం నిశిత పరిశీలన చేస్తే విచిత్రాంశాలు ఆవిర్భవించి, మనల్ని సవాల్ చేస్తాయి.

గానం మానవులను పరవశుల్ని చేస్తుంది; అలౌకిక ఆనందాన్నిస్తుంది; గానవాహినిలో తన్మయులై, తమ జీవితాలను భగవంతుని ఆరాధన కోసమో, ప్రేయసిఅనుగ్రహం కోసమో, అంకితమిచ్చి, కర్పూర నీరాజనం వలె వెలిగించి, హరించి తరించామనే ఆత్మసంతృప్తితో కనుమూసినవారు ప్రతి శతాబ్దంలోనూ ఉన్నారు.

లలితకళలన్నింటిలోనూ, శాశ్వతత్వ భాగ్యరేఖకు నోచుకోనిది గానకళ; ఈ శతాబ్దపు వైజ్ఞానిక ప్రగతి ప్రసాదించిన రకరకాల "రికార్డింగ్" యంత్రాలు గాయకులకు "అంక సిద్ధార్థపేటి" వంటివి; ముందు తరాలవారికి తమ గానసుధను భద్రపరిచే అవకాశం లభించింది; అంతకు పూర్వం? - శుభనామధేయం ఒక్కటే చరిత్రలో నిలిస్తే చాలునా?

మీరాబాయ్ కంఠమాధుర్యం, వేనవేల హృదయాలలో కృష్ణ భక్తిని పాదుకొల్పిన మంజులగానం, ఇవాళ మనం వినలేము; అలాగే తాన్‌సేన్, కబీర్, చైతన్య మహాప్రభువు; వారి గాన సుధారసంలో సుల్తానులూ, శుద్ధ శుంఠలూ, రారాజులూ, కరిగిపోయారు. ఐతే, ఆ యా గాయన గాయనీమణుల తుది శ్వాసతోపాటు వారి అమర గానం కూడా వాయువులో లీనమైపోయింది.

వాళ్ళు రచించిన గీతాలు నేటికీ నిలిచాయి కదా? - త్యాగరాజు కృతులు శ్రవణపేయంగా అనుదినమూ విని ఆనందిస్తున్నాము కదా?- అక్షరాలా నిజం; వాళ్ళు కేవలం గాయకులు కారు; వాగ్గేయకారులు;వాళ్ళ రచనల్ని ఎవరో పాడుతూంటే వింటున్నాము; త్యాగయ్య ఎలా పాడేవాడో మనకు తెలుసునా? "Gone with the wind"- అంతేగదా?

ఇక్కడ సంగీత శాస్త్రప్రసక్తి ఇమడదని మనవి; ప్రతి లలిత కళకూ శాస్త్రీయ ప్రాతిపదిక విధిగా ఉంటుంది. శాస్త్రీయ పరిజ్ఞానం లేనిదే ఎవడూ కళాకారుడు కాలేడు; ఐతే, కళాసృష్టికి శాస్త్రపరిజ్ఞానం ఒక్కటే చాలునని భావించడం వెర్రితనం.

సంగీతకళ తరువాత శిల్పం, చిత్రలేఖనం, వాటిగురించి ముచ్చటించాలి: తన్మాత్రం చాలును; శిల్ప, చిత్రలేఖన సౌందర్యసృష్టి వందల సంవత్సరాలు నిలుస్తుంది.

ఇంతవరకూ - రేఖామాత్రంగా వివరించినది యవనిక వలె వినియోగపడుతుందని భవదీయుడి ఆశ. పోనీ-- తాపత్రయం; యవనికలేని భావ వ్యక్తీకరణ బోసిగా ఉండదా?

ప్రక్రియాంశం - "మారుతున్న విలువల" నడుమ రచయిత బాధ్యత.

"విలువలు" అనగా సాంఘిక, సామాజిక జీవనం, వైజ్ఞానిక ప్రగతి స్థితి, రాజకీయ వ్యవస్థ, ప్రభుత నడిచే తీరుతెన్నులు, మత విశ్వాసాలు, జాతీయ సంపద ఉత్పత్తి పెంచే అవకాశాల పెరుగుదల, వాటి ఆరోగ్యం, రుగ్మత— యివన్నీ, ఇంకెన్నెనో కలిసి, మనిషిని అటూయిటూ ఊగిసలాడించే శక్తుల సంపుటి.

వీటిలో ప్రతిఒక్క అంశానికీ రచయిత అనేవాడు రకరకాలుగా అనుస్పందిస్తాడు. కొన్ని భావాలు అతనిలో గూడుకట్టుకుంటాయి; గూడు స్థిరంగా ఉన్నా, కొన్ని భావాలు, లేదా విశ్వాసాలు, పోనీ అభిప్రాయాలు, గూటినుండి పారిపోతూంటాయి. కొత్తభావాలు ప్రవేశిస్తాయి.

కోర్టుతో పనికలిగిన పార్టీలు లాయరుకు కావాలి; వైద్యుడికి రోగులు అవసరం; ఉపాధ్యాయుడికి తాను చెప్పే చదువు నేర్చుకోవడానికి విద్యార్థులు కావాలి; లాయర్లకూ, డాక్టర్లకూ, వాళ్ళ "క్లయింటు" లే డబ్బిస్తారు - ఉపాధ్యాయుడికి ప్రభుత్వమో, ప్రయివేటు సంస్థలో; జీతం యిస్తాయి. చిత్రకారుడు, గాయకుడు, శిల్పి, నటుడు, అందరికీ డబ్బుయిచ్చేవాళ్ళంటుంటారు. శ్రమ శక్తికీ మూల్యం దొరక్కపోతే, శ్రమించడం దేనికీ? కళాకారుడికీ, లేదా, ఒక వృత్తిని చేబట్టినవానికి లభించే ప్రతిఫలంలో అనంత వ్యత్యాసాలుంటాయి. వాటికి కారణలున్నాయిగాని సమంజసం అనదగినవి చాలా తక్కువ. "అయ్యబాబోయ్!" అనుకునేటంత ఎక్కువగానూ, "అయ్యో పాపం!" అని బాధకలిగించేటంత స్వల్పంగానూ ఉంటాయి. వీధి గాయకుడికి వాడవాడలా తిరిగి రోజంతా పాటలు పాడితే, దొరికే బిచ్చం మహాఐతే రెండురూపాయిలు. అతడు అద్భుతమైన గాయకుడు కావచ్చును; "ఆహా! ఎంత అమృతకంఠం!" అంటారు విన్నవాళ్ళు; అంటూ పదిపైసలు పడేస్తారు. చలనచిత్ర నిర్మాణ పరిశ్రమలో "ప్లేబ్యాక్" గాయకుడికి ఒకపాటకు రెండు, మూడు, వేల రూపాయిల ప్రతిఫలం దొరుకుతుంది. వినాయకచవితి పండుగకోసం, మట్టితో గణపతి ప్రతిమను ఎంతో విన్నాణంగా మలచిన శిల్పికి ప్రతిమ "సైజు"ను బట్టి యాభైపైసలో, ఒక రూపాయో, ధరకిడుతుంది. దేవీ ప్రసాద్ రాయ్ చౌధురీ వంటి

శిల్పి అదే "సైజు" విగ్రహాన్ని- ఏదైనాసరే; తయారుచేస్తే అధమపక్షం పదివేలరూపాయిలు రాలిపడతాయి,

"ఇత్యాది ఉదాహరణలను డోహించవలెను"

ఇంక - "రచయిత" అనిపించుకున్న విచిత్ర జీవి సంగతి ?- సాహిత్య విపణివీధిలో ధరలుకూడా గమ్మత్తుగా ఉంటాయి. ఇవాళ సాహిత్యానికి "మహారాజ పోషకులు:- (1) పత్రికలవాళ్ళు, (2) పుస్తకాల పబ్లిషర్లు; (3) రేడియో ప్రసారకేంద్రాల అధికారులు; (4) చెదురువాటుగా రాష్ట్ర, కేంద్ర, ప్రభుత్వాలకు చెందిన కొన్ని శాఖలు అధిపతులు; (5) చలనచిత్ర నిర్మాతలు; (6) సాహిత్య "అకాడమీ" సారధులు,

పై వర్గీకరణలో క్రమాలంకార సూత్రాన్ని పాటించలేదు. క్రమాలంకారవృద్ధి (ప్రతిపలం ప్రమాణంగా) ఇలా ఉంది:- అందరి కంటే పిసినార్లు, లుబ్ధాగ్రేసర చక్రవర్తులు, - రేడియో వాళ్లు. ఆర్థిక శాస్త్ర పరిభాషలో Buyer's market, Seller's market అని రెండు అవస్థావిభేదాలున్నాయి:- రేడియో వాళ్ళది సర్వదా, సర్వథా,- BUYER'S MARKET. కృష్ణశాస్త్రి కవితకూ, చనుబాలకవి కిష్టయ్య కవితకూ,- ఒకటే రేటు. బేరంలేదు.

పత్రికలలో రకాలున్నాయి:- వాటిలో కొన్ని ఐరావతాలు:- చాలాభాగం "సన్నకారు వైతాంగం" కోవకు చెందుతాయి:- భారీ పత్రికలు కొంచెం సంతృప్తి కలిగించే ప్రతిఫలం రచయితకు యిస్తాయి:- ఐతే, వాళ్ళది "CLOSED SHOP" వంటి విధానం :- ప్రతి పత్రికకూ [యించు మించు] "ఆస్థాన రచయితలు"న్నారు. కొంత కాలంనుండి "స్టార్ వ్యాల్యూ" పద్ధతిని పత్రికలు కూడా అనుసరిస్తున్నాయి :- "రాసిన దేమిటి ?" - వస్తునాణ్యం అక్కరలేదు :- "రాసినదెవరు ?" సాహిత్య విపణివీధిలో కొంచెం పేరుతెచ్చుకొన్న వారికి ఎక్కువ ప్రతిఫలం : "ఫలానా రచయిత/రచయిత్రి మార్కు నవలల్ని, కథలనూ వాడండి." అదీ నినాదం ; ప్రస్తుతం రచయిత్రుల రచనలకు గిరాకీ ఎక్కువ : ధారావాహికంగా నేడు వెలువడే "నవలారాజాల"ను నారీరత్నాలు అవలీలగా వండేస్తున్నారు : సదరు వంటకాలకోసం పాఠకులు ఎగబడుతున్నారు. నవీన 'కాశీమజిలీ'

కథలు పునర్జన్మ ఎత్తాయి : వాటినే నవలలు అంటున్నారు.

పబ్లిషరులుకూడా పుస్తక ప్రచురణను పకోడీల వ్యాపారంగా మార్చేశారు : పత్రికలకంటే ఎక్కువ ప్రతిఫలాన్ని కొందరు పబ్లిషరులు యిస్తారుగాని, శ్రమకూ, రచయిత మౌలిక ప్రతిభకూ తగిన ప్రతిఫలమా అది ? ఎంత మాత్రం కాదు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృపారసం పించనీ తీసుకోవలసిన రచయితలపైనా, పైరవీ రచయితలపైనా, వర్షిస్తుంది : "అకాడమీ" పాలసీ డిటో.

రచయితలకు నేటి భోజ మహారాజులు సినిమా నిర్మాతలు : ఆరుపంక్తులు దాటని చెత్త పాటకు వెయ్యిరూపాయిలు కూడా యిస్తారు : ఐతే సినిమారంగం అతిరాలా అభినవ భోజుని ఆస్థానం : అష్టదిగ్గజాలు భోజుడిని బంధించాయి : అంతేగాక, నేటి భోజుడికున్న అంధ విశ్వాసాలు అనంతం, ఆజ్ఞలు అపారం. ఫ్యూడలిజాన్ని నిరసించే "కొమ్ములు మొలచిన" రచయితలు, వేదికలపైన సింహనాదాలు చేస్తారు : అభ్యుదయం గురించి, రచయిత బాధ్యత గురించి, ఆభినవ లెనిన్‌వలె మాటాడతారు. సినిమారంగంలోని ఫ్యూడలిజాన్ని మాత్రం కంటికి రెప్పవలె సంరక్షిస్తారు : నిర్మాత మహారాజులకు సుబేదారులవలె వ్యవహరించడానికి తహతహలాడే రచయిత, సాహిత్య సభల వేదికలపైన ఉపన్యసిస్తాడు.

రచయిత ఎవరికి బాధ్యుడు ? పత్రికల అధిపతులకు, ఆకాశవాణి వారికి, పబ్లిషర్లకు, సినిమా నిర్మాతలకు, "అకాడమీ"ల వారికి బాధ్యుడు. తృణమో పణమో డబ్బిచ్చి రచన కొనుక్కునే మహాశయుడు సాహిత్య విలువలను నిర్ణయిస్తున్నాడు. అతడికి కొంచెం నవీన భావాలుంటే నవ్యసాహిత్యాన్ని అదరిస్తాడు. ధనార్జన :- అదీ ముఖ్యం. తొంభైశాతం రచయితలు సాహిత్యాన్ని వ్యాపారంగా మార్చివేశారు : సాహిత్య సభల నిర్వాహణకూడా ఒక వ్యాపారం.

ఇంతమందిలోనూ సాంఘిక శ్రేయస్సు గురించి, తుణతుణం మారుతున్న జీవన విధానంగురించి, మథనపడే అమాయకుడు సకృ

తుగా ఉండవచ్చుగాని, అలాంటి విచిత్రజీవికి ఆదరణలేదు. 'సాహిత్య రచనా' బేకారులు విచ్చలవిడిగా సంచరించి, "రంధోళ్ళు" వాయిస్తూంటారు. సాహిత్య రంగానికి తామే "ట్రస్టీల" మను కుంటారు.

* * *

"రచయిత" అనేది యివాళ "హోల్డాల్" వంటి మాట : కవులూ - అనగా పద్యాలూ, గేయాలూ, పాటలూ వ్రాసేవాళ్ళూ కేవలం వచనాన్ని ఉపయోగించి కథలూ, కథానికలూ, అల్పికలూ, గల్పికలూ, నవలలూ, నాటకాలూ, వ్యాసాలూ, అల్లేవాళ్ళూ - అందరూ రచయితలే.

ఇది పరిశోధనా వ్యాసం కాదు. పరిశీలనా వ్యాసం. దీనినే ప్రాతిపదికగా చేసుకొని, ఇందులోని భావాలనూ, అభిప్రాయాలనూ, సవాల్ చేసేవారికి సమాధానంగా, వెయ్యిపేజీల పరిశోధనా గ్రంథాన్ని వ్రాయడానికి భవదీయుడు సిద్ధంగా ఉన్నాడు : శ్రమ శక్తికి సముచితధర చెల్లించేవాళ్ళు ముందుకు రావాలి.

ఇంతకూ - "మారుతున్న విలువలు" అంటే ఏమిటి ? సాంఘిక జీవన విధానం, ఆర్థిక వ్యవస్థ, రాజకీయ పరిణామాలు - మొదలైన వాటినన్నింటినీ సమీక్షతం చేయగా, తయారయే కొత్త పదార్థం.

జీవన విధానాన్ని సాహిత్యం ఎన్నడూ మార్చలేదు ; మన తెలుగు సాహిత్యాన్నీ, యీ శతాబ్దం ప్రారంభంనుండి తెలుగుప్రజల జీవన విధానంలో వచ్చిన, వస్తూన్న, మార్పులనూ, కొంచెం నిష్పాక్షిక దృష్టితో ఆలోచిస్తే, కొన్ని మూలసత్యాలకు కారణాలు తెలుసుకోవలసిన అగత్యం ఏర్పడుతుంది.

ఇక్కడ ఒక ముఖ్యాంశాన్ని విస్మరించరాదు : రెండు రకాల రచయితలుంటారు : సర్వదా ఉంటారు. కార్యక్షేత్రంలో దిగి, సంఘ సంస్కరణమో, రాజకీయ సంరంభమో, చేబట్టి తమ కృషికి సాహిత్య రచనలను వినియోగించుకునేవారు ఒకరకం.

కందుకూరి వీరేశలింగంగారు ఆ కోవకు చెందినవారు : వితంతు వివాహాలు జరిపించడం, భోగం మేళాలను నిషేధించడం, పడుపు వృత్తినీ, ప్రభుత్వోద్యోగుల లంచగొండితనాన్నీ, మానిపించడం, మొదలైనవి ఆయన కార్యక్రమాలు : కేవలం పద్యాలూ, పాటలూ,

V.R. NARLA MEMORIAL LIBRARY V.R. NARLA D P R I. Acc. No.

ప్రహసనాలూ వ్రాసి, అంతటితో తనబాధ్యత ముగిసిందని ఆయన భావించలేదు. నడుం బిగించారు : సనాతనులతో యుద్ధంచేశారు. వితంతు వివాహాలు జరిపించారు.

తన కార్యక్రమానికి సిద్ధాంత ప్రాతిపదిక కావాలి : అందుకని పత్రికలు స్థాపించి, ప్రచారం చేశాడు. రచనా వ్యాసంగాన్ని, తన కార్యక్రమానికి ప్రచారాయుధంగా వాడుకున్నారు. ఇవాళ రాజకీయ నాయకులు, పత్రికలు స్థాపించి ప్రచారం చెయ్యడంలేదా? రాజకీయపార్టీలు తమ సిద్ధాంత గ్రంథాలనూ, కరపత్రాలనూ, వెలువరించడంలేదా? వ్యత్యాసం ఎక్కడుంది? అందుకనే వీరేశలింగం గారు వ్రాసిన "ప్రహసనాలు" యివాళ చదివితే, పేలవంగా, రసవిహీనంగా ఉంటాయి : పంతులుగారికి "చెక్కభజన" చేసేవాళ్ళు ఆగ్రహిస్తారు. కాని, వ్యక్తి ఆరాధన, సత్యాన్వేషణకు అవరోధం గదా?

పంతులుగారి తక్కిన రచనల ప్రస్తావన విధిగా వస్తుంది : నిజం, ఆయన కవుల చరిత్ర వ్రాశారు : కాళిదాసు "శాకుంతలమ్" తెలుగులో అనువదించారు : "రత్నావళి" తర్జుమా చేశారు : ఇనపగుగ్గిళ్ళ భాషలో నీతిచంద్రిక భాగాలను అనువదించారు : వృత్తిరీత్యా ఆయన తెలుగు ఉపాధ్యాయుడు. ఆయనలో రెండు "వ్యక్తిత్వాలు" సహజీవనం చేసేవి. సంఘ సంస్కరణతో ఎటువంటి సంబంధమూలేని సాహిత్యాన్ని సృష్టించిన వీరేశలింగంగారు వేరు.

అదేసమయంలో వడ్డాది సుబ్బారాయుడుగారు "వేణీసంహారం" నాటకం వ్రాశారు : ఎందుకు?— నాటకాలాడే సమాజాలకోసం : "భక్త చింతామణి" పద్యాలు వ్రాశారు. దేనికి? ఆయన దైవచింతనాపరుడు గనుక, భక్తుడిగా, తన ఆత్మసంతృప్తికోసం వ్రాశారు.

గురజాడ అప్పారావుగారు "కన్యాశుల్కం" వ్రాశారు : విజయనగరం మహారాజుగారు రాయమంటే రాశారు : సంఘ సంస్కరణకు ఉద్దేశించిన నాటకం కన్యాశుల్కం : అందరూ చదివి సంతోషించారు. నాటకాన్ని రంగస్థలంమీద ప్రదర్శిస్తే ఆనందించారు : నేటివరకూ కన్యాశుల్కం చదువరులనూ, ప్రేక్షకులనూ

ఆకర్షిస్తున్నది. ఇవాళ "కన్యాశుల్క" సమస్య లేనేలేదు: ఐనా, నాటకం రక్తికడుతున్నది. కన్యాశుల్క దురాచారాన్ని గురజాడ వారి నాటకం అలనాడు కొంతవరకైనా మాన్పించిందని ఆయన "పరమభక్తులు"కూడా అనలేరు: యంత్రయుగ నాగరికత వచ్చింది: సాంఘికవ్యవస్థ మారింది.

తిరుపతి వేంకటకవుల పాండవోద్యోగవిజయాల నాటకద్వయం నాటక సమాజాలకు నేటికీ పెన్నిధివలె ఉపయోగిస్తున్నాయి: ఆనాడు సాంఘికజీవనంలో వచ్చిన కొత్త పరిణామాలకూ, "ఉద్యోగ విజయాల"కూ సంబంధం లవలేశమైనా ఉన్నదా?- తిరుపతి వేంకటకవులు వ్యవధిలేని అవధానాలు చేశారు: కవి పండితులనూ, రసజ్ఞులనూ మెప్పించారు: సాధారణజనం అవధాన ప్రక్రియ తమాషా చూసి ఆనందించారు. "సాంఘిక విలువల" గొడవ ఎక్కడుంది? రచయిత బాధ్యత ప్రసక్తికి ఆస్కారమే లేదుగదా?

క్రమంగా "భావకవిత్వ" ఉద్యమం వచ్చింది. అదేసమయంలో గాంధీజీ నాయకత్వాన, రాజకీయ రంగంలో బ్రహ్మాండమైన ఉద్యమం నడిచింది: దేని దారి దానిది: కవులు రమ్యమైన కవిత సృష్టించారు: ఆంధ్ర సాహిత్యంలో నవ శకానికి వైతాళికులైనారు. కలకాలం నిలిచే సాహిత్యసంపదను తెలుగుజాతికి అందించారు; విశ్వనాథ, కృష్ణశాస్త్రి, శివశంకరశాస్త్రి, రాయప్రోలు, నాయని, నండూరి, అబ్బూరి, కాటూరి మొదలైన మహాకవులకు తెలుగుజాతి ఎంతో రుణపడి ఉంది.

అదేసమయంలో వేంకట పార్వతీశ్వరకవులు ఆంధ్రసాహిత్యరామాన్ని సుసంపన్నం చేశారు. "పార్వతీశుల జంట తెలుగుపంట" అన్నారు జాషువా కవి: పద్యచరణంలోని ప్రతి అక్షరమూ నిజం: ఐతే, సాంఘిక జీవన విధానాన్ని ఆయా రచయితలు ప్రభావితంచేసి మార్చగలిగారా? లేక, నవసమాజాన్నిచూసి, కవులూ, రచయితలే కొత్తప్రక్రియలను చేబట్టారా?

రాయప్రోలు, గురజాడ, విశ్వనాథ, దేశభక్తిగీతాలు వ్రాశారు. నిజమే: కాని, నిష్పాక్షిక మేధావులకు చిన్న మనవి: వారు దేశభక్తిగేయాలూ, పాటలూ వ్రాయకపోతే ఏం జరిగేది? స్వాతంత్ర్యోద్యమం తపీమని చతికిలపడేదా? ఉద్యమాన్ని గాంధీజీ నడిపించారు:

లక్షలాది జనం కారాగారాలకు వెళ్ళారు: పోలీసుల లాఠీప్రహారణా లను వేలాదిజనం సంతోషంగా, ధైర్యంగా భరించారు: కాళ్ళూ, కీళ్ళూ, ఎముకలూ విరిగినా ముందుకు సాగారు: పోలీసులు ఎన్ని బందూకులు కాల్చినా, ప్రాణాలర్పించారు:అంతటి త్యాగాన్ని చేయించి నది గాంధీజీవాణి: అంతేగాని, లయతాళబద్ధమైన దేశభక్తి గేయాలు ఎంతమాత్రమూ కావు: లక్షలాది జనావళికీ, స్వాతంత్ర్య సమరవీరు లకు అలాంటిగీతాలను ఎవరో వ్రాశారని కూడా తెలియదు: కార్చిచ్చు వంటి ఉద్యమం అవతల చెలరేగుతున్నది గనుక, కవులు తమ గీతాలు వ్రాశారు.

సాంఘిక, రాజకీయ పరిణామాలు ఉప్పెనవలె విజృంభించి, రచయితలను మార్చాయా? లేక రచయితలే సాంఘిక చైతన్యాన్ని జాగరితం చేశారా? అటునుండి ఇటు తిప్పడం చరిత్రకు అపచారం చేసినట్లవుతుంది.

కొడాలి ఆంజనేయులూ, శివశంకరశాస్త్రి, బహుశా మరి కొందరూ స్వాతంత్ర్యోద్యమంలో జైలుకు వెళ్ళారంచే, కవులు కాబట్టి, కవులుగా తమ బాధ్యతను నిర్వహించాలి గనుక వెళ్ళలేదు. దేశభక్తులుగా మాత్రమే వెళ్ళారని గమనించాలి.

కావ్యరంగం (అనగా సాహితీరంగం), కార్యరంగం - ఒకదాని కొకటి చుక్కెదురు కావుగాని, కొన్ని అసాధారణ సమయాలలో ఒకరంగంలో కృషిచేసేవ్యక్తిని రెండవరంగం ప్రభావితంచేస్తుందిగాని-

అది పూర్తిగా వైయక్తికం: అనగా ఒకవ్యక్తికి ఉత్తేజం కలుగుతుంది: **సమాజానికి** కాదు: గాంధీజీ జీవితాన్ని తీసుకుందాము: అమెరికా రచయిత థోరో రాసిన "**వాల్డెన్**" అనే గ్రంథం, రష్యా రచయిత కౌంట్‌లియో టాల్‌స్టాయ్ రచనలూ, గాంధీజీని ఆకర్షిం చాయి. ఆయన భావనాసరళి క్రమంగా పరివర్తన చెందింది: కార్య క్షేత్రంలో కొత్త సంవిధానాలను చేబట్టి నవసమాజాన్ని నిర్మించ డానికి ఆయన ప్రయత్నించారు.

భవదీయుడి వాదాన్ని పూర్వపక్షం చేయడానికి పై దృష్టాంతం చాలదా అని "మేధావులు" ధాష్టీకాన్ని ప్రశ్నిస్తారు. సహజమే: కాని, సత్యశోధనకు కుతర్కం, "వాలఖిల్య" భంగిమ వంటి వాదన

వినియోగించడం ఎంతవరకు సమంజసం? "థోరో" మహాశయుని జీవన విధానం, అతని సిద్ధాంతాలు, అమెరికాలో ఎలాంటి ఉద్యమాన్నీ తీసుకు రాలేదు: కారణం? నిఖిల ప్రపంచమూ నిన్నా, ఇవాళా, రేపూ, నివాళులర్పించే మహారచయిత టాల్‌స్టాయ్. మానవ నాగరికత ఊపిరి పీల్చినంతవరకూ, ప్రపంచసాహిత్యంలో ధృవతారవలె టాల్‌స్టాయ్ నిలుస్తాడు.

కాని, టాల్‌స్టాయ్ ఆశయాలూ, ఆదర్శాలూ, స్వప్నాలూ, అన్నింటినీ భగ్నంచేసిన కమ్యూనిస్టు ప్రభుత్వం రష్యాలో ఏర్పడింది: పరిపూర్ణ మానవత్వాన్ని, కారుణికదృష్టిని, టాల్‌స్టాయ్ ప్రబోధించాడు: "సమానత్వం, సోషలిజమ్" మొదలైన "కుహనా విలువల" పేరిట, వ్యక్తి స్వతస్సిద్ధ స్వాతంత్ర్యాలన్నిటిని తుడిచివేసిన నియంతృత్వం రష్యాలో ఏర్పడింది: నియంతృత్వాన్ని పాదుకొల్పిన మహానాయకుడు లెనిన్. పటిష్టంచేసి, ప్రజలను కేవలం "ముడి పదార్థం"వలె వాడుకొని ఈ రష్యన్ జాతికి బేడీలు వేసిన చండ శాసనుడుస్టాలిన్. బకూనిన్, బుఖారిన్, చెకోవ్, గోగోల్, రష్యన్ మహా రచయితల శ్రమఫలితం ఏమైంది?

పైన వివరించిన అంశంలో కూడా కుతర్కానికి ఉపకరించే "కేశలేశం" ఉంది. కారల్ మార్క్స్ రచనలు, ఆయన ("దాస్ క్యాపిటల్") గ్రంథం ప్రపంచ ఆర్థిక, రాజకీయ వ్యవస్థను మార్చి వేశాయని భీకరంగా వాదించవచ్చును: ఐతే, "భేరీ నినాదాలు" నిష్పాక్షిక జిజ్ఞాసకు, సత్యశోధనకు అవరోధాలు. చరిత్రలో చాలా "యాక్సిడెంట్లు" జరుగుతాయి: మొదటి ప్రపంచయుద్ధం ముగిసే సమయంలో జర్మనీనుండి రష్యాకు "అన్ని తలుపులూ" బిగించిన "గూడ్సు" రైలుబండిలో లెనిన్ మహాశయుడిని తీసుకువెళ్ళారు.

అక్కడ రష్యాలో అంతర్యుద్ధం భీషణంగా కొనసాగుతున్నది:

"అంతట లెనిన్ ప్రవేశించును"

మొదట కెరెన్‌స్కీ ప్రభుత్వం ఆపద్ధర్మంగా ఏర్పడింది: కుట్రలూ, కుహనాలతో కెరెన్‌స్కీ ప్రభుత్వాన్ని లెనిన్ కూల దోశాడు.

కెరెన్‌స్కీ పతనం, లెనిన్ విజయం, కేవలం "యాక్సిడెంటు". చిన్నచిన్న పోరపాట్లు జరిగాయి : లెనిన్ పట్టాభిషిక్తుడయాడు.

ఒకవేళ కెరెన్‌స్కీ నెగ్గితే ఏం జరిగేది?- కార్ల్ మార్క్స్ గ్రంథం లైబ్రరీలో నిదురించేది : రాజకీయ, ఆర్థిక శాస్త్రాలను బోధించే యూనివర్సిటీ ఉపాధ్యాయులు, అనేక సిద్ధాంతాలతోపాటు మార్క్స్ సిద్ధాంతాన్నికూడా కొంచెం వివరించి, విద్యార్థులకు పాఠాలు చెప్పేవారు.

లెనిన్ లేనిదే మార్క్స్‌లేడు; ఇంతకూ లెనిన్ అనుసరించినది మార్క్సిజం కాదు : కార్యరంగంలో ఒక పంథా అనుసరించి, దానికి మార్కు్స సిద్ధాంతాలను నేర్పుగా అతికించాడు.

దేశ, కాల, పరిస్థితులు మారినా పై అంశాన్ని ప్రస్ఫుటం చేయడానికి చిన్న ఉదాహరణ :- గాంధీజీకి భగవద్గీత స్ఫూర్తినిచ్చింది. ధర్మసంస్థాపనకు దారిచూపే దీపకళికగా గీతాబోధన ఆయనకు తోడ్పడింది : 1948 జనవరి నెల 30 వ తేదీ సాయంత్రం గాంధీజీని హత్యచేసిన రాక్షస ప్రవృత్తి ఉన్మాది నాథూరామ్ గాడ్సేకూడా భగవద్గీతను "దారిచూపే దీపకళిక"గా భావించాడు. గీతోపదేశం ప్రకారం గాంధీజీని హత్యచేయడమే "ధర్మ సంస్థాపన" అనుకున్నాడు. ఒకే గ్రంథం ఆరాధకుల ప్రవృత్తులు ఉత్తర, దక్షిణ, ధ్రువాలవంటివి.

దారుణ సంఘటనకూ, భగవద్గీతకూ, ఎటువంటి సంబంధమూ లేదు : మానవోత్తముడిని దానవాధముడు వధించాడు, గీతాప్రసక్తి అనవసరం.

కార్ల్ మార్క్స్, లెనిన్, వ్యవహారంకూడా అంతే; భాష్యకారులు ఎన్ని విచిత్ర వ్యాఖ్యాన గ్రంథాలు వ్రాసినా, అవన్నీ వారి స్వంత అభిప్రాయాలు.

మానవ సమాజం నిత్యపల్లవశీలమైనది; జీవన విధానం మారుతూంటుంది : మార్పు తెచ్చిన ఘనుడు రచయిత మాత్రం కాడు : వెయ్యి సంవత్సరాల క్రితం, రాజరాజ నరేంద్రుడు

ఆజ్ఞాపిస్తే, నన్నయ్యగారు మహాభారతాన్ని ఆంధ్రీకరించారు : రెండున్నర పర్వాలను రచించిన తరువాత, నన్నయ్యగారి రచనా వ్యాసంగం ఆగిపోవడం విషయాంతరం : కాని, రాజరాజ నరేంద్రుని ఆశయం వైదిక మత పునరుద్ధరణ. అది నెరవేరలేదు, ఇస్లామ్ వచ్చింది; సుమారు 600 సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా భారతదేశాన్ని (అధిక ప్రాంతం) పరిపాలించింది; జాతీయ జీవన విధానాన్నీ, సంస్కృతినీ, బలవంతంగా మార్చివేసింది : ఆ తరువాత బుడతకీచులు, ప్రెంచివారు, బ్రిటీష్‌వారు, ప్రవేశించారు : పాశ్చాత్య సంస్కృతిని అంటగట్టారు. భారతీయులు అన్నింటికీ తలవంచారు.

నేటి సాంకేతిక, వైజ్ఞానిక, ప్రగతి దౌడుతీస్తున్నది. కవులూ, రచయితలూ, తుణతుణం మారుతున్న సమాజాన్ని చూస్తున్నారు: కొందరు ఆక్రోశిస్తున్నారు, కొందరు సంతోషిస్తున్నారు. సాహిత్య రంగంలోని భేద, మోదాలతో సంబంధం లేకుండా జాతీయ జీవనం మార్పుచెందుతున్నది.

విశ్వనాధ సత్యనారాయణగారు కవిసమ్రాట్టు : ఆయన రచనలు చదివి ఆనందిస్తున్నాము : శ్రీశ్రీ మహాకవి : విప్లవ కవి; అతడినీ ఆరాధిస్తున్నాము : విశ్వనాధవారు సనాతన ధర్మాన్ని ప్రభోధిస్తున్నారు : శ్రీశ్రీ మహాకవి కమ్యూనిస్టు విప్లవం రావాలంటున్నాడు. కృష్ణశాస్త్రిగారు కవితా శిల్పంలో అద్వితీయులు : అందరి రచనలనూ చదివి ఆనందిస్తున్నాము.

మారుతున్న సమాజాన్నిచూసి, రచయితలు వైయక్తికముగా తమతమ బాధ్యతలను నిర్ణయించుకుంటున్నారు. మంత్రులమీద పంచరత్నాలు రాసేవాళ్ళున్నారు. అగ్నివర్షం కురిపించే కవులూ, రచయితలూ ఉన్నారు. శరపరంపరగా "కాలక్షేపం బటాణీల" వంటి నవలల్ని వ్రాసి ప్రచురిస్తున్న నవలామణులున్నారు.

అందరూ సమకాలికులు : వారి అభిరుచులూ, స్పందనలూ, ఇంత గందరగోళంగా ఎందుకున్నాయి? సమాజాన్నీ, జీవన విధానాన్నీ మార్చుతున్న "పాపాన్ని" వారికి అంటకట్టడం పరమ అన్యాయం : సహగమనాన్ని సమర్థించే వారినుండి, నక్సలైటులను ప్రశంసిస్తూ "కృతులు" వ్రాసే రచయితల వరకూ అందరూ ఉన్నారు:

హిప్పీలనూ, గొట్టం పంట్లాలనూ, "దేవతా వస్త్రాలను" ధరించి తమ "సెక్సు" రేడియేషను కిరణాలను ప్రసరింపచేయాలనే యువతీమణుల ఉత్కంఠనూ, నీతిబాహ్య రాజకీయాలనూ, ఇంకా వగైరా వగైరా లనూ, సృష్టిస్తున్నది కవులూ, రచయితలూ ఎంతమాత్రంకాదు.

తనకు తోచినది, ఆత్మసంతృప్తి కలిగేది రాయడం రచయిత బాధ్యత, తన రచనద్వారా భూమి కంపించిపోయిందని రచయిత ఆనందిస్తే, అతడి ఆనందాన్ని విమర్శించి, "సామాజిక బాధ్యతను విస్మరిస్తున్నావు." అంటూ హెచ్చరించడం దేనికి? వాటిని చదివే పాఠకమహాశయుడు సమాజంపట్ల తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తున్నాడా? పాఠకుల అభిరుచులు అనంతంగా ఉన్నాయిగదా!

రచయిత తయారుచేసిన "దినుసు" బాగుందని తీసుకున్న పబ్లిషరు, రచయిత శ్రమకు తగిన ధర చెల్లించాలి: అది పబ్లిషరు బాధ్యత. తన అభిరుచికి అనుగుణంగా ఉన్న రచనలను పాఠకుడు చదివి ఆనందిస్తాడు: అదొక బాధ్యత అని ప్రత్యేకంగా పేరొక్కనటం అసందర్భం: అది బాధ్యత కానేకాదు: తనకు రుచించని రచనలను పాఠకులెవరూ లంచమిచ్చినా సరే. చదవరు: పాఠకునికి వినోదం, ఉల్లాసం, తన విజ్ఞానం పెరిగిందనే సంతృప్తి - కావాలి. సాహిత్య ప్రయోజనం అంతవరకే. "మారుతున్న విలువల"పట్ల రచయిత తన బాధ్యతను తనకు తోచిన విధంగా నిర్వహిస్తున్నాడు. ఒకరు రామాయణాన్ని ఇంకొకసారి రాస్తే, మరొకరు సామ్రాజ్యవాదాన్నీ "దోపిడీదారు"లనూ తిడుతూ సాహిత్యాన్ని వండుతున్నారు. తమకు పురుషులతో సమానంగా స్వేచ్ఛ కావాలని మహిళలు రాస్తున్నారు. నవనాగరికతా వ్యామోహంలోపడి, వింతపోకడలు పోయే మహిళలగురించి "పురుషరచయితలు" వాపోతున్నారు. పాఠకులకు హాయిగా ఉంది: బోలెడంత వైవిధ్యం. సమకాలీన జీవన విధానానికి యీ రభసతో ప్రమేయం లేదు: అవసరాలననుసరించి మారిపోతున్నది.

శుభాకాంక్షలతో

శ్రీరామా బుక్ డిపో

H. O. మార్కెట్‌స్ట్రీట్
సికింద్రాబాదు

B. O. గన్‌ఫౌండ్రి
హైద్రాబాదు

శ్రీరామా పవర్ ప్రెస్

సుభాష్‌రోడ్డు
సికింద్రాబాదు

137

చదవండి !



సంపాదకులు :

ఎన్. ఇన్నయ్య పి. సత్యనారాయణ

12 మంది మేధావుల సలహా సంపాదకత్వంలో తొలి సంచిక జులై - సెప్టెంబరు **1970** వెలువడింది. తెలుగులో తొలిసారిగా సమాజ విజ్ఞాన రచనలు అందిస్తున్న పత్రిక

"ప్రసారిత"

సంవత్సర చందా రు. **10**/- విద్యార్థులకు రు. **8**/-

కార్యాలయం :

3 RT-189, విజయనగర్ కాలనీ,

హైదరాబాద్ -**28**.

మారుతున్న విలువలు - భాషా సమస్య

శ్రీ చేకూరి రామారావు.

సమాజాభివృద్ధి పద్ధతిని పరిశీలించి మోర్గన్‌వంటి సాంఘిక శాస్త్రజ్ఞులు కొన్ని స్థితులు (stages) గా విభజించారు. తరువాతవచ్చిన మార్క్స్, ఎంగెల్స్‌వంటి మేధావులు ఈ సమాజస్థితుల్ని (stages) గతుల్ని (processes of change) పరిశీలించి వీటి మూల తత్వాన్ని కనుక్కున్నారు. ప్రతి సమాజ స్థితికి ఒక మూలతత్వం ఉంటుందనీ, అది ఆర్థిక సంబంధమైనదని, దాన్ని ఆధారంచేసుకొని అప్పటి రాజకీయాలు, మతాలు, చట్టాలు కళలు, సాహిత్యం వృద్ధి పొందుతయ్యని వారు ప్రతిపాదించారు. అంతేకాక అప్పటి రాజకీయాలు, చట్టాలు, కళలు మొదలైనవి ఆ స్థితిని కాపాడటానికి ప్రయత్నిస్తై. ఆ సమాజస్థితికి మూల కందాన్ని (Base) తొలగిస్తే, దాని మీద ఆధారపడ్డ ఉపరితల నిర్మాణానికి (super structure) సంబంధించిన వన్నీ కూలిపోతై. కొత్త base ఏర్పడినప్పుడు కొత్తకళలూ, రాజకీయాలు వంటివి మళ్లీ ఏర్పడతై. సమాజం వర్గమూలమైనప్పుడు. వాటి రాజకీయాది కాలు తద్భిన్నంకావు. ఈ Base ఎట్లా మారుతుందనేది ప్రస్తుతం మనకనవసరం. చరిత్రతో వచ్చిన విప్లవాలు చాలా అందుకే వచ్చినయ్యని సాక్ష్యం ఉన్నది.

ఇట్లా సమాజస్థితి మారుతుందని, దాన్ని అనుసరించి సాంఘికమైన విలువలు మారుతయ్యని ప్రత్యేకంగా ఎవరికీచెప్పనక్కర్లేదు. ఈ మారుతున్న విలువల్లో భాష పాత్ర ఏమిటి? పైన పేర్కొన్న విలువలు ఆర్థికసంబంధాల్ని బట్టి ఏర్పడ్డవి. ఇంకోరకంగా చెప్తే ఆర్థికసంబంధాలే ఆ విలువల్ని సృష్టించినై. కాని భాషను ఆర్థికసంబధాలు సృష్టించినట్టు మనకాధారాలు

లేవు. భాష పుట్టుకను గురించి ఎన్నో సిద్ధాంతాలున్నప్పటికీ ఇప్పుడు ప్రధానంగా నిలబడ్డవి రెండేరెండు. భాష జంతుకోటిలో ఉన్న అభిప్రాయ ప్రకటన విధానాలనుంచి పరిణామం చెందిందా? లేక మానవ పరిణామంలో హఠాత్తుగా ఒక దశలో భాష ఏర్పడిందా? అన్నవే ఆ రెండు వాదాలు. ఆ రెండు వాదాలకి ఉపపత్తులున్నై. (ఆ వాదాల్ని గురించి విపులంగా చర్చించటానికిది అదునుకాదు). భాషలేకుండా మానవ సమాజమెప్పుడూ ఉండిఉండలేదని ఈ రెండు వాదాల వాళ్లూ అంగీకరిస్తారు.

మానవ సమాజంలో వర్గాలు ఏర్పడకముందునుంచీ భాష ఉందనేది అందరూ ఒప్పుకుంటారు. భాష వర్గ సంబంధాల (వైరుధ్యాల) వల్లకాని, ఆర్థిక సంబంధాలవల్లకానీ ఏర్పడలేదు. అంచే భాషకు ఉత్పత్తిశక్తులు, ఆర్థిక శక్తులు మూలంకావన్నమాట. ఆర్థిక శక్తులు (Base) మారినప్పుడు దానిమీద నిర్మించబడ్డ (Superstructure) రాజకీయాదులు మారతయ్యని పైన సూచించాం. అయినప్పుడు భాషకూడా Base మారినప్పుడల్లా మారుతుందా? భాష మారుతుందని మనకు తెలుసు, కాని ఈ మార్పుకు ఆర్థిక సంబంధాల ప్రమేయం ఎంతవరకు?

ఈ సందర్భంలో భాష మారటమంచే ఏమిటో మనం స్థూలంగానైనా తెలుసుకోవాలి. భాషకు వ్యాకరణం ఉంటుంది. వ్యాకరణం అంచే ఒకరో ఇద్దరో పండితులు శాసిస్తూ రాసిన సూత్రాల పుస్తకంఅనే అర్థంలో ఇక్కడ వాడటం లేదు. వ్యవహర్తలు భాషావ్యవహారంలో పాటించే నియమావళి అనే అర్థంలోనే నేను వ్యవహరిస్తున్నాను. ఈ వ్యాకరణంలో మార్పులువస్తే, ఈ మార్పులకి ఆర్థికసంబంధాలను కారణాలుగా చూపించగలిగితే అపుడు మనం ఆర్థికమైన మార్పులకీ, భాషలోవచ్చే మార్పులకీ ముడిపెట్టవచ్చు. వ్యాకరణాన్ని కూడా ప్రధానంగా మూడు భాగాలుగా విభజింపవచ్చు. వాక్య నిర్మాణం (Syntax), పద నిర్మాణం (Morphology), ధ్వని నిర్మాణం (Phonology). నన్నయ్య కాలంనుంచి వస్తున్న భాషను పరిశీలిస్తే పదనిర్మాణంలోనూ అంతకన్న ఎక్కువగా ధ్వని నిర్మాణంలో మార్పులు వచ్చినట్లుగా మనం గమనించవచ్చు. వాక్యనిర్మాణంలో చెప్పుకోదగిన మార్పులు లేవు. ఉదాహరణ, క్త్వార్థిక క్రియా ప్రయోగంలో కాని, నామక్రియా సంబంధాలను తెలియపరచే విభక్తి ప్రత్యయాల స్థానంలోకాని, ఉపవాక్యాల(Clause structure)నిర్మాణంలో

కాని, క్రియాజన్య విశేషణాలద్వారా (Relative Clause) నిర్మించుకోవటంలో గాని, నామ్నికరణవిధానంలోకాని ఎక్కడా మారినట్లు కనిపించదు. అంతేకాదు, ఈ పద్ధతులు సజాతీయమైన ఇతరభాషల్లో కూడా అట్లానే ఉన్నై. వీటిల్లో కొన్ని టర్కిష్, జాపనీస్ వంటి విజాతీయ భాషల్లోనూ ఉన్నై. అంటే భాషకు అతిముఖ్యమైన వాక్యనిర్మాణంలో చెప్పుకోదగిన మార్పులు రాలేదనేది సుస్థాపితమైన విషయమన్నమాట.

ఇక శబ్దరూపాల్లోనూ ధ్వనుల్లోనూవచ్చే మార్పులు గురించి: నన్నయ కాలంనుంచి 19వ శతాబ్దం వరకు ఉన్నది భూస్వామ్య వ్యవస్థ అనుకుంటే ఆ కాలంలో తెలుగుభాషా ధ్వని నిర్మాణంలోనూ, శబ్దనిర్మాణంలోనూ కొన్నిమార్పులు వచ్చినై. కొన్ని విభక్తి ప్రత్యయాలు మారినై. 'నుండి' బదులు నుంచి వచ్చింది. 'వలెను' అనే శబ్దరూపం 'ఆలి' అనే ప్రత్యయంగామారింది. అన్నంత క్రియలమీదవచ్చే క్రియలు Fix అయిపోయినై. కాని ఈ మార్పులు ఏ సమాజవ్యవస్థను పరిరక్షించటానికి ఏర్పడ్డవికావు. పైగా ఒకే ఆర్థికమైన పునాదిమీద ఏర్పడ్డ సమాజంలోనే వచ్చినమార్పులు.

భాషలో వచ్చే మార్పులకూ, ఆర్థికశక్తులవల్లవచ్చే మార్పులకూ సంబంధంలేదు. సమాజంలోవచ్చే మార్పులకు విలువలుఉంటై. ఒక రాజ్యాంగ వ్యవస్థలో మార్పులు వచ్చినయ్యంటే, అవి కొత్త సమాజ వ్యవస్థకు అనుగుణంగా రావటమేకాక, దాన్ని రక్షించటానికికూడా పూనుకుంటై. భాషలో వచ్చేమార్పులకు "విలువలు" ఉండవు. అంటే వ్యాకరణ నిర్మాణంలోవచ్చిన మార్పులు పూర్వం ఉన్నవాటికన్నా ఉన్నతమైనవనీ, ఉత్తమమైనవనీ చెప్పటానికి ప్రస్తుతం ఎటువంటి ఆధారాలులేవు. భాషలో వచ్చే మార్పులకు సాంఘికప్రయోజనందృష్ట్యా ఎటువంటి విలువా లేదు.

భాష ఏ సమాజవ్యవస్థలోనైనా అభిప్రాయ ప్రకటనకుపయోగపడుతుంది. మారుతున్న సమాజంలో అభిప్రాయాలు (images, concepts, Values, etc) కూడా మారుతై కాబట్టి అందుకనుగుణంగా భాష మారదా? మారాల్సిన అవసరంలేదా? అనేప్రశ్న సహజంగావస్తుంది. మారుతున్న విలువల కనుగుణంగా భాష మారాలనేవాళ్లు మారుతున్న అభిప్రాయాలను వ్యక్తం చేయటానికి భాష సమర్థంగా ఉండక్కర్లేదా అని అడుగుతున్నారు. భాషలో మార్పంటే మనకవసరమైనవిధంగా భాష వ్యక్తికరణ సాధనంగా ఉపయోగపడటం. భిన్నవిషయాలను, సరికొత్త విషయాలను

వ్యక్తీకరించటానికి తగిన పదజాలాన్ని భాష సమకూర్చుకోవాలి. ఈ పనిని భాష ఎప్పుడూ చేస్తూనే వుంటుంది.

బూర్జువా సమాజంలో జరిగిన సాంకేతికాభివృద్ధి చరిత్రలో ఇంతకు ముందుజరిగిన అభివృద్ధికన్న మిన్నఅయింది. ఈ సాంకేతికాభివృద్ధి మానవ జీవితంలో విప్లవాత్మకమైన మార్పుల్ని తెచ్చింది. ఈ సాంకేతికాభివృద్ధి ఫలితాలు ఒక దేశానికి పరిమితమై ఉండలేవు. ఉత్పత్తి పెరిగినప్పుడు దానికి మార్కెటు కావాలి. వేగవంతమైన ప్రయాణ సాధనాలువచ్చినై. దేశాలమధ్య సరిహద్దులు చెరిగిపోతై. ఒక ప్రాంతపు వస్తువులు (meterial & culture) భావాలు (abstract culture) ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తై. ఇది బూర్జువా సమాజ స్వభావంలోనే ఉంది. ప్రపంచంలో అన్ని ప్రాంతాల మధ్య సాంస్కృతికమైన ఆదాన ప్రదానాలు స్వేచ్ఛగా జరుగుతై. భిన్న దేశాలమధ్య సంబంధాలు పెరిగినప్పుడు ఈ సాంకేతికాభివృద్ధి దాని మూలంగాజరిగిన ఆదాన ప్రదానాలు భాషలో ప్రతిఫలించక తప్పదు. అంతేకాక ఈ సాంకేతికాభివృద్ధిని ఇముడ్చుకోదలచిన ఏభాషా "స్వచ్ఛం"గా ఉండటం సాధ్యంకాదు. పూర్వసమాజాల్లోవచ్చిన మార్పుల్ని ఇముడ్చుకోటానికి భాషకు చాలినంత వ్యవధిఉండేది. బూర్జువా సమాజంలోవచ్చిన విప్లవాత్మకమైన మార్పుల్ని ఇముడ్చుకోటానికి భాషలకు తగినంత వ్యవధి లేదు. అందువల్ల భాషలు అందుకవలంబించే పద్ధతి ఆ వస్తువులు, భావాలు ఏభాష మూలంగా మన సంఘంలోకి ప్రవేశించాయో ఆ భాషాపదాలనే గ్రహించటం. దీనివల్ల భాషకు జరిగే హానిలేదు. భాషా నిర్మాణంలో సమూలమైన మార్పులు ఇందువల్ల కలగవు. పారిశ్రామిక విప్లవం, అమెరికాలో, ఆస్ట్రేలియాల వలస, ఆంగ్ల సామ్రాజ్యం— వీటివల్ల ప్రపంచంలో చాలాదేశాలకు బూర్జువా నాగరికత, ఇంగ్లీషు భాషద్వారా వ్యాపించి ఇంగ్లీషు అంతర్జాతీయ భాష కాగలిగింది.

ఈ పూర్వరంగంనుంచి చూస్తే తెలుగుభాష ఆధునిక వ్యవహారానికి (రచనకుకూడా) సమర్థమైన వాహకంగా ఉండాలంటే కొత్త శబ్దజాలం భాషలో ఏర్పడాలి. సాంకేతిక పదాలు ఏర్పడాలి. కొత్తపదాలు భాషలో కొన్ని పరిమితమైన పద్ధతుల్లోనే ఏర్పడతై.

1. అన్నిటికన్న సులభమైన పద్ధతి ఇతర భాషాపదాల్ని యథాతథంగా వాడుకోటం. ఇది యదేచ్ఛగా జరుగుతూనేఉంది. ముఖ్యంగా

ఉన్నత విద్యావంతుల భాషలో (వ్యవహారంలోనూ, రచనలోనూ,) ఇది ఎక్కువ. సైన్సులోనూ, రాజకీయ రంగంలోనూ ఇది జరుగుతూనేఉంది.

2. రెండో పద్ధతి ఇతర భాషల్లోని పదాల్ని గ్రహించకుండా ఆ భావాల్ని మాత్రమే గ్రహించి మనభాషలో ఉన్న పదజాలంతోనే, కొత్త పదబంధాల్ని సృష్టించటం, ఇది గ్రామీణులు అతి సహజమైన పద్ధతుల్లో చేస్తారు. మరమేకు, మరనాగలివంటి పదాలు ఇట్లా సృష్టించబడినవే. ఇవి భాషలో త్వరగా స్థిరపడిపోతై. (సాహిత్య ఎకాడమీవాళ్లు ప్రచురించిన వృత్తి పదకోశాల్లో వీటికి చాలా ఉదాహరణాలు దొరుకుతై.) విద్యాధికులైనవాళ్లు సృజించే పదబంధాలు స్థిరపడటానికి ఎక్కువకాలం పడుతుంది. అయినా ఈ పద్ధతికూడా అనుసరించదగిందే. కాని ఇట్లాంటి పదాలు అది దీర్ఘమైతే కృతకంగాఉండి భాషలో నిలవక ఇతర భాషా పదాలే ఆ స్థానాన్ని ఆక్రమిస్తే సాధారణంగా ఇవి (Blending, Compounding, derivation) ద్వారా జరుగుతుంది.

3. ఇక మూడో పద్ధతి భాషలో యింతకుముందే స్థిరపడిన పదాలని కొత్త అర్థాలో వాడుకోటం. అర్థసంకోచ వ్యాకోచాదికాలవల్ల అర్థాన్ని మార్చుకొని నేటికాలానికి అనుగుణంగా వాడుకోటం. ఇది కూడా సామాన్య ప్రజలుచేస్తే భాషలో త్వరగా స్థిరపడిపోతై. ఉదాహరణకు బండి అనే పదాన్ని ఇప్పుడు రైలుకు, సైకిలుకు, బస్సుకు కూడా వాడుతున్నారు. కరపత్రం, కార్యకర్త, అనేమాటలకు ఇప్పుడున్న అర్థాలు ఈనాటివాళ్ళు కల్పించుకున్నవే.

ఈ మూడు పద్ధతులూ ఈనాడు వాడుకోకతప్పదు. ఈ సాంకేతికాభివృద్ధి ప్రజలందరికీ అందుబాట్లోకి వచ్చేవరకూ వేచిఉండటం సాధ్యంకాదు కనక పై మూడు పద్ధతుల్లో అవసరాన్నిబట్టి సంక్షిప్తత, అర్థబోధ లక్ష్యాలుగా ఉంచుకొని ఈనాటి తెలుగులో శబ్దజాలాన్ని వృద్ధిపొందించుకోవచ్చు. దానికి భాషాశాస్త్ర పరిచయం ఉన్న సమర్థులైన రచయితలు పూనుకొని రచనా వ్యాసంగాన్ని సాగిస్తే ఈనాటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలకు చేరువగా తీసుకుపోవచ్చు. ఈ విజ్ఞానాన్ని మాతృభాషలోనే అందించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరిఅయిందే. దాని ఆచరణలో జరిగే లోటుపాట్ల విషయం వేరు.

ఈ సందర్భంలోనే గ్రాంథిక, వ్యావహారిక భాషావిభేదాల సంగతి ప్రస్తావించకతప్పదు. ప్రాచీన రచనా భాషని గ్రాంథికమనీ, ఆధునిక రచనా భాషనీ వ్యావహారికమనీ వ్యవహరిస్తున్నాం. గ్రాంథిక భాషావాదులైనా ప్రాచీన రచనా భాషలో మాట్లాడమనరు. రాయాలని మాత్రమే అంటారు. అంచేత ఈ భాషా వివాదం రచనా భాషకు మాత్రమే సంబంధించింది. మనకు సాహిత్యం లభించినంతవరకు ప్రాచీనకాలంలో రచన అప్పటి వాడుక భాషలో జరుగలేదు. (ఇక్కడ రచన అంటే లిఖితమైన గ్రంథ రచన అనే అర్థంలోనే వాడుతున్నాను). అప్పుడు గ్రంథరచన ఎక్కువమంది ప్రజల కోసం జరగలేదు. ఫ్యూడల్ సమాజంలో విద్యా విజ్ఞానాలతో కొద్దిమందికే సంబంధముండేది. ఒకానొక కాలంలో రచనా భాష, వ్యవహారభాష ఒకటే అయిఉండాలి. క్రమంగా ఒక రచనా సంప్రదాయం ఏర్పడింతరవాత కవులు, తమకు సాంప్రదాయకంగా సంక్రమించిన రచనా భాషనే అనుసరించి రచన చేశారు, నన్నయ రచనాపద్ధతి అంతకుముందే ఏర్పడినట్టు మనకు శాసనాలు సాక్ష్యం చెపుతున్నై. ఫ్యూడల్ సమాజంలో సాంప్రదాయికంగా ఏర్పడ్డ గ్రాంథికభాషను మార్చుకోవలసిన అవసరం వాళ్ళకి రాలేదు. ఆ సమాజంలో కవిత్వం, సాహిత్యం అవసరమైంది చాలా కొద్దిమందికే. అలిఖితమైన జానపద సాహిత్యం ఎప్పటికప్పుడు ప్రజల భాషలోనే పుడుతూ వచ్చింది. వాటిని ఏ రామరాజుగారో, ఏ దోణప్పగారో-అట్లాంటివారు మరి కొందరు వచ్చేవరకూ పుస్తకాల్లోకెక్కలేదు. ఫ్యూడల్ సమాజంలో ఉన్నత వర్గాలకు పనికొచ్చే సాహిత్య సృష్టికి, అప్పటి శాస్త్రవిజ్ఞానానికి ఆ భాష సరిపోయింది. ఫ్యూడల్ సమాజంలో సాంకేతికాభివృద్ధి అతిస్వల్పం. అదైనా ఎక్కువమందికి అందాల్సిన అవసరం లేదు. ఆ కొద్ది పాటి శాస్త్రవిజ్ఞానమైనా సంస్కృతభాషలో వచ్చింది. దాన్ని తెలుగులో పెట్టుకునేటప్పుడు సంస్కృత శబ్దజాలాన్నే తెలుగులోకి తెచ్చుకున్నాం. అతి సంకీర్ణమైన ఆధునిక బూర్జువా సమాజపు సాంకేతికాభివృద్ధిని ఇముడ్చుకోవాలంటే ఇప్పుడు తెలుగులో వ్యాప్తిలో ఉన్న సంస్కృత శబ్దజాలమైనా చాలదు. పైగా ఫ్యూడల్ సమాజంలోలాగా కాకుండా ఈ సాంకేతిక పరిజ్ఞానం శాస్త్రపరిజ్ఞానం ఎక్కువ మందికి అందాలంటే, అందులో ఎక్కువ మంది రచన చెయ్యాలంటే ప్రాచీన రచనాభాష చాలదు. ఫ్యూడల్ వ్యవస్థలో భిన్న నాగరికతల సంబంధాలు పరిమితం, బూర్జువా సమాజంలో భిన్న దేశాలు స్వయంసంపూర్ణంగాబతకలేవు.

బూర్జువా నాగరికత ప్రధానంగా వ్యాపారనాగరికత. దీనికి దేశాల మధ్య వ్యాపార సంబంధాలు అనివార్యం. ఇందుమూలంగా సాంకేతికాభివృద్ధి ఎక్కువ మందికి అందాల్సి ఉంటుంది. ఈ అవసరాలకి గ్రాంథిక భాషలో శబ్దజాలం సరిపోదు. ఆ భాషలో రచనకూడా ఎక్కువ మందికి సాధ్యం కాదు.

గ్రాంథికభాష ఒక closed system. వ్యవహారభాష, open system. గ్రాంథికభాష ప్రాచీనభాష కావటంవల్ల దాని వ్యాకరణాన్ని ప్రయత్న పూర్వకంగా నేర్చుకోవాలి. దానికి గ్రంథసహాయం అవసరం. సలక్షణమైన గ్రాంథిక భాషనునేర్పే గ్రంథాలులేవు. ఆధునిక రచనాభాష ఆధునిక వ్యవహార భాషలోనుంచి పర్వడింది గనుక దానిలో రచన చెయ్యటానికి వ్యాకరణం నేర్చుకోనక్కర్లేదు. మాట్లాడటం నేర్చుకున్నప్పుడే వ్యవహర్త అలిఖితమైన వ్యాకరణం నిర్మించుకున్నాడు. గనక ఆధునిక భాషలో రచన సుకరం.

అధునిక సమాజంలో కేవలం టెక్నాలజీయేకాక రాజ్యాంగవ్యవస్థ కూడా అతిసంకీర్ణమైంది. ఈ రాజ్యాంగ వ్యవస్థతోడు నాడు ఎక్కువమందికి ప్రమేయంఉంది. విద్యావంతులు, విద్యాహీనులుకూడా ప్రభుత్వం వ్యవహారాల్లో జోక్యం కలిగించుకొవాల్సిన అవసరంఉంది. యీ రాజ్యాంగ వ్యవస్థలో ఒకసారి అధికారంలోకి వచ్చిన పార్టీ మళ్ళీ అధికారంలోకి రావాలంటే ఎక్కువమంది ప్రజలకు మేలుచేసినా చెయ్యకపోయినా చేసినట్టు చూపించాలి. ప్రచారం చెయ్యాలి. ప్రభుత్వాలు తమ అధీనంలోఉన్న ప్రచారం సాధనాలద్వారా యీ పనినిచేస్తుంటై. యీప్రచారం గ్రాంథిక భాషలోచేస్తే వాళ్ళప్రయోజనం సిద్ధించదు. పరిపాలనా భాషగా వ్యవహార భాషను వాడటం యీ ప్రభుత్వాల మనుగడకే అవసరం. ప్రజల్లో వ్యాప్తి కోసం ప్రయత్నించే ఏ రాజకీయ పక్షమైనా తన సాహిత్యాన్ని ఎక్కువ మందికి తెలిసేభాషలోనే ప్రచురిస్తుంది.

దీన్నిబట్టి నేటి రచనాభాషగా, నేటి వ్యవహారభాషనే ఎన్నుకోవటం యీ వ్యవస్థకే అవసరం. నేటి రచన వ్యవహార భాషలోనే జరగటం బూర్జువాసమాజపు అవసరాలకోసం జరుగుతున్నదే. గిడుగు రామ్మూర్తి, గురజాడ అప్పారావులు యీ బూర్జువాసమాజంలో తప్పనిసరిగా రావలసిన యీ మార్పుని వేగవంతంచేశారు. యీ మార్పు అనివార్యమైంది.

ఈ మార్పుని అంగీకరించని ఫ్యూడల్ సమాజపు ప్రతినిధులు యీ దేశంలో ఇంకావున్నారు. వాళ్ళే ఇంకా గ్రాంథిక భాషను నిలబెట్టాలని ప్రయత్నిస్తున్నారు. వాళ్లుపైకి ఏ కారణాలు చెప్తున్నా వాళ్ళ నిజమైన ఉద్దేశం పండితవర్గంఅనే privileged class ను ఇంకా కొనసాగించటమే. ఫ్యూడల్ వ్యవస్థలోని అన్నిఅవశేషాలతోపాటు ఇదికూడా చరిత్ర పుటల్లోకి వెళ్లిపోక తప్పదు.

卐 卐

నా అక్షరాలు కన్నీటిజడులలో తడిసే దయాపారావతాలు
నా అక్షరాలు ప్రజాశక్తులవహించే విజయ ఐరావతాలు
నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన అడపిల్లలు.

—తిలక్

నిన్నటి మహాకావ్యం పద్దెనిమిది పర్వాలైతే
నేటి మహాకావ్యం పద్దెనిమిది పేజీలే.

—శ్రీశ్రీ

ఆకళ్ళ కళలు ఆకళ్ళ
ఆకళ్ళ కళల ఆకళ్ళ
ఆకళ్ళ కలలు ఆకళ్ళ
కలల ఆకళ్ళ ఆకళ్ళ.

—కాళోజి

WITH THE BEST COMPLIMENTS FROM :

PRINTPACKS

Phone : 7 7 8 5 0

for QUALITY PRINTING

SPECIALISTS IN THE MANUFACTURE

OF COLOUR CARTONS, LABELS &

BROCHURES AND

FINE ART PRINTING

SHETTYS COMPOUNDS,

A–7–12, Mushirabad : Hyderabad–20, A. P.

147

ALWAYS REMEMBER

FOR YOUR FULL SATISFACTION

SONY ELECTRIC DRY CLEANERS

PHONE : 32341

H. O. STATION ROAD, MALAKPET

BRANCH: OPP. COLLECTORATE

FOR SALE, PURCHASE, REPAIR, TRANSFER,
SALE DEPOSIT & EXCHANGE OF GUN, RIFLE,
REVOLVER, PISTOL, AIRGUN

Please Contact :

Moin Arms & Ammunition Factory

24; Mozamjahi Market Building, Hyderabad–1 (A.P)
Phone No. : 53656

Wholesale Dealers In :

CARTRIDGES, GUNPOWDER, LEADSHOTS,
P. CARS SAFETYFUSES, DETONATORS, BLASTING
GELATINE & PELLETS

1487

With Compliments from :

INTEGRATED INVESTMENTS AND CHIT FUNDS (P) LTD.,

★

Registered Office :

39, LAL BAHADUR STADIUM
HYDERABAD

Phone : 35333 Grams : " INVESTMENTS "
& 34322

Branch :

"RAMSHOW" BUILDINGS,
ELURU ROAD, VIJAYAWADA-2

Phone : 7844 Grams : " INVESTMENTS "

(Reliable Chit Funds Promoters)

149

Phone : { Shop : 76358
Res : 52121

DECCAN STEEL INDUSTRIES

2020, Pan Bazar, Secunderabad-3

SHEETS IN ALL VARIETIES, PLATES, FLATS
ANGLES ETC.,

Associated Concerns :

ASSOCIATED STEEL INDUSTRIES

10248, Lohamandi, Motiyakhan, New Delhi

Phone : Office 260434 Res : 584979

R. N. GUPTA & Co.,

37, Baroda Street, Bombay–9

Phone : Office 326777 Res : 475739

Grams : "GUPTABROS

AGARWAL STEEL TRADERS

18, Netaji Subhash Road, Calcutta–2

Phones : Office 220307, Res : 358972

RITA STEEL INDUSTRIES

17, South Hathipala Road, Indore (M. P.)

Phone : Office 32708 Res : 4327

Also Offices at Gauhati, Bhuwneshwar,
Dhanbad and Kanpur

For all your requiremens contact

B. K. AUTO EXCHANGE

32, LAL BAHADUR STADIUM

HYDERABAD

prop : MOHD. BAHADUR KHAN

With best compliments from :

SHANTI LODGE

High Class Vegetarian Boarding,
Lodging & Restaurant

CHADERGHAT : HYDERABAD–24

Lodging Phone : 56101–7 lines

Restaurant Phone : 44821

151



ఈ 'రచన' కు

తమ వ్యాసములను అందించిన రచయితలకూ—

ఈ గోష్ఠి నిర్వహణలో

ఆర్థికంగా తోడ్పడిన

ప్రకటన కర్తలకూ—

కార్యనిర్వహణభారంమోసిన

మిత్రులకూ—

కృతజ్ఞతలు.

వి. విశ్వనాథం

సమావేశకర్త

యువభారతి

నేటిసాహిత్యంలో
ప్రతిబింబిస్తున్న
మారుతున్న విలువలు—

—విమర్శ

—నవల

—కథానిక

—నాటిక

—కవిత

—రేడియో రచన

—సినిమా రచన

—పత్రికా రచన

రెండవ భాగము

మారుతున్న విలువలు

శ్రీ పాములపర్తి సదాశివరావు

మధ్యయుగంలో పురాణాలు, ప్రబంధాలు, శతకాలు, యక్షగానాలు మూసపోత ఫక్కీలో కొనసాగాయి. జాతీయ పునరుజ్జీవనకాలంలో వీటి అనువాదాలతోబాటు భావకవిత, స్టేజి నాటకాలు, నవలలు, కథలు, వ్యాసాలు మున్నగు క్రొత్తరూపాలు వెలువడ్డాయ్. ఇవి ఆంగ్లసాహిత్య ప్రభావానికి లోనై ఉదయించి క్రమంగా జాతీయ స్వభావ స్వరూపాలను సంతరించుకొని ఆకర్షణ గొల్వాయి.

జాతీయ పునరుజ్జీవన కాలపు సాహిత్యంలో మానవతా దృక్పథం, స్వాతంత్ర్య దృక్పథం, అభ్యుదయ దృక్పథం, సమతా దృక్పథం, దేశభక్తి భావన, భవిష్యత్తుపైన ఆశావాదఉద్వేగం, ఆశయాలపై అచంచలవిశ్వాసం, నిష్కపట నిజాయితీపై అభిమానం, సేవాత్యాగభావనలపై గౌరవాదరాలు అపార ప్రేరణ నిచ్చాయి వీరేశలింగం, గురజాడ, పానుగంటి, చిలకమర్తి, ధర్మవరం కృష్ణమాచార్య, కాళ్ళకూరి నారాయణరావు, బలిజేపల్లి లక్ష్మీ కాంతం, కట్టమంచి రామలింగారెడ్డి, దువ్వూరి రామిరెడ్డి, రాయప్రోలు సుబ్బారావు, బసవరాజు అప్పారావు, నండూరి సుబ్బారావు, కృష్ణశాస్త్రి, బాపిరాజు, జాషువా, చలం, ఆదిభట్ల నారాయణదాసు, ద్వారం వెంకట స్వామి నాయుడు, బళ్ళారి రాఘవ, జీ. వీ. సుబ్బారావు, కాసా సుబ్బా రావు మున్నగు అసంఖ్యాక అతిరథ మహారథులు ఆ రోజులలో పలు రంగా లలో ప్రతిభావంతంగా తమ తమ సృజనాత్మకపాత్రలు నిర్వహించి సాంఘికో త్తేజన చేకూర్చారు. పూర్ణవికసిత వ్యక్తిత్వంతో భాసించారు.

వీరి ప్రభావం నేటికీ యువలోకంలో ప్రసరణ జెందుతూనే వుంది. పైన ఉదహరించిన పెద్దల శ్రేణిని పూర్తిగా ఈనాటి అని చెప్పడంకూడా పొసగదని తోస్తుంది. స్వాతంత్ర్యానంతరం, గత యిరవై యేండ్లలో క్రమ

1558

క్రమంగా సాంఘిక పరిస్థితులు, రచయితల మనస్తత్వం రెండూ తీవ్రమైన మార్పుకు గురియయ్యాయి. స్వాతంత్ర్యం రాకముందు జాతీయాభివృద్ధికి చెందే స్వాప్నికభావనలు స్వాతంత్ర్యానంతరం వాస్తవానుభవాల రూపం దాల్చాయి. సాహితీ సాంస్కృతిక రంగాల్లో క్రమక్రమంగా నిరాశా నిస్పృహలు, అవిశ్వాస ఆందోళనలు పైచేయి యౌతున్న దృశ్యం కనబడ్తుంది.

రేడియో, సినిమా, పత్రికారంగం, అకాడమీలు, విశ్వవిద్యాలయాలు, ప్రచురణ సంస్థలు మున్నగు ప్రజావిజ్ఞాన సాధనాల్లో ఎంతో విస్తృతి జరిగినా అవి యువకశక్తుల ఆదర విశ్వాసాలను చూరగొని వారికి క్రియాత్మక ఉత్తేజన నివ్వడంలో విఫలమౌతున్న పరిస్థితులను చూస్తున్నాము. అధికారుల అదుపు మనస్తత్వం, స్వేచ్ఛావ్యాపారుల స్వలాభపరత్వం ఆయా రంగాల్లో బాహాటంగా ప్రభావం వేస్తున్నట్లుగా వేరే చెప్పాల్సిన పనిలేదు. అందువల్ల యువకులలో వాటిపట్ల ఉపేక్షాభావం ప్రబలుతున్న సూచనలున్నాయి. ప్రజాస్వామ్యపరిణామంలో నానా అవకాశవాదులు నిజాయితీపరశక్తులను ప్రక్కకు త్రోసివేసి అధికార స్థానాలను ఆక్రమించడంతో రాజకీయంగా విలువలు దిగజారిపోయి ఆ ప్రభావం సాహితీ సాంస్కృతిక రంగాలకు ప్రసరించిన దృశ్యం కనపడ్తుంది...

* మన నాటకరంగం సరదాగా మాత్రమే మిగిలియుంది. నిర్జీవమైన సినిమా అనుకరణ నాటక కళగా సాగిపోతూవుంది. ఉత్తేజకరమయిన నాటకసంస్థలు. నాటక రచనలు పెద్దగా వెలువడటంలేదు.
* కవిత తీసుకుంటే వచనకవిత. దిగంబరకవిత, విప్లవకవితలాంటి తిరుగుబాటు ధోరణులు పైచేయి యౌతున్నట్లు చూడగలం...
* నవలలు, కథల్లో క్రియాత్మకమైన భావస్ఫూర్తి లోపించి మనుగడ మనస్తత్వం, ఉబుసుపోక ధోరణులు అధికంగా చలామణియౌతున్నాయి. సెక్స్, డిటెక్టివ్ రచనలు వెర్రితలలు వేస్తూ ఉన్నదికూడా చూడగలం. విలువలదృష్ట్యా చూచినప్పుడు వీటిని పెద్దగా శ్లాఘించగల వీలుండదనిపిస్తుంది.

ఇతర సాంస్కృతిక రంగాలుకూడ, చిత్రకళ, భరతనాట్యం, జానపద కళారూపాలు పెద్దగా ప్రజలను ఆకర్షించి ఉత్తేజన గొల్పుతున్న సూచనలులేవు.

నగరాల్లో వుండేవారి అనుభవాలేమోకాని జిల్లాల్లో తాలూకాల్లో నివసించేవారికి, సాహితీ సాంస్కృతిక రంగాలతో గల సాహచర్యాన్ని బట్టిచూస్తే–ఒక రకంగా స్తబ్ధత యేర్పడుతున్నట్లుగా తోస్తుంది. సినిమా రంగంలోను, పత్రికారంగంలోను వ్యాపార దృక్పథం, సెన్సేషనలిజం లాంటి కృతక అభిరుచులు సాగిపోతున్నాయి...

* లలితకళా అకాడమీవారు మోడర్న్ ఆర్ట్‌ను ప్రోత్సహిస్తుండగా, సాహిత్య అకాడమీవారు పాత ప్రబంధాలను పునర్ముద్రిస్తున్నారు. సంగీతనాటక అకాడమీ కార్యక్రమాలు ప్రజలను ఆకర్షిస్తున్న సూచనలు అగుపడుటంలేదు.

ఇదంతా సాహితీ సాంస్కృతిక రంగాల్లో ప్రజా సాహచర్య శీలమైన ఉత్తేజన కొరవడుతూ ఉందని చెప్పటానికే నిదర్శనం. అందువల్ల సృజనాత్మక విలువలు అల్పస్థాయిలో ఉంటున్నట్లు తోస్తుంది.

అధికార వర్గాలలో కార్యవాదశీలత (ప్రాగ్మటిజం), ఉద్యోగివర్గాల్లో మనుగడ శీలత (ఎగ్జిస్టన్షలిజం) స్వలాభపర వ్యాపారవర్గాల్లో యాంత్రికత–లేదా శోషణ పరతలాంటి ధోరణులు సాగిపోతున్నాయి. ఈ మధ్య పాప్ ఆర్ట్ రూపాలు, హిప్పీ, బీట్నిక్, యూహూ తత్త్వాలు, జేమ్స్‌బాండ్ ఫ్యాషన్లు మున్నగు ధోరణులవైపు యువకుల దృష్టిని ప్రసరిస్తున్న దృశ్యాలుకూడా ప్రారంభమయ్యాయి. ఇలాంటి ధోరణులన్నిటినీ ఒక విధంగా ప్రచలిత వ్యవస్థతో అనంగీకార (నాన్ కాన్ఫరమిస్ట్) పోకడలుగా తీసుకోవచ్చునను కుంటాను.

స్వాతంత్ర్యం అనే పదం ఈ నాడు "విశృంఖలతత్వం"గా భావింప బడ్తూ వున్నట్లుగా తోస్తుంది. అదుపు మరియు హేతువాద బద్ధమైన బాధ్యత (రెస్పాన్స్‌బిలిటీ) లను నేటి మేధావి రచయితలు నిరాకరించి – యథేచ్ఛగా తిరుగబడుతున్నారు. ప్రజాస్వామ్యం, సామ్యవాదం లాంటి సాంఘిక తత్వభూమికలను త్రోసిపుచ్చ గోరుతున్నారు. వారు మరీ అంధ ప్రవృత్తుల అదుపులేని రాజ్యం, రక్తమాంస ఆవశ్యకతల నివారణ లక్ష్యం వైపుకు ఆకర్షితులౌతున్నారేమో అనిపిస్తుంది. కనుక నిరాకరణ భావం చలామణి యౌతూ ఉందనిపిస్తుంది.

ఈ స్థితి ఒక్క తెలుగు సాహిత్యం వరకేకాదు. అమెరికా, యూరప్ ఖండాల్లో మరింత ప్రస్ఫుటంగా కనపడ్తుంది. విధి నియమరహితమయిన సెక్సు, క్రైము వ్యామోహం అంతులేని ధనదాహం నేటి పాశ్చాత్య సాహిత్యంలో సర్వోపరిగా చలామణి చేయబడుతున్నాయి. ఆ ప్రభావం తెలుగు సాహిత్యం పైకి ప్రసరించడంలో అబ్బుర మేమీలేదు. ఫ్రాయిడు సూత్రాలు, స్ట్రీమ్ ఆఫ్ కాన్షస్‌నెస్ రచనలు ఇటీవల ప్రచారం పొందుతున్న ఉదాహరణలు చూడగలం.

ఐతే ఈ మార్గం ఎటు? అన్నదే సమస్య. విధ్వంసం లేనిదే నిర్మాణం అన్నది సాధ్యపడదా అని సందేహం వేస్తుంది. నిర్మాణాత్మక విలువలకంటే విధ్వంసనాత్మక "విలువలే" అధిక ప్రచారానికి వస్తున్నట్లు నా మటుకు నాకు తోస్తుంది.

★

"స్వాతంత్ర్యం, సమభావం,
సోదరాత్రం, సాహార్ద్రం,
పునాదులై ఇళ్లలేచి
జనావళికి శుభం పూచి—

శాంతి, శాంతి, కాంతి, శాంతి,
జగమంతా జయిస్తుంది,
ఈ స్వప్నం నిజమవుతుంది."

—శ్రీ శ్రీ.

"దేశాభిమానం నాకు కద్దని
వొట్టి గొప్పలు చెప్పుకోకోయ్
పూనియే దైనాను వొకమేల్
కూర్చి జనులకు చూపవోయ్."

—గురజాడ.

నేటి సాహిత్యంలో ప్రతిబింబించే మారుతున్న విలువలు

శ్రీ పోతుకూచి సాంబశివరావు

నేటి సాహిత్యంలో ప్రతిబింబించే మారుతున్న విలువలు రెండు దృక్పథాలతో మనం పరిశీలించవచ్చు. సాహితీ క్షేత్రంలో ప్రయోగాత్మకంగా రచయితల ద్వారా మారుతున్న విలువలు, సాహితీరంగంలో ప్రతిబింబిస్తున్న సామాజిక జీవితంలోని క్రమక్రమంగా పరిణామం చెందుతున్న విలువలు. ఈ పరిశీలన ద్వారా సాహిత్యం సాంఘిక ప్రయోజనం కోసమే అన్న సిద్ధాంతం మూల స్వరూపాన్ని నిర్దుష్టంగా వ్యాఖ్యానించవచ్చు.

ఆధునిక సాహితీరంగం, వచన యుగ ప్రభావంలోపడి రచనా రీతుల్లో నూత్న ప్రయోగాలు విలసిల్లడానికి దోహదంచేసింది. పద్య కవిత స్థానే వచనకవిత స్థిరనివాసం చేసుకున్నది. శ్రీ శ్రీ అడుగుజాడల్లో వెలువడిన అనేక కవులు వచనకవితా పట్టాభిషేక మహోత్సవాలలో ప్రముఖంగా పాల్గొన్నారు. ప్రాచీన ప్రబంధ రచనా ధోరణిని దాసిగా చేసుకుని శ్రీ శ్రీ తన కవితా నూత్న ప్రయోగాలు అందిస్తే, కాలం మార్చిన నేటి రీతుల్లో పద్య కవితా వాసన ఎరుగని ఉత్సాహవంతులందరూ వచన రచనా కవితా రీతిని ఆరాధిస్తున్నారు. గ్రామ్య భాష. వ్యవహారిక రీతి – నేటి యుగంలో ప్రతీ సాహితీ పిపాస కల్గినవానికి సునాయాస లబ్ధసింహాసనాలు. విచ్చల విడిగా కవిత ప్రవహిస్తోంది వచన రచనలో — అదేవిధంగా ఇతర సాహితీ ప్రక్రియలు. కథ, నవల. నాటిక ధారాళంగా సాగుతున్నాయి. కవితా చమత్కృతి, పాత్ర చిత్రణ, కల్పనాశక్తి, ఇతివృత్త వైవిధ్యం మొదలగు వాటిలో పాండిత్యం శూన్యమయినా, ఆధునిక రచనా రీతులలో భావంలోను, భాషలోను, ఆశావాదం నెపంతో యువ రచయితలు పుష్కల

సమాజం వాడుకుంటోంది. చింతామణి, కన్యాశుల్కం, మొదలైన నాటకాలు ప్రజల్లో సృష్టించిన సమాజ చైతన్యం, చంద్రగుప్త, ప్రతాపరుద్రీయం, అందిచ్చిన చారిత్రక కల్పనాప్రతిభ, నేటి నాటకరంగంలో కనిపించటంలేదు. నాటక బృందాల సంతుష్టికి, సంస్థల నిర్వహణాకార్యక్రమాలకు మాత్రమే మొక్కుబడులుగా నాటకాలు ప్రదర్శించబడుతున్నాయి. రాజకీయ సంశ్లిష్ట దుర్గంధ వాతావరణం నేటి సమాజంలో చొచ్చుకుపోయి, నిజమైన సాహితీ విలువలను గుర్తించి, మారుతున్న సాహితీ విలువలకు పట్టముకట్టే ప్రభుత్వం యింకా రానందున, విషయం విషాదకరంగా వుంది.

ఇక ఈ సాహితీరంగంలో సమాజంలోని మారుతున్న విలువలు ఏ విధంగా ప్రతిబింబిస్తున్నాయి! చూద్దాం.—ప్రబంధకాలంనాటి వ్యక్తివిలువలకు, నేటి వ్యక్తివిలువలకు చిత్రణలో వ్యత్యాసం చాలావుంది. ఒక పాత్ర ఎన్నుకున్నప్పుడు రాజువంటి పాత్రకు నిత్య విశేషణ సముదాయం వెన్నంటిందే కాని, ఆ పాత్రలోని నిమ్నత వెలికిదీయడానికి రచయితలకలం సాహసించలేదు. ప్రజాస్వామ్య జీవితంలో రాజులు, రారాజులు తొలగిపోయి, సామాన్యులకు సన్నిహితులైన అసామాన్యులవడంవల్ల, మానవునిలో నిబిడీకృతమైన మంచిచెడుల కలయికగా పాత్రలు సృష్టింపబడుతున్నాయి. సమాజం వర్ణవ్యవస్థద్వారా సృష్టించిన వైశ్యుల కులం నేటి న్యాయచట్టరీత్యా హరించిపోవడంతో సమాజంలో అంతరాంతరాల్లో యీ జాడ్యం బీజాలువేసుకుని బ్రతుకుతున్నందువల్ల గర్హనీయమైన ఆ వృత్తి పదివేల శిరస్సులు కలిగిన పాత్రలను సృష్టిస్తోంది - మునుల ఆశ్రమాల్లో ప్రాచీన సాహిత్యం ద్వారా అలంకార ప్రాయంగా ప్రవేశపెట్టబడిన జింకలు, లేళ్ళు, గుర్రాలు, కుక్కలు, పిల్లులు, నేటి సమాజ వాతావరణంలోమానవ, లక్షణాలు పొదుగుకుని, కథా చిత్రణలో పరిపుష్టమైన భాగాలుగా వర్ధిల్లుతున్నాయి. పాశ్చాత్య నాగరికత, క్రమక్రమాభివృద్ధి చెందుతున్న శాస్త్ర విజ్ఞానం, సాహితీ క్షేత్రంలోని సమాజ విలువలనే మార్చేసింది. కాలం విలువ, మనిషి మానవత, మనస్సు సంశ్లిష్టత - అంతర్భూతమైన రచనలు నేడు విస్తృతంగా సృష్టింపబడుతున్నాయి. అయితే సమాజంనాటికీ నేటికీ ఎంత మారిందన్న ప్రశ్న వేసుకుంటే బహుశా యీ విశాల ప్రపంచ గమనం పోలికతో, సహస్రాంశ కూడా కాదేమోనన్న సందేహం మనకు కల్గుతుంది. సమాజంలో స్త్రీ స్వరూపం ఇప్పుడు అన్నివిధాలా బలవత్త

మైన రచనలు సృష్టిస్తున్నారు. వచన కవిత తెలుగు రచనలో క్రొత్తకాదు. చలం వ్రాసినదంతా చాలావరకు వచనకవితయే. ఆడంబర సమాస భూయిష్ఠ వచన రచనల్లో ప్రాచీన కవులు కవిత చూపలేదూ. అల్లాగే కవిత అని పేరులేకపోయినా వచనంలో కవిత పొదిగించిన ఉత్తమ రచయిత చలం. ఈ రెంటికీ మధ్యగా ప్రయోగాత్మకంగా, వచన కవితా స్రష్టలు తమ ప్రయోగాలు పొదుగించి కథలో నవలికలో, నాటికలో కూడా వచన కవితలు పొదిగారు. కుందుర్తి వ్రాసిన "ఆఖ" అనే నాటిక వచన కవితా ధోరణిలో జరిగిన ప్రయోగం. అలాగే అస్మదాదులు కథల్లో వచన కవిత చొప్పించారు. "దిగంబర కవుల" ప్రస్తి ప్రయోగాత్మక సిద్ధాంతాలకు సన్నిహితం. భావోద్వేగం, భాషోధృతం, విరగబడి నడిచే విప్లవ రీతులు ఉన్నాయనుకుని నూత్న ప్రయోగాలుగా అందిచ్చిన వారి కవితలో సమాజంలోని కుళ్ళు కుళ్ళుగా వాసనాభరితంగా పాఠకుల నాసికలు బ్రద్ధ లయ్యే రీతి కలం చిందడం కొంత ఎబ్బెట్టుగానే వుంది. పాఠకుల ఆదరణ వచన కవిత మీద మోజు చూపిన మాట వాస్తవమే. కాని, రూపాయిలలో కొలిచినాడు, పాఠకుడికి కవితమీద మనస్సు తగ్గినదని నిస్సందేహంగా చెప్పవచ్చు. కథ, నవల రూపాలు సమాజంలో, నేడు వేళ్ళు పాతుకు పోయాయి.

పాఠకుల ఆదరణ. ప్రోత్సాహం వీటికి అనుకున్నంత కాకపోయినా, చెప్పుకోదగ్గంతగా వృద్ధిలోకి వస్తోంది. సమాజంలోని విలువలకు నూత్న నిర్వచనాలు జోడించి, కథ రీతుల్లో నవ్యత, మారుమూల సామాన్యునికి అందుబాటులో లేని సన్నివేశాల చిత్రణ ద్వారా వైచిత్రి - నేటి కథా రచయితలు కొంత వెలికితెచ్చినమాట వాస్తవమే. పాలగుమ్మి పద్మరాజు గారి "గాలివాన" కథలోని పాశ్చాత్య పోకడల ప్రతిబింబంపై గాలివాన రేగినా, బుచ్చిబాబుగారి నవ్యత నాణాలు కొత్త విలువలు సంపాదించినా. వాస్తవికత, భారతీయత యీ యితివృత్తాలలో కృత్రిమ స్వరూపం పొందా యనే, విమర్శలేక పోలేదు. రాచకొండ విశ్వనాధశాస్త్రి, హితశ్రీ, మధు రాంతకం రాజారాం, మొదలైన రచయితలు నూత్న ప్రయోగాలు చేస్తున్నా ఆ ప్రయోగాలలో పాత్రవైచిత్రికంకె, వాతావరణ వైచిత్రి తొంగిచూస్తూంటుంది. నాటకాలు, నాటికలు నేటి సమాజ విప్లవానికి దారి తీసే సాహితీ ప్రయోగాలే - కాని వాటిని వినోద ప్రక్రియలుగా నేటి

రంగా రూపొందుతోంది. ఒకప్పుడు స్త్రీ సృష్టికి ముఖ్యం. గృహంలో పునాది అనుకోబడినా, నేడు స్త్రీ రాజకీయంలోకి చొరబడి, మానవ విలువలు పూర్తిగా మార్చేసింది. రాజకీయం సమాజరంగానికి మూలకందం. అది నేడు అందని విభాగంలేదు. సమాజంలోని అన్ని విభాగాలలో స్త్రీ రాజకీయం ద్వారా బలవత్తరమైన ముద్ర వేసుకుని పురోగమిస్తున్న ధ్వని కలిగిస్తోంది. సమాజంలోని స్త్రీ పాత్రలోని ఉద్వేగానికి ప్రతిబింబంగా, నేటి సాహితీరంగంలో స్త్రీ రచయిత్రిగా కూడా ప్రత్యేక స్థానం సంపాదించుకుంటోంది.

సమాజం, నాగరికత, శాస్త్ర విజ్ఞానం, మానవత – యివి చాలా పెద్ద పదాలు. అర్థంచేసుకోవాలంటే అనంత రూపాలు. ఈ చతురస్రంలో నేటి సాహిత్యం పొదగబడుతోంది. ఇందులోంచి వచ్చే వివిధ కెరటాలకు సిద్ధాంతాల రూపాల నిర్వచనాలు విమర్శకులు అందిస్తున్నారు.

మారుతున్న సమాజ విలువలతో, సాహితీ ప్రక్రియలతో నేటి సాహిత్యం గణనీయమైన పురోభివృద్ధి సాధించిందా అంటే సందేహాస్పదం. కాలం మార్పులో సాహితీ ప్రతిభకంటే సాహితీప్రతిభ ద్వారా లభించే భౌతిక ఫలితాలు ముఖ్యమై పోయాయి రచయితలకు. విశ్వజనీన దృష్టితో ప్రారంభమనే రచనలకు, పెనుకవున్న ఆర్థిక విధానాలు మానవుని రచనా వ్యుత్పత్తికి సంకుచిత మాపాదిస్తోంది. కలకాలం నిలిచే రచనలు నేటి యుగంలో బహు కొద్దికాలం మార్పు. కొద్దికాలం మాత్రమే చదివి ఆనందించే రచనా వ్యాసంగానికి ఆదరణ అందిస్తోంది. ఉద్గ్రంథాలు, విమర్శా గ్రంథాలు, నిఘంటువులు, వ్యాఖ్యానాలు, గ్రంథ సముదాయంగా, పెరుగు తున్న జనాభా లెక్కలకు పారితోషకంగా వస్తున్నాయే కాని, మానస సంతృప్తికి, మనో పరిణామదశకు ఉపకరించటంలేదు. బ్రతుకు భారమై ఆర్థిక ప్రవృత్తి సాహితీ ప్రతిభలో చిడపురుగులా చొచ్చుకుని దొలుస్తోంది. విప్లవంలేనిచో చిడపురుగులు దొలిచిన రక్తనాళాలలో తిరిగి రక్తస్రావం నదీవరదల్లా పారదు – అయితే ఆ కాలంకోసం వేచి చూడాలి !!

A. P. Patel & Company

TIMBER MERCHANTS,

ANDOOK PACKING SUPPLIERS

ALL KINDS OF PACKING CASES,

PALLETS, CRATES ETC.,

★

A-17/150 Bakaram Road

HYDERABAD-20

(ANDHRA PRADESH)

Phone : 74232

159

Grams : "NEWS PRINT"

Phone Shop : 72997
Residence : 74095

Please Visit Us

For all your Requirements

In

PAPER, BOARDS, WEDDING CARDS,

& PRINTING INKS

BATCHU LINGIAH & SONS

PAPER MERCHANTS

H. O. 6, GENERAL BAZAR

SECUNDERABAD

B. O. B–12–1062, OSMAN GUNJ

HYDERABAD

(Phone : 41429)

Rs

మారుతున్న విలువలు - రచయిత

శ్రీ శీలా వీర్రాజు

సమకాలీన జీవితాన్ని అద్దంపట్టి చూపలేని ఏ సాహిత్యాన్నికైనా ఆధునిక కాలంలో నిలిచే అర్హతలేదు. పాతకాలపు నాణెం ఎలా చెలామణీకి పనికిరాదో యిదీ అంతే. ఒక్క చారిత్రక ప్రాధాన్యత తప్ప మరో ప్రయోజనం లేదు. పాతకాలపునాణెం ప్రభుత్వ ఖజానాల్లోనే గాని ప్రజలమధ్య చెల్లుబడి కానట్లే సమకాలీన జీవితాన్ని చూపలేని సాహిత్యంకూడా ఏ కొద్దిమందో ఉలిపికట్టెదార్లమధ్యతప్ప ప్రజల మధ్య చలామణీకి పనికిరాదు.

ఆధునిక కాలంలో ప్రపంచంఅంతటా సామాజిక విలువలు మారిన తర్వాత సమాజానికీ, సాహిత్యానికీ సన్నిహిత సంబంధం ఏర్పడింది. వ్యక్తివిలువలకన్న సామాజిక విలువలు ముఖ్యమైనవన్న కొత్త సిద్ధాంతంతో సరికొత్తశకం ఆవిర్భవించడంతో కళ కళకొరకే నన్న రంగెలిసిపోయిన పాతకాలపు మడిబట్ట వాదనపోయి కళ సమాజం కొరకనే కొత్త వాదం బయలుదేరింది. సాహిత్యం యీ కళల్లో ఒకటి గనుకా, అన్ని కళల్లోకీ సాహిత్యమే ఎక్కువగా సమాజాన్ని ప్రభావితం చేయగల ముఖ్యమైన కళ గనుకా, సాహిత్యం తప్పనిసరిగా సమకాలీన దృక్పథాన్ని కలిగివుండాల్సినదైంది. ఇది ఆధునికయుగలక్షణం. అందువల్ల సామాజికజీవితంలో మార్పు వచ్చినప్పుడల్లా ఆ మార్పులు సాహిత్యంలోనూ విధిగా ప్రతిబింబించక తప్పదు.

అయితే యిప్పటికీ యీ మారిన విలువల్ని గుర్తించక రచనల పేరుతో వందలకొద్దిపేజీలతో అబద్ధపుచరిత్రల్ని, కుళ్లుగబ్బుకంపుకొట్టే కులవ్యవస్థనీ, శుద్ధ ఫ్యూడలిజం మనస్తత్వాన్నీ చొప్పించి కాలానికి ఎదురీదాలనుకునేవారు లేకపోలేదు. ఇంకా మనం సంధికాలంలోనే వున్నాం. అందువల్ల యిటువంటి తిరోగమన నినాదాలు అక్కడక్కడా వినిపించక తప్పదు.

నిజానికి మనకు రాజకీయ చైతన్యంగానీ, సాంఘిక చైతన్యం గానీ అంతగా రాలేదు. "గతకాలము మేలువచ్చు కాలముకంటెన్" అనే పిచ్చి నమ్మకాన్ని వదులుకోలేని మూఢత్వంలో వున్నాం. అందుకే మనలో నరనరానికీ జీర్ణించుకుపోయిన మూఢాచారాల్ని, మారిన కాలంతోపాటు వదులుకోలేక, అవి మన ఉత్కృష్ట సంప్రదాయాలుగా, మన సాంస్కృతిక విలువలుగా నచ్చచెప్పుకోడానికి ప్రయత్నిస్తున్నాం. రాచరికాలు నశించి ప్రజాస్వామ్యాలు ప్రపంచమంతా తలెత్తినా, జమిందారీ విధానాన్ని రద్దుపరచి సోషలిజంను స్థాపించుకోడానికి ప్రయత్నిస్తున్నా యింకా మనం ఆ పాత వ్యవస్థలంచేనే మోజు చూపిస్తున్నామనడానికి యీనాడు కుప్పతిప్పలుగా వస్తోన్న, మనం గొల్లరెల మందల్లా ఎగబడి చూస్తోన్న జానపదసినిమాలే తార్కాణం. సాంఘికచిత్రాల్లో సైతం గ్రామీణ యితివృత్తంగల చిత్రాల్లో విధిగా జమిందారు వుండి తీరతాడు! జమిందారీ వ్యవస్థని కూల దోసినా యింకా ఆ వ్యవస్థమీద మోజు పోలేదు మనకు.

మనలో కనీసం రాజకీయ చైతన్యం వచ్చినంతగాననా సాంఘిక చైతన్యం రాలేదు. ఈనాడు జమిందారీ వ్యవస్థనుగానీ, రాచరిక వ్యవస్థనిగానీ తిరిగి ప్రతిష్టించడానికి ఏ రాజకీయ వేత్తయినా ప్రయత్నిస్తే ఎంతమాత్రం అతన్ని క్షమించడంలేదు. అలాటి వారిని కారాగారానికి పంపించడానికీ, లేదా దేశంనించి బహిష్కరించడానికీ ఏ మాత్రం వెనుకంజ వెయ్యడంలేదు. కాని, సంఘాన్ని మళ్ళీ పాత కాలపు వ్యవస్థలోకి తీసుకుపోవటానికి ఉద్యమంలాగ రచనలుచేసే రచయితల్ని, కవుల్ని ఏమి చేయలేకపోతున్నాం. పైపెచ్చు వారికి భజనకూటాల్ని ఏర్పాటు చేసి బిరుదుల్ని, బహుమతుల్ని ప్రసాదిస్తున్నాం.

మన ఆలోచనల్లో మార్పురాక, మన అభిరుచుల్లో మార్పు లేక మేడిపళ్ళలా బ్రతుకుతున్నంత కాలం మన సాహిత్యంలో మాత్రం మార్పెలా వస్తుంది?

అందుకే యీ నాటి మన రచనల్లో ఎక్కువ వాటిలో మారు తున్న విలువలు ప్రతిబింబించడంలేదు. తెలుగు రచనలు సమకాలీన జీవితాన్ని చూస్తున్నాయనుకోవడం పొరపాటు. మనవి కేవలం సాంసారిక రచనలు. వంటింటి పోపు వాసనలతోనూ, పడకటింటి ముక్కవాసనలతోనూ నిండిన రచనలు. పైగా మన వంటిళ్ళూ మన పడకటిళ్ళూ ఎలా యిరుగ్గా వున్నాయో మన ఆలోచనలూ, మన సాహిత్యమూ అంతే యిరుగ్గా వున్నాయి. కొత్తగాలులు వీస్తే మైలపడిపోతామనే వారసత్వపు ఛాందస భావాలనుంచి పూర్తిగా మనం విముక్తులం కాలేకపోయాం. సరైన గాలీవెలుతురూ లేనప్పుడు మొక్కలు పాలిపోకతప్పదు. మనఆలోచనలూ అంతే. ఈ పాలిపోయిన ఆలోచనలవల్ల ఆరోగ్యవంతమైన సాహితీ కుసుమాలు పుష్పించడానికి ఆస్కారంలేదు.

రచనల్లో సమకాలీన సమాజం ప్రతిబింబించడంతోనే సరిపోదు. అది సమాజాన్ని ముందుకు తీసుకుపోయేదిగా వుండాలి. సామాజిక మైన స్పృహ, ప్రగతి దృక్పథం వుండాలి. సమకాలీన సమాజంలో తిరుపతి దేవుడికీ, రకరకాల బాబాలకీ ప్రజల్లో పలుకుబడి వున్నంత మాత్రంచేత వాళ్ళ చరిత్రల్నీ, వాళ్ల భక్తుల చరిత్రల్నీ అశాస్త్రీయ మైన, అసంగతమైన వాళ్ళ మహత్వ గాథల్నీ చొప్పిస్తూ రాసే రచనలు నిజానికి సామాజిక దృక్పథంగల రచనలు కాలేవు. శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చెందింది. మానవశక్తిమీద విశ్వాసం పెరిగింది. సమాజం మారి, విలువలు మారాయి. ఈ మారిన విలువలను సాహిత్యంలో చూపకతప్పదు. వాటిని ప్రచారం చేసినా చెయ్యకపోయినా కనీసం యీ విలువల్ని గుర్తిస్తేచాలు. మన రచనలు సమాజాన్ని ముందుకు నడిపించడం అవసరం. నడిపించకపోయినా కనీసం దాన్ని వెనక్కు తిప్పేవిగా మాత్రం వుండకూడదు.

నిజానికి సాహిత్యం ఎప్పుడూ ఏకముఖంగా అభివృద్ధి చెందదు. రెండు శాఖలుగా విస్తరిస్తుంది. ఒకటి - ప్రగతి శీలము. రెండు -

ప్రయోగశీలము. ప్రగతివాదంతోపాటు ప్రయోగవాదంకూడా వున్నప్పుడే సాహిత్యం సుసంపన్న మౌతుంది. ప్రయోగాలు జరక్కుండా ఏ భాషా సాహిత్యమూ అభివృద్ధి చెందలేదు. ఒక్క ప్రగతి వాద రచనలే సమాజానికి కావాలనుకుంటే పద్యాల్లో నవలల్ని కావ్యాలుగా రాసుకోవచ్చు. గ్రాంథికభాషలో అభ్యుదయ సామాజిక విలువల్ని ప్రకటించుకోవచ్చు. గురజాడ వంటివారూ, గిడుగు లాటివారూ వ్యావహారిక భాషకై ఉద్యమాలను నడిపించవలసిన అవసరంలేదు. ప్రజలు మాట్లాడే భాషలో, ప్రజలకు సన్నిహితమైన భాషలో సాహిత్యాన్ని రూపొందించడానికి జీవితాల్ని ధారపోయ నవసరంలేదు. భాషకూడా ఎప్పుడూ ఒక్కలాగే వుండిపోదు. కాలంతోపాటు అదీ మారుతూవుంటుంది. ప్రయోగాలు అందుకు తోడ్పడుతాయి.

అందుకే సాహిత్యంలో ప్రగతి దృక్పథంతోపాటు ప్రయోగ దృక్పథమూ వుండాలి. అయితే ప్రయోగాల పేరుతో సమాజానికి దూరంగా ఎగిరిపోవడంగానీ, అభ్యుదయ నిరోధక ధోరణులను ప్రకటించడంగానీ ఎంతమాత్రం కూడదు. ఒక రచన - అది ప్రగతి శీలమైనా, ప్రయోగశీలమైనా - అది తప్పని సరిగా అభ్యుదయ దృక్పథం కలిగివుండాలి.

అయితే అభ్యుదయదృక్పథం పేరుతో కేవలం కొన్ని సిద్ధాంతాల మేనిఫెస్టోగానో, ప్రచారసాహిత్యంగానో వుండిపో గూడదు. సామాజిక విలువలతోపాటు సాహిత్యపు విలువల్ని కూడా చూపించగలగాలి. ఎంత అభ్యుదయదృక్పథం కలిగివున్నా సాహిత్యపు విలువలు లేకపోతే అది సాహిత్య ప్రక్రియగా చలామణి కాలేదు. కుటుంబనియంత్రణమీదా, పొదుపుమీదా రేడియోలో పుంఖాను పుంఖంగా వచ్చే రచనలు ఉత్తమసాహిత్యంగా మనం ఎలా గుర్తించడంలేదో వీటి విషయంలోనూ అంతే. రచయిత ప్రవక్తాకాడు, రాజకీయవేత్తాకాడు. అతను ప్రధానంగా సాహితీవేత్త. ఆ విషయాన్ని మర్చిపోకుండా అతను ప్రవక్తలాగా, రాజకీయవేత్తలాగా ప్రవర్తించినా ఫరవాలేదు.

ప్రయోగదృక్పథం, ప్రగతిదృక్పథంగల రచనల్ని సృష్టించే విషయంలో రచయితలకన్న కవులు చాలా ముందుకుపోగలిగారు. కవిత్వంలో వచ్చినంత వికాసం వచనంలో రాలేదు. వస్తువులో, శిల్పంలో కవిత్వం చాలా ముందుకు పోగలిగింది. తన బాధను లోకంమీద రుద్దే భావకవిత నాటి స్వంత గోడువల్ల సమాజాన్ని ముందుకు నడిపించలేమని తెలుసుకున్న కవులు అభ్యుదయ కవిత్వాన్ని సృష్టించి లోకం బాధని తమ బాధగా చేసుకున్నారు. ఫ్యూడలిజం మనస్తత్వపు భావ కవిత్వం నించి సోషలిజం దృష్టిగల అభ్యుదయ కవిత్వం తెలుగులో ఆవిర్భవించి సమకాలీన సమాజాన్ని చూపించడమే గాక భవిష్యత్ సమాజ స్వరూపాన్ని కవులు నిర్దేశిస్తూవున్న రోజుల్లో, రచయితలు వంటగదుల చుట్టూ, దేవుళ్ళచుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. భావకవిత్వం నుంచి అభ్యుదయకవిత్వంలోకి కవిత్వం మారినప్పటి భావవిప్లవంగాని, శిల్ప విప్లవంగాని వచనరచనలో రాలేదు. ప్రయోగవాదంతోనూ, ప్రగతి వాదంతోనూ కవిత్వం శాఖోపశాఖలుగా విస్తరిల్లింది. ప్రయోగపరంగా, అభ్యుదయకవిత్వం తర్వాత వచనకవిత ఆవిర్భవించి బహుముఖాలుగా విస్తరించింది. ప్రగతి పరంగా, వర్గరహిత సమ సమాజ స్థాపనకు ప్రపంచ మేధావుల ఆలోచనల్లో వచ్చిన అత్యాధునిక ఆలోచనా ధోరణులు ఎప్పటికప్పుడు కవిత్వంలో ప్రవేశిస్తున్నాయి. ఇంత విప్లవం కవిత్వంలో వస్తూవుంటే వచనంలో ప్రగతి దృక్పథంకాదుగదా, ప్రయోగదృక్పథం కూడా అంతగా కనిపించడం లేదు.

తెలుగువచనంలో యిరవయ్యేళ్ళకిందటే కొద్దోగొప్పో ప్రయోగాలు జరిగాయి. చలం, బుచ్చిబాబు, విశ్వనాథశాస్త్రి, గోపీచంద్‌లు ఒకొక్కరూ ఒకొక్క ధోరణిలో ప్రయోగాలు చేశారు. వర్ణనలో, మనస్తత్వచిత్రణలో తాత్విక చింతనలో మేలైన రచనలు సృష్టించారు. సామాజిక దృక్పథం గల రచనలుకూడా ఆనాడే ఎక్కువగా వచ్చాయి. చలం, విశ్వనాథశాస్త్రి, కుటుంబరావులు సంఘంలోని అన్యాయాలమీద తిరుగుబాటును ప్రకటించారు ఆనాడు కనిపించిన ప్రయోగం, సామాజిక దృష్టి యీనాడు మన కథల్లో, నవలల్లో కనిపించడంలేదు. రెండు దశాబ్దాల కాలంలో తెలుగు

కవిత ఎంతో అభివృద్ధి చెందగా తెలుగు నవల, తెలుగు కథా ఎందుకు అభివృద్ధి చెందలేకపోయాయి? ఈనాడు తెలుగు నవల, తెలుగుకథ పూర్వంకన్న ఎక్కువ ప్రాచుర్యం పొందాయి. చదివేవాళ్ళు పెరిగారు. రాసేవాళ్ళు పెరిగారు. కథలసంఖ్య, నవలల సంఖ్య పెరిగాయి. ఈ పెరుగుదలలు కనీవినీ ఎరుగనంత ఎక్కువగా వున్నాయి. కాని మారుతున్న విలువలను ప్రతిబింబించే రచనలు వీటిలో వేళ్ళ మీద లెక్కపెట్టే సంఖ్యలోమాత్రమే వున్నాయి. బహుకొద్దిమంది రచయితలే మారుతున్న ఈ నాటి విలువల్ని సాహిత్యంలో చూపించే ప్రయత్నం చేస్తున్నారు. వీరైనా రాజకీయ విషయాలకు యిస్తున్నంత ప్రాధాన్యతను సాంఘిక విషయాలకు యివ్వడంలేదు. నిజానికి రాజకీయ వ్యవస్థలో మార్పులు తెచ్చి తద్వారా సమాజంలో మార్పులు తేవడానికి ప్రయత్నించేవాడు—రాజకీయవేత్త. సామాజికమైన మార్పుల్ని తెచ్చి వాటి ఆధారంతో రాజకీయవ్యవస్థలో మార్పులు రప్పించేవాడు—రచయిత. ఈ ఇద్దరికీ ఎంతో తేడా వుంది మరి. ఆ విషయాన్ని మర్చిపోతే ఎలా?

సామాజికమైన మార్పుల్ని తీసుకురావడం అనేది చాలా బాధ్యతతో కూడుకున్నపని. ఎంతోశ్రమతో కూడినదికూడా. రచనావ్యాసంగాన్ని సీరియస్‌గా తీసుకుంటేనేగాని యిది సాధ్యం కాదు. దీనికి ఎంతో అనుభవమూ, విజ్ఞానము, అవగాహన, నైపుణ్యం వుండాలి. ఈనాటి చాలామంది రచయితలకు విస్తృతమైన అనుభవాలు లేవు. పుస్తకాలద్వారానన్నా తెలుసుకొనే ప్రయత్నం లేదు. సమస్యలను గురించిన పరిజ్ఞానంలేదు. నైపుణ్యం అయితేవుంది. అయితే యిదొక్కటివుంటే చాలదు. అప్పర్ క్లాస్ సొసైటీని చూపించాల్సి వచ్చినప్పుడు ఇంపాలాకార్లూ, పోర్టికోలూ, పచ్చని లాన్‌లూ, ఏరోడ్రోములూపెట్టేసినంతమాత్రంచేత ఆ వాతావరణం ఏర్పడిపోతుందని భావించే రచయిత ఎంత చక్కగా రచన చేయగలిగినా సరైన అవగాహనతోచేసిన రచనగా అది పరిగణించబడదు. ఆ వర్గం ప్రజల మనస్తత్వం, అలవాట్లు కనిపించాలి. అలాటి అవగాహన, పరిశీలన లేకుండా రచనలుచేస్తే అవి అట్టే కాలం నిలవ్వు. కేవలం కాలక్షేపానికి మాత్రమే వుపయోగిస్తాయి.

తెలుగునవల, కథ చేతులుమారి రచయిత్రులహస్తగత మయ్యాక కాలక్షేపం ధోరణి మరీఎక్కువయిపోయింది. సాధారణంగా స్త్రీలలో సాహసం తక్కువ. సర్దుకుపోయే మనస్తత్వమేగాని ఎదురు తిరిగే తత్వంకాదు. అందువల్ల సంఘంలోని అన్యాయంమీద తిరుగుబాటు చేయడానికి వాళ్ళు అంతగా ముందుకురాలేరు. దీనికి తోడు యీనాటి పఠితల్లో అధిక సంఖ్యాకులు స్త్రీలే కావడంవల్ల వారిని ఆకర్షించే రచనలకే రచయితలు సయితం మోజు చూపిస్తున్నారు. అందువల్ల కాలక్షేపంరచనలకు గిరాకీ పెరిగింది. సమకాలీన సమస్యలను చిత్రించే రచనలు కొరవడ్డాయి. సామాజిక దృష్టిగల రచయిత్రులు ఒకరో, యిద్దరోవున్నా వారి దృష్టి కేవలం స్త్రీ స్వేచ్ఛకు, స్త్రీల సమస్యలకు మాత్రమే పరిమితమై పాక్షికదృష్టి అయిపోయింది. వందలకొద్ది సంవత్సరాలుగా స్త్రీని అజ్ఞానంలోనూ, బానిసత్వంలోనూ, తొక్కిపట్టిన పురుషుడి స్వార్థాన్నుంచి స్త్రీలు యిప్పుడిప్పుడే బైటపడుతున్నందువల్ల యీ కాలంలో వచ్చే రచయిత్రుల రచనల్లో యీ మాదిరి పాక్షికదృష్టి వుండడం అసంగత మేమీకాదు. అయితే యీ దృష్టినుంచి తప్పుకుని ఎంతత్వరగా సమగ్రమైన దృష్టిని ఏర్పరచుకుంటే అంత మంచిది. అప్పుడే వాళ్ళ నుంచి సమకాలీన సామాజిక దృక్పథంగల రచనలు వెలువడతాయి.

రచయితలు—వారు మగవాళ్లైనా, మహిళలైనా - సమకాలీన సమాజాన్నిగూర్చి, సమాజంలో మారిన విలువలనుగూర్చి, మారుతున్న విలువలనుగూర్చి తెలుసుకోవడం చాలా అవసరం. చారిత్రిక, భౌతిక సమస్యల అవగాహనకూడా వారి రచనల్ని శక్తివంతం చేయడానికి తోడ్పడుతుంది. ముందుచూపుఅనేది రచయితకు వుండవలసిన ప్రాథమిక లక్షణం. ప్రపంచంతోపాటు ముందుకి నడిచే సత్తా రచయిత లకు విధిగా వుండాలి.

శాస్త్ర విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం పెరిగే వాళ్ళు పత్రికలు రేడియో, టెలివిజను వంటివి రావడంతో ప్రపంచంలో ఎక్కడ ఏ మార్పు వచ్చినా క్షణాలమీద ప్రపంచమంతా తెలిసిపోతున్న యీ రోజుల్లో, రచయితల అవసరం లేకుండానే ప్రజలు ఆ యీ మార్పుల్ని

V.R. NARLA MEMORIAL LIBRARY
D.P.R.
Acc. No

తెలుసుకో గలుగుతున్నారు. తదనుగుణంగా తమనితాము సంస్కరించుకోడానికి ప్రయత్నిస్తున్నారు. అలాంటప్పుడు ఆ మార్పుల్ని రచయితలు గుర్తించక రచనలుచేస్తుంటే వాళ్ళ అజ్ఞానాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటారు. వాళ్ళ తెలివితక్కువతనానికి జాలిపడతారు.

ఇలాంటిపరిస్థితి ఏర్పడకుండా వుండడానికే రచయిత ప్రయత్నించాలి. మారుతున్న ప్రపంచంతోపాటు తామూ మారాలి. మారిన విలువలకు అనుగుణంగా తమనితాము సంస్కరించుకోవాలి. వాటిని సాహిత్యంలో చూపించాలి. లేకపోతే తెలుగురచయిత వెనకబడిపోతాడు. ప్రజలు ముందుకి వెళ్ళిపోతారు. అప్పుడు, యీనాడు వున్న గౌరవంకూడా తెలుగు రచయితకు లభించదు.

★

పండు వెన్నెలదాల్చి ప్రసవవేదనతోడ
నెలవంక కనబోవు నిండుపొద్దులరేయి
ఒకవంక తెగతెంపు ఒకవంక బిగియింపు
హాహాల చెలిమిలో హాయి తొణికిసలాడు
తిమిరాల కడుపులో తేజాలు జనియించు
అమావాస్య నిశికింత హడలేల బెగడేల

* * *

తలచి తరచి తలపులన్ని
పలుకుల్లో ఒలికిస్తే
ప్రాణాలే ఝల్లుమనును
గుండె మువ్వా ఘల్లుమనును

* * *

ఉదయం కానే కాదనుకోడం నిరాశ
ఉదయించి అటానే వుంటుందనుకోడం దురాశ
చీకటిలో కనువిప్పిన వారికి వెలుతురంటే బూచి
వెలుతురులో కనుతెరిచినవారికి చీకటంటే పిశాచి

—కాళోజీ.

K. V. C. INDUSTRIES

GENERAL ENGINEERS & FABRICATORS

Phone : 35814

I-1-64/1, Musheerabad, Hyderabad-20

★

prop : K. V. CHALAPATHI RAO

With best compliments from :

Super Tyres

FULL CIRCLE TYRE RETRADERS

Phone No. : 42849

GANDHI BHAVAN, NAMPALLY

HYDERABAD-1

169

With best

compliments

from :

J. & J. DeChane

★

HYDERABAD-DECCAN

మారుతున్న సాహిత్యం - వివర్శ

శ్రీ సంపత్‌కుమార

ఈనాడు సాహిత్యంయొక్క పరిధి ఎంతో విస్తృతమైపోయినట్లుగా కనిపిస్తుంది. రకరకాలయిన ప్రక్రియలూ, అంతఃప్రక్రియలూ ఆవిర్భవిస్తున్నవి. ఆ యా ప్రక్రియల్లోనూ, వాటి వాటి కలగలుపుతోనూ నిర్విరామంగా, నిరాఘాటంగా వెలువడుతున్న రచనలు కోకొల్లలు. ఊహల్లోనూ, అనుభవంలోనూ, ఆలోచనలోనూ, విచారణలోనూ, అభివ్యక్తికి ప్రధాన సాధనమయిన భాషలోనూ, ఇంకా అనేకాంశాల్లోనూ పరిమితిస్థాయికి చాలాదూరంగా ఉన్న అనేకమయిన రచనలు ఈనాటి సాహిత్య పరిధిని మరింత విస్తృతంగా భాసింపజేస్తున్నయి. పలుసందర్భాల్లో, పలురచనల విషయికంగా 'సాహిత్యం' అన్నపదం నేతిబీరకాయ స్థాయికి దిగజారిపోవటం స్పష్టంగా కనిపిస్తూనే ఉన్నది. ఈ స్థితిలో 'సాహిత్యం' గూర్చి తదాసక్తులు గాఢంగా విమర్శించుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబిస్తుందన్నది సహజమైన అంశం. సమాజాన్ని ప్రతిబింబించటమంటే, సామాజికంగా నెలకొన్న ఆశయాలనూ, ఆదర్శాలనూ, జీవితవిధానంలో సహజంగా నిష్పన్నమయిన, ప్రధానమయిన విలువలనూ ప్రతిబింబించటమన్నమాట. జీవితం- అది వైయక్తిక జీవితంకావచ్చు, సామాజిక జీవితం కావచ్చు- ఎప్పుడూ ఒకే గాడిలో, ఒకే ఒరవడిలో సాగిపోతూ వుంటుందని చెప్పటానికి వీలులేదు. ఈ వీలులేనితనాన్ని చరిత్ర స్పష్టంగా నిరూపిస్తూనే ఉన్నది. కొన్నేండ్లమీద సామాజిక జీవిత విధానంలోనూ, అది రూపొందించుకున్న విలువల్లోనూ మార్పులు వస్తూఉండటం సహజం. అవి రాజకీయంగా కావచ్చు, ఆర్థికంగా కావచ్చు, నైతి

కంగా కావచ్చు, లేదా వీటన్నిటి సమాహారంగా కూడా కావచ్చు. ఇంకా అనేక కారణాలవల్ల కావచ్చు, వస్తూనే ఉంటాయి. ఒకప్పుడు తెలిసి కొన్ని, తెలియకనే కొన్ని సమాజంలో వ్యాపించి, జీవిత విధానాన్ని ప్రభావితం చేస్తుంటాయి. సామాన్యంగా సమాజంలో ఒక రకంగా పైస్థాయికి చెందిన ఆలోచనాశీలం గల వ్యక్తుల ఆలోచనా విచారణ ధోరణిలో వచ్చే మార్పులు ప్రధానంగా సామాజిక జీవిత విధానంలోనూ, విలువల్లోనూ మార్పిడి జరుగటానికి కారణమనవచ్చు. అయితే ఆయావ్యక్తుల ఆలోచనా ధోరణిలోని పరిణతి, అపరిణతి మొదలయిన వాటినిబట్టి వాటి మంచిచెడ్డలు కాలంమీద నిర్ణీతమవుతూ ఉంటాయి.

కాని, ఒకప్పుడు ఒక విచిత్రమయిన పరిస్థితి సమాజంలో ఏర్పడుతూ ఉంటుంది. అప్పటివరకున్న జీవిత విధానమూ, వ్యవస్థా, దాని విలువలూ విచ్ఛిన్నమయి పోతుండగా, కొత్త జీవిత విధానమూ, వ్యవస్థా, విలువలూ నిర్దిష్టంగా ఏర్పడవు. కొత్తదనం స్ఫురిస్తుంటుంది తప్ప ఇంకా నిలదొక్కుకోదు. రకరకాలయిన విధానాలూ, విలువలూ ప్రవేశిస్తూ ఉంటాయి. ఏవి నిలదొక్కుకొనేవో, ఏవి వాటంతట అవి మాసిపోయేవో స్పష్టంగా నిర్ణయించుకోవటానికి వీలులేని పరిస్థితి సాగుతుంటుంది. ఈ నాడు సమాజం సరిగ్గా ఆ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నది.

సామాజిక జీవితం ఈ నాడు, తన నిర్ణీతమయిన ఒకానొక పరిధినుంచి హఠాత్తుగా అంచులందనంతటి విశాలమయిన పరిధిలోకి విసిరివేయబడ్డట్టుగా ఉన్నది. కొనమొదళ్లు ఎక్కడా అంతుపట్టటం లేదు. జీవితంలో అనుకోకుండగా, ఒక్కసారిగా తట్టుకోలేనంత వేగం పెరిగింది. ప్రపంచం నాల్గుచెరగులదాకా విస్తరించిన పరస్పర సంబంధాలూ, పరస్పరం ఒకదాన్ని ఒకటి కాదనుకొనే ఏకకాలా విర్భూతమయిన అనేక సిద్ధాంతాలూ, విజ్ఞానశాస్త్రం తెరచిన అనేకమయిన దారులూ, మొదలయిన అనేక కారణాలవల్ల ఆర్థికంగానూ, రాజకీయంగానూ, నైతికంగానూ, కలిగిన ఎన్నో సంక్షోభాలు సామాజిక జీవితాన్ని అస్తవ్యస్తంచేసి వ్యక్తిని ఉక్కిరి బిక్కిరి

చేస్తున్నాయి. ప్రతిదాన్నీ సమాజక్షేమానికీ, భద్రతకూ ఉపయుక్తంగా మలుచుకోవటానికీ, మలుగనిదాన్ని త్రోసి ముందుకు పోవటానికి వీలులేని విధంగా, సమాజంలోనే ఏకపక్షంగా ఎదిగిన దుష్టశక్తులు వైయక్తిక స్వార్థానికీ, స్వేతరులను అణగద్రొక్కటానికీ ఉపయోగించుకుంటున్నయి. ఎంతటి పటిష్ట వ్యవస్థ అనుకున్నాకూడా దీర్ఘకాలం మీద అది శిథిలంకావటం సహజం. అసలు ఆ వ్యవస్థ ఏ సామాజిక సుస్థితి కోసంగా నిర్మించుకోబడిందో, ఏ విలువలు జీవిత భద్రతకూ, క్షేమానికీ పాటింపబడినాయో, వాటిల్లోకూడా శైథిల్యం రావచ్చు. అయితే ఆ శైథిల్యానికి మూలకారణాలను తొలగించుకొని మళ్లీ సుస్థితికి ప్రయత్నించటానికి బదులుగా, మొత్తం సమాజ జీవితాన్నే విచ్ఛిన్నం చేయాలనేధోరణి ప్రబలింది. స్వార్థమూ, అహంకారం మొదలయినవి పెచ్చుపెరిగి సమాజాన్ని ఛిన్నాభిన్నంచేసి చిన్న చిన్న వర్గాలనూ, సంకుచిత మనస్తత్వాన్నీ, అసహనాన్నీ పెంచినయి. డబ్బుచుట్టూ, అధికారంచుట్టూ అందరిదృష్టి కేంద్రీకృతమవుతున్నది. ప్రతి వ్యవస్థలోనూ ఈ రెండింటికి ప్రాధాన్యం ఉండనే ఉన్నది, కాని ఈనాడున్నంతగా ఏనాడూఉన్నట్లు కనిపించదు. వీటికోసం వ్యక్తిసహజంగా సామాజిక వ్యవస్థకు అతి ప్రాథమికమూ ప్రధానమూ అయిన నిజాయితీని కోల్పోవటం, పైగా పశుబలాన్ని పయిరెండింటికి ఆసరాగా అందించటమూ జరుగుతున్నది. అవకాశవాదం మితిమీరిపోయింది. ఈ స్థితిలో కృత్రిమమయిన ఆడంబరాలూ, ధనవత్వమూ, నటనా, కాపట్యమూ మొదలయినవే జీవితంలో అనుసరింపదగిన విలువలుగా భ్రాంతికల్గిస్తున్నాయి. ఏదో అలవాటుగా, అలవోకగా. "సమాజం, సమాజం" అని గొంతు చించుకోవటమే తప్ప ఏవిధమయిన క్షేమంకర భద్రంకర సువ్యవస్థితి కోసంగా, "సమాజం" ఆవిర్భవించిందో, పెంపొందిందో, ఆ విధమయిన సమాజంయొక్క రూపురేఖలు ఎక్కడా కనిపించవు. కేవలం అవకాశవాదంతో కొందరిని తమ చెప్పుచేతల్లో ఉంచుకోవడానికి ఒక బూచిని చూపెట్టి భయపెట్టటానికి మాత్రమే సమాజమన్నది ఈనాడు అధికంగా ఉపయుక్తమవుతున్నది. ఒకవిధంగాచూస్తే, ఈనాడు 'సమాజం' అన్న పేరు కేవలం మనుష్య సమూహాస్థితికి మాత్రమే పర్యాయపదం అవుతున్నది.

ఈ విధంగా అతిసంక్లిష్టమూ, సంకీర్ణమూ, అయోమయమూ అయిన జీవితంయొక్క వేగంలో నలిగి, రాపిడికీ దోపిడికీ గురిఅవు తున్నవాళ్ళు చాలామంది. వాళ్ళల్లో ఆలోచించలేనివాళ్ళూ, నోరులేనివాళ్ళూ పలుమంది. ఎంతో కొంత ఏదోఒక స్థాయిగానైనా ఆలోచించగలిగినవాళ్ళు మానసికంగా చెప్పరానంత సంక్షోభపడు తున్నారు. ఈ సంక్షోభం నిగ్రహరహితమైన విచ్ఛేదమూలకమయిన అరాచకానికి దారితీస్తున్నది. ఆవేశంలో, బాధలో అవసరమయ్యా, కాకుండాకూడా సమస్తాన్ని సమూలచ్ఛేదం చేయాలన్నంత కసీ, ప్రతీపతా మితిమీరుతున్నాయి. బాధానుభవంలో ఒరిపిడి అధికమై, ఆలోచనలు పరిణతంకానీయని ఈ స్థితి ఉడుకురక్తాన్ని మరింత ఉడుకెత్తించి అయోమయం, గజిబిజీ అయిన దారుల్లో పరుగెత్తి స్తున్నది.

ఇట్లాంటి ఆధునిక జీవితాన్ని సాహిత్యం ప్రతిబింబిస్తున్నది.

అయితే, కేవలం సమాజపు యథాస్థితిని ప్రతిబింబించటంతో మాత్రమే సాహిత్యంయొక్క ప్రయోజనం తీరిపోయినట్లుకాదు. ఈ ప్రతిఫలనంతో బాటుగా వర్తమాన జీవిత సంక్లిష్టతలోంచి బయట పడి, అతిత్వరితంగా మారుతున్న కృత్రిమమైన విలువలను తొలగించు కొని సువ్యవస్థిత జీవిత విధానానికి క్రొత్త విలువలను సూచిస్తూ మార్గ దర్శనం, భవిష్యద్దర్శనం చేయిస్తూ సమాజక్షేమానికి ప్రయత్నాన్ని వ్యక్తిలో పెంపొందించటం సాహిత్యానికున్న పరమ ప్రయోజనం. సాహిత్యానికున్న ఈ సామాజిక ప్రయోజనం విస్మరింపబడితే, అది సాహిత్యంగా ఏదో గౌరవాదరణీయస్థాయిని పొందదు. పొందవలసిన అవసరం కూడా లేదు. మరి ఈనాటి సాహిత్యంలో ఎంతభాగం ఎంత వరకు ఈ అంశాన్ని సాధించటంలో ముందంజవేస్తున్నదీ విమర్శించి చూచుకోవలసిన అవసరం ఎంతైనాఉన్నది.

ఈనాడు జీవితంలో ప్రవేశించి, దాన్ని అతి క్లిష్టమూ, సంకీర్ణమూ చేసిన కుత్సిత రాజకీయాలూ, కృత్రిమమయిన ఆర్థిక విధానమూ, సాహిత్యాన్నికూడా వదిలిపెట్టలేదు. గిరిగీసుకున్న 'వర్గ' మనస్తత్వమూ, ముఠాతత్వమూ, సంకుచితత్వమూ ఇందు లోనూ విస్తరించినయి. సైద్ధాంతిక వ్యామోహమూ, అసహనమూ

విరివిగా కనివిస్తున్నాయి. ఏదో వినూత్నమయిన మార్గానికి ప్రవక్తృత్వం వహించాలన్న తొందరపాటూ ఏదో ఉద్యమ ప్రారంభ కత్వం సాధించాలన్న ఆత్రమూ, ఈ రెండింటి వ్యామోహమూ ఈనాడు సాహిత్యంలో ప్రవేశించిన 'యువతరం'లో మితిమీరి కనిపిస్తున్నది. ఈ కారణంగా ఏకపక్షతా, ఎదుటి దాన్ని అర్థంచేసు కోలేని బలహీనతా, ఏమాత్రమూ స్వీయేతరాన్ని సహించలేని తీవ్రతా అతిగా కన్పిస్తున్నయి. దీనితో అవగాహనకు ఆస్కారం లేకుండా పోయింది.మరొకవైపు తన స్వత్వంతోనూ, నిజాయితీతోనూ సంబంధం లేకుండా కేవలం డబ్బుకోసంగానూ, తాత్కాలికమయిన కృత్రిమ ప్రతిష్టకోసంగానూ సాహిత్యం రచింపబడటం కూడా సాగుతున్నది. అల్పమయిన స్వార్థాలనూ సాధించుకోవటం కోసం సాహిత్యాన్ని ఒక సాధనంగా ఉపయోగించుకోవటం కన్పిస్తున్నది. స్వార్థాలు రకరకాలు.

సంయమనంతో, సహనంతో ప్రస్తుతసంక్లిష్టతను అధిగమించి సామాజిక ప్రయోజనలక్ష్యంగా వెలువడవలసిన సాహిత్యం ఈ ప్రవృత్తితో సన్నగిల్లిపోతున్నది. ప్రతిదాన్ని కాదని త్రోసివేయ టంలోనూ, స్వప్రయోజనానికుపయోగించుకోవడంలోనూ ఉన్న ఆస్థ, ఏది అవసరమో, ఏది సమాజప్రయోజనకరమో, దాన్ని స్పష్టంగా సూచించటంలో విఫలమవుతున్నది. అపరిణత భావ ధోరణిలో ఏదితోస్తే దాన్ని 'సాహిత్యం' తొడుగుతో వెలువరించి రచయితగా రూపొందాల్నన్నమనస్తత్వం పెరిగిపోతున్నది. అందుకని ఏ స్థితిలోనూ అవసరమయిన 'విమర్శ' ఈ స్థితిలో మరింతగా అవసరమయితున్నది.

'విమర్శ' అనగానే కేవలం దోషనిరూపణ చేయటం, రచనలను తెగడటం అని మాత్రమే అనుకుంటే, (అనుకోవటానికి ఈ నాడు ఆస్కారం లేకపోలేదు) అది విమర్శపట్ల అన్యాయమే అవుతుంది. సాహిత్య విమర్శ సాహిత్యం యొక్క ఉద్దీప్తికి ఏనాడూ అత్యవస రంగానే భావించబడింది. ఆ భావన ఫలప్రదమయిందన్న అంశాన్ని 'విమర్శ' చరిత్ర నిరూపిస్తూనేఉన్నది. కేవలం ఉన్న సుస్థితికి ఉద్దీప్తి కలిగించటం మాత్రమే కాకుండా, సాహిత్యం దారితప్పుతున్నప్పుడు

సాహిత్యానికి మార్గదర్శకం కావలసికూడాఉంటుంది. ఆ బాధ్యతను వెనుకటినాళ్ళల్లో విమర్శ నిర్వర్తించిందికూడా. సాహిత్యంలోని గుణ దోష వివేచనచేసి, దాని బలుపూ, వాపూ, ఏదెంతో తేల్చి, సామాజికంగా అది ఎంతవరకు ప్రయోజనకరమయిందీ కానిదీ, విమర్శ స్పష్టం చేస్తుంది. అట్లాచేయటం విమర్శ ధర్మం. ఈ విధమయిన ధర్మాన్ని పాటించిన విమర్శ అటు సాహిత్యానికీ, ఇటు సాహిత్యం వల్ల ఏదోపొందదగిన ప్రయోజనంగలదనుకొన్న సమాజానికీ చాలా అవసరమూ, ప్రయోజనకరమూ.

మరి ఈనాటి విమర్శ తన ధర్మాన్ని ఎంతవరకు నిర్వహిస్తున్నది అనేదికూడా, సాహిత్యం విషయంలో మాదిరిగానే ఒకప్రశ్న.

విమర్శ విషయంలో ప్రధానమయింది రచన. వైయక్తికమయిన స్నేహసౌహార్దాలకూ, కోపతాపాలకూ అక్కడ ఏమాత్రమూ స్థానంలేదు. అతిప్రాథమికమూ, ప్రధానమూ అయిన ఈ అంశం ఈనాటి విమర్శలో అధికభాగంలో విస్మృతమవుతున్నది. వైయక్తికమయిన ఇష్టానిష్టాలనుబట్టి రచన యొక్క విలువలను పరిశీలించటం ప్రారంభించితే, దానికో దారీ తెన్నూ ఏర్పడటం దుస్సాధ్యమయిన విషయం. ఇష్టమైనరచనను మిన్నెత్తటం, అనిష్టమైనదాన్ని అణగద్రొక్కటం సాహిత్యంలో నల్లబజారు మనస్తత్వాన్ని ప్రదర్శిస్తుంది. జీవితంలో మనిషి నలబజారుతో ఎంత సతమతమయిపోతున్నాడో, సాహిత్యంలో ఈస్థితివల్ల రచనకూడా అదేస్థితికి పాల్పడిపోతుంది. విమర్శ అనేది రచనవైపునుంచి పాఠకుని దృష్టితో ప్రారంభమయి విస్తరించవలసి ఉంటుంది తప్ప, కేవలం 'విమర్శకు'ని వైయక్తికమయిన ఇష్టానిష్టాలనుంచి కాదు. ఈ ఇష్టానిష్టాలకు నిర్దిష్టమూ నిర్దుష్టమూ అయిన ప్రమాణాలు పలుసందర్భాల్లో ఏర్పడకపోవటం సహజం కాగా, విమర్శ ప్రమాణరహితమయిపోతుంది.

విమర్శ విషయంలో ప్రధానంగా గమనించవలసిన అంశాలు రెండు. ఒక రచన సాహిత్యకంగా తన స్థాయిని కలిగి ఉండటానికి ప్రధానమయిన కొన్ని విలువలు - ఇది మొదటిది. రెండవది ఆ రచనలో ప్రతిపాదింపబడిన విషయం. రచన సాహిత్యంగా నిలవటానికి ఎంత వీలున్నది, ఎంతవరకు తగియున్నది అన్న అంశాన్ని నిర్ధారించుకున్న

తరువాతకాని రెండవ దాన్ని గూర్చి చెప్పటానికి వీలులేదు. ఎందు కంటే, ఆ రచన 'సాహిత్య' పరిధిలో చేరకపోతే అది సాహిత్య విమర్శకు విషయంకాదు. సాహిత్యేతరంలో సాహిత్య విమర్శసాగదు. అందువల్ల రచనను సాహిత్యకంగా విలువకట్టిన తరువాత ప్రతిపాదిత విషయంలోని సామంజస్య - అసామంజస్యాలను గూర్చి ఆలోచించవలసి ఉంటుంది. ఒకప్పుడు ఒక రచన సాహిత్యపు విలువలు కలిగి ఉన్నాకూడా, వైషయికంగా అంత ప్రయోజనకరం కాకపోవటమూ, అట్లాగే దీనికి వ్యతిరేక దిశలోనూ ఉండవచ్చు. ఈ రెండింటిలో దేని ప్రతిపత్తి ఎంతో నిరూపించి, విమర్శ రచనను ఒక మొత్తంగా విలువ కట్టవలసి ఉంటుంది. ఈ రెండింటి సమ్యక్స మ్మేళనంలోనే రచన ఉత్తమస్థాయినీ, ప్రయోజనకర స్థాయినీ చేరుకుంటుంది. ఈ దృష్టివదిలి ఏ ఒక్క అంశాన్నో ఆధారంచేసుకుని మిగతాదాన్ని కాదని రచనను తెగడటమో, పొగడటమో సరైన విమర్శకాదు.

ఒక రచన సాహిత్యపరిధిలోకి రావటానికి ఆ రచనలో ఉండ వలసిన విలువలు రెండు. ఒకటి పరిష్కృతమూ, విషయానుకూలమూ అయిన భాష, రెండవది అభివ్యంజన శిల్పమూ. ఈ రెంటి విషయంలో ఏనాడూ విప్రతిపత్తిలేదు. అయితే భాషయొక్క పరిష్కృతినిగూర్చిన భావనలోనూ, శిల్పస్వరూప విషయంలోనూ విలువలు మారుతూ ఉండవచ్చు. వీటి విషయంలో వైయక్తికమయిన ఇష్టానిష్టాలకు ప్రసక్తిలేదు. అయితే ప్రతిపాదింపబడిన విషయాన్నిగూర్చి కొంత ప్రసక్తి ఉండటానికి అవకాశం ఉన్నది. పలు సిద్ధాంతాల ఆవిర్భావమూ, వాటి సంఘర్షణా కారణంగా అభిప్రాయ భేదాలుండటం సహజం. కాని సైద్ధాంతిక వ్యామోహంతో ఏకపక్షంగా విమర్శ సాగితే, రచనకు అన్యాయం జరిగినట్టే. ఈ సైద్ధాంతిక వ్యామోహం ఒకప్పుడు ఏ స్థాయికి పోతుందంటే, రచనలోని మిగిలిన అంశాలను గూర్చి ఏమాత్రమూ ఆలోచన చేయని స్థితికి పోతుంది. అప్పుడు విమర్శ తన ధర్మాన్ని నిర్వహించినట్టుకాదు. పాఱీకమయితుంది. దీనివల్ల ప్రయోజనం లేకపోవటమేకాక, అవాంఛనీయమైన చెడు కూడా కలుగుతుంది.

మారుతున్న జీవితవిధానంలోని విలువలు, వాటిని బట్టి సాహిత్యపు విలువలు, తద్ద్వారా విమర్శ ప్రమాణాలూ మారుతూనే ఉంటాయి కాని, సహజమయిన సాహిత్యధర్మంగానీ, విమర్శధర్మం గానీ మారదు. అయితే ఈనాటి విమర్శ పలుచోట్ల ధర్మచ్యుత మయిపోతున్నది. ఆశ్రయింపులూ, దాక్షిణ్యాలు అధికమయి పోతున్నయి. ప్రధానమయిన రచనను వదిలిపెట్టి, వ్యక్తిని లక్ష్యం చేసుకోవటం జరుగుతున్నది. ఈ కారణంగా సాహిత్యానికి 'విమర్శ' ఏకపక్షంగానే మారుతున్నది. మరొక విచిత్రమూ, అవాంఛనీయమూ అయిన విషయం ఏమిటంటే, వ్యక్తిని లక్ష్యంగా చేస్తున్న విమర్శ, వర్గాలమార్పిడితో, లేదా దాని అపోహతో తన స్వరూపాన్నికూడా మార్చుకుని జీవితంలోని దుష్ప్రవృత్తుల మాదిరిగానే విశృంఖలంగా ప్రవర్తిస్తున్నది. హుందాతనాన్నీ, నిష్పాక్షికతనూ, నిజాయితీనీ, ఋజుత్వాన్నీ పాటించవలసిన విమర్శ వాటినుంచి దూరమై బజార్న పడిపోతున్నది. నిష్పాక్షికత, నిర్భయత్వం పేరిట నింద తాండవిస్తున్నది. ఈ రకమయిన 'విమర్శ' నిజమయిన విమర్శ యొక్క అస్తిత్వాన్నే శంకించగల ప్రమాదానికి దారితీస్తున్నది.

ఈవిధమయిన కాలుష్యం ఇట్లాఉండగా, సరయిన విమర్శ తనస్వశక్తితో అక్కడక్కడా ముందుకు సాగుతూనే ఉన్నది. అయితే విమర్శను సహించే ఓర్పు తగ్గిపోతున్నది. ఈ అసహనం విమర్శను ఒకప్పుడు బందీని చేసివేసే ప్రమాదమూ కలిగిస్తున్నది.

మరి ఈస్థితిలో సాహిత్యానికి, దాని విమర్శకూ భవిష్యత్తు శంకాస్పదంగా ఉండగా, సరయినరీతిని నెలకొల్పుకొని సాగించవలసిన బాధ్యత సాహిత్యకుల, విమర్శకులమీద ఈనాడు అధికంగా ఉన్నది. ఈనాటి సంక్లిష్ట సంకీర్ణ జీవితంలోని కుళ్ళును సాహిత్యంలోకీ, విమర్శలోకీ తెచ్చుకొని పరీక్షించుకోవటం ఈ రెంటికీ మంచినేమాత్రమూ కలిగించదు. మార్గదర్శకం కావలసినవే దారితప్పి గజిబిజిని సృష్టిస్తే నిజానికి సమాజానికి ఈ రెండింటివల్ల ప్రయోజనంలేదు. సామాజిక ప్రయోజనం లేనప్పుడు ఈరెంటికీ భవిష్యత్తులేదు. భవిష్యత్తును ఉజ్జ్వలం చేసుకోవటానికి ప్రయత్నించటం వాటి అస్తిత్వానికి ఈనాడు చాలా అవసరం.

WITH THE BEST COMPLIMENTS FROM

M/s. HIND FABRICATORS

8552–B, Mahatma Gandhi Road

SECUNDERABAD

Phone : 73175

Manufacturers of :

STEEL STRUCTURAL WORKS, WINDOWS, STEEL TANKS, FIRE BUCKETS, G.I. WATER STORAGE DRUMS, CONSUMER GOODS, AND ALL KINDS OF SHEET METAL PRODUCTS. A SPECIALIST

(we are also on Govt. approved list)

WITH THE BEST COMPLIMENTS FROM :

Sri Saibaba Packing Industries

Phone No. 35970

Manufactures & Suppliers

CORRUGATED PAPER ROLLS

CORRUGATED PAPER SHEETS

CORRUGATED PAPER CARTONS

IN ALL SIZES AND PLIES

6-3-905 Raj Bhavan Road, Somajiguda

HYDERABAD–4

Phone : 77471

For all your requirements

in Ready-made garments

PLEASE VISIT

Wear Well Apparels



7-2-638, Rastrapathi Road

SECUNDERABAD-3

మారుతున్న విలువలు - విమర్శ

శ్రీ జి. వి. సుబ్రహ్మణ్యం

నేటి ప్రపంచసమాజం వడివడిగా మారిపోతున్నది. దానితోపాటు దాని దృక్పథాలూ, అభిరుచులు కూడ శరవేగంతో మారిపోతున్నవి. సమాజాన్ని అనుసరించి ప్రపంచ సాహిత్యాల్లోకూడ ఎన్నో నూతన ప్రయోగాలూ, నవ్యప్రక్రియలూ, తలయెత్తుతూ నిత్యనూతనత్వాన్ని భజిస్తున్నవి.

నేటి రచయిత తానేదేశంలోఉన్నా, ఏ వ్యవస్థలో ఉన్నా ప్రపంచ మానవకోటిలో ఒక సభ్యుడుగా, ప్రపంచ పరిణామాలకు హేతుభూతుడైన వ్యక్తిగా, నవ్యసమాజంలో ఒక భాగస్వామిగా భావిస్తున్నాడు. కాబట్టి అతని సాహిత్య సృజన వ్యాపారంలో ప్రపంచ పరిణామచ్ఛాయలు ప్రతిబింబింపక తప్పదు. అతడు తనభావంలోను, భావనలోను, ప్రక్రియలోను ప్రయోగంలోను నిత్యనూతనత్వానికీ లోకానికి అందించటానికి యత్నిస్తున్నాడు. దానితో ప్రాత పద్ధతుల విలువలు మారటం, మారురూపు తాల్చటం, కొంగ్రొత్త పద్ధతులకు విలువలు హెచ్చటం జరుగుతున్నది.

ప్రపంచపరిణామానికి ముఖ్యహేతువు విజ్ఞానశాస్త్రం. విజ్ఞాన శాస్త్రం అచుంబితమైన మహోన్నతాలను అందుకోవాలనీ, అగాధమైన లోతులను కొలచిచూడాలనీ, అజ్ఞాతమైన రహస్యాలను వెలికి తీయాలనీ కృషిచేస్తున్నది, ప్రకృతి శక్తులకు విశ్లేషించి అద్భుతమైన శక్తులను ఉత్పాదిస్తున్నది, ప్రయోగిస్తున్నది. అందువల్ల ప్రపంచ సమాజం విజ్ఞానశాస్త్రసహాయంతో అద్భుతావహములైన అనుభూతులనూ, అపూర్వమైన శక్తులనూ నిత్యజీవితంలో పొందగలుగుతూ ఉన్నది. అందువల్ల నేటి రచయితకూడా అబ్బురపాటు కల్గించే

నూతన ప్రక్రియా ప్రయోగాన్ని కాంక్షిస్తున్నాడు; శక్తివంతమైన పలుకుపడిని చేపట్టుతున్నాడు.

నేటి విజ్ఞానశాస్త్రం ప్రపంచానికి భౌతికమైన ప్రగతితోపాటు, శాంతి పరిరక్షణను గూర్చిన భయాందోళనాలను కూడా ప్రసాదిస్తున్నది. విజ్ఞానశాస్త్రం రాజనీతిచే శాసింపబడటంతో ప్రపంచంలో సంఘర్షణ ఉత్పన్నమౌతున్నది. దీని ప్రభావం రచయితభావంమీద బలంగా ముద్రించుకొంటున్నది. శాంతికి దూరమౌతున్న సమాజం ప్రశాంత చిత్తవృత్తితో బ్రతకలేక పోతున్నది. అందువల్ల రచయిత కూడా సాహిత్యసృజన వ్యాపారంలో సమాధిని పొందలేకపోతున్నాడు, సాహిత్య పరమ ప్రయోజనాన్ని దర్శించే సావకాశం అతనికి దొరకకుండా పోతున్నది. ప్రపంచపరిణామ వేగాన్ని చూచి అబ్బురపాటుచెంది, ఆవేశంతో దాన్ని సమీక్షిస్తున్నాడు. పరుగెత్తుతున్న కాలం కన్నా ముందు పరుగెత్తుదామని అంగలుపంగలు వేస్తున్నాడు. ఇరుకైన దుస్తులు వేసుకొని, సాగిపోతున్న రైలుబండిని అందుకొనటానికి పరుగెత్తే ప్రయాణీకుడికి పెట్టే బేడా బరువైనట్లే ప్రగతి శీలుడైన రచయితకు గతం, సంప్రదాయం భారంగా తోస్తున్నది. నేటి రచయితకు తానెక్కదలచుకున్న రైలుబండి అందకపోతే ఒక జీవితకాలం వృధాఅయిపోయినట్లును కుంటాడు. రేపువచ్చే క్రొత్త బండిలోని ప్రయాణీకులతణ్ణి ప్రాత మనిషిగా వెక్కిరిస్తారు. కాబట్టి రైలుబండిలో చోటు లేకపోయినా చువ్వలు పట్టుకొని వ్రేలాడుతూనైనా తన ప్రయాణం సాగిస్తున్నాడు. రైలుబండి ఫుట్‌బోర్డ్‌మీద నిలుచున్నవారికి కుదుపు ఎక్కువైనా కాలంతోపాటు తామూ నడుస్తున్నట్లని పిస్తుంది. లోపల కూర్చున్న వారికి రైలు కదులుతున్నదని తెలుసుగాని, తాము కదులుతున్నట్లని పించదు. లోపల ఉక్కిరిబిక్కిరౌతున్నా బైటికి వచ్చే అవకాశంకూడా లేకుండా పోతున్నది. ఇంక పక్కలు పరిచి గుర్రువెట్టి నిద్రపోతున్న ప్రయాణీకులకు రైలు ఆగిందీ తెలియదు; పోతున్నదీ అంతుపట్టదు. అసలు రైలుబండిలోనే మూడు తరగతులు. వాటిని కాదని జనతా రైళ్ళను ఎక్కినా అందులోని మూడవతరగతిలోనే మూడుతరగతులు ఉన్నవి.

నేటి ప్రపంచసమాజాన్ని తీర్చిదిద్దుతున్న మరొకశక్తి రాజకీయవ్యవస్థ. మానవాళికి ప్రజాస్వామ్యం ఉత్తమమైన వ్యవస్థగా పరిగణింపబడుతున్నా, కాపిటలిజం. కమ్యూనిజం, నియంతృత్వం — ఈ వ్యవస్థలో ప్రజాస్వామ్యం వివిధరూపాలతో సాక్షాత్కరిస్తున్నది. రాజకీయవ్యవస్థలు ప్రజల జీవన విధానాన్నే గాక సాహిత్య జీవితాన్ని కూడ శాసించి తన చెప్పుచేతల్లో ఉంచుకొంటున్నది. దానితో సాహిత్యం వికసించవలసినంత స్వతంత్రంగా, స్వచ్ఛంగా విస్ఫారలేక పోతున్నది. అభివృద్ధిచెందుతున్న స్వతంత్రదేశాలలోకూడా ఆ ప్రభావం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పడుతూనే ఉన్నది. అది కొన్నిచోట్ల సాహిత్యక్షేత్రాల్లో కూడ సంఘర్షణకు దారితీస్తున్నది. ఇట్టి పరిస్థితులు భారతదేశంలో స్పష్టంగా కనపడుతూనే ఉన్నవి.

ఇక్కడ మరో విషయం గుర్తుంచుకోవాలి. నేటి మానవుడు భౌతికమైన ప్రగతినే అభ్యుదయం అంటున్నాడు. ఆ అభ్యుదయాన్ని అధర్మంగా సంపాదించటానికి కూడ వెనుకంజ వేయటంలేదు. ఆత్మ వికాసంకన్నా ఆర్థికసంపద్వికాసమే ధ్యేయంగా నడచుకొంటున్నాడు. వ్యక్తి తన వ్యక్తిగతజీవితాన్ని సమాజ జీవితాన్నీ రెండుగా భావిస్తున్నాడు. తనఅనుభూతిని గోప్యంచేసి సామాజికాభిరుచులను ప్రకటిస్తున్నాడు. సమాజంలో కనపడే అసమగ్రత, అసమానత, వైవిధ్యము, సంఘర్షణ, కుళ్లు, కొంచెతనం, వీటిని తన రచనల్లో ప్రతిబింబింపచేస్తున్నాడు; అధిక్షేపిస్తున్నాడు. వీటన్నిటినీ చూచి,సంక్షుభితమైన మానవ హృదయోద్వేగాన్ని రచనల్లో ప్రజ్వలింపజేస్తున్నాడు. కాని జీవిత చైతన్యానికి మూలకందమైన ఆత్మను, అజరామరమైన దానిశక్తి కున్న ప్రాధాన్యాన్ని రచనల్లో ప్రతిబింబింపజేయటం విస్మరిస్తున్నాడు. రచయిత సమాధినిపొంది రచన సాగింపగలిగితే ఆ పరమార్థాన్ని ఆవిష్కరింపగలుగుతాడు. సమాధికి దూరమైన నేటి రచయిత కన్నులు మూసికొని ఆత్మను దర్శించే అవకాశంలేక కంటికి కనపడే విభిన్న ప్రకృతిని విభిన్న ప్రక్రియలలో వ్యక్తీకరిస్తున్నాడు. కాబట్టి నేటి సాహిత్యంలో వస్తువుకు, ఆకృతిశిల్పానికి కలిగినంత ప్రాధాన్యం సాహిత్యపరమార్థానికి కలగటంలేదు.

నేటి సాహిత్య ప్రక్రియలలో విమర్శ ఒక శక్తివంతమైన ఆయుధం. దానికి రెండువైపులా పదునున్నది. అది కళ, శాస్త్రం. కళాస్రష్టయైన రచయిత హృదయాన్ని, కళాపిపాసియైన సామాజికుని అనుభవాన్ని విలువకట్టి సప్రమాణంగా వెలువరింపగలిగిన సాహిత్య ప్రక్రియ విమర్శ. విమర్శ అనే ఆయుధం లేనిది కళ ప్రగతిని సాధించ లేదు; కలలుకంటున్న మరో ప్రపంచాన్ని స్వాయత్తం చేసుకోలేదు.

తెలుగుదేశంలో మరోప్రపంచం పిలుపు విన్నవాటినుండీ కవులూ, రచయితలూ దాన్ని అందుకొందామనీ, ఆక్రమిద్దామనీ, దాని రూపురేఖలు సుస్పష్టంగా తీర్చిదిద్దుదామనీ ప్రయత్నిస్తున్నారు. కాని ఆవేశంతో ముందుకు దూకుతున్న రచయితలసైన్యానికి బలమైన విమర్శాయుధాలు ఉత్పత్తికావటంలేదు. కొంతకాలం విదేశాలనుండి వచ్చే దిగుమతులమీదనే ఆధారపడవలసి వచ్చింది; తరువాత సొంతగా తయారుచేసుకుందామని ప్రయత్నాలే ముడిసరుకు, విడిభాగాలూ అధనుకు దొరకక్కపోవటం సంభవించింది. అట్లని కర్మాగారాలు మూతపడలేదు. దొరికిన స్వదేశీపదార్థాలతో దొడ్డపనిముట్లను కొన్ని వారు రూపకల్పనం చేసుకున్నారు; ఇంకా క్రొత్తమోడల్సు కొరకు బ్లూప్రింట్లు తయారుచేస్తున్నారు.

నాకు తెలిసినంతవరకు - నవ్య సాహిత్యయుగంలో తెలుగు విమర్శ ప్రస్తుతం నాలుగవ దశలో నడుస్తున్నది. కందుకూరి వీరేశలింగంపంతులుగారికి పూర్వమున్న సాహిత్య విమర్శ పూర్వయుగానికి చెందింది. ఆతర్వాత నవ్యయుగం ప్రారంభమైంది. అందులో ప్రథమదశ పరంపరాగతమైన శాస్త్రవిమర్శ. రెండవదశ పాశ్చాత్య సంప్రదాయైక విమర్శ. మూడవదశ సంప్రదాయబద్ధమైన సిద్ధాంతాలనూ, పాశ్చాత్య సంప్రదాయాలనూ యథావకాశంగా సమన్వయించుకొన్న ప్రాత క్రొత్తల మేలుకలయిక" గల విమర్శ. ఈ మూడవదశ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనాత్మకమైన విమర్శయందు పరిణతిచెందింది. ఆ తరువాత వచ్చింది అధునాతన విమర్శ. ప్రస్తుతం ఈ వ్యాసంలో ప్రస్తావింపబడుతున్నది విమర్శయొక్క ఈ చివరిదశ.

అధునాతన విమర్శలకు ఆలంబనమైనది సమకాలీనాత్యంతాధునిక సాహిత్యం. అందులో కవిత్వవిమర్శదే అగ్రతాంబూలం.

నవల, నాటకం, కథానిక, ఏకాంకిక - ఇత్యాదులు కోకొల్లలుగా వస్తున్నా వాటిమీద విమర్శ మాత్రం చాలతక్కువగా వెలువడుతున్నది.

ఈ యుగంలో అభ్యుదయకవిత్వం, వచనకవిత్వం, అధివాస్తవిక కవిత్వం మొదలైన అవధుల్నిదాటి నేటిసాహిత్యం పరుగెత్తుతోంది. ఇజమ్ను ఎన్నో ఇప్పటికే కొంత ప్రాతపడ్డట్లు కనిపిస్తున్నవి. సంఘంలోని అవినీతిమీద విప్లవం తెద్దామన్న తీవ్రవాదం ఉషఃకిరణాలను ప్రసారిస్తున్నది. రచయితకు సంఘంలో మందగిస్తున్న విలువ అతణ్ణి అగ్నిపర్వతంలా రగుల్కొనజేస్తున్నది. కాని, దానికి కావలసినశక్తి-విమర్శాయుధం, లేకపోవటంచేత అగ్నిపర్వతం బ్రద్దలుకావటంలేదు.

తెలుగు సాహిత్యంలో క్రొత్తక్రొత్త ప్రక్రియలు వచ్చినంత వేగంగా వాటికి రూపకల్పనం చేసి, ప్రామాణికత్వాన్ని కల్పించే విమర్శ సాగటంలేదు. ఈ లోపం రచయితల కలాలబలాలను పట్టి చూస్తున్నది. కొందరు ఆధునిక కవులు తమ కవిత్వ ప్రక్రియా స్వరూప స్వభావాలను తామే విమర్శ రూపంగా వెలయిస్తున్నారు. ఇది అభిలషితమైన ఉత్తమ సంప్రదాయం. ఇట్టి పద్ధతిలో రచయితలే వ్రాసిన వ్యాసాలకు ఆధునిక సాహిత్యంలో మంచి గౌరవం కనబడుతున్నది. రచయితలు తమ వ్యవసాయాన్నిగూర్చి తామెంత చెప్పుకున్నా సహృదయ విమర్శకుని ద్వారా విమర్శ రావాలనీ, అప్పుడే అది సమగ్రమౌతుందనీ భావిస్తారు. అది నిజంకూడా. అందువల్ల అధునాతన కవిత్వశాఖలకు చేవకలగలేదు; ఊడలు దిగలేదు.

ఈ విపరీత వరిస్థితి యువరచయితల్లో ఒక అసంతృప్తిని, ఒక ఉద్వేగచైతన్యాన్ని కలిగిస్తున్నది. అందువల్ల చాలమంది రచయితలు కవిత్వంలో విమర్శను వ్రాస్తున్నారు. వర్ణనీయాంశాన్ని డిసెక్షన్ చేసి చూపిస్తున్నారు. తమకు నచ్చిందాన్ని ఆవేశంతో పొగుడుతున్నారు; కష్టమైన దానిని పడతిడుతున్నారు. కనపడని ఏదో లక్ష్యంకోసం డిసెక్షన్ చేస్తున్నారు. కాకువులూ, అన్యాపదేశాలూ, అధిక్షేపాలూ, సింబల్సూ, వ్యాజనిందలూ తమ కవితాఖండాలలో గుప్పిస్తున్నారు. మాటలలో వాడిదనం ఉన్నా అతిగూఢత్వాన్ని ఆలంబనం చేసుకొని భావాన్ని ఆవిష్కరిస్తున్నారు. అందువల్ల

సామాజికునికి సాహిత్యం సాధించే ప్రయోజనం తెలిసీ తెలియకుండా పోతున్నది.

ఇట్టి విషమ పరిస్థితుల్లో విమర్శకుని అవసరం ఎంతైనా ఉంది. అయితే నేటి విమర్శకుడు తన గురుతరమైన బాధ్యతను సగర్వంగా నిర్వహించటానికి ముందుకు వస్తున్నాడా ? అన్నది సమస్య. నేడూ విమర్శ చేస్తున్నాడు ఆధునిక కవిత్వ విమర్శకుడు. కాని, అది పరిచయాత్మకమైన సమీక్షమాత్రమే. కొన్నిచోట్ల కవితాఖండాల వ్యాఖ్యానం మాత్రమే. వీనిలోనే విచిత్రంగా రాజకీయవాదాలూ, కులవర్గ సమస్యలూ, వ్యక్తిగతాభిమానాలూ, అభిరుచులు చోటు చేసుకుంటున్నవి. ఇవి విమర్శవృక్షానికి చీడపురుగుల వంటివి. వీటిని అధిగమించి శాశ్వత ప్రమాణాలనుగాని, సాపేక్ష ప్రమాణాలనుగాని అనుసరిస్తూ సాగించే సమర్థమైన విమర్శ పెరగటంలేదు. అందువల్ల అధునాతన విమర్శకుడు తాను మెచ్చుకొంటున్న నేటి కవిత్వంలోని విలువను సమర్థించటానికి బదులు గతాన్ని తిడుతూ తన మాటకు గతి కల్పించుకోటానికి యత్నిస్తున్నాడు. ఇట్టిది మన విమర్శ చరిత్రలో దయనీయమైన అవస్థ.

నేటి విమర్శకులలో కొందరు కవిత్వంలో ప్రతిబింబించిన రాజకీయ సిద్ధాంతాలకుగానీ, మనస్తత్వ సిద్ధాంతాలకుగానీ, సామాజిక సూత్రాలకుగానీ, విజ్ఞానశాస్త్ర విషయాలకుగాని ప్రాధాన్యాన్ని కల్పించి రచనలు సాగిస్తున్నారు. ఇవి ప్రాచీన సాహిత్యంలోని మత సిద్ధాంతాలనూ, శాస్త్రాంశాలనూ, సాంఘిక పరిస్థితులనూ, వివరించే విమర్శల కోవకు చెందుతవి. సాహిత్య పరమార్థాన్ని నిరూపించే దృష్టి వీటిల్లో తక్కువ. విమర్శ రచయిత వ్యుత్పత్తిని, బుద్ధి పాటవాన్ని వివరించినంత మాత్రాన చాలదు. సాహిత్యం సామాజికుని కందించే రసానుభూతిని నిరూపించి చెప్పే విమర్శ పద్ధతి అవసరం నేడు. అప్పుడే విమర్శ సాహిత్య పరమార్థాన్ని నిరూపించేశాస్త్రంగా, కళగా సంపూర్ణావిష్కారం పొందగలుగుతుంది.

నేటి రచయిత అంతర్ముఖుడై అనుభవించి వ్రాసిందానికన్నా బహిర్ముఖుడై భావించి అధికంగా వ్రాస్తున్నాడు. అందువల్ల కవితలో రచయితయొక్క ఆత్మీయతకన్నా ఆలోచన తన్మయత్వం కన్నా

తర్కం, ఆర్ద్రమైన వాక్కుకన్నా వక్రోక్తి, అనుభూతికన్నా ఆవేశ చమత్కారాలూ హెచ్చుగా భాసిస్తున్నవి. దీనికి కొంతవఱకు సామాజికుల అభిరుచులుకూడా కారణాలౌతున్నవి. నేడు చదువు కున్నవారు సమాజంలో ఎక్కువైనా గాఢమైన సాహిత్యాభిరుచి కలవారు తక్కువగానే కనపడుతున్నారు. వారికి జీవితంలో ఆర్థికంగా లాభంగడించే లౌకిక విషయాలూ, వాటి వివరాలూ ఆసక్తిని కలి గించినంతగా అలౌకికానందం అందించే సాహిత్యం అభిరుచిని కల్గించ టంలేదు. వారికి బరువైన భావాలు బరువనిపిస్తున్నవి; గాఢమైన బంధం ఉక్కిరి బిక్కిరి చేస్తున్నది; నియమ నిబంధనాలు శృంఖలాలుగా కనిపిస్తున్నవి: చిత్తద్రవీకరణంకన్నా చిత్తోత్పత్తి సమాదరణీయ మౌతున్నది; అత్యంత మధురరచనంకన్నా అంత్యప్రాసలమీద ఆదరం పెరుగుతున్నది; క్షీణయుగమని చెప్పబడ్డ దక్షిణాంధ్ర యుగం లోని శృంగారంకన్నా పలచబారిన పచ్చిశృంగారంమీద ప్రజలమనస్సు పరవళ్లు త్రొక్కుతున్నది. కాబట్టి నేటిరచయిత సామాజికులకు చిత్తరంజనంచేస్తూ సాహిత్యప్రగతికి సోపానాలు కడుతున్నాడు. ఓట్ల బలంమీద గద్దెకెక్కే ప్రజాప్రతినిధివలెనే ప్రజాబలంమీద రచ యిత మనుగడ సాగిస్తున్నాడు.

నేటి విమర్శకునకూ ఈ అవస్థ తప్పటంలేదు. సామాజికులు మెచ్చని విమర్శ ప్రాచుర్యాన్ని పొందలేకపోతున్నది. అందువల్ల ఉక్తి చమత్కారంతోనూ, ఉపరితల పరామర్శలతోనూ సాహిత్య సమీక్ష సాగుతున్నది. పరిశోధనలు పండితలోకానికి సంబంధించినవనీ, పత్రికా సాహిత్యమే ప్రజలకు సంబంధించినదనీ. ప్రతీతి వ్యాపిస్తున్నది. పండితులకూ చదువుకున్న సామాజికులకూమధ్య అగాధం పెద్దదౌ తున్నది. అందువల్ల పరిశోధకుడైన విమర్శకునకు నేడు ప్రజాదరణం లేదు. సామాజికులకు కావలసిన విమర్శను వెలయించేవాడికి శాస్త్ర ప్రమాణాలవసరం లేదు. అందువల్ల పత్రికా సాహిత్యం ప్రబలంగా వ్యాపించిన ఈ రోజుల్లో సామాజికుల దృష్టిని నిజమైన సాహిత్య విమర్శవైపు మళ్లించి, దాని ప్రమాణాలను పునరుద్ధరింపవలసిన బాధ్యత మన అందరిమీదా ఉన్నది.

క్రాంతదర్శియైన కవి హృదయంతో, నిర్దుష్టమైన శాస్త్ర దృష్టితో, కళాత్మకంగా విమర్శనను తీర్చిదిద్ది, రేపటి సాహిత్యానికి రూపురేఖలు దిద్దవలసినవాడు విమర్శకుడు. మారుతున్న విలువల్లో మరువరాని సత్యం ఇది.



తెలుగు కవిత్వాన్ని ఖండించి, దీవించి డోగించి, కాసించి రక్షించే అపూర్వశక్తి మీ చేతులో పుస్తకం. *Pass it on.*

* * * *

కవిత్వంలోనూ, జీవితంలోనూ, *Economy of words and thoughts* లేకపోవడం దేశభక్తికన్న హీనమైన పాపం, ఆత్మ లోకంలో దివాలా.

— చలం

* * * *

పొద్దు తిరుగుడు పువ్వులా
లోకం చుట్టూ పరిగెత్తకు
మనిషివై
కాకుంటే కనీసం మనిషివై
ఎఱ్ఱగులాబిలా – నిప్పులా
యౌవ్వనంలా – మందహాసంలా
నిజంలా – నింగి మధ్య మార్తాండునిలా
అరక్షణం బ్రతుకు.

— భైరవయ్య

యువభారతి

నిర్వహించుతున్న

"మారుతున్న విలువలు -
రచయితల బాధ్యతలు" గోష్ఠి

జయప్రదం కావాలని—

శుభాకాంక్షలతో

ప్రోగ్రెసివ్ ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్
5-4-776, ఆబిడ్స్,
హైదరాబాదు-1.

189

మీ రూపాయిని ఒక సత్కార్యానికి వెచ్చింపనివ్వండి —
అది మీకు గొప్ప అదృష్టాన్నికూడా చేకూర్చవచ్చు!

ఆంధ్రప్రదేశ్ సంక్షేమనిధి స్వాతంత్ర్యదిన ప్రత్యేకకానుక!

రు. 10 లక్షలు గెలుపొందండి!

12వ రాఫిల్ పదిలక్షల రూపాయలను 3,312 బహుమతులద్వారా
అందివ్వనున్నది. టిక్కెట్టువెల రు. **1-00** మాత్రమే

బోనస్: ఒకటవ, రెండవ మరియు మూడవ బహుమతులుపొందే టిక్కెట్లు
అమ్మినవారికి 10% బోనస్‌గా 13వ రాఫిల్ టిక్కెట్లు యివ్వబడును.

100 టిక్కెట్ల విలువ రు. **75-00** మాత్రమే!

టిక్కెట్ల విలువ ముందే చెల్లించవలెను.

సంక్షేమ నిధి **12**వ రాఫిల్ బహుమతుల జాబితా

1	మొదటి బహుమతి	రు. 2.5 లక్షలు	రు. 2,50,000
2	రెండవబహుమతులు ఒక్కొక్కటి	,, 50,000	,, 1,00,000
4	మూడవ ,, ,,	,, 25,000	,, 1,00,000
5	నాల్గవ ,, ,,	,, 10,000	,, 50,000
100	ఐదవ ,, ,,	,, 1,000	,, 1,00,000
200	ఆరవ ,, ,,	,, 500	,, 1,00,000
3000	ఏడవ ,, ,,	,, 100	,, 3,00,000
3,312	బహుమతుల మొత్తము		రు. **10,00,000-00**

అమ్మకపు దార్ఢ్య బహుమతులు: అత్యధిక సంఖ్యలో టిక్కెట్లు అమ్మిన
వారికి ఈ దిగువ బహుమతులు యివ్వబడును.

మొదటి బహుమతి	... ...	2,000	13వ రాఫిల్ టిక్కెట్లు
రెండవ బహుమతి	... ...	1,500	,, ,, ,,
మూడవ బహుమతి	... ...	500	,, ,, ,,

డ్రా తేది: 15-8-1970

ఏజంట్లు తమ టిక్కెట్లను ముందుగా సొమ్ముచెల్లించి ఈ దిగువ
చిరునామానుండి పొందవచ్చును.

గౌరవ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ సంక్షేమ నిధి

నెం. బి. 5-8-51, లక్ష్మీభవన్, ఫతేసుల్తాన్‌వీధి,
నాంపల్లి, హైదరాబాదు-1

తంతి: 'వెల్‌ఫేర్' ఠాకూర్ వి. హరిప్రసాద్
ఫోన్: 56004 గౌరవ కార్యదర్శి

మారుతున్న విలువలు - నవల

శ్రీ అక్కిరాజు రమాపతిరావు

సాహిత్యప్రభావం సంఘంపైనా, సామాజిక పరిణామాలు సాహిత్యంలోనూ, ప్రతిఫలించడం సార్వకాలికమైన సత్యమే. సామాజికప్రయోజనాన్ని, ఏదోవొకస్థాయిలో సాహిత్యం దృష్టిలోపెట్టుకొనక తప్పదు. సాంఘికావసరాలను, సాంఘికవ్యవస్థను, సాహిత్యం, ప్రతి దేశంలోను, ప్రతి కాలంలోనుకూడా, ప్రతిబింబిస్తూనేవుంటుంది. సాంఘిక పరిణామాలను బట్టే సాహిత్యపరిణామాలుకూడా ఏర్పడుతూవుంటాయి.

సంఘం ఎప్పుడూ, తానున్న వ్యవస్థకన్నా మంచివ్యవస్థను రూపొందించుకోవాలని, సంఘర్షిస్తూనేవుంటుంది. అందుకనే "మంచి గతమున కొంచెమేనోయ్" అన్న కవి వాక్కు విలువైందిగా అనిపించడం.

యుద్ధాలు, శాస్త్రీయపరిజ్ఞానంలో పురోభివృద్ధి, ఖండఖండాంతరాల మధ్య ఎల్లలు కరిగిపోవడం, పారిశ్రామిక పురోగమనం మొదలైనవన్నీ, వివిధదేశాలలోని, సాంఘికమార్పులకు కారణాలు.

శతాబ్దంకింద, సాంఘికఅవసరాలకు, వ్యక్తిగతమైన సమస్యలకు, లక్ష్యాలకు, ఆశయాలకు, నేటికాలానికి, మారిపోయిన వ్యవస్థ తాలూకు విలువలతో పోలికేవుండదని చెప్పాలి. ఇప్పుడు కొత్తసమస్యలు, కొత్త ఘర్షణలు, కొత్త పరిష్కారాలు ఎప్పటికప్పుడు పుట్టుకొస్తూవుండవచ్చునుగాక. అయినా మార్పు అనేది నిత్యనూతనంగా, నిర్విరామంగా కొనసాగుతూనేవుంటుంది.

వ్యావసాయికమైనవ్యవస్థ, క్రమంగా పారిశ్రామికవ్యవస్థగా పరిణామం చెందడంతో, ప్రపంచంలోని వివిధ దేశాలలోని, సామాజిక, మత, రాజకీయవిప్లవాలు, తమ ప్రభావాన్ని చూపడంతో, మనదేశంలో, సాంఘిక దృక్పథంలోనూ, సామాజిక విలువల్లోనూ కొన్ని మార్పులు

వచ్చాయి. పరిణతిచెందని ప్రజాస్వామిక వ్యవస్థ తాలూకు, కొన్నిసమస్యలు, సంఘర్షణలు, సమకాలీనసంఘం ఎదుర్కొంటున్నది. పరిపూర్ణంగా ఆర్థికాభివృద్ధిని సాధించకపోవడమూ, నైతికవిలువల పతనము. ధనవంతుల దోపిడి, విద్యావంతుల అవినీతి, యీ సమస్యలను మరింత క్లిష్టతరం చేస్తున్నాయి. ఎక్కడచూసినా పోటీ, సుఖలాలసత్వము, స్వార్థపరత్వము, పెచ్చు పెరిగిపోయినాయి. అందువలన ఒక అశాంతి, అసంతృప్తి, హింసాత్మకప్రవృత్తి, సామాజిక విలువలను కలుషితం చేస్తున్నాయి.

నీతిగా, న్యాయంగా, ముక్కుసూటిగా, బ్రతకడానికి అవకాశాలు లోపించిపోతున్నాయి రోజు రోజుకు. అందువలన, మేధావులుకూడా, యీ అస్తవ్యస్తమైన పరిస్థితులకన్నిటికీ కారణాలేవి? అన్న జిజ్ఞాసలోపడ్డారు. మళ్ళీ అనేకాభిప్రాయాలు తలలెత్తాయి. పూర్వపు విలువలే యీ దుస్థితి కంతా కారణమని, ఆ విలువలను సమూలంగా నాశనం చెయ్యాలని, ఓక వర్గంవారు తీవ్రంగా పూనుకొన్నారు. వాళ్ళు సువ్యవస్థను రూపొందించడంలో హింసాత్మకమైన మార్గాన్నికూడా అవలంబించడం తప్పుకాదంటారు. వీళ్ళది అతిధోరణి.

ఏది ఏమైనా, ఎవరైనాసరే, సామాజిక పరిణామాలకు తలవొగ్గక తప్పదు. వెనుకటి విలువలన్నీ నశించిపోతున్నాయనీ, భీభత్సమైన పరిస్థితుల వైపు మనం పయనిస్తున్నామనీ, అనుకోవాల్సిన పనిలేదు. చీకటి తరవాత, వెలుగు తప్పకుండా వస్తుంది. వెనకటిరోజులకన్నా విద్యావంతుల సంఖ్య ఇప్పుడు పెరుగుతున్నది. మనిషి మనిషికీమధ్య ఉండే వ్యత్యాసాలుకూడా చాలావరకు తగ్గిపోయినాయి. అయితే మనిషిలో నైజంగావుండే స్వార్థపరత్వము, అత్యాశ, మొదలయిన దుర్గుణాలవల్ల సంఘంలో కొత్తవర్గాలు, కొత్తవిలువలు, పరిణమించి సాధించిన ఏకొంచెంమందో పరిగణనలోకి రాకుండాపోవడమూ మనం చూస్తూనేవున్నాము.

ప్రజాస్వామ్యవ్యవస్థలో పరిపాలనా యంత్రాంగం సమర్థవంతంగా బాధ్యతలను నిర్వర్తించలేకపోతే అనేకమైన చెడుఫలితాలను అనుభవించాల్సివస్తుంది ప్రజలు. నీతి, న్యాయము, సామర్థ్యమూవున్న ప్రభుత్వవ్యవస్థ తప్ప ప్రజాస్వామ్యప్రభుత్వాన్ని విజయవంతంగా నిర్వహించలేదు. సామాన్యప్రజల జీవనస్థాయికన్నా, సంఘంలో అదృష్టవంతులైన ఏకొద్ది వర్గపు జీవనస్థాయో పెరిగినందువల్ల అది సంఘర్షణలకు దారితీస్తుంది కాని సువ్యవస్థను నిరూపించలేదు.

సాంఘికమైన అభిరుచులు, సంఘంలోని శాంతి భద్రతలు, మేధావుల ధోరణి సాహిత్యాభిరుచులను దిద్దితీరుస్తాయి. కేవలం సామాజిక ప్రయోజనము అంటే సత్సందేశాన్ని ప్రబోధించడమే సాహిత్యపు ముఖ్య కర్తవ్యం కాకపోయినా తక్కిన లలితకళలకన్నా సమాజాన్ని దిద్దితీర్చడంలో సాహిత్యానికి ఎక్కువబాధ్యతా, ప్రాముఖ్యమూ వున్నాయి. సంగీతము, చిత్రలేఖనము, శిల్పము మొదలైన కళలన్నిటికన్నాకూడా సాహిత్యం ప్రజల అభిరుచులను ఎక్కువగా ప్రభావితం చేస్తుంది. అందువల్ల ఉత్తమ సాహిత్యానికి సాంఘికప్రయోజనంకూడా ప్రధానాశయంగా వుండటం అభిలషణీయం.

కందుకూరి వీరేశలింగంగారి కాలంలో, చాలా ఎక్కువగా, తెలుగు దేశంలోనూ, తద్వారా తెలుగు సాహిత్యంలోనూ, సామాజిక దృక్పథం, బాగా వేళ్ళు తన్నుకున్నది. ప్రజలను విజ్ఞానవంతులనుగా చేయాలని, దానికి వారిలో విద్యా, వివేకాలను పెంపొందించడమే మార్గమని, తద్ద్వారా సామాజికమైన సుగతి సాధించవచ్చునని ఆయన సాహిత్య దృక్పథాన్ని పెంపొందించారు. రాజకీయమైన పరిణామాలకు ముందుమెట్టుగా సాంఘికమైన చైతన్యం ప్రజల్లో పెంపొందాలని, సంఘసంస్కారాన్ని సాధిస్తే రాజకీయ చైతన్యాన్ని ప్రజల్లో పెంపొందింపజేయడం సులభమవుతుందని పంతులుగారాశించినట్లుగా కనబడుతుంది. అందువల్ల కిందటి శతాబ్దంలో సాంఘిక పరిణామాలు ఎక్కువగా సాహిత్యాన్ని ప్రభావితం చేస్తే ఈ శతాబ్దంలో రాజకీయ పరిణామాలు సాహిత్య ధోరణులను ప్రభావితం చేస్తూవుండటం మనం చూడవచ్చు.

వార్తాపత్రికలు, సినిమా, రేడియో, టెలివిజన్ మొదలైన యంత్ర యుగపు సాధనాల ద్వారా ప్రజల్లో సాంఘికచైతన్యం ఎక్కువైంది. ఇదివరకటికన్నా ప్రయాణ సౌకర్యాలు పెరిగి, ప్రజలమధ్య రాకపోకలు ఎక్కువ కావడంతో పాత దృక్పథాలు చెదరిపోయి విధిగా ప్రజలు కొత్త దృక్పథాలను అలవాటు చేసుకోవడం జరిగింది. ఆశ్రిత పక్షపాతానికి, అవినీతికి వశమైపోయిన ప్రభుత్వ వ్యవస్థవల్ల ఒకవర్గంవారి దోపిడీ బాగా పెచ్చుపెరిగి కలిమిలేములమధ్య కార్పణ్యాలు వృద్ధిపొందాయి. దానితో మత, నైతిక విలువలు విశ్వాసాలపట్ల నిరాదరణ ఎక్కువైపోయింది. ఈ అవ్యవస్థకంతటికీ కారణం ప్రభుత్వవ్యవస్థలోని లోపాలే అని చెప్పాలి.

మనదేశం స్వాతంత్ర్యంపొందినతరువాత దురదృష్టవశాత్తూ సామాజికోన్నతి సాధించాలనే లక్ష్యం దృష్టిపథంనుండి తప్పుకొన్నది. దేశహితం కన్నా, దేశ ప్రయోజనాలకన్నా తన సౌఖ్యం ముఖ్యం అన్నధోరణి విద్యావంతుల్లోనూ, అధికారవర్గంలోనూ పెరిగిపోయింది. చెడుగావున్న వ్యవస్థను పునర్నిర్మాణం చేయాలంటే చాలా శ్రమపడవలసి వుంటుందికాని, ఉన్న వ్యవస్థను పాడుచేయటం సులభంగానే సాధ్యపడుతుంది. ప్రథానోపాధ్యాయుడు నీతి, నిజాయితీ కలవాడై, సమర్థుడై తన కర్తవ్యాన్ని తు. చ. తప్పకుండా నిర్వర్తించగలవాడైతే ఆయనకింద పనిచేసే ఉపాధ్యాయులు గాని, ఆ స్కూల్లో చదువుకొనే విద్యార్థులుగాని కర్తవ్యపాలనంలో, బాధ్యతా నిర్వహణంలో స్వశక్త్యానుసారంగా శ్రమించవలసి వుంటుంది. అట్లాకాక, ప్రథానోపాధ్యాయుడే అలసుడైతే, అవినీతిపరుడైతే అతడి సహాయకులుగాని, విద్యార్థులుగాని తమ కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వహించరు. సరిగ్గా స్వాతంత్ర్యానంతరం దేశపరిస్థితులు ఈ విధంగానే పరిణమించాయి. అందువల్ల సంఘంలో అవాంఛనీయమైన పరిణామాలెన్నో వచ్చాయి.

నవ్యకవిత్వము, అభ్యుదయకవిత్వము, దిగంబరకవిత్వము మొదలైన ధోరణులన్నీ సమాజంలో వచ్చిన పరిణామాల ప్రతిధ్వనులే. కవిత్వంలో లాగానే ఇతర సాహిత్య ప్రక్రియలలోకూడా, ఇతర కళారూపాలలోకూడా ఇలాంటి మార్పులు ప్రతిబింబించాయి. సంగీతంలోను చిత్రలేఖనంలోకూడా ఇటువంటి నవ్యధోరణులు పుట్టాయి. సాంఘిక జీవితంలోని అవిశ్రాంతి, సంఘర్షణ, వేగము, పోటీ మొదలైనవాటి సామూహికప్రభావం సాహిత్యం రూపురేఖలను మారుస్తూవచ్చింది. సాంఘిక అసమానతలను చాటిచెప్పే కవిత్వము సంఘంలోని వ్యవస్థను, దారిదోపిడిని, అక్రమాన్ని తెలియజెప్పే కథలూ, నవలలూ, విద్యావంతులై, పరిణత మనస్కులైన పాఠకులను ఇప్పుడు ఆకర్షిస్తున్నాయి.

వేయిపడగలు, నారాయణరావు, మాలపల్లివంటి పెద్ద (అంటే గ్రంథం పరిమాణంలోనే కాక, వస్తుదృష్టినిబట్టికూడా) నవలలను ఇప్పుడు పాఠకులు చదవటానికి ఆసక్తి చూపించరు. అట్లానే లఘుకావ్యాలను ఆదరించినంతగా పెద్ద పెద్ద కావ్యాలను ఆదరించడం కష్టం. ఈ విధంగా అభిరుచులు మారిపోవటానికి పారిశ్రామికయుగప్రభావమే కారణమని చెప్ప

వలసివుంటుంది. లభించిన కొద్దిపాటి విశ్రాంతిని సద్వినియోగం చేసుకోవడానికి పుస్తకాలను మాత్రమే ఆశ్రయించవలసిన అగత్యంలేదు ఈ యుగ ప్రతినిధికి. అనేకమైన ఆకర్షణలున్నాయి. పుస్తకపఠనంలో అత్యంతమూ ఆసక్తివున్నా టాల్‌స్టాయ్, వార్ అండ్ పీస్‌లాంటి పెద్దపెద్ద గ్రంథాలను పఠించే అభిలాష తగ్గిపోతున్నది. వస్తు గౌరవందృష్ట్యా ఇలాంటి అభిరుచుల్లో మార్పులు వచ్చాయి.

తెలుగులో ఇవాళ "నవల" చాలా ప్రాచుర్యాన్ని పొందిన సాహిత్య శాఖ. చారిత్రాత్మకమైన వీరగాథలు, సాహసాలు, ప్రణయాలు, రాచరిక కుటుంబగాథలు, తొలినాళ్ళలో నవలకు ఇతివృత్తాలుగా స్వీకరించబడ్డా, ఇప్పుడు సాంఘికేతి వృత్తాలే ప్రధానంగా నవలలుగా రూపొందుతున్నాయి. ఇప్పుడు కాల్పనికేతివృత్తాలు పాతబడిపోయినాయి. సమకాలీన సాంఘిక సమస్యలను ఇతివృత్తాలుగా స్వీకరించిన రచనలకే ప్రాచుర్యం లభిస్తున్నది. సంఘంలో ప్రబలంగా కనబడుతున్న పెచ్చుతగ్గులు, ఆందోళనలు, వర్గ వైరుధ్యాలు, కులదురభిమానాలు, ప్రభావితంచేస్తున్న నగర జీవనపు ఆకర్షణలు, రాజకీయాలు, సామాజిక సమస్యలు, వైయక్తిక సమస్యలు, ఇతివృత్తాలుగా రచయితలు నవలలు వ్రాస్తున్నారు. కొందరు రచయితలు స్త్రీ పురుష కామప్రవృత్తికి సంబందించిన వైయక్తిక సమస్యలను చిత్రిస్తున్నారు. సాంఘికమైన వ్యవస్థలోవచ్చిన మార్పుతో వ్యక్తిగతమైన సమస్యల స్వరూపాల చిత్రీకరణ వీళ్ళ అభిమానవిషయంగా కనపడుతుంది. అంతేకాని సందేశము, సాహిత్యపువిలువలు ఈ రచయితలకు పట్టినట్లుగా లేదు. అయితే వ్యక్తిగతమైన సమస్యలు, సామాజిక సమస్యలు కావా అన్న ప్రశ్న వస్తుంది. కావని ఎవరు చెప్పగలరు? బహుజన హితము, బహుజన సుఖము ఆశించినప్పుడు వ్యక్తిగతమైన అభిరుచులను, ప్రయోజనాలను సామాజికమైన ఉన్నతికొఱకు వదులుకొనవలసివుంటుంది.

ఈ సందర్భంలో ఇంకొక సమస్యకూడా ఎదురవుతున్నది. సంఘంలోని దురన్యాయాలను వ్యక్తిగతమైనవైనా, సంఘపరమైనవైనా యథాతథంగా చిత్రీకరించవచ్చునాలేదా అని. చిత్రించవచ్చునుకాని హితము, ప్రియము, పథ్యము అయ్యేవిధంగా వుండాలి. చలం సాంఘికంగా స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలనుగూర్చి ఘోషించాడని ఆయన సాహిత్యంలో విప్లవపంథాను లేవదీశాడని కొందరంటారు. ఆయన సాహిత్యం సాధించిన ప్రయోజనం శూన్యం. నల్లమందు బాగాతిని అతీంద్రియమైన అనుభవాన్ని

సాధించడంలాంటిది చలం సాధించిన సాహిత్యప్రయోజనం. ఇటీవల ఒక మహాకవి ఇట్లా ఉవాచించారు. "విప్లవం చిరకాలం వర్ధిల్లాలి" అని. ఇది ఎంత అర్థరహితమైన నినాదమోచూడండి. అంటే ఈ దోపిడీవిధానం, కన్నీళ్ళు, బలవంతులు బలహీనులను అణగదొక్కడం, ఇలా కలకాలం కొనసాగవల సిందేనా? లేకపోతే కొందరు మహాకవులయ్యే అవకాశంలేదు. ప్రజలను విద్యావంతులను చెయ్యడంకాని, మానవత్వపు విలువలను పెంచడంకాని, అసమానతలను తొలగించడంకాని, పట్టకుండా నినాదాలతోను, సిద్ధాంత పరమైన ఉద్ఘోషణలతోను సంఘం మారదు. సాహిత్యప్రయోజనం సిద్ధించనూ సిద్ధించదు. మనిషి మనిషిగా తన బాధ్యతలను, కర్తవ్యాలను గుర్తించనంతవరకు లేదా తన హద్దుల్లో తాను బ్రతికేట్లుగా అతణ్ణి శాసించే అధికారంలేనంతవరకు సంఘమూ, సాహిత్యమూ, ప్రభావితం కాలేవు.

రాజకీయనాయకులనుగురించి ఎంత తక్కువగా అనుకుంటే అంత మంచిది. యూనివర్శిటీ ప్రొఫెసర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు, వ్యాపారస్థులు, మేధావులు, సంఘసేవకులు, మతాచార్యులు, అవినీతిపరులైవున్నారీవేళ. అంటే సంఘమంతా అన్నమాట! ఇలాంటి సంఘంలో కళాత్మకమైన విలువలతోకాని, సామాజిక ప్రయోజనాన్ని ప్రధానంగా చేసుకొని, సాహిత్యం వెలువడే అవకాశంలేదు.

ఈ దృష్టితో చూసినప్పుడు నేటి తెలుగు నవల ఆశాజనకంగాలేదు. సినిమాకథలలాగా అసహజమైన సంఘటనలు, అవాస్తవికమైన సన్నివేశాలు, అనుచితమైన నాటకీయధోరణి, అర్థంలేని కల్పనలు, అధికసంఖ్యకంగా వెలువడుతున్న నవలల్లో కనపడుతున్నాయి.

పోలాప్రగడ సత్యనారాయణమూర్తి రచించిన, "సంఘంచేసిన మనిషి" మంచినవలే అని చెప్పాలి. ఎందుకంటే నేటి సాంఘిక స్వరూపాన్ని బాగా అవగతం చేసుకొన్నాడాయన అని ఆ నవల చెప్పుతున్నది. ప్రతివ్యక్తికూడా సంఘం చెక్కిన శిల్పమే అంటే తాను జీవిస్తున్న సంఘానికి వ్యక్తి ఎప్పుడూ ప్రతినిధిగా వుంటాడని శిల్పివేసే ప్రతిఉలిదెబ్బా శిల్పాన్ని తీర్చేటట్లుగా తాను ఎదుర్కొనే ప్రతిసన్నివేశమూ తన వ్యక్తిత్వాన్ని దిద్దితీరుస్తుందనీ రచయిత నిరూపించదలచుకొన్నాడీ నవలలో. ఆయన రచించిన దీపశిఖ కూడా మంచినవలే అని చెప్పాలి. సాంఘికమైన వ్యవస్థ గతంనుంచి వర్తమానంలోకి ఏవిధంగా మారుతూవున్నదో నిరూపించే ప్రయత్నం ఆయన యీ నవలలో చేశారు.

ఎమ్. పార్థసారథి రచించిన "రంగులవల" అన్న నవలలోకూడా సామాజికమైన సమస్యల ప్రస్తావనవున్నది. ఆధునికమైన సామాజిక పరిణామాలను గూర్చిన విశ్లేషణకొంత చేశారీయన యీ నవలలో.

ఇటీవల వెలువడ్డ ప్రయోగాత్మక నవల అంపశయ్య. తను చుట్టూ పరచుకొనివున్న సామాజిక స్వరూపాన్ని వ్యక్తిపైన అడుగడుగునా అది ప్రసరించే ప్రభావాన్ని సమాలోచనం చేశాడీ నవలారచయిత. ఒట్టి సందేశమేవుంటే ధర్మశాస్త్రమో, నీతిశాస్త్రమో అవుతుంది సాహిత్యం. కళాత్మకమైన విలువలుకూడా వుండాలి. అయితే ఈ కళాత్మకమైన విలువలు వైయక్తికమైన అనుభవాలనో, అనుభూతులనో మాత్రం పరిమితంచేసుకొన్నవిగా వుండగూడదు. చైతన్యస్రవంతి అనబడే సాహిత్యధోరణి సామాజిక సమస్యల పరిష్కారానికి ఎంతవరకు తోడుపడగలదో విచారణీయం.

సాహిత్యంలో సమకాలీనమైన సామాజికస్వరూపం ఎప్పుడూ ప్రతిబింబిస్తూనేవుంటుంది కాని, సాహిత్యపు విలువలు ఏవి? అవి కానీ,పోనీ నేటి మారుతున్న సమాజపు విలువల దృష్ట్యా సాహిత్యం ఏవిధమయినదిగా వుండాలి? మారుతున్న విలువలు, నేడు వెలువడుతున్న సాహిత్యంలో ప్రతిబింబిస్తున్నాయా, అని విశ్లేషించి చూపడం కష్టం,

★

There are only three things In the world.
one is to read poetry; another is to write
poetry; and the best of all is to line
poetry.

—**Rupert Brooke.**

"నిజమైన సాహిత్యం పాఠకుని వ్యక్తిత్వాన్ని మారుస్తుంది.
సంస్కారాన్ని రేకెత్తిస్తుంది"

"మనిషికి తిండీ, బట్టా ఎంత అవసరమో
పుస్తకాలుకూడా విజ్ఞాన సముపార్జనకు
అంతే అవసరం. ప్రతిఇంటా కొద్దోగొప్పో
గ్రంథాలయం ఉండడం చాలా అవసరం."

"మంచి పాఠకుని తయారుచేసే శక్తిని రచయిత సంపాదించుకోవాలి"



మీకు తెలుసా ?
'దంతశుభ్రత' అంటే సరైన అర్థం తెలుసుకోండి!

తమ దంతములను శుభ్రపరుచుకొనుటకై పుగాకును వాడిన చాలామంది దంతక్షయాన్ని అరికట్టుకొనగలిగారు.

పుగాకు దంతక్షయాన్ని అరికట్టే పెక్కుగుణాలు కలిగివుంది. ఇప్పుడు పుగాకు అవుసరంలేదు. దానిస్థానంలో **'ఇపోక్'** (IPCO). **'ఇపోక్'** టూత్ పేస్టు స్వచ్ఛమైన పుగాకునుండి తయారుచేయ బడిన ఆయుర్వేద సంబంధమైన టూత్ పేస్టు.

"ఇపోక్" మీరు ప్రతి రోజు వుపయోగించటం మూలంగా

మీకు 1. పండ్లనొప్పిని తగ్గిస్తుంది. 2. దంతక్షయాన్ని అరికట్టు తుంది. 3. పయోరియా మొదలైన జబ్బులనుండి మిమ్మలను శాశ్వతంగా రక్షిస్తుంది.

"ఇపోక్" టూత్ పేస్టు మీకు తప్పక దంత సంబంధమైన బాధలనుండి ఉపశమనం కలిగిస్తుంది.

ఒకసారి వాడిచూడండి. మీకే తప్పక తెలుస్తుంది. ఒకసారి వాడారంటే మీరు మరోరకం పేస్టు జోలికి పోరు.

తయారుచేయువారు :

ఆశా ఇండస్ట్రీస్, నడియాడ్ (గుజరాత్) ఇండియా

ఆంధ్రప్రదేశ్ కు డిస్ట్రిబ్యూటర్లు :

మెస్సర్స్ అనిల్ ట్రేడర్స్,

14-3-196, గోషామహల్, హైద్రాబాదు-12.

మారుతున్న విలువలు - నవల

శ్రీమతి సి. ఆనందరామం

కొన్ని కొన్ని పదాలు నిర్వచించలేం. మంచితనం–అందం – ఇలాంటివి.

మంచితనం గ్రహించేవాడి మనసునిబట్టి నిర్ణయింపబడేది.

అందం చూసేవాడి కళ్ళనుబట్టి సాక్షాత్కరించేది. అలాగే "విలువ" కూడా కాలాన్ని బట్టిఎప్పటికప్పుడు మారేది.

ఏ విలువలనైనా నిర్ణయించుకునేది సమాజం కనుక–సజీవ సమాజానికి ప్రధానమైన లక్షణం నిరంతరమయిన మార్పే గనుక–ఈ విలువలు ఎప్పటికప్పుడు మారటంలో ఆశ్చర్యంలేదు.

ఒక్కొక్క యుగంలో ఆనాటి సామాజిక పరిస్థితులననుసరించి ఒక్కొక్క విలువ అతిశయించి ప్రాధాన్యం వహిస్తుంది.

దేశం సస్యశ్యామలమయి కులవృత్తులు ప్రధానంగా పాటింపబడే దశలో ధర్మం పరిపాలించింది. క్షాత్రం అండగా నిలిచింది.

దేశం శత్రువుల దండయాత్రలతో భీభత్సమవుతోన్న తరుణంలో క్షాత్రం అతిశయించింది. ధర్మం దానికి దారిచూపింది.

ఈ రెండు దశలలోనూ అర్థం కేవలం క్షాత్రధర్మాలను పోషించడానికి మాత్రమే వినియోగపడింది.

ఈనాడు పరిపాలిస్తున్నది–అర్థం!

అందుకనే అనంతకోటి విలువలూ ఆ అర్థంలో చిక్కువడిపోయి అర్థం కాకుండా పోతున్నాయి.

పరీక్షిన్మహారాజుకు భయపడి కలి తన వ్యసనాలన్నింటికీ నిలయమైన బంగారు నాణెంలో ఆశ్రయం ఏర్పరచుకున్న కథ సత్యమో, అసత్యమో కాని ఈ నాడు పైకంతో పెత్తనాన్ని కొనవచ్చునన్న సంగతి మాత్రం ప్రత్యక్షర సత్యం...

అందుకే పైకానికి ఎక్కడలేని ప్రాధాన్యమూ వచ్చేసింది.
ఎవరికి చూసినా ఒక్కటే అభిలాష—
డబ్బు సంపాదించాలని !
ఎవరి నోటవిన్నా ఒక్కటే ఆక్రోశం !—
"డబ్బు చాలటంలేదు !"
ఎవరి ప్రణాళికలు చూసినా ఒక్కటే లోపం—
రాబడికి మించిన వ్యయం !
సమాజం మొత్తం అహమహమికతో అస్థిమితతతో—తీరని దాహంతో పరుగులు పెడుతోంది పైసల కోసం...

స్త్రీల సమస్యలుగా - సామాజిక సమస్యలుగా స్థూలదృష్టికి తోచే అనేక సమస్యలు మరికొంత సూక్ష్మంగా పరిశీలిస్తే ఏదోఒకవిధంగా డబ్బుతో ముడిపడినవే !

ఈ అస్థిమితత్వం – ఈ తీరని దాహం – ఈ పరుగులు – ఈనాటి రచనల్లో మనకు కనిపిస్తున్నాయా ?

ఒక రచనను సృష్టించటంలో రచయిత ఆనందం పొందుతాడు.
ఆ సృష్టిలోని అందాలు కనిపెట్టటంలో పాఠకుడు ఆనందిస్తాడు.
రస జగత్తులో రచయిత ఎంతటి ప్రధానుడో పాఠకుడూ అంతే ప్రధానుడు—

ప్రాచీన అలంకారికులు సహితం రసము సామాజిక నిష్ఠమని సిద్ధాంతీకరించారు.

అంచేత ఒక యుగంలో ప్రాధాన్యంవహించేరచనల స్థాయి ఆ యుగంలోని అధిక సంఖ్యాకులైన పాఠకుల స్థాయిపై ఆధారపడి ఉండటంలో ఆశ్చర్యంలేదు.

అలనాటిలా ఈనాడు పురాణాలు చదివే తీరికా, వినే ఓపికా ఎవరికీ లేవు.

గుంపులుగా గూడి పనులుచేసుకొనే ఆడవాళ్లూ లేరు.
ఆ పనిపాటల సమయాలలో పాడుకునే కీర్తనలూ లేవు.

ఉరుకులతో, పరుగులతో, ఆఫీసులకు, కాలేజీలకు, కంపెనీలకు చేరుకుని యంత్రాలలా పనిచేసే ప్రాణులకు విరామసమయంలో ఉల్లాసం కలిగించే రచనలు కావాలి.

కొద్దిపాటి పాండిత్యంతోనే అర్థం చేసుకొనగలిగేలా ఉండాలి.

ఇంటి ఇల్లాలికి పొరుగింటిపుల్లమ్మ లోకాభిరామాయణంకంటె ఇంకాస్త మజాగా ఉండే "అద్భుతమైన" రచన కావాలి.

అంచేత అలాంటి "అద్భుతమైన" "ఉల్లాసకరమైన" రచనలకే ఈ నాడు ప్రాధాన్యం వస్తోంది.

అక్కడక్కడ సునిశితమైన మానవ మనస్తత్వ పరిశీలనతో—
విపుల సామాజిక వాతావరణ పరికల్పనతో—
ద్వంద్వాల నిరంతర సంఘర్షణ చిత్రణతో—
శాస్త్రాంశాలను విపులీకరించగల మేధాసంపన్నతతో—
కొన్ని కొన్ని ఉదాత్తమైన రచనలు వస్తూనే ఉన్నాయి.
అవి చదివి "తలయూచి" మెచ్చేవారూ లేకపోలేదు.
అయినా యుగధర్మాన్నిబట్టి వాటికి ప్రాచుర్యం లభించటంలేదు.

ఒక్కమాట :

ఈ నాడు మారుతున్న విలువల్ని ప్రత్యక్షంగా తమ రచనలో చిత్రించక పోయినా పరోక్షంగా పలువురు దానినే ప్రదర్శిస్తున్నారు.

సామాజిక జీవనాన్ని ఐశ్వర్యం పరిపాలించటం వల్ల కలిగే ఒడిదుడుకులు చిత్రించలేకపోయినా—

ఏ రకంగా వ్రాస్తే డబ్బు మరింత ఎక్కువ సంపాదించుకోవచ్చునో గ్రహించి ఆ రకంగానే వ్రాస్తున్నారు!

సమకాలీన ప్రభావాన్ని తప్పించుకోవటం ఎవరి తరం!

* * * *

*ప్రభుత్వాలు ఎన్నిలోపాలుచేసినా క్షమించవచ్చుగాని, ప్రతి స్వల్ప కార్యానికి ప్రతి సాధారణ విషయానికి తమదిక్కు చూచే అంత నిర్వీర్యులను, నిస్సహాయులనుగా ప్రజలను చేయడ మనేది క్షమించరాని నేరం.

—శ్రీ పొట్లపల్లి రామారావు

సాహిత్యానికి సామాజికప్రయోజనం వుందని మరోమారు నిరూపిస్తున్న **"యువభారతి"** కి అభినందనలు.

స్పందన సాహితి

సామాజిక ప్రయోజనం కలిగిన సాహిత్యాన్ని సాధ్యమైనంత తక్కువ ధరకు సామాన్యునికి అందుబాటులో వెలువరించాలనే సదాశయంతో ఇప్పటివరకు **"స్పందన సాహితి"** రెండు ప్రచురణలు వెలువరించింది.

1. స్పందన

(ప్రసిద్ధులూ – సుప్రసిద్ధులూ – సరికొత్తవారూ కలసి మొత్తం వెరశి 47 మంది కవుల కవితా సంకలనం.) రు. 2–00

2. వానచినుకులు.

(ప్రసిద్ధ రచయిత్రి శ్రీమతి డి. కామేశ్వరిగారి ఎన్నిక చేసిన మన్నికైన కథలు) రు. 1–00

పై రెండు పుస్తకాలు ఒకేసారి తెప్పించుకుంటే రెండున్నర రూపాయలకు మేమే తపాలా ఖర్చులు భరించి పంపుతాం—

కాదంటారా !

సభ్యత్వం సాలుకు అయిదు రూపాయిలు రుసుం చెల్లించి సమితిలో చేరేవారికి పై రెండేకాదు - మున్ముందు సమితి వెలువరించేవి ఏవైనా సరే వుచితంగానే లభిస్తాయి.

ప్రతులకు, వివరాలకు వ్రాయండి.

స్పందన సాహితి

1–8–17/2 చిక్కడపల్లి

హైదరాబాద్–20

మారుతున్న సమాజంలో - నవల

శ్రీమతి కె. రామలక్ష్మి

నిత్యచైతన్యం కలిగినది సమాజం. అది ప్రవాహంగాని సరస్సుకాదు. కదలిక దానికిచిహ్నం. మార్పు దాని లక్షణం. సమాజంలో ఈ చైతన్య లక్షణం కొంచెం కుంటువడినాసరే సర్వేసర్వత్రా దాని ప్రతిధ్వనులు విని పిస్తాయి. అందుకే ఏమాత్రం స్తబ్దత తోచినా మార్పు, వేగం కోరుతూ చైతన్యవంతులు హాహాకారాలు చేస్తారు. సంస్కర్తలు తమ శ్రమ, శక్తులను ధారవోసి కుంటువడిన సమాజాన్ని మళ్ళీ చారినపట్టించాలని తాపత్రయం ప్రారంభించుతారు. ఈ నిత్య చైతన్యస్రవంతిలో భాగం పంచుకుంటారు.

సంఘజీవియైన ప్రతిమానవుడు తనతోపాటు సమాజాన్ని (అత్యధిక) అత్యున్నత ఆశల శిఖరాలవైపో, అధఃపాతాళంవైపో మానవుడు తీసుకు పోగలడు. అదీ-సమాజానికీ మనిషికీ కల అవినాభావసంబంధం. మనిషి లేనిదే సమాజం ఏది? సంఘం ఏది?—ఉండవు.

మానవ జీవిత కార్యకలాపాలన్నీ సంఘంలో భాగాలే. సంఘానికి దూరంగా వెళ్ళి ఏ Creative కళ రాణించలేదు. అసలు రాణించదుకూడా. సంఘం కట్టుబాట్లకు కదలికలకు తొట్రుపడుతూ సృష్టికర్త అయిన కళా కారుడు తన కళలు రూపొందించాలని, పెంపొందించాలని తాపత్రయ పడుతూ ఉంటాడు. సంఘచైతన్యాన్నిపట్టి ఆ కళాసృష్టి, కృషి రాణిస్తూ ఉంటుంది. స్తబ్ధము, నిర్జీవము, నిరుత్సాహ పూరితము, నిస్తేజము అయిన సమాజంలో కూర్చుని ఏ మేధావి, చైతన్యవంతము, సజీవము, ఉత్సాహ పూరితము, తేజోవంతము అయిన రచనలనుగాని, ఇతర కళలనుగాని సృష్టించలేడు. సమాజపు ఒడుదుడుకులు స్పష్టంగానో, అస్పష్టంగానో కళ లలో ప్రతిబింబించక తప్పదు. అది చూసేవాని దృష్టికోణాన్నిబట్టి దృగ్గోచరం అవుతుంది. చూసినవాడికి ఇంద్రధనస్సు నీటిబుడగ అవగాహనం అయి

VARDHAMAN MAHAVIR MEMORIAL NATIONAL ARCHIVES OF SCIENCE & TECHNOLOGY DPRI Acc. No

నట్లు గ్రుడ్డివానికి మనం ఎంత వర్ణించి చెప్పినా అర్థంకావు. అలాగే కళా స్వాదనలో అవగాహనశక్తి లోపించిన రసికునికి మనం ఎంత వివరించినా అర్థంకాదు.

నేటి సమాజపు ధోరణులను తిలకించండి. అవి ఎలాఉన్నాయి? చూడగానే అర్థం అయేలా ఉన్నాయా? "ఇవి మంచిలక్షణాలు - పెంపొందించండి. ఇవి చెడ్డ లక్షణాలు అవరోధించండి" అని చెప్పడానికి ఆస్కారం ఇస్తున్నాయా? ఒక పక్క ఝరీవేగం - ఒక పక్క పూర్తి స్తబ్ధత; ఒకపక్క విపరీతపు పోకడలు - మరోపక్క మార్పుకోరని పద్ధతులు; ఒకవైపు వెట్టి ఆవేశం, వేరొకవైపు నిశ్చలమౌనం. ఇంతటి విభిన్నతలని తనలో యిముడ్చుకొని సమాజప్రవాహం యథావిధిగా సాగిపోయింది. మానవజీవితం సాఫీగానో, ఆందోళనగానో సాగిపోయింది. ఆగిపోలేదు. ఆగదు.

ఇటువంటి వింతపరిస్థితులలో రచనావ్యాసంగం పరిశీలిస్తే వింతవింత ధోరణులు, విపరీతపు పోకడలు కనపట్టడంలో వింతలేదు. అబ్బురపడవలసిన అవుసరంలేదు. మనం పూనుకుని చేయవలసినదికూడా ఎక్కువలేదు. నేటి రచనాపోకడలని చూస్తుంటే ఇదే అనిపిస్తుంది. ఫాషన్ అనుకున్నది ముమ్మరంగా పెంపొందుతుంది. అది ఫాషన్ కాదని తెలిసినప్పుడు అంతత్వరగానూ సమసిపోయింది. నేటి నవలాసాహిత్యంలో స్పీడు, ఉత్పత్తి చూస్తుంటే అదే అనిపిస్తుంది. ఎంతలేదన్నా నెలకు 50 కి పయిగా కొత్త నవలలు వస్తున్నాయి. రాసినివారే వ్రాస్తున్నవి, కొత్త కొత్తవారు రాస్తున్నవి, పున ర్ముద్రితాలు, అనువాదాలు అనేకరకాలవి వస్తున్నవి. వీటిలో నెల్లూపొల్లూ ఏరడం అన్నది సామాన్యమైనపనికాదు. ఉత్సాహవంతులైన వేలాది పాఠకులకోసం ఈ రచనాస్రవంతి వేగం పుంజుకుంది. తన వేగంలో రాయిరప్పలనీ, పనికివచ్చి పరిపుష్టిని కల్గించే మినరల్స్‌నీ, పాటిమట్టిని కొట్టిపారవేస్తుంది.

గోదావరికి వరదలువస్తే వ్యాపారి ఏంచేస్తాడు? కలప ఏరుకున్నాడు. ఏమైనా దొరుకుతాయి అని ప్రాణానికి తెగించి ప్రవాహానికి ఎదురీది వెళ్తారు కొందరు. ఈ నవలా ప్రవాహంలోను నిజమైన ఉత్సాహంగల పాఠకుడు, కుతూహలంగల పాఠకుడు, శాశ్వత విలువలకోసం, సాహిత్యపు విలువల కోసం వెతుకుతాడు. తప్పదు. ఆ పరీక్షలో నిగ్గుతేరి నిలచిన రచనలు అస్సలు లేవు. రావుఅనడం పూర్తిగా అర్థంలేని మాట. పాఠికదృక్పథం అనిపించు

కుంటుంది. నేడు ఉత్పన్నమవుతున్న వేలాది నవలల్లో ఏ కొద్దిగానో మంచివి పదికాలాలపాటు నిలిచేవి లేవనడం సాహసమే అవుతుంది.

నేటి నవలారంగాన్ని నవలామణులే కిరీటంలేని మహారాణుల్లా ఏలుతున్నారన్నది - చెప్పగానే నమ్మదగ్గ మాటగా తోచినా వాస్తవం కాదని చెప్పవచ్చు. ఎక్కువమంది స్త్రీలు రచనలు చేస్తున్నారు. నిజమే! కాని, వారికంటె ఎన్నో రెట్లు ఎక్కువగా పురుషులు నవలలు రాస్తున్నారు. ఆడది చేసిన పాపంకొద్దీ – విమర్శకులు, సాహితీపరులు, కుళ్ళుబోతులు, అసూయాపరులు, నిజం చూడనివారు – అంతా ఒకటే మాట అంటున్నారు – ఆడవాళ్లు రాసేస్తున్నారని. ఈ గోలతోనే అనవసర ప్రాముఖ్యం స్త్రీరచయితలకి వచ్చిందిగాని వారి సంఖ్యాబలం అత్యధికంఅయి కానేకాదు.

నవలా వ్యాసంగం వ్యాపారరీత్యా లాభసాటి కావడం, పత్రిక లనే బకాసురులకి తగినంత రొట్టి ఈ నవలలే అందించకల్గడం ప్రముఖకారణంగా పెద్ద, చిన్న నవలలు కోకొల్లలుగా వస్తున్నాయి. వీటిలో నాలుగోవంతు మాత్రమే స్త్రీలు రాస్తున్నారు.

స్త్రీలు రచించినవాటిలో ఏ కొద్దిమందిలోనో మినహాయించి వాస్తవిక దృక్పథంలేదన్న వాదన ఒకటిఉంది. నిజానికి ఏది వాస్తవికదృక్పథం? ఈనాడు సమాజం వింత పోకడలు పోయింది. ఓ పక్క స్త్రీలకు సమాన హక్కులంటూనే యింకొకపక్క వారికి అర్హత లేకుండా చేస్తారు. ఒకపక్క సంఘసంస్కరణ అంటూనే రెండోపక్క దాన్ని ఈసడిస్తారు. ఒకపక్క వితంతు వివాహాలను ప్రోత్సహించాలంటూనే రెండోపక్క దాన్ని త్రోసిరాజంటారు. సమాజపు నీతిని కొలచే కొలతబద్దవేరు, వ్యక్తినీతిని కొలచే కొలబద్ద వేరుగాచేస్తారు. సమాజపరంగా మంచిది–వ్యక్తిపరంగా ద్రోహంగా చూస్తారు. ఇక వ్యక్తి తెగించి తనకు మంచిదనుకున్నదాన్ని సమాజం ఎంతమాత్రంగా గౌరవిస్తుందో తెలిసినసంగతే కదా!. అటువంటి అయోమయంలో పడి సమాజ వాస్తవికతను అయోమయంగానే చిత్రించడం జరుగుతుంది. తానునమ్మిన విపరీతభావాలని జుగుప్సాకరంగా రచించేవారున్నట్టే, తాము నమ్మిన వాటిని సాఫీగా చెప్పిన రచయితలూ ఉన్నారు. ఒక రచయిత తాగుబోతులన్యాయం చర్చించవచ్చు. ఇంకొకరు సంప్రదాయాన్ని చర్చించవచ్చు. రెండూ బలవత్తరంగానే ఉన్నాయి సమాజంలో. అటువంటప్పుడు కొందరు వాస్తవికతకు పూసుకుపోవడంలేదని బాధపడటంలో అర్థంలేదు.

కూడదనుకున్న చెడులన్నీ కొనసాగుతున్న సమాజంలో వాస్తవికత పేరిట వాటికి ప్రాధాన్యం యిస్తూ - "మేం సమాజాన్ని ప్రతిబింబించుతున్నాం" అని బోర విరుచుకుంటే లాభంలేదు. వాస్తవికత పేరిట కుళ్ళుని జనబాహుళ్యపు కంట పడేయటమే అవుతుందది.

స్త్రీలు సహజంగా అలజడి వాంఛించరు. అరాచకం అసలే వాంఛించరు. సభ్య సంఘంలో ప్రశాంతంగా జీవనం గడిస్తే బాగుంటుందని తలపోస్తారు. అటువంటి స్త్రీలుకూడ సంఘంలో జరుగుతున్న కృత్రిమ న్యాయాన్ని, అన్యాయాన్ని, అసహాయతను ఆడిపోసుకుంటున్నారు. అవి రూపుమాపాలని, అవి సంఘంలోంచి దూరంకావాలని కోరుకుంటూ రచనలు సాగించకపోలేదు. సాంఘిక న్యాయం వ్యక్తి న్యాయం అవదని తండ్రి కొడుకుల మధ్య అత్యద్భుతం అయిన కథ రచించింది "రంగనాయకమ్మ ఇదేనా న్యాయం?" లో. సంఘపు కట్టుబాట్లకు తల ఒగ్గితే నిజానికి కొడుకు తండ్రిని పెట్టి పోషింపక తప్పదు. కాని తండ్రి అన్నమాటకే అర్థాలుగాని తండ్రులు యీ సంఘపు సదుపాయాలని ఆకట్టుకొని కొడుకు పంచచేరడం సహించలేని రచయిత్రి అతివాస్తవికంగా ఏమాత్రం ఎబ్బెట్టుఅనిపించకుండా ఇదేనా న్యాయం ముగించింది. మారుతున్న సమాజానికి, విలువలకి ప్రతీక ఈ నవల. అలాగే డి. కామేశ్వరి రచించిన కొత్తనీరు. కొత్తనీరు పాతనీటిని కొట్టివేయడం సహజం. తల్లిదండ్రుల నమ్మకాలని, ఆశయాలని కాదని స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు చూపిన రెండవతరం కథ ఇది. మారుతున్న విలువలు ప్రస్ఫుటంగా వాస్తవికంగా చిత్రించడం జరిగింది.

డి. విశాలాక్షిగారి "మారిన విలువలు", వాసిరెడ్డి సీతాదేవి 'సమత' ఇవన్నీ మారుతున్న సమాజాన్ని యథాశక్తి ప్రతిబింబించినవే.

మార్పు కోరుతూ, రాదగ్గ మార్పు ఎలా ఉండాలని రచయిత ఊహిస్తున్నాడో అదే సృష్టిస్తూ రచనలు చేస్తున్న వారుకూడ లేకపోలేదు. ఇది బొత్తిగా ఉటోపియా అని విమర్శకులు తోసిరాజన్నా పాఠకులలో అటువంటివి ఉత్సుకతలు రేకెత్తిస్తూనే ఉంటాయి.

రచయిత సజీవ సమాజంలోనే రాణిస్తాడు. అది లేనప్పుడు రచనలు కూడ కాల్పనికలు, ఊహాజనితములు, కాలక్షేప లక్ష్యాలు అయి సర్వ సామాన్యంగా ఉండక తప్పదు. అటువంటి స్తబ్ధ వాతావరణంలోకూడా చైతన్యం పిండుకొని ఉత్తేజపరచగల రచనలుకూడ రావడం మనం

దించదగ్గ విషయం. మార్పు సహజమైన ఈ సమాజంలో అంతంత త్వర గానూ రచనలు, రచయితలు, వారి ధోరణులు, పోకడలూ మారుతూనే ఉంటాయి. ధీశక్తిగల పాఠకుడు వీటి రాటుపోటులకి నిలబడి - వస్తున్న వాటిలోనే ప్రయోజనకారియైనవి, పలుకాలాలు నిలిచేవి ఏవని ఆణిముత్యా ల్లాగా ఏరాలని ప్రయత్నిస్తాడు.

★

అత్మముందు నిలబడి నిన్ను నువ్వు చూసుకో
మనిషిలా మంచిగా ఆకాశంలా అవనిలా
బతుకు.
తెరిచిన కళ్లు యింక మూయకు
చెప్పడానికి నువ్వొవరని గొంతు నొక్కడానికి ప్రయత్నించకు
మనిద్దరిమధ్య బలమైన బంధం
ముందు మనం మనుషులం.

—నగ్నముని

తెలుగు పలుకుల తల్లి వెలయు మీ యింట
తేనె కయితల వల్లి తులలేని పంట !
ఇంటింట సరస్వతీ పీఠం.



ఎమెస్కో
సంప్రదాయ సాహితి

సాధారణ ఉగాదితో శుభారంభం !

రసజ్ఞులందరూ ఓంప్రథమంగా విధిగా చదివే
తెలుగు పంచకావ్యాలు

ఇంతవరకు వచ్చినవి :

ఆంధ్రకవితా పితామహు
అల్లసాని పెద్దనామాత్యుని
మనుచరిత్రము
సాదాప్రతి : రూ. 2-00
మేలుప్రతి : రూ. 3-75

రామరాజభూషణుని
వసుచరిత్రము
సాదాప్రతి : రూ. 3-00
మేలుప్రతి : రూ. 4-75

కృష్ణదేవరాయల
ఆముక్తమాల్యద
సాదాపత్రి : రూ. 3-00
మేలుప్రతి : రూ. 4-75

తెనాలి రామకృష్ణుని పాండురంగమాహాత్మ్యము

సాదాప్రతి : రూ. 3-00

మేలుప్రతి : రూ. 4-75

రానున్నవి :

ఆగస్టులో -

శ్రీనాథుని

శృంగారనైషధము

అనంతరం.....

క్రమంగా -

భారత, భాగవత, రామాయణాలు

ప్రబంధాలు, కావ్యాలు, శతక గేయ సాహిత్యం

సార్వకాలిక, ఆంధ్ర సారస్వత భాండారం

ముచ్చటైన సంపుటాలుగా, ఇలాగే

సరస మూల్యానికే.....

డిస్ట్రిబ్యూటర్స్ :

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్

రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్.

209

A Golden Opportunity for

Low & Middle Income Groups

KRISHINAGAR COLONY

THE ONLY ONE OF ITS KIND IN THE CAPITAL

CALLING YOU ! YOU ! & YOU !

The Colony is now made open to one and all

Sponsored by :

The Staff of Agriculture Department

The Krishinagar Colony, a venture of the employees of the State Agriculture Department has already over 300 members and sprawls over an area of about 40 acres near Brahmananda Chitrapuri.

The Draw for lots for allotment in Krishinagar Colony No. 1 was held on the Republic day at Dwaraka Hotel and a similar Draw for the Second Colony at the Jubilee Hall on 2nd March 1969.

Convenor Goutham and his band of workers translated Krishinagar idea into its present day reality within a span of three months.

(Deccan Chronicle Dt. 6th March 1969)

32, Lal Bahadur Stadium

HYDERABAD-I

Phone : 38025

210

మారుతున్న విలువలు 'కథానిక'

శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మ

ఒక కథను మొదటిసారి చదివినపుడు మనకు కలిగే ఆనందం తాత్కాలికమేనా ? ఆ కథను మళ్ళీమళ్ళీ చదివితే మనకు మొదటిసారి కలిగినంత ఆనందం కలుగుతుందా - అలా కలగకపోతే ఆ తప్పు రచయితదా ? మనదా ?

నా చిన్నప్పుడు అప్పుడుప్రసిద్ధులైన వారి కథలెన్నో చదివాను. మళ్ళీ ఆ కథల్నే పదేళ్ళు, ఇరవై యేళ్ళ తరువాత చదివేను. అలా చదివిన కొంతమంది ప్రఖ్యాతుల కథలు ఎంతో చప్పగా వున్నాయనిపించింది. నాకు వారిమీద జాలికూడా వేసింది. తప్పో - రైటో ఇప్పటి కుర్రాళ్ళకు తెలిసినంత 'టెక్నిక్' కూడా వీరికి తెలియదేమో అనిపించింది దానాదీనా మనం కళాఖండాలనుకునే వాటికి గొప్ప కథలనుకునే వాటికి ముందుముందు ఇదే గతి పట్టవచ్చునని నాకనిపించింది. అన్ని కథలకు యీ ట్రాజిడీ వర్తిస్తుందో లేదో నాకు తెలియదుగాని కొన్నివేల కథలు మఖిలో పుట్టి పుబ్బలో మాడిపోతూవుంటాయి.

కథానిక కుర్రవాళ్ళసొత్తు. కథల్రాయటానికి మంచి ఉత్సాహం కావాలి. నలుగురు చదువుకుని ఆనందించే కథలు వ్రాయటం బ్రహ్మవిద్యేం కాదు. ఎవరు పడితే వారు వ్రాయవచ్చు. జీవితంలో బోల్డు వైవిధ్యంవుంది. అది తరగని గని. ఎంతమంది రాసినా వచ్చిన నష్టం ఏమీలేదు. తీయగా తీయగా రాగం అన్నట్లు రాయగా రాయగా కథ !

తెలుగు కథానిక మనం ఎరువు తెచ్చుకున్న ప్రక్రియే అయినా దాన్ని దాదాపు మనం స్వంతం చేసుకున్నట్లే ! కథలు

చదివి మెచ్చుకొనడానికి సాహిత్యంతో ఏం పరిచయం వుండనక్కర్లేదు. పొయిట్రీకున్న భగజం టిక్కుల్లూ దీనికిలేవు. ఇది సూటిగా జనంలోకి పోతుంది. ఏటా కొన్ని వేలకథలు కొన్ని లక్షలమంది చదువుతున్నారు. భాషతో సాహిత్యంతో పరిచయం అట్టే లేనివాళ్ళు కొన్నివందల మంది కథలు రాస్తున్నారు. కథల popularity కి కథల యోగ్యతకు ఆట్టే సంబంధంలేదు. చాలా బాగా రాయని కథలు జనాన్ని ఆకర్షించవచ్చు. Perfect గా రాసిన కథలు ఎవరూ చదవక పోవచ్చు. కథానిక హైబ్రోస్ కోసంకాదు. ఇంటలెక్చువల్ జిమ్నాస్టిక్స్ చేయటం కోసం కాని సిద్ధాంత రాద్ధాంతాల కోసమనీకాదు. తాత్కాలిక మానసిక ఆనందంకోసం తన్మయత్వం కోసం కథ చదువుతారు కాని కథలు చదివి ఎవరూ జీవిత సమస్యలను పరిష్కరించుకోరు. పాఠకుడికి ఎటువంటి తన్మయత్వం కలిగించాలి, అతడికి ఎటువంటి ఆనందాన్ని కలుగచేయాలి అనే విషయాన్ని రచయితలు ఎవరికి వారే నిర్ణయించుకోవాలి. రచయితకు ముఖ్యమైన బాధ్యత ఏమిటంటే తనకు తెలిసిన విషయం రాస్తున్నాడా, తెలియకుండా రాస్తున్నాడా అనేది. కారవుల్ని సమర్థించినా పాండవులను సమర్థించినా రచయితకు బేసిక్ నిజాయితీ చాలా అవుసరం. కథలకు కావలసిన ముడి సరుకును జీవితంనుంచి పిండుతాము కాబట్టి జీవితాన్ని గూర్చి సరైన అవగాహన వుండితీరాలి. భాషమీద అధికారం సంపాదించుకోకుండా రచనచేసి మెప్పించటం సాధ్యంకాదు. శక్తివంతమైన రచనకు శక్తివంతమైన expression అవసరం కదా! దీనికి పాతకొత్త అన్నభేదం లేకుండా ఏ మారుమూల సాహిత్యమైనా అధ్యయనం చేయవలసిందే - సంప్రదాయం తెలుసుకోకుండా సంప్రదాయాన్ని ఖండించటం ఎలాగ? బాగా చదవకపోతే, సరైన అవగాహన లేకపోతే, నిజాయితీ లోపిస్తే ఆ రచనకు విలువవుండదు. "చిత్తశుద్ధి లేని శివపూజలేలరా" అన్నారు.

నేటి సాహిత్యంలో మారుతున్న విలువలు- కథానికగూర్చి నన్ను వ్రాయమన్నారు. ఏం చెప్పాలి? కొందరి కథలు ప్రపంచానికి బాధ- కొంతమంది తమ కథలలో ప్రపంచపు బాధనంతా పలికిస్తారు. మన జీవితంలో వచ్చేమార్పులే మన సాహిత్యం కళ్ళల్లోకూడా

వస్తాయి. ఏ తరం ఆ తరానికి కావలసిన సాహిత్యాన్ని సృష్టించు కుంటుంది. రేపటి రచయితలు రేపటికీ కావలసిన కథలు రాస్తారు. మనకు ఎలాంటి కథలు యిష్టమో చెప్పటంవేరు- యిలా రాయండి, యిలా రాయకండి అని చెప్పటంవేరు. రచయితలను శాసిస్తే వారు శాసనోల్లంఘనం చేస్తారు. మనం "యువతరం" అని ఎవరిని గురించయితే చెప్పుకుంటున్నామో వారంతా వయసుచేత యువకు లేమో కానీ భావాల్లో అభిప్రాయాల్లో ఆచరణలో అంతా యువకులు కాజాలరు. అలాగే వృద్ధుల్లో కూడా— బూజుపట్టిన భావాలు కుళ్లు సంస్కారం కలవాళ్ళు యువకుల్లో ఎంతమందిలేరు? నాకు తెలిసిన ఒక యమ్మే కుర్రాడు కట్నంలేకుండా పెళ్లిచేసుకుని, తరువాత మరదలు పెళ్లికి పెచ్చుగా కట్నమిచ్చారనే సాకుమీద పెళ్లాన్ని రాచి రంపానపెడితే ఇద్దరు బిడ్డలతల్లి ఆత్మాభిమానంచేత తల్లి తండ్రు లను కట్నం ఇమ్మని అడగలేక ఆత్మహత్య చేసుకుని మరణించింది. పిల్లంతా యువకులేనా? కాలేజీ అమ్మాయిలు, ఉద్యోగినులు వ్రాసిన కొన్ని వేలు, వందల కథలూ, వ్యాసాలూ నేనుచదివాను. అన్నింట్లో నాకు ఆడదాని కన్నీరు, నిస్సహాయత, సాంఘిక దురన్యాయాలపట్ల వ్యగ్రత కనుపించింది. మన దేశంలో చదువుకుని పెళ్లికాకుండా వుండిపోయిన కన్యలనుచూస్తే మన యువకుల సంస్కారహీనత, రసజ్ఞతా, దారిద్యం వెల్లడవుతుంది. బస్సులమీద రాళ్ళు వేయటం, బీచిలో మానభంగాలు చేయటం, ఆఫీసులలో పనిచేసే ఆడపిల్లలను అవమానించటం, నేటి యువకులకు సంబంధించిన ఏ విషయంవిన్నా ఏ వార్తవిన్నా జుగుప్స కలుగుతోంది. వారిని తల్చుకుని గర్వపడ దగిన అంశాలే కానరాకుండా వున్నాయి. దేనినైనా ప్రశ్నించే అర్హత వారికివున్నదా? పాతదైనంతమాత్రాన ప్రతిదీ మంచిదికాదు. కొత్తదైనంత మాత్రాన ప్రతిదీ శిరోధార్యమూ కాదు. వీరొక్కరే కాదు, యీనాడు ఆలోచిస్తున్నదీ ప్రశ్నిస్తున్నదీ. ఆదినుంచీ మాన వుడు ఆలోచిస్తూనే వున్నాడు, ప్రశ్నిస్తూనే వున్నాడు. దాని చరిత్ర మానవ నాగరికతా చరిత్ర. నీ తండ్రికూడా యువకుడే- అతని కాలంలో అప్పటి విలువలను అతను ప్రశ్నించాడు. నువ్వొక్కడివే వీరుడివీ, శూరుడివీకాదు. నీ వెనకతరంలోనూ, నీ ముందుతరంలోనూ

వీరులూ, శూరులూ, ధీరులూ వున్నారు. ఎంతవారికైనా అహంకారం పనికిరాదు. లోతైన అవగాహనకు మన యిష్టా యిష్టాలు ఎన్నడూ అడ్డురాకూడదు.

సాహిత్యసృష్టి వ్యక్తిపరమైన కృషి. దానిపై సాంఘిక అజమాయిషీ పనికిరాదు. work shop పెట్టి మనం కథలు రాయించగలమా? కథ్రాయటం individual genius కి సంబంధించిన విషయం- కథలు ఎలా రాయాలో ఎవరూచెప్పలేరుగాని - ఎలా రాయకూడదో మనం చదివి తెలుసుకోనడానికి బోలెడు అవకాశంఉంది.

త్రాగుడు, సెక్సుమీద Social taboo వుంది, ఈ రెండిటిపై టాబూలేనట్లు వూహించి కథలు వ్రాసినమాత్రాన కాని విలువలు మారిపోతాయా? మనకు లేని ఆరుబయట విధి శృంగారాన్ని నవలల్లోనూ కథల్లోనూ చిత్రిస్తూ వుంటారు. అంతమాత్రంచేత అవన్నీ జీవితంలో ప్రవేశిస్తున్నాయా అంటే లేదు. అనుకరణ వేషభాషాదికలవరకే! నాకూ చాలా అనుమానాలు వున్నాయి. జీవితంలో వచ్చే మార్పులన్నీ సాహిత్యంలో రావటానికి వకాశం వుందా? జీవితం మారినంత వేగంగా సాహిత్యం దాని విలువలూ మారుతాయా? అంత యీజీగా మారవు. అయితే కొన్ని సర్దుబాట్లుమాత్రం జరుగుతాయి. మనం తీసుకెళ్ళి కథానికను ఒక సూత్రానికో, ఒక సిద్ధాంతానికో, ఒక నమ్మకానికో ముడిపెట్టి దాన్ని గుంజకు కట్టివెయ్యకుండా వుంటే అది ఛెంగు ఛెంగుమని దుముకుతూ, స్వేచ్ఛగావిహరిస్తుంది. ఒక కొత్త రచయిత ఒక మంచి కొత్త కథ వ్రాసినపుడల్లా తెలుగు కథానిక యింతితై వటుడింతయై అన్నట్లు అంతం తెత్తు ఎదిగిపోతుంది. దాని భవిష్యత్తు కొత్తవారి చేతుల్లోవుంది.

★

భగవంతుని అచ్చాఫీసు
ప్రచురించిన మానవ ప్రకృతికావ్యంలో
లెక్కలేని అచ్చుతప్పుల్ని
ఇక్కడ మానవుడేదిద్దుకోవాలి.

—ఆరుద్ర

మారుతున్న విలువలు - నాటకం

శ్రీ గొల్లపూడి మారుతీరావు

కాలం మారిపోతోంది. విలువలు మారిపోతున్నాయి. మనుషులు మారుతున్నారు. స్వభావాలూ, దృక్పథాలూ, అలవాట్లూ, ఆచారాలూ - అన్నీ మారిపోతున్నాయి. కాని యీ తెలుగుదేశంలో మారనిది ఒక్కటివుంది. తెలుగు నాటకరచయిత దృక్పథం.

బ్రిటిష్ పాలనకు – దేశీయపాలనకు మలుపులోనిలిచిన కొద్దిమంది రచయితలు – తమదికాని (బ్రిటిష్ సంఘాన్ని) Popular appeal కోసం సాధిస్తే – ఆరోజు చెల్లింది. నలుగురూ చప్పట్లుకొట్టారు. మెచ్చుకున్నారు. మరి యీరోజు సంఘం ఎవరిది?– నీదీ, నాదీ – అందరిదీనూ. "సంఘానికి హృదయంలేదు. సమాజం మనల్ని బ్రతకనివ్వదు–" లాంటి మాటలు ఎందుకో – ఇంకా వింటూంటే యివాళ జుగుప్సపుట్టిస్తాయి. సంఘం – మనపై – మన నైమిత్తిక జీవితానికి మనమే ఏర్పరచుకొన్న discipline అనుకుంటే – అది చెడినప్పుడు విమర్శించుకోవలసింది మనలనే అని గుర్తించినప్పుడు – ఈ "సంఘం" బారినుంచి నాటకం బ్రతుకుతుంది.

20 సంవత్సరాలక్రితం అవసరమైన – యిప్పుడు వెకిలిగా కనిపించే – చాలా విషయాలు యీ విధంగా యింకా మన నాటకాల్లో కనిపిస్తున్నాయి నాటకరంగంలో monotony కి యిది ఒక కారణం. యివాళ్టి రోగాలకి యింకా బలమైనవి, కొత్తవి ఏవో మందులు కావాలి? అవి ఏమిటి? వాటిని ఎంత బలంగా, ఎంత కొత్తగా, ఎంత జాగ్రత్తగా ఎదుర్కోవాలి?– అని రచయిత ఆలోచించాలి.

20 ఏళ్ళ క్రిందట మనదయిన యీ దేశంలో మొదటిసారిగా సమాజాన్ని గురించి, మన సమాజ జీవితాన్ని గురించి ఆలోచించాడు రచయిత. ఇక్కడ కనిపించే అవినీతిని ఎత్తిచూపాడు – (ఎన్ జీవో, మావూరు వంటి

నాటకాలు) కాని, క్రమంగా ఆ అవినీతి వ్యక్తిని నాశనంచేసి, మనకు కంటికి కనిపించనిచోట గుర్తుపట్టలేనంతగా రక్తంలో జీర్ణమయిపోయింది. క్రమంగా దాన్ని మరిచిపోయి - నేలవిడిచి సాము ప్రారంభించాడు రచయిత. సమాజ పరమయిన అవ్యవస్థ క్రమంగా వ్యక్తినీ నాశనం చేసింది - నైతికంగా మనిషి జారిపోయాడు. ఇలా moral vacacny - ఏర్పడిన ఈ రోజుల్లో మనిషిని దక్కించుకోవలసిన సునిశితమయిన, సహజమయిన, బలమయిన రచనలు రావాలని నా ఉద్దేశం.

ఇవాళ జీవితంలో "వేగం" పెరిగింది. శాస్త్రీయ పరిణామాల ద్వారా, ప్రయోగాలద్వారా - ప్రపంచం Shrink అవుతోంది. ఇవాళ అమెరికా వెళ్ళడం కష్టంకాదు... పదిమంది చేసే పని ఒక్కడు చెయ్యడం కష్టంకాదు. చంద్రుడిదగ్గరకు వెళ్ళడం కష్టంకాదు. అంచే జీవితం తాపీగా తాబేలు నడక మాని లేడిలాగా పరుగుపుచ్చుకొంది. మనిషి Restless అవుతున్నాడు. ఇది కారణంగానే "నాటిక" పుట్టిందనుకుంటాను. సమాజంలో విస్తృతంగా చెప్పనవసరంలేని సమస్యల్ని క్లుప్తంగా, సూటిగా, ధాటిగా చెప్పడానికి ఒక బలమైన సాధకంగా "నాటిక" పుట్టింది. సమాజంలో విలువల మార్పుకి యిదొక ముఖ్య నిదర్శనం. మరి దీన్ని ఎందరు సద్వినియోగం చేసుకుంటున్నారు? మూడు నాటకాలకు సరిపోయే సమస్యల్ని నాటికల్లో యిరికించి ఒక క్లైమాక్స్, ఒక యాంటిక్లైమాక్సుకూడా యిరికించి సమస్యల్ని పులిమి, వాటిని పరిష్కరించడానికి యాతన పడి చివరికి అస్తవ్యస్తంగా ముగుస్తోంది నేటి తెలుగు నాటిక.

ఒకే ఒక చిన్న విషయాన్ని బలంగా మనస్సుకి తాకేటట్టు సూటిగా సంధించే సాధనం నాటిక. దానిలో క్లయిమాక్సులు లేకపోయినా ఫరవాలేదు. వేగం, వాడి వుంటేచాలు. ఒకే పాత్ర, ఒకే అంశం ఉన్నాచాలు. నాటిక చూశాక ఒక సమస్యవేపుకు మన దృష్టి మళ్ళితే అది కృతార్థత చెందినట్టే.

అసలు "నాటకం", "నాటిక" ప్రయోజనమేమిటి? నాటకం చేసే పని ఏమిటి? అని ప్రశ్నించుకొందాం. ఇక్కడ నేను Ibsen ని సాక్ష్యం చెప్పుకుంటాను- ఒక anthology కి ముందుమాట వ్రాస్తూ "నాటకం సమస్యల్ని పరిష్కరించదు-ఎత్తి చూపుతుంది. వీళ్ళు మీ నిత్యజీవితంలో తటస్థపడుతున్న పాత్రలు, వీళ్ళ మంచి చెడ్డలివి, మీరు వీళ్ళ ద్వారా ఎదుర్కొం

టున్న సమస్యలివి. వీటిని పరిష్కరించుకోవడానికీ మీరేంచేస్తారు? అని ప్రశ్నించడమే నా పని" అని అన్నాడు. అంతవరకే నాటకం చేసే, చెయ్య గలపని అని నా ఉద్దేశం.

"Sweet bird of youth" అనే నాటకంలో ప్రఖ్యాత అమెరికన్ నాటకరచయిత టెన్నిసీ విలియమ్స్ - తన ముఖ్యపాత్రచేత చివరగా చెప్పించే Curtain line యిది. "I don't ask for your pity, but just for your understanding - not even that - no - Just for your recognition of me in you, and the enemy, time, in us all" అని. అతను కథను ముగించలేదు. పాత్రల్ని ముగించలేదు. చివరకి ఎత్తుకున్న సమస్యలన్నీ అలాగే ఆగిపోతాయి. అయితే ఆ ముఖ్యపాత్ర మనల్ని ఎందుకో చివరంటా జిజ్ఞాస కలిగిస్తూనే వుంటుంది. చివరికి పైవిధంగా ఆ పాత్ర చెప్పాక ఒక్కసారి తుళ్ళిపడతాం. ఏం జరిగిందని ఆలోచించేలోగా నాటకం ముగుస్తుంది. తర్వాత ఆ పాత్రను గురించి, ఆ సమాజం గురించి మనం ఆలోచించకుండా వుండలేం.

కాని మన నాటకాల్లో, సినీమాల్లో పాత్రలన్నీ, ఎత్తుకున్న సమస్యలన్నీ పరిష్కారం కావాలి. (ఎవరు ఈ పరిష్కారంచేసేది !– రచయితా !!) చివర అంతా సుఖపడాలి. గ్రూపు ఫోటోకి రావాలి. కాని కేవలం పాత్రల్ని లేదా ఎత్తుకున్న సమస్యనీ మాత్రమే ఎందుకు ముగించి వదిలిపెట్టగూడదు ! ఆ సమస్యమీద రచయిత ఒక్కసమీక్ష (టెన్నిసీ విలియమ్స్‌లాగ) చేసి ఎందుకు వదలకూడదు? (ఇక్కడ అలా చేసిన ఒక యిటీవలి సినిమా ఉటంకిస్తాను. "మనుషులు మారాలి"లో మన అలవాట్ల ప్రకారం దుర్మార్గులు శిక్షించ బడలేదు. కాని రచయిత చెప్పదలచుకొన్న సమస్యని సమీక్షించి దానిని ఒక ముగింపుకి తెచ్చి వదిలేశారు !)

"ఒకచెట్టూ రెండే పువ్వులూ" నాటకంలో కేవలం సమస్యనిముగించి లేదా సమస్యపై ఒక ఘాటు సమీక్షచేసి ఒక poser గా నాటకాన్ని ముగిస్తే చాలామందికి అర్థం కాలేదు. ఒకచోట ప్రదర్శించినప్పుడు నాటకం అయి పోయిందని చెప్పాల్సివచ్చింది. అంటే– చివర గ్రూపు ఫోటో లేదన్న బాధ చాలామందిలో కనిపించింది !.

ఎందుకు? మనం యింకా పాతరోగాలకి పాతమందుల్నే వాడు తున్నాం కనుక. కొత్త మందుల్ని స్థిరపడిపోయిన ఆ పాతరోగాలకే

వాడాలని ఎవ్వరినీ సిద్ధపరచలేదన్నమాట. ప్రేక్షకుల ధృక్పథాన్ని మనం మార్చుకోలేదన్నమాట. మనప్రేక్షకుల్ని మనం పోగొట్టుకుంటున్నామన్నమాట. యివాళ యిదీ పెద్ద సమస్య. మనం పాత ధోరణిలో, ఒక analysis లేని పాతఫక్కీరచనలతో మనం మన ప్రేక్షకుల్ని నష్టపోయాం. అదే ఆంధ్రదేశంలో నాటకానికి పురస్కారం లేకపోవడం అంటే అర్థం.

ఇంకొక ముఖ్య విషయం :

నేటి యువతరం కొత్తపోకడలుపోతోంది. వింతపోకడలుకూడాపోతోంది. తిరగబడుతోంది. అన్నిచోట్లా అలజడి, అరాచకం కనిపిస్తున్నాయి. ఈపరిస్థితిలో నాటక పాత్ర ఏమిటి? ఈ వ్యవస్థ ఏ నాటికలో ప్రతిబింబిస్తోంది? ఎటు ప్రయాణంచెయ్యాలో తెలీక, ముందు తనకి సంక్రమించబోతున్న ఈదేశాన్ని నమ్మలేక, చీకటిలో నిలబడ్డ యువతరం వెర్రికేకపెట్టి - పిచ్చివాడిలాగ వీధిని పడడాన్ని ఏ రచయిత నాటకంలో బిగించాడు? ఈ మధ్య "ప్రజల్ని నరికెయ్యాలి, చంపెయ్యాలి" అంటూ భీషణనినాదాలతో ఒకటి రెండు రచనలు కనిపించాయి. ఇక్కడ నాటకపరంగా ఒకటి చెప్పాలనిపిస్తోంది. సాహిత్యప్రక్రియద్వారా - అంటే నాటకంద్వారా యిలాంటి అవ్యవస్థను గర్హించే రచయిత ఆ వ్యవస్థను ప్రేమించగలగాలి. లేకపోతే ఆ వ్యవస్థను గర్హించే అర్హతలేదు. సాహిత్యం సంస్కరణకు, వికాసానికి ఉపయోగపడవలసిన "సాధు" ప్రక్రియ అని నా మతం. అంతేకాని సమూల వినాశానికి సాహిత్యం ఎందుకు? కత్తిపట్టుకుంటే చాలదా?

చెడిపోతున్న, నాశనమయిపోతున్న వ్యవస్థని సానుభూతితో, సహనంతో ఔదార్యంతో పరిశీలించగలిగిన రచయితే దానికి కావలసిన మార్పుని సూచించగలడు. లేకపోతే యిలాంటి Volcanic Subjects కి కోతిచేతిలో దివిటీలాగ చాలా ప్రమాదకరమైన పరిణామాలు సాధ్యం కావచ్చు.
You must be able to love the Society, which you want to reform. It is only their, the reformation is possible.

అందువల్ల నానాటికీ శిథిలమయిపోతున్న మనిషి నైతిక జీవితాన్ని పునరుజ్జీవింపచేసే రచనలు నానాటికీ వేగంతో పురోగమిస్తున్న యీ 'Restless' స్వభావాల్ని కాస్త ఆపి, ప్రశ్నించే రచనలు - ఔదార్యంతో, దయతో, ఓర్మితో తప్పుత్రోవపట్టిన వ్యక్తిని సంస్కరించే రచనలు కేవలం

సమస్యను సామాజిక జీవితాన్ని ఆవిష్కరించి పరిష్కారాన్ని వ్యక్తికే వదిలేసే గడుసయిన రచనలు యివాళ రావాలనుకొంటాను.

నానాటికీ సామాజిక విలువలు మారిపోతున్న యీ కాలంలో "నాటకం" పాత్ర యిది.

卐 卐

"పాఠకులు దిట్టమయిన వాళ్ళయినప్పుడే విలువగల రచనలు వెలువడ్తాయ్. ఉత్తమ సాహితీ సృష్టికి ఉత్తమ పాఠకుల ఉనికి ప్రోద్బలం అవసరం"

* * * *

"ఏదేశ చరిత్రచూచినా
ఏమున్నది గర్వకారణం :
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం,
వైషమ్యం, స్వార్థపరత్వం
కౌటిల్యం, ఈర్ష్యలు, స్పర్ధలు
మాయలతో మారుపేరతో
చరిత్రగతి నిరూపించినవి.

—శ్రీ శ్రీ.

When you think of GAS think of

CALGAS

AGENTS FOR TWIN CITIES

Hyderabad Gas Company

23, Lalbahadur Stadium, Hyderabad

Phones : 36622 & 33422

Branch :

7-2-20 Ghasmandi, Secunderabad
Phone : 76633

Refill Delivery Points at :

1. Charminar (Phone : 56041)
2. Malakpet (Phone : 41932)
3. Tarnaka (Phone : 71793)
4. Alwal (Phone : 79219)
5. Fatehnagar (Phone : 39566)
6. Ramachandrapuram.

NOW SERVING OVER 10,000 HOUSES IN THE TWIN CITIES

220

సాహిత్యంలో మారినవిలువలు - కవిత

శ్రీ కుందుర్తి

సాహిత్యంలో విలువలు మారుతున్నాయని అందరూ అంగీకరించిన విషయమే. మారుతున్నాయి అనవలసిన అవసరం యింకలేదు; మారాయి అనవచ్చు. ఎందుకంటే, యీమార్పు ఎల్లప్పుడూ జరుగుతుండేదే అయినప్పటికీ, ఒకానొకకాలంలో స్పష్టంగా బైటపడినప్పుడు యీ మార్పు జరిగింది అంటాము. ఆధునిక యుగంలో విలువలు మారడం అనేది కందుకూరి, గురజాడ, గిడుగు ప్రభృతుల కాలంనుండి ప్రారంభమై నేటికి దాదాపు ఒక స్థిరత్వాన్ని పొందింది. ముఖ్యంగా గమనించవలసిన విషయమేమంటే, యీ విలువల మార్పు అనేది మిగతా జీవితరంగాలను అన్నిటినీ వదలిపెట్టి ఒక్క సాహిత్యంలోనే రాదు. వచ్చిన మార్పుయొక్క ప్రభావం అన్ని జీవిత రంగాలను ఏకకాలంలో తాకుతుంది; కొంచెంముందు, వెనుకా, అంతే. అంటే యీనాడు మనం మారిన విలువలు అనుకుంటున్నవి ఆధునిక యుగం ప్రారంభమైన తర్వాత వచ్చిన భావ విప్లవానికి సంబంధించినవి. ఇష్టంవున్నా, లేకున్నా యీ మార్పుకు ప్రధానమైన కారణాలుగా, ఆంగ్లభాషా, నాగరికతల ప్రభావమూ, ప్రపంచవ్యాప్తమైన వైజ్ఞానిక ప్రగతి, ఆధునిక శాస్త్రీయ దృక్పథము, అక్టోబరుమహావిప్లవము మొదలై నవాటిని అంగీకరించకతప్పదు. విలువలు మారడమంటే, విశ్వాసాలు మారడం. పేరొక్కన్న కారణాలవల్ల మతము, సంఘము, మనిషి, ప్రగతి మొదలగువాటిపట్ల మన పూర్వ విశ్వాసాలు సడలిపోయి కొత్త విశ్వాసాలు ఏర్పడినవి. సంఘంలో మతంయొక్క ప్రాధాన్యం పూర్తిగా సన్నగిల్లిపోయి, అది మానవుడి ఆంతరంగిక విషయంగా సంకుచితమైపోయింది. సమాజ వ్యవస్థ, దాని శాగోగులను గురించిన

మన ఆలోచనలలో తీవ్రమైన మార్పువచ్చి, మార్క్సిజం ప్రభావం బాగా ఎక్కువై, శాస్త్రీయదృక్పథం అలవడింది. దేనినిగాని మూఢంగా విశ్వసించే రోజులుపోయి, ప్రతి దానినీ ప్రశ్నించే తిరుగు బాటుతత్వం వృద్ధిపొందింది. జరుగుతున్న వైజ్ఞానిక ప్రగతివల్ల, మానవుడు సాధించగలుగుతున్న అనేక విజయాలవల్ల, దైవంలో విశ్వాసం సడలిపోయి. మనిషి ఆత్మవిశ్వాసాన్ని పొందగలిగాడు. ప్రగతి అనేది నిరంతరమైనదనీ, దానికి వెనుకచూపులేదనీ, ఎన్ని తంటాలుపడినా గతం పునరావృతంకాదనీ, యీనాటి సాంఘిక వ్యవస్థ సోషలిజం మొదలగు నూతన మార్గాలవైపు పురోగమించాలేగాని, ఫ్యూడలిజంవంటి పూర్వవిధానాల పునరుద్ధరణ అసంభవం అనే అంశాలు మన ఆలోచనా రీతులలో బాగా బలపడిపోయినవి. ఇటువంటి సమూల మైన మార్పు జరిగినప్పుడే విలువలు మారడం, అవి మారినట్లు స్పష్టంగా మనకు కనిపించడం జరుగుతుంది.

మారిన విలువల ప్రసక్తి వచ్చినప్పుడు, అసలు మారకుండా వుండే శాశ్వతమైన విలువలు వున్నాయా అనే ప్రశ్న రాకతప్పదు. ప్రతిది మారడం, సృష్టిలక్షణమైనప్పుడు మారని విలువలు అనేవి వుండడం సాధ్యమా అనేది ఆలోచనీయము. సత్యం, శివం, సుందరం వంటి లక్ష్యాలు శాశ్వతమైన విలువలని అనాదిగా విశ్వసించబడు తున్నవి. కాని, "అంచే ఏమిటి?" అనే ప్రశ్న రానంతకాలమే యివి శాశ్వతమైనవిగా నిలిచివుంటాయి. ధర్మంచర, సత్యంవద అంచే అందరూ అంగీకరిస్తారు. కాని ఏది ధర్మం? అని ప్రశ్నించుకుని సమాధానం చెప్పుకోవలసివచ్చినప్పుడు విలువలు మారినాయో లేదో తెలుస్తుంది. అవి శాశ్వతంగా పనికివచ్చే సాధారణీకరణ సూత్రాలే గాని విలువలు కావు. "కవిత్వం మంచిగా వుండాలి, హృదయంగ మంగా వుండాలి, రసవంతంగా వుండాలి". యివన్నీ విలువలని చెప్ప డానికి వీల్లేదు. మనుషుల ఆలోచనారీతిలో, అవగాహనలో మార్పు వచ్చిన కొలది వారి కవితాస్వాదనశక్తిలోకూడా మార్పువస్తుంది. అభిరుచులలో మార్పువస్తుంది. అయితే మరి, కావ్యం పదికాలాల పాటు నిలవాలి, శాశ్వతమైన విలువలు కలిగివుండాలి అంచే అర్థం ఏమిటి? ఆనాటి కాళిదాసు, షేక్స్పియర్ వంటి మహాకవుల

రచనలు ఎందుకు నిలిచివున్నాయి ? ఇప్పుడు విలువలు మారినాయి గదా, సాహిత్యంలో వాటి స్థానానికి భంగంకలుగలేదెందుకు ? అనే ప్రశ్నలు ఉదయిస్తాయి. ఏ దైనా రచన పాఠకులచేత ఒకటికి పదిసార్లు చదువబడడానికి వుండవలసిన ప్రధాన లక్షణం ఏమంటే అందులో నిక్షిప్తమైవున్న సందేశము, దాని శైలి మొదలగునవి. సాధారణ పాఠకుల హృదయాలకు దగ్గరలో వుండాలి. అంటే, అవి Human emotions ను తాకి, హృదయాన్ని రెచ్చగొట్టి, ఆవేశం కల్పించి పాఠకుణ్ణి ఆనందపరచాలి. శకుంతలను అత్తవారింటికి పంపుతూ కణ్వ మహర్షి పడిన వేదన, పుత్రులు కలుగలేదని దశరథుడు పడిన విచారము మొదలగునవి లోకంలో సర్వసాధారణంగా ఉండే మానవ హృదయ లక్షణాలు. ఒకదానిని ప్రేమించడం, తమదనుకొన్న ఒకవస్తువు నశించినపుడు దుఃఖించడం మొదలగునవన్నీ హృదయానికి సంబంధించినవి. ఇటువంటి పట్టులలో పాఠకుని అనుభూతులను కూడా స్పృశించగలిగేటట్లు రాయడం రసవంతంగా రాయడం. ఇందువల్ల కొన్ని కావ్యాలు ఒకటికి పదిసార్లు చదివినా విసుగు ఉండదు. ఒక పెద్ద కావ్యంలో కొన్ని ఘట్టాలు మాత్రమే ఈ విధంగా వుంటాయి. ఇవి మాత్రమే చదివి మిగిలినవి వదిలివేస్తాము. ఈ విధంగా మానవ జీవిత యదార్థ పరిస్థితికి అనుగుణంగా అందరి హృదయాలకు తగిలే విధంగా, అంటే రసవంతముగా వ్రాయడమే ఒక విలువ అనుకుంటే యీ విలువకు మార్పులేదు. కాని సాధారణంగా మనం శాశ్వత విలువలు అనుకుంటున్నవాటిలో, ఇది చేరదు. ఇది రచయితయొక్క ప్రతిభా విశేషమును బట్టి వుంటుంది. పూర్వకవులపట్ల, పురాణపాత్రల పట్ల మనకు ఉండే భక్తి గౌరవాలవలన కూడా కొన్ని కావ్యాలు నిలిచివున్నట్లు కనిపిస్తాయి. కాని అవి చారిత్రకంగా మాత్రమే నిలచి వుంటాయి. ఉదాహరణకు ఇటీవల సాహిత్య ఎకాడమివారు ప్రచురించిన 'ఒక రూపాయి' కావ్యాలు చాలామంది కొన్నారు. కాని వాటిని చదివినవారు, చదివి ఆనందించినవారు నూటికి పదిమంది కంటే యెక్కువుండరు. అటువంటివారిలోకూడ అధికసంఖ్యాకులు యీనాటి మారినవిలువల స్పృహలేకుండా "గతకాలము మేలు వచ్చుకాలము కంటెన్" అనే విశ్వాసం కలవారు. అంతేకాక ఒక కావ్యము, ఒక

శైలీవిన్యాసం వలననో, శ్లేషాద్యలంకార నిర్వహణ సామర్థ్యంచేతనో, సమాన కాఠిన్యబలంచేతనో, లేక ఎక్కువమందికి అందుబాటులో వున్న సారళ్యంచేతనో, నిరోష్ఠ్య నిర్గద్యాది కష్టతర నిబంధనలచేతనో- ఏదో ఒక కారణంచేత చారిత్రికంగా నిలిచి యుంటుంది. కాని యీ కారణాలు ఏవీ శాశ్వతవిలువలని చెప్పటానికి వీలులేదు.

విలువలు మారడం అనేది ఆధునిక కాలంలో జరిగినంత మౌలికంగా ఇంతకుపూర్వమెప్పుడూ జరగలేదేమో అనిపిస్తుంది. సాంఘిక వ్యవస్థ మారినప్పుడల్లా విలువలు మారుతూవుండడం, అవి సాహిత్యంలో ప్రతిఫలిస్తూ వుండడం జరుగుతూ ఉండేమాట నిజమే. కాని ఒక్క తెనుగుసాహిత్యాన్ని మాత్రమే దృసిలోపెట్టుకుని యీ విలువల మార్పును అంచనా వేయడానికి వీలుండదు. వేదకాలం నుండి జరిగిన రచనలన్నింటినీ సమగ్రంగా చూస్తేనేగాని మార్పులను పసికట్టటానికి వీలుండదు. దానితోపాటు ఇతర దేశాలలోని చరిత్ర, సంస్కృతి, సాహిత్యాలనుకూడా ఒకకంట కనిపెట్టి చూడాలి.

ప్రస్తుతాంశము మారిన విలువలు నేటి కవిత్వంలో ఏ విధంగా ప్రతిఫలిస్తున్నాయి అని. కవిత్వంలో మారిన విలువలు ప్రతిబింబించడం ప్రారంభమైనది అభ్యుదయ కవితాయుగంలో అని చెప్పాలి. అభ్యుదయ కవిత్వానికి, భారతాదియైన తత్పూర్వ కవిత్వానికి గల తేడా చాలా మౌలికమైనది. ఛందస్సులో, రచనారీతిలో, కావ్యపరమార్థంలో యీ రెండింటికి యే విధమైన పోలికలేదు మారిన విలువల ప్రభావం ఇతరరంగాలవలె సాహిత్యంలోకూడా అనంతకోటిరూపాలలో దర్శనమిస్తుంది. సంప్రదాయికఛందస్సును తృణీకరించి కొత్త ఛందస్సులను సృష్టించడానికి ప్రయత్నించడం, అసలు ఛందస్సే పూర్తిగా పనికిరాదని ఎదురుతిరగడం, ఛందస్సువలనకలిగే ప్రయోజనాలను యితర విధాలలో సృష్టించుకోవడం, ప్రకటనరీతిలో కొత్తదనంకోసం ప్రయత్నించడం, వ్యాకరణాన్ని ఉల్లంఘించడం, అలంకారాల భారాన్ని విసర్జించడం, అతిసామాన్యుడికి కావ్యనాయక గౌరవం కల్పించడం, సామాన్యప్రజల జీవిత విశేషాలను చిత్రించడం ద్వారా కల్పనాత్మకమైన కవిత్వానికి వాస్తవికత అనే కొత్త

లక్షణాన్ని కల్పించడం - ఇవి అన్నీ, ఇంకా యిలాంటివి ఎన్నో మారిన విలువలు సాహిత్యంలో ప్రతిఫలించినప్పటిఫలితాలే. అభ్యుదయ కవితాయుగం తరువాత వచ్చిన వచన కవితాయుగం ఇంకా ఇటీవలి కాలంలోని కొత్తపోకడలు మొదలగు వాటిలో కొత్తకోసం నిరంతరం ప్రయత్నం జరుగుతున్నప్పటికీ విలువలు మారడం అనేది మళ్ళీ ఇప్పుడప్పుడే జరిగే పనికాదు. అభ్యుదయ కవితాయుగంలో కావ్య పరమార్థం సోషలిస్టుసమాజసాపనము అప్పటికి అదికొత్త. ఇప్పుడు అది సర్వసాధారణమైపోయింది. అలాగే ఛందస్సును నిరాదరించడం ఆనాడొక విప్లవం. అది నేడు అంగీకారయోగ్యమై వచనకవిత రూపంలో ప్రజాభిమానాన్ని చూరగొన్నది. అంటే దీనిఅర్థము ఆధునికయుగంలో మారిన విలువలు నేటికి ప్రజలందరి ఆమోదాన్ని పొందినవని. ఈ నాడు కవిత్వంలో అధికసంఖ్యాకులైన కవులు చేపట్టిన వచన కవితారూపము ఆధునికయుగంలో జీవితపు విలువలలో వచ్చిన అన్ని మార్పులకు సాహిత్యంలో ఏకైక ప్రతినిధిగా వృద్ధి పొందింది. కవికి కావ్యవస్తువు ఎన్నికలో సామాజికస్పృహవుండడం అంటే "ఆద్య సత్కథల్ వావిరిపుట్టు రత్నములు" అనే ధోరణితో వెనుకకుపోకుండా సమకాలీన సమాజంలోని వాస్తవిక పరిస్థితుల చిత్రణ ద్వారానూ, వాటి కారణాల పరిశీలనద్వారానూ ప్రజలలో చైతన్యం కలిగించి, సంఘం మార్పుచెందడానికి దోహదకరమైన కావ్యవస్తువులను మాత్రమే ఎన్నుకోవడం వచనకవితయొక్క ప్రధాన లక్షణం. వచనకవిత బాగా విస్తరించిన తరువాత ఈ ప్రధాన లక్షణానికి కొద్దిమంది కవుల విషయంలో విఘాతం కలుగకపోలేదు. కాని, దానిని అంతగా పట్టించుకోనవసరంలేదు. ఈనాడు కవిత్వం రాస్తున్న వేలాది యువకవుల కవితాభ్యాసం వచనకవితతో ప్రారంభమవుతున్నది. వ్రాయడం తలపెట్టిన మొదటి కవితలోనే మానవుడు, అతని కష్టసుఖాలు, అతన్ని దుర్భరపరిస్థితిలోకి యీడ్చిన సమాజం, కవిచుట్టూ తాండవిస్తున్న అవినీతి, అక్రమమార్గాలు, సమాజంలోని కుళ్ళు, పెద్దమనుషులనబడుతున్నవారి బండారం మొదలగు విషయాలు అప్రయత్నంగానే చోటుచేసుకుంటున్నవి. ఇటువంటి అభ్యుదయ భావాలకు వచనకవిత ఒక్కటే సరియైన వాహనం అనడానికి

యింతకుమించిన ఋజువు ఏంకావాలి? అలాగే, కవిత్వంద్వారా జరిగే ప్రబోధం సామాన్యపాఠకులకు అందుబాటులోఉండాలి అనే ఆశయంతో పూర్వకావ్యభాషనూ దాని అంగాలైన అలంకార, వర్ణన, సమాసాధిక్యతలను విసర్జించి, వాడుకభాషలో కవిత్వంచెప్పే అలవాటు ఏర్పడింది. అంటే చెప్పే విషయమూ, రీతి పూర్తిగా మారిన కొత్త కవితారూపముగా వచనకవిత స్థిరపడిపోయింది.

అభ్యుదయ కవితాయుగంలో గానీ, ఇటీవలి కాలంలోగానీ, కవిత్వంలో వచ్చిన కొన్ని వికృత లక్షణాలను గురించి చెప్పకుండా వదలిపెట్టడానికి వీలులేదు. క్రొత్తను సృష్టించాలనే ఉబలాటంతో అయోమయత్వము, అర్థరాహిత్యము, అన్వయక్లిష్టత మొదలగునవి కొందరి రచనలలో చోటు చేసుకున్నవి. నూతన ప్రయోగాల పట్ల, పాశ్చాత్య కవులు పోయిన పోకడలపట్ల కొందరు ఆధునిక కవులకుగల మోజు ఈ పరిస్థితికి దోహదం చేసింది. నిజమైన ప్రగతివాదకవులకు ప్రయోగవాద లక్షణాలు కలిగిన కవులకు లక్ష్యము ఒకటే అయినా, ఉభయులు వుద్దేశించిన కావ్యపరమార్థం ఒకటే అయినా ప్రజల దగ్గరికి చేరడంలో ప్రయోగవాద కవిత్వము విఫలమైనదనే చెప్పాలి. దీనికి కారణం, సంఘంలో మారిన విలువలయొక్క స్వరూప మేమిటో వాటిని కవిత్వానికి వర్తింపజేసినపుడు సాధించవలసిన ఫలితాల స్వరూప మేమిటో సరియైన అవగాహన లేకపోవడమే. అభ్యుదయయుగం లోని కవులలోనూ, ఇప్పటి యువకవుల్లోనూ, ఈ తెగకు చెందిన వారు కొందరున్నారు. వచన కవితలో సమాస బాహుళ్యము, కావ్య భాష, శ్లేషలు, యమకాలు ఎందుకుండకూడదని ప్రశ్నించేవారూ, సమాజం యెంత కుళ్లుగావుందో అంత కుళ్ళు మాటలతో, అంత తీవ్రతతోనే దానిని ఎందుకు నిరసించరాదు అని ప్రశ్నించేవారూ- రకరకాల వాదనలుచేసే కవులున్నారు. ఏది ఏమైనా సమతా సమాజ వాద కవితా లక్షణాలను గుఱించిన అవగాహన కలిగివుండడం కవులైనవారికి నేడు చాలా అవసరం.

సామాజికవ్యవస్థ మారినపుడు విలువలు మారుతాయి అనుకున్నాంగదా మరి మన దేశంలో సామాజికవ్యవస్థలో మౌలికమైన మార్పు ఏమి వచ్చింది అని ప్రశ్నించవచ్చు. ఆధునిక యుగంలో

మనరాష్ట్రము, మన దేశము అనే సరిహద్దురేఖలు యేనాడో చెరగి పోయినవి. ఆధునిక వైజ్ఞానికప్రగతి విజయాల ఫలితంగా నేడు ప్రపంచమంతా ఒకే మానవజాతి నివాసస్థలంగా రూపొందింది. ప్రపంచంలో చాలా భాగంలో పెట్టుబడిదారీ సమాజ వ్యవస్థ మారి పోయి నూతన సోషలిస్టు వ్యవస్థ యేర్పడింది. దీని ప్రభావ ఫలితంగా అన్ని దేశాలలో భావవిప్లవం వచ్చింది. ఆలోచనారీతి మారింది. విలువలు మారాయి. అవి సాహిత్యంలోనూ ప్రతిబింబించాయి.

మారిన విలువలు సాహిత్యంలో ప్రతిఫలించిన సందర్భంగా, వచనంలోనూ, కవితలోనూ కలిగిన ఫలితాలను సూక్ష్మంగా పరిశీలించడం అవసరం. వచనానికి సంబంధించి నంతవరకు పూర్వ తెలుగు సాహిత్యంలో చెప్పుకోదగినది ఏమీలేదు. కథ, నవల మొదలగు వచన ప్రక్రియలు మనం పాశ్చాత్య సాహిత్యంనుండి నేర్చుకున్నవే. అంచే ఆధునికయుగంలోని లక్షణాలతో కొత్తగా వచన ప్రక్రియ ఆవిర్భవించింది. అందుకే వచ్చీరావడంతో అది వ్యవహారిక భాషాస్వరూపాన్ని నిస్సందేహంగా ధరించింది. కవితలో పరిస్థితివేరు. పూర్వ కావ్యభాషా బంధాలను తెంచుకుని వ్యవహారిక భాషను కవిత్వములో ప్రవేశ పెట్టడానికి చాలా ఆలశ్యమూ అయింది. చాలా శ్రమ పడవలసి వచ్చిందికూడా. స్వరూపంలో వచనం ముందడుగువేస్తే భావాలలో కవిత్వం ముందడుగు వేసిందని చెప్పవచ్చు. ఎందుకంటే అభ్యుదయ భావవిప్లవం కవితలో ప్రవేశించినంతగా నాటికీ, నేటికీ, కథల్లో, నవల్లో ప్రవేశించలేదేమో అనిపిస్తుంది. కార్మికులు, కర్షకులు, యితర సామాన్య ప్రజలు, వారి కష్ట సుఖాలు మొదలగునవి అభ్యుదయ కవిత్వంలో వచ్చినంతగా వచనంలో రాలేదు. అసలు రాలేదని కాదుగాని, వచనగ్రంథాలు వచ్చినంత ఎక్కువ నిష్పత్తిలో ఆ భావాల ప్రవేశం జరుగలేదు. కాని మధ్యతరగతి ప్రజల జీవన పరిపరిస్థితులు, గ్రామీణ జీవితం, మనస్తత్వ పరిశీలన మొదలైనవన్నీ ఆధునిక శాస్త్రీయభావచేతనయొక్క లక్షణాలుగా చెప్పుకోవచ్చు. కవిత్వంలో మాత్రం, అభ్యుదయ భావాలు అరమరిక లేకుండా, సూటిగా ప్రవేశించాయి. ఎంత ఎక్కువగా ప్రవేశించాయంటే, రాజకీయ ప్రబోధకుడికీ, కవికీ భేదంలేనంతగా ప్రవేశించాయి. ఇది

కవిత్వమా, నినాదాల సమూహమా అని విమర్శకులు అడిగేటంత ఎక్కువగా ప్రవేశించాయి. అందుకే అభ్యుదయకవిత్వంలో కవిత్వపు విలువలు చాలా తక్కువగా వున్నాయనే అపవాదు పుట్టింది. అయినా, ఆ విధంగా జరిగినందువల సోషలిసు భావవిప్లవానికి మేలే జరిగింది కాని కీడేమీ జరగలేదు. ఈ విమర్శను పురస్కరించుకునే అనంతరకాలంలో, వచనకవితాదశలో కవిత్వపు విలువలకు లోటులేని విధంగా అభ్యుదయ కవిత్వం ప్రవర్తిల్లింది. ఏనాడైనా కవిత్వంలో వచనంలోకంటే ఎక్కువగా ఆవేశమూ, తీవ్రత వుండితీరుతాయి. ఇది ఎంత అవసరమైనా సంయమనం మాత్రం వుండాలనే విషయాన్ని కవులు విస్మరించకూడదు.

ఏ విలువలైనా దేశకాలపరిస్థితులను అనుసరించుకునే వుంటాయి. కాని వాటికి అతీతంగా వుండలేవు. ప్రపంచ పరిస్థితులలో నేడు సోషలిస్టుయుగం నడుస్తున్నది. కనుక ఆ ఆర్థిక, సామాజిక వ్యవస్థకు అనుగుణంగా మన ఆలోచనా రీతిలో విశ్వాసాలలో మార్పులు వచ్చాయి. మరి మానవుడు యింతకంటే మేలైన ఆర్థిక, సామాజిక వ్యవస్థను ఏర్పాటుచేసుకుంటే ఏమవుతుంది? ఇప్పటి విలువలూ, విశ్వాసాలూ పాతబడిపోయి కొత్తవి ఏర్పడతాయి.

★

విలువలున్నాయి. కాని అవి కనపడవు స్వార్థంగా, క్రూరంగా బ్రతికే మనుషులకి జీవితంలోంచి ఏమొస్తుంది? ఇతరుల కన్నీళ్ళలో బాధపడేవాడికి ఒక్క చిరునవ్వులోంచి వచ్చే మాధుర్యం ఎవరెరుగుదురు? బయట ఏం జరుగుతోందనికాదు. వాటినుంచి నీలోపల ఏం జరుగుతోందనే దృష్టి నీకు కలిగిన రోజున సమన్వయం ఎక్కువగా కలుగుతుంది.

—చలం.

With the best compliments from :

MOHAN BROS

WINE MERCHANTS

TILAK ROAD, HYDERABAD-1

PHONE : 42548

SOLE SELLING AGENTS FOR

QUEEN OF QUEENS

DELUXE WHISKY

For the best in dishes and sweets

VISIT

Cafe Hyluck & Sweet House

New Malakpet Chowrastha, Station Road,

HYDERABAD.

Proprietor : MOHD. HABEEBUDDIN

For delicious non-vegetarian dishes

VISIT

Aswan Cafe

New Malakpet, Hyderabad.

proprietors: ***MOHD. KHAJA QURESHI*** *and*

MOHD. ABDUL QUADER QURESHI

For delightful refreshments and tea

VISIT

Five Stars Cafe

Station Road, Yakutpura, Hyderabad-23

proprietress : SMT. SADIQA BEGUM

730

మారుతున్న విలువలు : నేటికవిత

డాక్టర్ అరిపిరాల విశ్వం

జీవితాన్నే చూడాలంటే విలువల అద్దంలో చూడు. మనిషినిగూర్చి మనిషి తెలుసుకోదగింది — తెలుసుకోలేనిది కేవలం విలువలు మాత్రమే.

విలువలు క్రియా ప్రక్రియారూపంలో బయల్పడే ప్రవర్తనా జన్యాలు. భౌతికవిలువలు దేహజాలు. నైతికవిలువలు హృదయ జాలు. లౌకికవిలువలు ఊహాజన్య ఆలోచనాగతాలు. తాత్త్విక విలువలు ఆత్మజన్యమైన జ్ఞానంనించి వస్తాయి.

భౌతికవిలువకు వస్తుస్థితితో ఎక్కువ సంబంధం. నైతిక విలువకు వస్తువుయొక్క కాలానుగతితో సంబంధం. లౌకికవిలువలకు దేశముకన్న, కాలమునకే ఎక్కువ ప్రాధాన్యం. తాత్త్వికవిలువలకు దిక్కాలావధులకతీతమైన శాశ్వతానంద సంవిద్భావము ఉపాధి.

అన్నమయములు, ప్రాణమయములని భౌతికవిలువలు రెండు రకాలు.

భౌతికవిలువలు, వస్తువుయొక్క ప్రాప్తికి, అప్రాప్తికి సంబంధించియుండును.

"దారిపక్క చెట్టుకింది
ఆరిన కుంపటి విధాన
కూర్చున్న ముసిలొకతె
మూలుగుతూ ములుగుతున్న ఈగలతో వేగలేక",

"రానున్నది చలికాలం, దిక్కులేని దీనురాలు

ఏళ్ళముదిరి కీళ్ళుకదలి బతుకంచె కోర్కెసడలి
పక్కనున్న బండరాతి పగిదిగనే పడిఉన్నది''-

''భిక్షువర్షీయసి''

—శ్రీశ్రీ.

అన్నమయమైన విలువలనుండి పుట్టిన వాస్తవికతకు పైకవిత ప్రతిబింబము. బిచ్చగత్తె దినదినగండంగా బ్రతుకును వెళ్ళిస్తోంది. పోరాడి పొట్టనింపుకొన్నంతకాలమే బ్రతుకు నడుస్తుంది. ఈ భౌతిక విలువలే, ప్రాణమయమైనవిలువలకు పునాది. స్వోదరపోషణార్థం, మనిషి స్వార్థత్వం ధరించకతప్పదు. అప్పుడు పరార్థంతో పోరాడకా తప్పదు.

''ఎక్కతొక్కి ఎంతరాసినా ఇంతే
దక్కవలసింది, కూడు, గూడు, గుడ్డ''.

—శ్రీ వాచార్ ఫుర్.

కూడు, గూడు, గుడ్డ ప్రాణమయ విలువలు.

అన్నమయవిలువలు తత్కాల తృష్ణాతృప్తికి పరిమితములు. ప్రాణమయ విలువలు ఆ తృప్తికి ఒక సాగుదలను యిచ్చే ప్రయత్నం లోంచే పుడతాయి.

''బ్రతుకు మిథ్యా శృంఖలితము
చదువు బాధాసంకలితము
జయిలులోపల స్వేచ్ఛకలదు
బయటఋణమ్మయినా వలదు''.

—వరద రాజేశ్వరరావు.

మేధావివర్గపు మనస్సంకట స్థితి : విలువలొకప్పుడు విముక్తిని యివ్వలేవుసరిగదా, సంకెళ్ళనిచ్చే స్థితిఉంది. అయితే అవి కేవల ఆత్మపరము, మిథ్యాదర్శన సముత్పన్నాలు.

ఒకొక్కప్పుడు విలువలు వ్యక్తి పతనానికి, దారితీస్తాయి. భ్రాంతిమూలకమనస్తత్వానికి - అలాంటి నిదర్శనం.

"రాతమ్మిడూ, పోదాం, మనకుచోటులేదిక్కడ
ఆప్తుల్లే అరణ్యంలో హాయిగా కాలంగడుపుదాం
కడుపుకొరకు క్రూరజంతువునని గర్జించే సింహం
మనిషికంటె నయంకదూ! అమ్మో భయమేస్తుందిక్కడ."

—కుందుర్తి.

వాస్తవికతతో రాజీ పూర్తిగాపడలేక, నాగరికత నుంచీ, దూరంగా ఏకాంతంగా జీవించాలనేఊహలోని ఆభాస విలువలు కూడా ఉన్నాయి. కృష్ణశాస్త్రిగారన్నట్లు "ఆశఆకాశమంత. శక్తికుద్ర విహంగమంత." మధ్యతరగతి మేధావివర్గంలో - గెలుపును చివరికైనా సాధించగలమన్న నమ్మకంకన్నా, ఓడిపోతామో మో అన్న భయాందోళనలే ఎక్కువగా ఉన్నాయి. విలువలు చీకటిదారిని వెలిగించే చిరుదీపాలు. అవి మరికొందరికి కొరివిదయ్యాల్లా అవుతాయి.

"నాకు - నాకు కావాలి
ఆ రోజు మట్టుకే"

—ఆరుద్ర.

అన్నమయ విలువలకే చోటిచ్చిన పరిస్థితికూడా ఉంది.

"ముప్పొద్దులందునా మురికిమేనితోడ
పొలము లోపలబడి నలిగిపోతున్నాము
ఇంటికొచ్చామంటె - యింత గంజిలేక
కడుపుమంటాతోటి - కాలిపోతున్నాము.
మన బొమికెలనుగొట్టి - మన రక్తమునుపిండి
ఎన్నాళ్ళు ఏలుతారీధనికులీదొరలు"

—తుమ్మల వెంకట్రామయ్య

దళిత, పీడితజాతి - స్వేచ్ఛకై, సమానత్వానికై పరిశ్రమించే వర్గచైతన్యం-మార్క్సు యిచ్చిన క్రొత్తవిలువ. అదే అభ్యుదయకవిత.

భౌతికావసరాలకే శక్తిసర్వం ఖర్చైపోతే, పై విలువల్ని గూర్చి ఆలోచించగలగటం అంత సులభంకాదు. చివరికి తనపైన, సంఘంపైన, దేవుడిపైనా నమ్మకం సడలవచ్చు.

"కీలుగుఱ్ఱము మీద
బాలిసు నానుకొని
ప్రాణాలు లేనట్టి
భగవంతుడొచ్చాడు -
కూలిమాటడగండిరా - అన్నాలు
చాలవని చెప్పండిరా!"

—తెన్నేటి సూరి.

ఉన్నవాళ్ళు, లేనివాళ్ళ అన్నాన్ని, అదృష్టాన్ని తినేశారు. అన్నం యిచ్చేది దేవుడు, అన్నాన్ని తెచ్చేది శ్రామికుడు. అనుభవం ఉన్నవాడి దయపైన ఆధారపడ్డది. అందుకే - దేవుడనే - తాత్త్విక భావనకూడా, యిక్కడ లేనివానిదృష్టిలో భౌతికమైన, అన్నమయ విలువకు ఉపాంగమే అయిపోయిన దయనీయస్థితి కల్గింది. ఇదే యీనాటి సమాజచిత్రం.

"నేడుమనం గగనకుసుమాలనుకొంటున్నవి
మనపిల్లల రేపటి రంగస్థలాలు
శబ్దాన్ని మించిన శరగమనులు
రేపటి పౌరులు."

—ఏల్చూరి.

ఆధునిక సమాజం ఆశా, నిరాశల సంగమస్థలం. నేటి వెతల బ్రతుకుకన్న, రేపటివెలుగు ఆనందాన్నిస్తోంది. నీ దుఃఖాన్ని, నీ ముందు తరం ఆనందంకోసం త్యాగం చేయగలిగితే నీవు నిజమైన మనిషివి.

"ఒక్కొక్కడికీ యెవడికి వాడికి
నాలుగ్గోడల నడింప్రపంచం! కల్చర్!- కంచం-మంచం.

—కల్చర్, పూషా.

గుడిలోకుంచం ఆడుకునే - తత్త్వం కూడా ఉంది. విలువలు చిక్కిపోయాయి.

'చావుపుట్టుకలమధ్య, సందేహంవంటి జీవితంలో
నలువై పులా అంధకారం.
మంచిగంధంలా పరిమళించే మానవత్వం
మాకున్న ఒకే ఒక్క అలంకారం.

—తిలక్.

సందేహాలు, అన్వేషణ, సంఘర్షణ—సాఫీగా సాగకపోవడం-యివి ఓరీతిగా జీవితానికి నిర్వచనాలు.

నైతిక విలువలు

'నిప్పును కన్నెత్తి చూళ్లేదు సంఘం
జనాన్ని సూటిగా వినలేదు సంఘం.
నిజాన్ని చంపి, నిజాన్ని పూజిస్తుంది సంఘం
న్యాయాన్ని హత్యచేసి న్యాయాన్ని గౌరవిస్తుంది సంఘం
దేవుణ్ణి హింసించి, దేవుణ్ణి తలుస్తుంది సంఘం.

—సర్పయాగం, రెంటాల.

సంఘంలో విలువ్రమౌతున్న నైతికవిలువకీ కవిత చిహ్నం.

" విపణివీధి, తపోవనం
చాకిరేవు, శాసనసభ
సానికొంప, సాధుమఠం
మూత్రశాల, యాత్రాస్థలి
పోటీ పడి కాటులాడ
ఎచ్చైతేనేం."

—కాళోజి.

అనుకరణము, ధిక్కరణం, అవకాశవాదం ఇవి కొత్తగా వచ్చిన సూడోవాల్యూస్,

లౌకిక విలువలు

"యెల్లలోకము వొక్కయిల్లై
వర్ణభేదములెల్ల కల్లై
వేలనెరుగని ప్రేమబంధము
వేడుకలు కురియు.
మతములన్నియు మాసిపోవును.
జ్ఞానమొక్కటె నిలిచి వెలుగును
అంతస్వర్గ సుఖంబులన్నవి
యవని విలసిల్లున్."

—గురజాడ.

"యుద్ధంమీద యుద్ధంవచ్చినా
మనిషిగుండె పగులలేదు.
మనిషిమీద మనిషిచచ్చినా
కన్నుతుదల జాలిలేదు.
నాగరికత మైలపడిన దుప్పటిలా
నాకందనిపదో రహస్యంనన్ను
వశంచేసుకుంది"

—తిలక్.

తాత్త్వికవిలువలు కూడా సోదాహరణంగా వివరించేందుకు స్థలాభావం అడ్డువస్తోంది.

★

For delightful refreshments

VISIT

Kaiser-E-Hind Restaurant

New Malakpet, Hyderabad.

Phone No. 52297

proprietor : **SHRI SYED JALAL & PARTY.**

For snacks and tea

VISIT

ZAHEERA CAFE

Inside Yakutpura, Hyderabad.

Phone No. : 53093

prop : **SHRI SAYEED BIN SALAM**

237

యువభారతికి

కి శుభాకాంక్షలు

వివాహాది శుభకార్యములకు

ఫోన్ నెం.. 76545

జూలూరి వీరేశలింగం

బనారస్ శిల్క్ ప్యాలెస్

గద్వాల దుకాణము

జూలూరి మాన్షన్ (ఆంధ్ర బ్యాంకు మేడపైన)

సికింద్రాబాదు-3.

క్రొత్త డిజైనులలో నాణ్యమైన అన్నిరకముల

పట్టు, కాటన్ చీరెలు లభించే నూతన దుకాణము

బనారస్, కంచి, ధర్మవరం, బెంగుళూరు, ఆరణి

పట్టుచీరెలు

గద్వాల, సేలం, వరయూరు, కోయంబత్తూరు, మధుర,

వెంకటగిరి, మాధవరం, బొబ్బిలి

కాటన్ చీరెలు

మరియు పట్టు, కాటన్, పావడాలు, కనుములు లభించును.

2 × 2 బట్టలు, చీరెలు మరియు పట్టు ధోవతులు,

పట్టు సెల్లాలు అన్ని రకములు లభించును.

JULOORI VEERESHALINGAM,

BANARAS SILK PALACE

మారుతున్న విలువలు - రేడియో రచన

శ్రీ పన్యాల రంగనాథరావు

అక్షర సృష్టి జరిగిన నాటినుంచీ ఒకవ్యక్తి మరొకవ్యక్తికి తన భావాలు తెలియపరుచుకోటానికి లేఖనం, పఠనం, సాధనాలుగా ఉపకరిస్తున్నాయి. పరస్పరం మాట్లాడుకోవడం ద్వారా ఒకరిభావాలొకరు తెలియచేసుకొంటూ ఉండడం అంతకుముందునుంచీ జరుగుతున్నదే. వ్యక్తిలో సంస్కారము పెరిగినకొద్దీ అక్షరానికొక అందంపర్చడి దానితోపాటే భావానికీ ఒక స్వరూపం వచ్చి, సాహిత్యసృష్టికి లిఖితంగా అంకురార్పణ జరిగిందనుకోవచ్చు. స్వతహాగా మానవుడు సౌందర్యాన్వేషి కావడంవల్ల అక్షరంలోని అందాన్నీ, భావంలోగల స్వరూపాన్నీ వెంటనే గుర్తించి వాటికి మెరుగులు దిద్దుకోవడం ప్రారంభించాడు. ఒక భావాన్ని మాటలలో పెట్టగలిగినప్పుడు ఆ మాటలకు అక్షరాలు తీర్చిదిద్దినప్పుడు అదే మాటను అంతకన్నా ఎక్కువ అందంగానూ, రసవత్తరంగానూ స్ఫురింపచేయవచ్చుననే తపనతో అంతకంతకు తనభావాలకు అత్యుత్తమ స్వరూపాలిస్తూ వచ్చాడు. ఈ పరిణామంలోనే లేఖనాసాహిత్యసృష్టి జరిగింది. ఆ సాహిత్యంలోనే రకరకాల రూపాలు అవతరించినై. మానవుడు తన భావాన్ని మాటలలో పెట్టి అక్షరస్వరూపం ఇవ్వడంతో తృప్తిపడిపోక ఆ భావాలనే వాక్యంలోనూ, పద్యరూపంలోనూ, వాగ్గేయరూపంలోనూ, కథారూపంలోనూ, నాటకరూపంలోనూ ఇమడ్చగలిగాడు.

సాహిత్యసృష్టి ఆ విధంగా జరిగి ఉండొచ్చునని భావుకులనేకుల అభిప్రాయం. ఇది చాలావరకు నిజమే అనిపిస్తుందికూడాను.

ఈ విధంగా సృష్టించుకున్న లేఖనాసాహిత్యంలో మానవుడు తన్ను తాను తీర్చిదిద్దుకోవడమే కాక తనచుట్టూఉన్న వాతావరణాన్నీ, పరిస

రాల్నీ, వ్యక్తుల్నీ, ప్రకృతినీ కూడా ఎప్పటికప్పుడు కొత్త కొత్త సొంపులతో ఇముడ్చుతూ వచ్చాడు.

విలువ అనేది దేనిపరంగా ఆలోచించినా—వ్యక్తి విలువే కానీండి, సమాజపు విలువేకానీండి, ఏదైనాసరే ఆదినుంచీ చూసినట్లయితే రోజు రోజుకీ మార్పుచెందుతూనే ఉన్నాయి. ఇట్లా మార్పు చెందుతూ ఉండటమే ప్రగతి లక్షణంకూడా. ఒక్కొక్కప్పుడు ఇటువంటిమార్పు చెడుగా పరిణమించవచ్చు. ఆ చెడుపరిణామమే శాశ్వతమేమో అనిపించనూవచ్చు. అయితే అది కేవలం భ్రమ. మార్పులోఉండే బలాన్నిబట్టి దాని ఆయుర్దాయం నిర్ణయమవుతుంది. అదేవిధంగా మంచి మార్పు అయినాసరే ఆ మంచి మానవుడికి ఎంతవరకూ ప్రయోజనకరంగా ఉంటుందో అంతవరకేఉంటుంది.

మార్పు దానంతటఅది ఎక్కడనుంచో వొచ్చిపడదు. మానవుడి పరివర్తనాప్రవర్తనలబట్టే మంచికైనా చెడుకైనా మార్పువస్తుంది. రావాలి కూడా. అటువంటి మార్పుయొక్క ప్రయోజనం తీరినవెంటనే దాని స్థానంలో ఇంకోమార్పువచ్చి తిష్టవేస్తుంది. పరిణామ దశలో ఈ మార్పులు మనం కళ్ళారా చూస్తున్నవే.

మార్పులనేవి, ఎక్కడవొచ్చినా, ఎప్పుడువచ్చినా, మొట్టమొదట, సాహిత్యంలో కనిపిస్తాయని నేననుకుంటాను. మార్పు తీసుకురాదలచినవారు, మొదట సాహిత్యాన్నే ఆధారంచేసుకుని, "ఫీలర్సు", వొదులుతూ ఉండడం పరిపాటే, అంటే లేఖనంద్వారా కనబడేప్రతీదీ సాహిత్యమనికాదు తాత్పర్యం. భావప్రకటనకు సాహిత్యమే ప్రధానం కనుక, ఎటువంటి భావానికైనా సాహిత్యమే తప్ప, నలుగురికి తెలిసేటందుకు మరోగత్యంతరంలేదు, ఈ ప్రకారంగా ఆలోచిస్తే, ఒక వార్త తెలియటానికి చేసే రచన సాహిత్యం అనిపించుకోకపోయినా, సాహిత్య సృష్టికి ఆ వార్త 'బేసిస్' కావచ్చు.

భూకంపాల గురించీ, జలప్రళయంగురించీ, యుద్ధాల భీభత్సాల గురించీ, వార్తలొస్తాయి, ఆవార్తల బట్టి, వాటి విషయం సాధారణంగా తెలుసుకుంటాం. తరువాత వాటిపైన వొచ్చే సాహిత్యమంతా ఆ వార్తల ఆధారంగానే సృష్టించడం జరుగుతుంది.

అలాగే సమాజంలో, సాంఘిక జీవనంలో ఉన్నపరిస్థితుల గురించి, రాగల – తీసుకురాగల మార్పులగురించి బోలెడంత సాహిత్యం వెలువడుతూ ఉంటుంది. ఇందులో నిజమైన సాహిత్యపు విలువలున్నవి ఎన్నిఅనేది

వేరేసంగతి ఇప్పుడు ఆలోచిస్తున్నది–"బేసిక్ లెవెల్" లో కేవలం సాహిత్యం గురించే అని గుర్తుంచు కోవాలి.

వ్యక్తిలోనూ, సమాజంలోనూ, రాజకీయాలలోనూ వస్తున్న మార్పులు, స్వభావసిద్ధంగానే సాహిత్యంలో అవతరించడం చూస్తూనే ఉన్నాం. ఇది ఈ శతాబ్ధంలోనే జరుగుతున్నది ఎంత మటుకుకాదు. శతాబ్దాల తరబడి, సాహిత్యంలో ఆ మార్పులు వస్తూనే ఉన్నాయి.

అంతేకాక సాహిత్యంలోకూడా రచయిత, ఈ మార్పులకు అనుగుణ్యంగానే తనకు, చేతనైనదీ, వీలైనదీ, తనకలం సాగగలిగేది ఒక పద్ధతి ఎంచుకుని అందులోనే మార్పులు ప్రతిబింబింపజేస్తాడు. రచన చేయగలిగే స్తోమత వున్నవ్యక్తి "ఏది రాసినా", ఏపద్ధతిలో రాసినా ఆ రచన వ్యక్తిలోగాని, సమాజంలోగానీ, ఎక్కడైనాగాని, ఉన్న పరిస్థితినే ప్రతిఫలింపచేస్తుంది. ఇది ప్రచార సాహిత్యంలో మరీ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

ఈ దృష్టితో చూచినట్టయితే, సాహిత్యంలో ఏమార్పు వచ్చినా, ఏపద్ధతిలో వచ్చినా, ఎటువంటి భావాలు, వ్యక్తీకరించబడుతున్నా, వాటిని చదివేవారిలో అరుచి పొందేవారు తప్పుపట్టవలసిన పని లేదని స్పష్టమవుతూనేఉంది. ఒకప్పుడు ఎంతోమందికి నచ్చని సాహిత్యం ఈనాడు అధిక చలామణీ పొందడమేకాక, కొన్ని విశిష్టమైన రచనలుగాకూడా వేరు తెచ్చుకున్నాయి. ఈనాడు వేలసంఖ్యలో వస్తున్న నవలలూ, పద్యరచనలూ, గేయాలూ, వచనగేయాలూ, నాటక నాటికలూ, ఇవన్నీకూడా, వాటిలో ఉండే "థీమ్స్" తోసహా, నేటి మార్పు చెందుతున్న వ్యక్తి – సమాజం పరిణామమే అనక తప్పదు. ఈ ఘడియలో కొందరికి, వీటిలో కనిపిస్తున్నవి, అనగా ఈ రచనలలో వ్యక్తమవుతున్నవి, హేయంగా పొడగట్టవచ్చు, కాని సమాజం హేయంగా ఉన్నప్పుడే, సాహిత్యంలో ఆహేయం ప్రస్ఫుటమవుతుందని తెలిసినవారు, వీటిని దూషించవలసిన అవసరం లేదు.

అయితే, సాహిత్యం ప్రచారం పొందితేనేతప్ప దానికి విలువకూడా ఉండదు. నలుగురుకీ, ఫలానా అనితెలిసినప్పుడే దానిసార్థకత. ఈ విధంగా సాహిత్యం ప్రచారంలో రావటానికి ఈనాడు పత్రికలు చేస్తున్నంత సహాయం ఇంకే పద్ధతివల్లా జరగటంలేదు. వెయ్యికాపీలు అమ్మే ఒకనవలను పదివేలమంది చదివితే చదివిఉండొచ్చు. అదేనవల, యాభైవేల ప్రతులు

అమ్మడుపోయే ఏవార పత్రికలోనో సీరియల్ గావ స్తే దాన్ని కనీసం లక్ష మంది నా చదివే అవకాశం బొత్తిగా లేకపోలేదు. అయిదురూపాయలిచ్చి నవలకొనేకన్న, ఆర్థికసూత్రాల ప్రకారం, పావలాయిచ్చి వారపత్రికను ఇరవై వారాలపాటు కొనుక్కోవడం గిట్టుబాటుగా ఉంటుంది. ఎందుకంటే సీరియల్ తోబాటు చదివేటందుకు మరికొంత "వెరైటీ" దొరకడమేకాదు, ఆ యిరవైపత్రికలూ ఆఖరికి తూకంవేస్తే, కొంతైనా కట్టెస్తుంది. ఈ కారణంచేతనే, ఈనాడు పత్రికలలో సీరియల్స్‌కి, యింత ప్రచారం వస్తున్నది.

సాహిత్య ప్రచారానికి కొంతలోకొంతవరకూ దోహదం చేస్తున్నది రేడియో సాధనం. అయితే రేడియోలో ప్రసారానికి ఏరకం సాహిత్యం తగింది? ఏదితగదు? అనేది వేరేవిషయం, అందులో చాలావరకు 'రాజకీయాలు' ఇమిడి ఉంటాయి. కాబట్టి, మనం స్థూలంగా తెలుసుకోవాల్సింది, ఏ రకం సాహిత్యం అనేదానికన్న, రేడియో ప్రసారానికి అనుగుణ్యమైన రచనా పద్ధతి ఎలా ఉండాలి అనేది గమనించాలి.

రేడియో ప్రసారంలో - ముఖ్యంగా తెలుసుకోవలసింది ఒకటుంది. ఎటువంటి రచన అయినాసరే, రేడియో దగ్గరకొచ్చేటప్పుడు. సామాన్యంగా "చదువుతున్న" భ్రమ కలిగించరాదు. శ్రోతకి. "చెప్పుతున్న భ్రమ" కలగాలి. నిజానికి రేడియోలో "మైక్" ముందు జరిగేది చదవటమే! కాని చదువు తన్నంట్టుండరాదు ఏ రచన అయితే, చదువుతున్న భ్రమ కలిగించకుండా ఉంటుందో అది విజయవంతమైన రేడియో రచనగా భావించవలసి ఉంటుంది. ఈ దృష్టితో పరిశీలించినట్టయితే, సాహిత్యంలోని రకరకాల రచనా పద్ధతులలో రేడియో రచన అంటూ ఒకటి ప్రత్యేకంగా ఉండాలని స్ఫురిస్తుంది. దీనికి, నాకుతెలిసినంత వరకూ కవిత్వం ఒక్కటే భిన్నం. రేడియోకోసం, వేరే కవిత్వం రాయటమంటూ ఉండదు గనుక.

కాని ఒక వ్యాసం, ఒక కథ, లేక నవల, ముఖ్యంగా నాటిక, నాటకం మటుకు రేడియోలో ప్రసారానికి ఒక ప్రత్యేకత కలిగిఉండాలి. ఈ ప్రత్యేకతనే 'రేడియో టెక్నిక్',—'రేడియో' శిల్పం అనికూడా కొందరంటారు. పత్రికలో ప్రచురించటానికి యోగ్యమైన ఒక వ్యాసం, ఒక రచన, రేడియోలో యథాతథంగా ప్రసారానికి యోగ్యంకాదు. పదిమందిని కూర్చోపెట్టుకుని, వారికి చెప్పుతున్నట్టుగా ఉండాలి. కథేనా అంతే. అందుకే,

పిల్లలకోసం ప్రత్యేకంగా రాసిన రచనలు - [పిల్లలకోసమనే పేరుతో పెద్దవాళ్ళు చదువుకోదగ్గ వాటి మాటకాదు!] ఏమార్పూ చేయనవసరం లేకుండా సరాసరి రేడియో ప్రసారానికి వీలుగా ఉంటాయి.

నాటకాల విషయంలో ముఖ్యంగా ఈతేడా బాగా ఉంటుంది. రేడియో నాటకాలు ముఖ్యంగా శ్రవ్యనాటకాలు. నాటకంలోని పాత్రలూ, వాటి స్వభావాలూ అన్నీకూడా చెవులద్వారా అర్థం కావలసిందేగాని, మరోమార్గం లేదు. కనక, రంగస్థల ప్రదర్శనకోసంఉన్న నాటకం ప్రసారం చేయవలసివస్తే కొన్ని సంభాషణలతోసహా, కొన్ని సన్నివేశాలతోసహా, సవాలక్షమార్పులు చేయవలసి ఉంటుంది. కంటితోచూసే దృశ్యంలో రవంత లోపం ఏదైనా ఉంటే, వెంటనే దాన్ని మరిచిపోగలిగేటంతటి సులభంగా, చెవితో వినవలసిన శబ్దంలో ఏదైనా అపస్వరం అపశబ్దం ఉన్నట్టయితే దాన్ని మరిచిపోవడం ఓపట్టున సాధ్యంకాదు. "ఇంకా కళ్ళకు కట్టినట్టేఉంది" అనటంతోపాటు "ఇంకా చెవిలో గింగురుమంటూనే ఉంది" అంటాం. అయితే కళ్ళు మూసుకుంటే కాస్త ఊహలోపడి కళ్ళకు కట్టినట్టు ఏ దృశ్యమైనా తోచవచ్చునేమోగాని, చెవిలోమటుకు ఏ 'తిరీ' పెట్టుకోనక్కర్లేకుండానే అపశబ్దం వినిపిస్తుంది. రంగస్థలానికి చెవీ, కన్నూ, రెండూ ముఖ్యం. రేడియోకి ఒక్క చెవే ముఖ్యం. రెండింటిపనీ చెవే చేయవలసి ఉంటుంది.

రేడియో రచనకి ఇన్ని 'లిమిటేషన్స్' ఉన్నాయి. ఇప్పుడిప్పుడు చాలామంది రచయితలకు రేడియో రచనాస్వరూపం ఎలా ఉండాలో తెలుస్తున్నది. ఇట్లా తెలుసుకుని చేస్తున్న రచనలు సాహిత్యంలో ఒక ముఖ్యమైన మార్పుగా, పరిణామంగా,-లేదా ఒక భాగంగా పరిగణించవలసి ఉంటుంది. 'రేడియో ప్రసంగం', 'రేడియో రచన', 'రేడియో కథ', 'రేడియోనాటిక'. ఈ ప్రయోగాలవల్లనే స్పష్టమవుతుంది వీటికున్న ప్రత్యేకత. [క్షమించండి-రేడియో కవిత్వం మటుకు ఇంకా రాలేదు. వచ్చే అవకాశం కూడా ఉన్నట్టులేదు. !!]

రేడియో రచనకు ఒక విధంగాచూస్తే విశిష్టమైన స్థానం ఉందనే చెప్పాలి. ప్రచురణా, ప్రదర్శనాయోగ్యమయ్యే రచనలు రేడియోలో ప్రసారానికి ఉన్నపాళంగా నప్పవు. అయితే రేడియోలో ప్రసారానికి అనుగుణ్యంగా సాగించే రచనలు - ప్రచురణా, ప్రచారయోగ్యాలుగానే

ఉండటం కద్దు. రేడియోనాటికలు కొందరివి పుస్తకాలుగా రావడం, పత్రికలలో ప్రచురణ పొందడం దీనికి తార్కాణం.

నేటి సాహిత్యంలో రేడియోరచన ఒక గొప్ప పరిణామం. మన దేశంలో రేడియో వ్యవస్థ విదేశాలతోపోలిస్తే ఇంకా శైశవ దశలోనే ఉందని చెప్పక తప్పదు. అందువల్ల రేడియో వ్యవస్థ వృద్ధిపొందడంతోపాటు రేడియో రచనలకు కూడా ఉత్తరోత్తరా గొప్ప భవిష్యత్తు ఉందనడంలో సందేహంలేదు.

★

"అదృష్టవంతులు మీరు,
వెలుగును ప్రేమిస్తారు
ఇరులను ద్వేషిస్తారు
మంచికీ చెడ్డకీ నడుమ
కంచుగోడలున్నాయిమీకు.
మాకు గోడలులేవు.
గోడలను పగులగొట్టడమే మాపని.

—శ్రీ శ్రీ

* * * *

చందనం అలదేవాడు ముందుతన ప్రేళ్ళ గంధ పాత్రలో ముంచితేకాని మరొకరికి పూయడానికి అవకాశం చిక్కదు. అటూగే, అంతో ఇంతో ముందు చేతులు మసిచేసుకుంటేగాని ఒకడి ముఖానికి మసిబూసే అవకాశం లభించదు.

—శ్రీ పొట్లపల్లి రామారావు.

With the best compliments from :

GAUTOM TRADERS

IRON & STEEL MERCHANTS

proprietor : **H. SHANTILAL JAIN**

Visit or Ring :

Phones : { Office : 76583
Stockyard : 77669
Residence : 76582

60/2, RANIGUNJ, SECUNDERABAD-3 (A.P.)

STOCKYARD : 108, WALKER TOWN, SECUNDERABAD

For the Best in Dishes and tea,

VISIT

MASQATHI CAFE

Kotli Alija, Hyderabad.

proprietor : **SRI OSMAN BIN ABDULLA MASQATHI**

WITH THE BEST COMPLIMENTS FROM :

BAJRANG BHAVAN

SWEET HOUSE & RESTAURENT

Market Street, Secunderabad–A. P.

Phone : 73107; Residence : 75485

WITH THE BEST COMPLIMENTS FROM :

GOKUL MEDICAL HALL

CHEMISTS & DRUGISTS

Market Street, Secunderabad-A. P.

246

మారతున్న విలువలు - రేడియో రచన

శ్రీ జనమంచి రామకృష్ణ

"నిరుపహతి స్థలంబు...

ఊరక కృతుల్ రచియింపు మటన్న శక్యమే !" అని కవితోపాసనకు కావలసిన లలితమైన హంగులమర్చారు పెద్దన్నగారు.

ఈనాడు ఆయనే పునర్జన్మయెత్తి సారస్వతసేవ చేయ పూనుకుంటే కవిత్వంచెప్పడానికి ఆయన పెట్టిన షరతులు, గొంతెమ్మకోర్కెలవుతాయి. కోర్కెల గుర్రాలవుతాయి – మృగతృష్ణలవుతాయి. పూర్వజన్మ సువాసనతో ఆయన ప్రస్తుత ప్రపంచరీతులూ, సాంఘిక విలువలూ, అభిరుచులూ, సాహితీస్థాయీచూసి "మనం ఈ శతాబ్దానికి నప్పనివాళ్ళం. ఎందుకూ పనికిరాని వాళ్ళం." ఎంత త్వరగా నిష్క్రమిస్తే అంత మంచిది. అని వెయ్యిదేవుళ్లకు మొక్కుకుంటారు.

ఈనాడు సారస్వతపోషకులెక్కడున్నారు? పెద్దనగారు చెప్పిన షరతుల ప్రకారం మనస్సును అటువంటి ఉల్లాసమైన ఊయల్లో ఊపి సత్యాత్మికమైన కవనం చెప్పడానికి సాధ్యమూకాదు, వ్యవధీలేదు. విత్తం లేదు. ఆ దినాల్లో కవులంత హుందాతనంతో జీవితాలను వన్నెల విసనకర్రగా చేసుకున్నారంటే–తమప్రతిభకి అడుగుమడుగులొత్తే రాజాధిరాజులు కృతిభర్త లయారు. దేశంలోని పాండిత్య ప్రకర్షనాదరించి, వారుకూడా సారస్వతంలో మనస్సును ఘాలితం చేసుకుని కలం చేబూనారు. ఆ కాలాల రాజులు సారస్వతప్రియులు. వారి రాజ్యాల్లో సరస్వతి పద కింకిణీస్వనం– ఎల్లవేళలా వినిపించేది. సరస్వతి తాండవంలో కవితా కోరకాలు ఎన్నో సారస్వతకన్య గళంలో మాలలయాయి.

ఒక జాతి నాగరికత, విశిష్టత, ఆత్మ, తెలుసుకోడానికి ఆ జాతి సారస్వత సంపదే గీటురాయి. సారస్వతాభివృద్ధికి కొంత ఆదరణవంటి

దోహదం అవసరం. అది లేనినాడు కవితాసుమాలు, ఎడారిపూ లై వూరు కుంటాయి. రాజాదరణ, కళాపోషణ ఉన్ననాడు సుస్థిరంగా తరతరాలు నిల బడే బంగారు ఇటుకలతో జాతిప్రతిభా భవనం నిర్మించబడినదన్నమాటే. ఏ జాతి సారస్వతం చూసినా, రాజాదరణ ఉన్నదశలోనే ఉద్రిక్తంగా అభి వృద్ధి చెందినట్లు కనబడుతూంది.

కాని, యావత్ ప్రపంచంలోని విలువలు మారినట్లే, సారస్వత విలువ కూడా మారింది. పూర్వం, కాలం, కిన్నెరసాని వాగులూ మానవుని చుట్టూ తీరిగ్గాపారేవి. ఈనాడు మానవుడు కాలం వెనకాతల గుండెలదరి పోయేలా పరుగులు తీస్తున్నాడు. తత్ఫలితంగా అందరం వ్యవధిలేదని ఓరిమి పోగొట్టుకుని జిజ్ఞాసతో సతమతమై పోతున్నాము.

నేటి మానవునికి ఏపని చేయటానికీ తీరికలేదు. జీవితావసరాలకై ఉదయం లేచింది మొదలూ, తాపత్రయ పడవలసిందే. తీరిక ఉన్ననాడు ఓరిమి మొదలయిన సద్గుణాలకు తావుంటుంది.

ప్రపంచం విలువలు మారినట్లే, నేటి మానవుని అభిరుచులుకూడా మారాయి. ప్రజాస్వామికంలో సారస్వత ప్రియులు, సారస్వత పోషకులు ప్రజలే. ప్రజల అభిరుచులమీద సారస్వత రచన ఆధారపడి వుంటుంది. చలనచిత్ర పరిశ్రమ చూడండి. ఒక మూడు దశాబ్దాల వెనుక చలనచిత్రాల స్థాయి ఎలావుండేది? నేడు ఎలావుంది? ప్రజల అభిరుచులకు తగినట్లుగానే నేడు చలనచిత్రాలు తయారవుతున్నాయి. నేటి విద్యావిధానం ఫలితంగా కూడా సారస్వత విలువలు మారుతున్నాయి. విద్యాబోధన సారస్వతాభి రుచిని పెంపొందింప చేయడంలేదు. సారస్వత పరంగాచూస్తే, నేటివిద్యార్థి త్రిశంకుస్వర్గం అనుభవిస్తున్నాడు. ఎందుకంటే చదువులో పునాదులు లేక పోవడంచేత అటు పాతసాహిత్యం వైపూ పోడు, ఇటు ఆధునిక సాహిత్యం వైపూ పోడు. అభిరుచి అలవరచుకోవడమలావుంచి చదివే అలవాటు అబ్బడం లేదు. మిగతా వ్యాపకాలలో ఉండిపోయి తీరికఅనేది ఏమిటో తెలియక చవకబారు- జీవితానికి పనికిరానివి- తన భవితవ్యానికి ఉపకరించని ఎండ మావులవెంట పరుగులుతీస్తున్నాడు. నేటి యువతరంమనస్సు పులుము డుగా, అయోమయంగా తయారైన ఆధునిక తైలవర్ణచిత్రంలా వుంది. తనకి ఊహలున్నాయి, ఉత్సాహముంది. శక్తివుంది, కాని, ఆ శక్తినీ

ఉత్సాహాన్నీ, ఊహలనీ, సరియైన మార్గంలో మలచుకునేందుకు. అటు తల్లి తండ్రులుగాని, ఇటు అధ్యాపకులుగాని క్రమశిక్షణ నివ్వడం లేదు.

నేటి విద్యార్థికి చవకబారు జీవితాన్ని అనుకరించేందుకు చూపే శ్రద్ధ చదువు మీదగాని సారస్వతం మీదగాని లేకుండా పోతూంది. వారి తప్పు కాదది. పెద్దలదీ, సంస్థలదీని.

వ్యవధిలేని విద్యార్థికి - ఒక్క విద్యార్థి కేవిటి! మనందరికీ బరువైన పుస్తకమంటే చిదరింపు.

"ఇది మంచి నవల. తప్పక చదువు" అని ఎవరికైనా నవలనివ్వండి.

"అయ్యా బాబో! ఇన్ని పేజీలే! ఓపిక లేదు. వ్యవధిలేదు." అని తిరిగి పుస్తకం మనచేతిలోనే పెట్టేస్తారు. తన ఓపికకి, వ్యవధికి, అభిరుచికి తగినంత పుస్తకమైతే చదవడానికి ప్రయత్నిస్తారు. కొంతమంది అటువంటి సన్నకారు పుస్తకాన్నికూడా సాంతంగా చదవరు. కథా సంవిధానం మధ్య వర్ణనలూ మొదలయినవి వదిలేసి, కథకు సంబంధించినంత మేర నవల చదువుతారంతే!

నేడు చలామణీలోవున్న సాహిత్యం మెదడుకి మేతగా పనిచేయదు. పనిచేయ తగ్గదైతే ప్రచారంలోకిరాదు. చిత్రమేమిటంటే గ్రంథాలయాలు కూడా అటువంటిపుస్తకాలు కొనడం మానుకున్నాయి. నేటి గ్రంథాలయాల్లో కొట్టొచ్చినట్లుగా మనకంటికి నదరుగా కనిపించేవి రైల్వే సాహిత్యం!

తెలుగునాడులో పుట్టినకవి, రచయిత చాలా బీదవారు. తాను రచించిన సారస్వతాన్ని అంతో ఇంతో తెలుగువారు చదవగలరుకాని, ఆ రచయిత బీదరికాన్ని మాత్రం స్మరించరు. అంతేకాదు తెలుగు వారిలో ప్రతి రెండవవాడూ రచయితే! సారస్వత కృషికి ఏవీ లోటులేదు. ఎటొచ్చి రచయితమాత్రం భుక్తికోసం అనుక్షణం తాపత్రయ పడవలసిందే.

ఈనాడు రచయిత తన ప్రతిభను చూపించి బ్రహ్మాండగా రాస్తాను అని రాస్తే- ఆ రచన ప్రజాదరణలోనున్న అభిరుచికి వ్యతిరేకమైనదైతే- కుక్కమూతి పిందై కూర్చుంటుంది. అందుచేతనే అంతో ఇంతో రచన సాగించే ప్రతి రచయితా - ప్రజాదరణకోసం, ప్రశంసలకోసం నేల విడిచి సాముచేస్తున్నాడు.

ఈనాడు కవితకు స్థానంలేకుండా పోయిందనే చెప్పాలి. కవులుకూడా గద్యరచనకు పూనుకుంటున్నారు. ఛందోబద్ధంకాని గద్యకవిత కొంచెంగా ప్రజాదరణ పొందుతూంది. ఈ తరంవారికి భారత భాగవతాలు, అల్లసాని వారి మనుచరిత్ర, ముక్కుతిమ్మనగారి పారిజాతాపహరణం మొదలైనవి మన సాహిత్యానికి, మన భాషకు, జాతికీ శిరోభూషణాలని తెలియదు. ఒక వేళ ఒకానొక వెర్రిసాహితీప్రియుడు తన సంతానాన్ని కూర్చోబెట్టి, మనుచరిత్రలోని వరూధిని వర్ణనో, పారిజాతాపహరణంలోని సత్యభామ అలకో, భారతంలోని తిక్కనగారి కీచకవధ ఘట్టమో, భాగవతంలోని కృష్ణలీలలో తన్మయతతో చదివి వినిపించబోతే :-

"ఎహే ! ఈ వెర్రిమొర్రికవిత్వం ఎవరికి అర్థమవుతుంది?. పగసాధిస్తా, డొక్కచీలుస్తా, గండరగండడు, అణాకి ఐదు హత్యలు, శవంలో శవం, డిటెక్టివ్ నవలలు చదివారా? వాటిలోవున్న మజా మీరుచదువుతున్న పుస్తకాల్లో ఏముంది, నాదగ్గరున్నాయి చదవండి నాన్నారూ" అంటే ఆ తండ్రి నోరు తెరచి "మన సాహిత్యం గతి ఏమి కాను?" అని నెత్తీ నోరూ బాదుకుంటూ, ఆ పవిత్ర గ్రంథాలను కాగలించుకొని బావురుమని ఏడవాలి.

ఈనాడు షేక్స్పియర్ అక్కరలేదు. టెనిసన్, కీట్స్, షెల్లీ, బైరన్, వర్డ్స్వర్త్, ఠాగూర్, గురజాడ. వీరేశలింగంపంతులు మొదలైన వారిని ఎవ్వరూ ఎరగరు. నా సహాధ్యాయుడే.- తాను కూర్చున్న వెనుక గోడకు రవీంద్రుని పటం తగిలించివుంది. "ఈయనేకాదండి షేక్స్పియర్" అని అడిగాడు ప్రబుద్ధుడైన నా స్నేహితుడు. – పట్టభద్రుడు సుమండీ ! అతగాడికి గడ్డాలు గుర్తు. అందుకని గడ్డమున్న రవీంద్రుణ్ణి షేక్స్పియర్ అనుకున్నాడు ! అటువంటి సాహితీపరులను ఎరిగి వుండడానికి వ్యవధిలేదు. ఎరిగి వుండడం ఆరోగ్యానికి అంత మంచిదికూడా కాదు.

చదువుకునే సాహిత్యంలో, వినువల్లో, అలా మార్పులొచ్చి పడుతూంటే మరొక రకమైన – సాహిత్యం అనడానికి వీలులేదేమో – రచనా ప్రక్రియతో రచయితలు కిందామీదా పడుతున్నారు. అది రేడియో రచన. ధ్వనిద్వారా రూపకల్పన కల్గించడానికి ప్రయత్నించే రచన. నిజానికి విశృంఖలంగా, స్వేచ్ఛగా ఈరకమైనరచన సాగించడానికి వీలుపడదు. ఇది చదువుకునే రచనకాదు. వినే రచన. ఈ రకమైన రచనకు సవాలక్ష

నిబంధనలున్నాయి. ఒకటి వ్యవధి. నిర్ణయమైన వ్యవధిలో ఆ రచనను – ప్రసంగం కానీయండి, పద్యాలు కానీయండి, నాటకం కానీయండి – కుదించాలి. అనగా వ్యవధి నిబంధనవల్ల రచయిత స్వేచ్ఛకు ఇబ్బంది కల్గుతుంది.

రెండవది – పదజాలాన్ని విచ్చలవిడిగా వాడ్డానికి వీలుపడదు. కుదించిన సంభాషణలద్వారా కొండంత భావాన్ని విశదం చెయ్యాలి. రేడియో రచనకు వాడేభాష వేరుగావుంటుంది. అటువంటిరచనకు నిజంగా మంచి నేర్పరితనమవసరము. అప్పుడే ధ్వనిద్వారా రూపమివ్వగల చాకచక్యం అబ్బుతుంది.

చలామణిలోవుంటూన్న రచనంతా ఎలా సాహిత్యప్రమాణం పొంద లేదో అలానే రేడియోప్రసారరచనాసాహిత్యమవజాలదు. నిజానికి రేడియో రచనకు సాహిత్య సౌష్టవం చాలా తక్కువనే చెప్పాలి. సినీమా స్క్రిప్టుకి సాహిత్య గౌరవమున్ననాడు రేడియోరచనకు తప్పక సాహిత్య గౌరవ ముంటుంది.

నేటి సాహిత్యానికి భవితవ్యం ఉందా? అని ప్రశ్నించుకుంటే వుందనే చెప్పాలి. కాలప్రవాహంలో కొట్టుకపోక నిలదొక్కుకుని నిలిచింది సాహిత్య విలువ సంపాదించుకుంటుంది. మన సాహిత్య చరిత్రలో ప్రబంధయుగ మొకటుంది. ఆ కాలంలో, రాజపోషకులు, కవులను పిలిపించి తమపరంగా ప్రబంధాలు రాయించుకున్నారు. కవులు, తమ పోషకులను సంతోషింప జేసేందుకు కోకొల్లలుగా ప్రబంధాలు రాశారు. ఐతే, ఈనాడు సాహిత్యంగా నిలిచినవి, చెప్పుకోతగ్గవి వేళ్ళమీద లెక్కపెట్టవచ్చును.

నిన్నటి అభిరుచులు, విలువలు నేడు మారుతున్నాయి. నేటి అభిరుచులు, విలువలు రేపటికేమార్పుచెందుతాయో తెలియదు. ఒకటిమాత్రం గ్రహించాలి. అభిరుచులు బొత్తిగా వ్యక్తిగతాలుకావు; పైగా పరిసరాలు ప్రభావం అభిరుచులపై అమితంగా ఉంటుంది. పరిసరాలను అదుపులో పెట్టుకోగల శక్తి మనకుంది. గతాన్ని విస్మరించి మానవుడు మనజాలడు. గతాన్ని అడుగడుగునా జ్ఞాపకం చేయవలసిన బాధ్యత ప్రభుత్వానిది, విద్యా సంస్థలది, తల్లితండ్రులది, అధ్యాపకులది.

పాతకొత్తల కలయికలో ఏది మంచిదో, ఏది చెడ్డదో తెలియని ఊబిలో గిలగిల కొట్టుకుంటూంది, నేటి మన సాంఘికవ్యవస్థ. ఇది పరీక్షా సమయం. ఉద్ధరించే నాథుడు అవతరించాలి.



యువభారతి

ప్రచురణలు

సరస్వతీ సాక్షాత్కారము
(రసపుష్టికలిగినకావ్యం) — అనుముల కృష్ణమూర్తి — రు. **2–00**

జీవనగీత
(మానవాళి నివాళులెత్తిన కారుణ్యోపనిషత్తు, ఖలీల్ జిబ్రాన్ The Prophet కు తెనుగుసేత). — కాళోజి — **2–50**

వీచికలు
(నలుగురు యువకవుల కవితా సంకలనం) — కృష్ణమూర్తి, చక్రవర్తి వెంకట్రావు, విశ్వానాథం — **1–00**

పంచవటి
(కథల సంపుటి) — అవసరాల రామకృష్ణారావు, మంజుశ్రీ, శీలా వీర్రాజు, లత, సి. ఆనందరామం గార్ల కథలు. — **2–00**

ప్రతులకు:

యువభారతి

5, కింగ్స్‌వే, సికింద్రాబాద్-3 కు వ్రాయండి

758

మారుతున్న విలువలు - సినిమా రచన

శ్రీ కపిల కాణిపతి

విలువలు, విలువలు అంటారు. అసలు విలువలంటే ఏమిటి? విలువ అనగా కిమ్మతా?, వెలా?, రూపాయి పైసలలో కట్టే ధరవంటిదా?- కాదు అని జవాబు.

మానవ జీవితానికి శాశ్వతమైన విలువలు కొన్ని వున్నాయి. అవే చతుర్విధ పురుషార్థాలు; ధర్మ, అర్థ, కామ, మోక్షాలు. ధర్మానికిబద్ధులై అర్థకామాలు సాధించాలి. ధర్మబద్ధులైనవారికి మోక్షకామం క్రమేణా కలుగుతుంది.

ఈ శాశ్వత విలువలు మారుతున్నాయా? విలువలు మారవు. అవి సూర్యచంద్రులులాగ శాశ్వతం, ప్రకృతి సిద్ధం. కాని వాటి ఆచరణలో మార్పురావొచ్చు. ఆధునిక కాలంలో ధర్మం, మోక్షం అనే ఆదిఅంత్యాల మీద విలువ తగ్గుతున్నది. మధ్యవైన అర్థకామాలమీద ముక్తాయింపు.

తెలుగుసినీమాలు ఈవిలువలు తిరస్కరిస్తున్నాయా? మారుస్తున్నాయా?. లేదనే చెప్పాలి. పాపానికి ప్రాయశ్చిత్తం, పుణ్యానికి మంచి కలుగుతాయని ఘోషిస్తూనే వున్నాయి. అవినీతి చూపించినా అది మంచిదని చెప్పడంలేదు. చెబితే సెన్సార్లు వొప్పుకోరు. తత్కారణంగా శాశ్వత విలువలలో మార్పులు లేవనే చెప్పాలి.

ఇవిగాక రచనకి కొన్ని విలువలుంటాయి. కావ్యరచనకి మన సంప్రదాయానుసారం విశ్వశ్రేయస్సే ముఖ్యమైన విలువ. శ్రేయస్సు సాహిత్య లక్ష్యమే కాక ప్రయోజనం కూడాను. "గాడ్పేల విసరు, సలిలమేల పారు" అందుకనే నేను వ్రాస్తున్నాను అన్నాడో కవికుమారుడు. ఈ విసురూ, ప్రవాహం ప్రయోజనం అనుభవించేది మానవుడు. మానవుణ్ణి ఉద్దేశించి చెయ్యని రచన అడవినిగాచినవెన్నెల, అది కళకాదు.

కళలవల్ల ఆనందం కలుగుతుంది. ఆనందం అమలినంగా వుండా లన్నారు పెద్దలు. ఈ అమలినానందం మన చలనచిత్రకళ పోషిస్తోంచా అంటే కొంతవరకు లేదనే చెప్పాలి. అంతవరకు విలువలు ఇప్పుడేకాదు, చాలా చిత్రాలలో, ఎప్పుడో మారిపోయింది.

ప్రతిరచనకీ ముఖ్యమైన విలువలు,— సభ్యత, ఔచిత్యము, రసపుష్టి. సినిమా రచన ఒక వ్యక్తి చేసేదికాదు. కథకుడు, మాటలు; పాటలు వ్రాసే వారు, ఛాయాచిత్రకారుడు, సన్నివేశాలు నిర్మించేవారు, దుస్తులు తయారు చేసేవారు, నృత్య, సంగీత దర్శకులు, అందర్నీమించి, ఈ విషయాలన్నీ కవ్వించి చిత్రంతీస్తే తుదిరూపు ఎల్లావుంటుందో దర్శించే దర్శకుడు, వీరంతా కలిసి ఒక భావరాగతాళసమ్మేళనాసంపదగలిగిన నాదరూపం సృష్టిస్తారు. కాని ఈ సమ్మేళనంగాని, లయగాని చివరకి మృగ్యం అవు తున్నాయి. కారణం సినీమా వ్యాపారం, లాటరీ, జూదం. ఇది ఆడేది నిర్మాత. ఆయన దర్శించేది (శ్రీ మహాలక్ష్మి. అత్తని ఆరాధించేవాళ్ళ కళ్ళకి కోడలు గిట్టదు. తత్కారణంగా ధనవిలువముందు, దానికోసం పని చేసే కళాకారులందరూ ఎంత బాధపడుతున్నా పొట్టకోసం తక్కిన విలువలకి తిలోదకాలిస్తున్నారు. పర్యవసానం అసభ్యత, అనౌచిత్యం, రసాభాసం.

మూటికీ కలిపి ఒకే ఒకదృష్టాంతం చెబుతాను. ఒక దిక్కుమాలిన తల్లి వున్నది. ఆమెకో చిన్నబిడ్డ. ఎవరి పంచలోనో చాకిరీచేస్తూ, వారి మోచేతి నీళ్లు తాగుతూ, శిశువుని పెంచుకుంటోంది. బళ్ళోకి పంపిస్తోంది. ఒక సన్నివేశంలో ఆవిడ గుమ్మంలో నుంచుంది. పిల్లవాడు పలక పుచ్చుకుని గేటుదాకా వెళ్ళాడు. తల్లి "టా,టా" చెబుతోంది. ఆ దృశ్యంలో తల్లీ, బిడ్డా కనబడాలి గదా! వెనక్కి చూస్తో ఏడవలేక నవ్వుతూ, వెర్రి మొహంతో బడికెళ్లే కుర్రవాడు, అటువంటివే బాధలతో తల్లీ వున్నారు. అప్పుడు కెమేరా ఆతల్లి పూర్తిగా పమిటెలో ఇమడని, ఫ్లనమధ్యంలోంచి పిల్లవాణ్ణి చూపించింది. చంటి పిల్లవాడై, ఎవరో ఎత్తుకుపోతోంటే, కనబడక కనబడితే, పాపం, తల్లికి చేపొచ్చింది అనుకోవచ్చు. ఇక్కడ ఎదిగిన పిల్లవాడు, తరిపి గేదెదూడలాగ పాలు తాగడంలేదు. ఎదురుగా మూర్తిభవించవలసినది మాతృదేవత. వ్రేటుకుల్ని వేసే సన్నివేశంలో రంజుచెయ్యగలిగిన ఆవిడ ఉన్నతవక్షస్థలంకాదు,

బాహుమూల రుచికాదు. చూసేవారికి తెలియకుండానే వెగటు కలుగుతుంది. వికారం పుడుతుంది. అదే రసాభాసం. రససిద్ధాంతంతెలిస్తే నిర్వచనం తెలుస్తుంది. కాని వికారం పుట్టడానికి శాస్త్రం చదవక్కర్లేదు.

ఒక మహాశివభక్తుడున్నాడు. ఆయనకి లోకంలో ప్రతివస్తువూ శివలింగాకారంలో కనుపిస్తాయి. చివరికి ప్రియురాలి స్థనంకూడా లింగాకారమే అవుతుంది. ఒక లిప్తమాత్రం దర్శకుడు ఆ స్థనం చూపించాడు. ఆ సన్నివేశంలో అది అసభ్యతగాని, అనౌచిత్యంగాని కాదు.

నలభై యేళ్ళకింద శబ్దచిత్రాలు రాకముందు మా మామ్మని "సక్కుబాయి" సినిమాకి తీసికెళ్లాం. "ప్రతి ఇంట్లోనూవున్న గొడవే - అత్తా, కోడళ్ల గొడవ. వెధవసినిమా" అంది.

వెళ్ళక వెళ్ళక చాకలి మడేలు పక్కవూరెళ్లి సినిమా చూసొచ్చాడు. "చాకలిదాన్నికూడా తీసుకెళ్ళావుట్రా?" అంటే, "అయ్య బాబోయ్, ఇంకేమన్నా వుందాండి, ఇంటికాడకూడా అలా సెయ్యకుంటే నా తరమాఅండి" అన్నాడు.

పిల్లలతో భార్యాభర్తలు సినిమా కెళ్ళారు. పిల్ల అడిగింది, "ఎందుకమ్మా ఆ అబ్బాయీ, అమ్మాయి అలా కుస్తీపడుతున్నారు, దొల్లుతున్నారు, గంతులేస్తున్నారు" అని. తల్లి ఏమి అనలేక "వాళ్ళకి పిచ్చెక్కిందిలే" అని జవాబు చెప్పింది.

మూడుతరాల విలువలు తెలుస్తున్నాయి. సినిమా రచనలో రచయితల ధరలు పెరిగినకొద్దీ వారి కల్పనకి విలువలు తగ్గుతున్నాయి. ఒకే ఒక పేరు చెప్పాలంటే, ఏ- బి. ఎన్. రెడ్డి, వంటివాడో తప్పితే. అయనకూడా కొంత పెద్ద మడివిప్పిన తర్వాతగాని అవార్డు రాలేదు. లక్ష్మీకటాక్షం కలుగలేదు. బి. యన్. కనక ఇన్నాళ్లు నిలవగలిగాడు.

కృష్ణశాస్త్రిని మొదట సినీగేయాలు వ్రాయడానికి పిలిస్తే ఆయన ఎంతో బాధపడ్డాడు, కవితాలక్ష్మిని ప్రార్థించాడు,

నగలన్ని దిగవిడచి
నడిచిరావమ్మా
నవ్యకవితకునాకు
దారిచూపమ్మా!

మల్లేశ్వరికి మహంకాళమ్మకీ మధ్యనున్న విలువలు మారిపోయాయో, అవన్నీ మారుతున్న విలువలే.



తప్పక
చదవండి!

నాలుగుకోట్ల తెలుగు ప్రజల
భాగ్యనగరంనించి వస్తోన్న
ఏకైక సచిత్ర మాసపత్రిక

స్వాతి

మేలైన కథలకు, కమనీయ కవితలకు
నాణ్యమైన కార్టూనుకు. నవ్వించే జోకులకు కూడలి

స్వాతి

సరికొత్తతరహా చలనచిత్ర వార్తలకు
అందమైన ముఖపత్ర సింగారింపులకు పేటెంటు

స్వాతి

స్వాతి మీచేతికి ఒక ఆభరణం, మీయింటికి ఒక అలంకారం

స్వాతి
సచిత్ర మాసపత్రిక
రాంకోటి, హైద్రాబాద్.

256

మారుతున్న విలువలు - పత్రికలు

శ్రీ నార్ల చిరంజీవి

"ఈ వేకువ వికసించిన మల్లెమొగ్గ
ఎవరికెరుక నిన్నపడిన మూగబాధ?"
విలువలు మారుతున్నై.

మనుషులు మారుతున్నారు, మనసులూ మారుతున్నై! మానవ శ్రేయోదాయకమైన ప్రతి మార్పూ, మంగళదాయకమైన రేపటి భవిష్యత్ కోసమే అని ఆశిస్తాం! కాని, ఈనాటి ఈ మార్పులు చూస్తూంటే హెచ్. జి. వెల్స్ ఏనాడో అడిగినట్లు 'పురోగమనానికా? తిరోగమనానికా?' అన్న సదసత్సంశయంలో పడతాం!

సమాజం - మహా సాగరం లాంటిది. అలల తాకిళ్ళు, తుఫాన్ ఘోషలు, కల్లోలాలు అన్నీ పైపైనే జరిగి పోతుంటాయి. సముద్రం అట్టడుగు నీరు నిశ్చలంగానే ఉండిపోతుంది. అది కూడా కదిలి కల బడ్డప్పుడే 'జలప్రళయం' వొస్తుంది. అలాగే సమాజంలో కూడా సమూలంగా సంస్కరింపబడక, పైపై మార్పులవల్ల సత్ప్రయోజనం లభించదు. ఇవాళ మనకు కనిపించే, వినిపించేవన్నీ కొందరి దృష్టిలో పైపై మెరుగులు. మరికొందరి దృష్టిలో మార్పులు చేర్పులు. నిజానికి ఇవి పాడిక సత్యాలే! సమాజం మొత్తం సమూలంగా మారి, నూత్నరూపం ధరించి వినూత్న దశకు చేరుకోడమే 'విప్లవపరిణామం'. అలాకాక, పైపై మెరుగులకీ, మార్పులకీ నడుమ సమాజం చెడిన రేవడి అవుతుందేమో కాని, పనికొచ్చే పసిడి మాత్రం తయారు కాబోదు.

జీవితంపట్ల గాఢానురక్తీ, సమాజంపట్ల నిశితదృక్పథం, బాధ బాధ్యత రెండూ కలిగి ముందుకు సాగనంతకాలం - వ్యష్టిగా

కాని సమష్టిగా కాని తీవ్రపరిణామాలు సాధింపబడవు. తీవ్ర సంచలనం ముంచుకొస్తే తప్ప - తమ తమ రంగాల్లో 'విప్లవినోదులు' తయారు కాగలరేమోకాని, 'విప్లవయోధులు' తయారు కాబోరు. తమ తమ జీవితాల్ని తాము నమ్మిన మహోపథాలకు అంకితంచేయగల 'స్థితప్రజ్ఞుల' కోసం సమాజం ఎదురు చూస్తోంది. మరో గురజాడ, గిడుగు, వీరేశలింగం ప్రభృతుల వారసుల నిమిత్తం వారి రాకకోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తోంది నేటి తరం!

నేటి సమాజంలో కిందినించి పైకీ, పైనించి కిందకీ అంటు జాడ్యంలా అంతులేని దొంగభక్తీ, కుహనా సంస్కృతీ, దారుణమైన అవినీతీ, అన్యాయార్జితం, పక్కదీపం ఆర్పేసి స్వంతదీపం వెలిగించుకునే రాక్షస మనస్తత్వం - ఇలా ఎన్నో పేరుపెట్టబడని రోగాలు ఉన్నాయి. కంచుకోటలుకట్టి ఉన్నాయి. చీకటి గోడలు నింగి నంటుతున్నాయి. వీటి పుట్టకీట్లు కదిలించి నేలకూల్చగల మహాప్రభంజనం రావాలి. కావాలి!

ఈ సమస్తానికి మూలం 'డబ్బు' అనేదని నిశ్చయంగా తేలిపోయింది. 'డబ్బు' కున్న స్థానాన్ని తెరవెనక్కినెట్టి మిథ్యాతత్వాల్ని బోధించే వాళ్ళు 'పుండొకచోట ఉంటే మరోచోట వాతపెట్టే' మృషాభిషక్కులే అవుతున్నారు. ఈ సమాజంలో 'దేవుడి' కన్నా 'డబ్బు' బలపడి పోయింది. దానికోసం రకరకాల మారణహోమాలు పెచ్చుపెరిగాయి. నాగరీకంగా నాజూకుగా కొన్ని హోమాలు సాగుతూంటే మరికొన్ని అమానుషంగా, అతి రాక్షసీయంగా జరుగుతున్నాయి. రూపాలు వేరయినా లక్ష్యం ఒకటే. ఈ హోమ ధూమ ధూపాల్లో శలభాలై కొందరు, సమిధలై కొందరు సామాన్యులు సజ్జనులు కథావశేషులవుతున్నారు.

'యావద్విత్తోపార్జనాసక్తి' దీనికి మూలం. వ్యక్తిగత ఆస్తి, దానివెంట అనలు కొనలుగా సాగే ఆలోచనలే, ఆర్జనలే, అనర్థకాలే ఈ నాటి సమాజం 'అస్తవ్యస్తాని'కి మూలకారణం.

నేటి నాగరిక సమాజంలో పత్రికలు చాలా బలీయమైన సాధనాలు, ఆయుధాలు కూడా. రణరంగంలో మోహరించిన సైని

కుల్లాంటివారు పత్రికా 'రచయితలు'. కాకుంటే తేడా వొకటే. అక్కడ ఆయుధాలు, ఇక్కడ కలాలు పదునెక్కుతుంటాయి.

దురదృష్టవశాత్తు సమాజంలోని అవలక్షణాలకు అతీతులు కాలేక, మార్గదర్శకత్వ బాధ్యతనించి తప్పుకుని మన్నుదిన్న పెంజేరుల దుస్థితికిదిగజారి, సుఖజీవితానికి సులభసంపాదనకీ తరణోపాయాల్ని వెతుక్కుంటూ బలి అయిపోతున్నాయి చాలవరకు పత్రికలూ, రచనలూ కూడా.

అంచేతనే కాకమ్మ కబుర్లకీ, కట్టు కథకి పుట్టినిళ్ళై, పెట్టుబడికి ముద్దు పుత్రికలై, లక్ష్యహీనమూ అగమ్యగమ్యమూ ఐన పీత నడకల్లో పడ్డాయి చాల పత్రికలూ, రచనలు. మతిచెడిన శస్త్ర వైద్యుని చేతిలో కత్తి - మరణోన్ముఖుడైన రుజాగ్రస్తుణ్ణి రక్షిస్తుందా? భక్షిస్తుందా? అన్న భయంకరప్రశ్న మన ఎదుటనిలబడి ఉంది.

స్వాతంత్ర్యం రాకముందుస్థితి ఇంత అధ్వాన్నంగా లేదు. ఎక్కడో ఆంగ్లేయుల ఔరసపుత్రులనతగిన కొన్ని పత్రికలు తప్ప - తతిమ్మా దేశీయ పత్రికలన్నిటికీ ఒక గమ్యమూ లక్ష్యమూ ఉంది! త్యాగధనులు, సాహసచక్రవర్తులూ ఐన రచయితలు ఉన్నారు. జైళ్లు తుపాకుల బెదరింపులు ముందు వారి శిరస్సులు వొంగలేదు. తుఫానులు ఎన్ని వీచినా హిమోత్తుంగ శృంగాల్లా వారి శిరస్సులు గంభీరంగా నిలబడిఉండేవి. నిజాయితీగల ప్రతి పత్రికా రచయితా - ఒక డాక్టరులాగా - సమాజాన్ని పట్టి పీడించే అన్ని అసాధ్యరోగాల్ని నిర్మూలించి, ఆరోగ్య పరిరక్షణకు పాటుబడేవాడు. ప్రజల నాడీ స్పందన పత్రికారచనలో ప్రతిధ్వనించేది: రచనా చికిత్సకుల ప్రధాన ప్రథమ కర్తవ్యం - ప్రజలపక్షాన నిలబడి పోరాడ్డమే!

ఐశ్వర్యాన్ని కరిగించి పత్రికల్ని నెలకొల్పి, నడుపుతూ బికారులైన "ప్రజాయోధులు" ఉండేవారు. పరప్రభుత్వాన్ని ఢీకొని ఆహుతి అయిన "ఆత్మధనులు" ఉండేవారు. వారి జీవితాలు, రచనలు, వ్యాసంగాలు నవభారత సృష్టికి దోహదమిచ్చాయి. లక్షలాది యువతీ యువకులు ముక్తగీతిక లాలాపిస్తూ స్వాతంత్ర్య సంగ్రామపథంలో నిర్భీతిగా ప్రయనించారు.

ఆ రోజుల్లో ఆనేక పర్యాయాలు "రహస్యపత్రికలు" వెలువడేవి. భారతాత్మకు ప్రతీకలుగా అవి మూలమూలలకు వెళ్ళేవి. బ్రిటిష్ సింహాలు చెరలాడినా పొరలాడినా, అందక ముప్పుతిప్పలు పెట్టి మూడుచెరువుల నీళ్ళు తాగించిన ఘనత ఈ "ఈ రహస్య పత్రికలకు-చిట్టెలుకలుకే" దక్కింది. వాటి నిర్వహణలో ఆదర్శపురుషులు అష్ట కష్టాలకు లోనై ఆహుతి అయిపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

ఆ సంప్రదాయాలు, ఆ దీక్షాకర్తవ్యాలు, ఆ ఆరాటాలు పోరాటాలు కేవలం స్మృతి చిహ్నాలుగా నేడు మిగిలిపోవడంకంటే వేరే దుర్దశ ఏముంటుంది? రెండు దశాబ్దాలుగా సాగుతూన్న నవీన భారత చరిత్రలో "పత్రికల" సంగతి పర్యాలోకించినవారికి శూన్య దృక్కులు తప్ప ఆశాదృక్కులు కనిపించవు. కనిపించినట్లు తోచినా అవి గగనకుసుమ సదృశాలే!

ఉద్యమాలు ఉత్సాహోద్రేకాలు పట్టు సడలగానే క్రైమ్, సెక్సు పత్రికలు "ప్రజారాజ్యం" చేశాయి. విజ్ఞాన ప్రబోధ పరిమితంగా అయితే ఆ పత్రికలవల్ల అపకారం ఉందనలేము. కాని, "డబ్బు" చేసుకొనే కాంక్షతో అవి చేసిన మేలుకంటే అపకారం చాల దొడ్డది అనడంలో ఎలాంటి సందేహం లేదు. సమాజంలో డబ్బుసంపాదించే వానికున్న గౌరవం పలుకుబడికి పరిమితం లేదుకనుక - ఎలా సంపాదిస్తేనేం - సంపాదన ముఖ్యమైపోయింది. పత్రికలు, చలనచిత్రాలు ఈ దోవలోనే పడ్డాయి.

స్వతంత్రభారతం ఒక విచిత్ర పరిణామాన్ని సృష్టించింది. అధికారంలో విపణివీధిలో "గుత్తాధిపత్యం" ఏర్పడ్డమే ఈ పరిణామం. లక్షాధికార్లు కోటీశ్వర్లుకావడం, సాధారణులు మరింత నిరుపేదలు కావడం, "నదీనాం సాగరోగతిః" అన్నట్లు సమస్తసంపద కొందరి చేతుల్లోనే పోగుపడడం మొదలయింది. చూస్తూ చూస్తూ ఉండగానే గుత్తాధిపత్యం ప్రతిరంగంలోను బలపడిపోయింది. వీరి చేతుల్లోనే బలమైన పత్రికలు, గొలుసుపత్రికలు ఉన్నాయి. పరోక్షంగా, ప్రత్యక్షంగా ఈ శక్తులు రాచకీయరంగంలో గుత్తాధిపత్యాన్ని నేర్పుగా ప్రవేశపెడుతున్నారు. 'ప్రజాస్వామ్యాన్ని' కొనేస్తున్నారు, అమ్మేస్తున్నారు. "ఎన్నికలు" వొస్తే ప్రత్యక్ష జోక్యం చేసుకొంటున్నారు.

పంచాయతీ మొదలు పార్లమెంట్‌దాకా తమ అభిప్రాయాలకి ఆదాయాలకి అనువైన స్థానాన్ని సంపాదించుకొంటున్నారు వాణిజ్య రంగమూ, పత్రికా యాజమాన్యమూ గుప్పిట్లో బిగించుకొన్న వీరి పలుకుబడి, ప్రాపకమూ "కేన్సర్" కన్నా భయంకరంగా దేశంలో వ్యాపించిఉంది. బలిష్టమైన వీరి చేతుల్లో "ప్రజాభిప్రాయం" మూగ వోయింది.

దేశంలో తలయెత్తే అశాంతి, నిరాశ, నిరుద్యోగం వల్ల పర్వడ్డ ఉద్యమాలు, ఉత్సాహోద్రేక పోరాటాలు, సంఘటిత శక్తులు, స్వేచ్ఛా భావ ధోరణులు వీటిని అణిచివేయడంలో, వెన్నుపోటుపొడవడంలో వీరి పత్రికలు చాల మెలకువగా ఉన్నాయి. స్వీయ సామ్రాజ్యాన్ని అన్నిరంగాల్లోను స్థాపించుకుంటున్నారు.

రాజకీయంగా అల్పాయుష్కులు, పాలనలో అసమర్థులు, పదవీ సుఖలాలసులు వీరికి దాసోహమ్మని చేతులెత్తడంతో గుత్తాధిపతులు మరింత పెచ్చుపెరిగిపోయారు. నిజానికి దేశం ఇవాళ పరోక్షంగా వీరి కాగిట్లో వొదిగిలిపడి ఉంది.

రాజకీయపక్షాలు నిర్వహిస్తున్న పత్రికలు నిమ్మకునీరెత్తినట్లో, నమ్మకాన్ని అమ్ముకోడంలోనో ముణిగితేలుతున్నాయి. దేశంలో పర్వడిన "అనిశ్చిత పరిస్థితి" బలపడుతూన్న కొద్దీ ఈ పత్రికలు మరింత గందరగోళంలోపడుతున్నట్లు తోస్తుంది.

స్వతంత్రంగా వెలిసిన పత్రికలు ప్రకటనదారుల పోషణకు గురికావడం వల్ల ఏ ఎండకాగొడుగు పట్టి ఏ రోటివద్ద ఆ పాటపాడి బతుకుతున్నాయి.

కడచిన నాలుగైదేళ్ళల్లోను యువతరం సాహిత్యపరంగానో ఆవేశపరంగానో పత్రికలు ప్రారంభిస్తున్నారు. పరిమాణంలో పాటవంలో ఇవి చిన్నవే! వీని శక్తి ఎలాంటిదో వేచి చూడాలి.

ఇలాగని అంతా 'చెడే' తప్ప మంచి లేదని నా వుద్దేశ్యం కాదు. ఈనాటికీ ఏదో మంచి జరగాలనీ, కలలు పండాలని తాపత్రయ పడే పత్రికా రచయితలు గాలిలో దీపాల్లాగా కొట్టు మిట్టాడుతూనే ఉన్నారు. యువతరంలో కొందరు ఉత్తమ ఆశయాలకోసం పత్రికలను

పెట్టాలని ముందుకొస్తున్నారు. మేధావులు, ఆలోచనాపరులు తమ వాణిని ప్రతిబింబించడానికి ముందుకు వస్తూనే ఉన్నారు.

ఏదో ఒక మార్పు, కూర్పు వొస్తుంది. వొచ్చితీరాలి. అప్పుడు కాని ఈ ఇరులు ఇరుకులు ఎల్లలు దాటి పత్రికలు పత్రికా రచయితలు 'విశ్వశ్రేయస్సు,' 'వసుధైక కుటుంబం' అన్న ఉత్తమాశయాలతో ముందుకు సాగుతారు. పూర్వులు సముపార్జించి పెట్టిన త్యాగధనం, నిస్వార్థసేవ మళ్ళా పెట్టుబడిగా కొత్త జీవనలతలు పూసి పుష్పించి లోకకళ్యాణం సాధించబడుతుందని విశ్వసిద్దాం.

చుక్కలలో ఆదర్శాలను లెక్కిస్తూ
ఎక్కడికో పోతున్న మనల్ని
రెక్కపట్టి నిలబెట్టిలోకం
ఎన్నెన్ని దుస్సహ దృశ్యాలు చూపించి,
ఎన్నెన్ని దుస్తర విఘ్నాలు కల్పించి
కలలకు పొగలనూ, కాటుకలనూకప్పి,
శపించిదో, శఠించిదో మనల్ని.

—శిశి

* * * *

భూమి గుండ్రంగా తిరిగే స్వభావం కలది కాబట్టి, భూమిమీద వ్యామోహం ఎవడికి కలికినా, వాడితల గుండ్రంగా తిరగడం ఆరంభిస్తుంది.

—శ్రీ పొట్లపల్లి రామారావు

పత్రికలూ, మారుతున్న విలువలూ

శ్రీ సంఘమిత్ర

పత్రికా రచన అసిధారావ్రతంవంటిది. నిత్య సత్యాన్వేషణమే పత్రికల ప్రథమోద్దేశం, చరమోద్దేశం కూడా. మనసా వాచా కర్మణా తనకు ఏది సత్యమని ధృఢంగా అనిపిస్తున్నదో దానిని సంపాదకుడు నిర్భీతిగా లోకానికి ఎలుగెత్తి తెలియపర్చాలి. అందుకే పత్రికారచన అసిధారావ్రతమన్నది. నూరునయాపైసలనిజంకూడా ఒక్కొక్కప్పుడు కొందరికి రుచించక పోవచ్చు. అయితేనేం సంఘసంస్కర్త అయిన సంపాదకుడు వెలుగుబాటను కేలెత్తి చూపిస్తూ ముందు చూపుతో సాగిపోతాడు.

కందుకూరివేసిన బాట

ఆంధ్ర పత్రికా రంగంలో అటువంటి తొలి సంపాదకుడు శ్రీ కందుకూరి వీరేశలింగంగారు. వీరేశలింగంగారు స్థాపించిన "వివేకవర్ధని "అనే వారపత్రిక ఆశయం సంఘసంస్కరణ తరువాత పంతులుగారు 'వ్యాసవర్ధని' అనే పత్రికనుకూడా ప్రారంభించారు.

శ్రీ ఎ. పార్థసారథినాయుడుగారు 'ఆంధ్ర పత్రిక' అనే వారపత్రిక ప్రారంభించారు. ఈ పత్రిక సుమారు పాతిక సంవత్సరాలు నడిచింది. ఆనాటి పాలకులయిన బ్రిటిష్‌వారిని విమర్శిస్తూ ఈ పత్రికలో వ్యాఖ్యలు వెలువడేవి. ఈ కాలంలోనే శ్రీయుతులు కొక్కొండ వెంకటరత్నంగారూ, చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు గారూకూడా కొన్ని పత్రికలను స్థాపించడం జరిగింది. ఇవికూడా ఆనాటి జాతీయవాంఛలకు దర్పణాలుగా, సంఘసంస్కరణలకు పట్టుకొమ్మలుగా పనిచేశాయి.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA
D.P.R.I.
Acc. No.

ఇరవయ్యోశతాబ్ది ప్రారంభంనుండీ పత్రికావ్యాసంగం విస్తృత మయింది. గిడుగు రామమూర్తిగారు నడిపిన తెలుగు వారపత్రిక 'తెలుగు' వ్యవహారిక భాషావాదానికి తోడ్పడింది, ఆధునిక సాహిత్య ప్రచారం నిమిత్తం కీర్తిశేషులు కొంపెల్ల జనార్ధనరావుగారు 'ఉదయిని' అనే మాసపత్రికను నడిపారు. అయితే దురదృష్టవశాత్తూ వీరు ముప్పయ్యేళ్ళుకూడా నిండకుండానే పరమపదించారు. శ్రీ ముట్నూరి కృష్ణారావుగారు 'కృష్ణాపత్రిక' ప్రారంభించారు. దీని కార్యస్థానం జాతీయకళాశాలకు పీఠమైన మచిలీపట్నం. పత్రికారచనలో శ్రీకృష్ణారావుగారు కొత్త ఒరవడి పెట్టారు. అతిగంభీరమైన తాత్త్విక విషయాలుగాని లేకపోతే సున్నితంగా మనస్సుకుతాకే సారస్వత విషయాలుగాని వారు చక్కని పదజాలంలో పాఠకులముందు పెట్టేవారు. అరవిందుల తత్త్వదర్శనమూ, రాగూరు విశ్వజనీనతా వీరి రచనల్లో గుబాళించేవి. ఒకతరంపాఠకులపై చెరగని ముద్రవేసిన శిల్పి 'మౌన ముద్రాలంకారులు' శ్రీ కృష్ణారావుగారు.

'ఆంధ్ర పత్రిక' వారపత్రికగా ప్రారంభింపబడింది. తరువాత శ్రీకాశీనాథుని నాగేశ్వరరావుగారు దీనిని దినపత్రికగామార్చి మద్రాసునుండి వెలువరించ నారంభించారు. పిమ్మట ఆంధ్రసచిత్ర వారపత్రికా, భారతీ ప్రారంభించారు వీరే. ఆంధ్రజాతీయోద్యమాలకు తెలుగు సారస్వతానికీ ఈ పత్రికలు ఆరోజుల్లో ఎంతో ఊతం ఇచ్చినవి.

ఖాసా వెలిగించిన దీపాలు

'ఆంధ్రప్రభ' తొలిసంపాదకులు శ్రీ ఖాసా సుబ్బారావుగారు. తర్వాత శ్రీ న్యాపతి నారాయణమూర్తిగారు ఈ పత్రిక సంపాదకత్వం వహించారు. తరువాత చాలాకాలం శ్రీ నార్ల సంపాదకత్వాన ఈ పత్రిక వెలువడింది. ఖాసా సుబ్బారావుగారే ఇంగ్లీషు స్వతంత్రనూ తెలుగు స్వతంత్రనూ ప్రారంభించారు.

తెలంగాణాలో శ్రీ మాడపాటి హనుమంతరావుగారు స్థాపించిన 'ఆంధ్రజనసంఘం' అనేపత్రికా, కీ॥ శే॥ సురవరం ప్రతాపరెడ్డిగారు వెలువరించిన 'గోలకొండ' వారపత్రికా ఆంధ్రోద్యమానికి ఎంతో తోడ్పడ్డాయి.

చూచాయగా కొన్ని పత్రికలను ఇక్కడ పేరొక్కాన్ను. అయితే గతంలోవొచ్చిన అనేకానేక పత్రికలవల్లకాని, నేడు నడుస్తున్న పత్రికలవల్లకాని సంఘంలో తీవ్రమైన మార్పులు వచ్చాయా? వస్తున్నాయా? అంటే సమాధానం అవునూ, కాదూ. "నేను నా నాటకాలద్వారా మానవజాతి సమస్యలన్నీ పరిష్కరించేశాను. కాని నేను ఒక్క నాటకంకూడా రాయనట్టే మానవజాతి ప్రవర్తిస్తోంది. నేరాసినదంతా వృథా" అని బెర్నార్డుషా వాపోయాట్ట. అలాగే నిజంగా సంఘసంస్కరణకోసం సమాజంలోమార్పులకోసం పాటుపడుతున్న పత్రికల ప్రభావం ఎంతవరకు ప్రసరిస్తున్నది? అని ప్రశ్నవేస్తే చప్పున సమాధానం చెప్పటం కష్టం.

వ్యాపారదృష్టి

కొన్ని ప్రశ్నలకు ప్రశ్నలే సమాధానం. అసలు మనకు మంచి పత్రికలు వున్నాయా? అని ప్రశ్నించవొచ్చు. మనకున్న మంచి పత్రికలను వేళ్ళమీద లెక్కించవచ్చు. స్వాతంత్ర్యానంతరం పత్రికా పరిశ్రమకు వ్యాపారదృష్టి పెరిగింది. ధనికవర్గం యొక్క రాజకీయాల నీలినీడలు మన పత్రికలపై గాఢంగా ప్రసరిస్తున్నవి. పైత్తం దార్ల రాజకీయవై ఖరికి ఆత్మగౌరవాన్ని విడనాడి తాళం వేయడం నేడు మన పత్రికా ప్రపంచంలో సర్వసామాన్యమైన విషయంగాఉంది.

కేవలం చందాలమీద ఆధారపడిపత్రికలు బ్రతకడం కష్టం. ప్రకటనలు కావాలి. ఈ ప్రకటనలు కొందరి గుప్పిళ్ళలో వున్నయ్. ఆగర్భదరిద్రుడి సమస్య ఆగర్భశ్రీమంతుడి ప్రయోజనం - ఈ రెంటిమధ్య పేచీవొచ్చినపుడు దరిద్రుడు వెనక్కి వెళ్తున్నాడు. మంత్రులూ పారిశ్రామిక పైత్తనదార్లూ, భూస్వాములూ, కోటీశ్వరులూ వీళ్ళు పచ్చగా ఉంటేనే తామూ పచ్చగా ఉంటామని వాళ్ళ కొమ్ముకాసే పత్రికాధిపతులు ఎక్కువయ్యారు.

సచేతనమైన హృదయం

నిరంతరం మనం ఎదురొక్కంటున్న చిక్కుసమస్యల్ని విశదంగా తెలియపరుస్తూ ఆ చిక్కుపరిస్థితుల్ని అధిగమించడానికి తగిన

సలహాలనిస్తూ ఎల్లప్పుడూ దేశక్షేమానికీ ప్రజాభ్యున్నతికీ పాటుపడ వలసిన వ్యక్తి జర్నలిస్టు. మరినేడు పత్రికలు ఎలావున్నయ్? ఓ మధురమీనాక్షి కథానికా, ఓ సినిమా నక్షత్రం చీకటిజీవితం, ఒక పళ్ళపొడి ప్రకటనా, నవ్వు తెప్పించని పనికిమాలిన కార్టూను, ఓ తెలిసీ తెలియని రాజకీయ విమర్శ, ఓ తార, తారడూ ముఖచిత్రం—ఇవీ మన వారపత్రికల మాసపత్రికల స్థూలస్వరూపాలు. సజీవమైన విమర్శ, సచేతనమైన హృదయం, సానుభూతితో కూడిన దృక్పథం ఎన్నిపత్రికల్లో నేడు మనకు కానవస్తున్నది?

నేటివిప్లవరచయితలసంఘం ఉపాధ్యక్షులు శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారు ఇరవైఏళ్ళ క్రితం చెప్పిన ఈ విషయంకూడా గమనించండి.

"మన పత్రికలకు డబ్బులేదు. విజ్ఞానవంతమైన వ్యాసాలురాసే రచయితలు తక్కువ. పత్రికారచన ఇంకా ఒక గౌరవనీయమైన వృత్తిగా పరిణమించలేదు. యథార్థమైన వార్తలు సంపాదించేందుకు మనకు సాధనాలుకూడా లేవు. ఏకోవూరులోనో కాల్పులుజరిగితే అక్కడి యథార్థసంఘటనలు మనకు నెలలపర్యంతం తెలియరావు. (కుటుంబరావుగారూ ఎంత నిజంచెప్పారండీ. మొన్న జలగాన్ భివాండీల్లో మతకలహాల గురించి ఎన్నిరకాల కథనాలు వచ్చాయండీ స్వామీ. 'ఇలస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా' చెప్పిందివేరు, జనసంఘం వారుచెప్పింది వేరు)"

ఇరవైఏళ్ళక్రితం కొ. కు. గారు చెప్పిన పరిస్థితి నేటికీ ఏమీ పెద్దగా మారలేదు.

విప్లవం వర్ధిల్లాలి

ఒక రకంగా చూస్తే మన సంప్రదాయాలకూ నేడు మనం చేయవలసిన కృషికీ మధ్య ఒక సంఘర్షణ ఉన్నదేమో అనిపిస్తుంది. పోతనగారు "సంతుష్టిడీ మూడు జగముల పూజ్యుడు" అన్నారు. సంతుష్టితో ఉంటే పురోగమనం ఎక్కడిదీ? "తృప్తి నల్లమందు లాంటిది. మనుష్యుల బుర్రల్లో కుమ్మరి పురుగుల్ని పెట్టి వదలాలి. లేకపోతే తృప్తిపడి కునికిపాట్లుపడుతూ శక్తిలేని వాళ్ళయి

మాట్లాడక అన్నిటికీ సహించివూరుకుంటారు. ఓరిమి గాడిదలసుగుణం. ఇతరులు పెట్టే బాధలకు లొంగి సహించి ఓరిమితో పడివుండడం మానవుణ్ణి నాశనంచేస్తుంది. ఓరిమి కలిగివుండండని బోధించేవాళ్ళు ప్రజల్ని కనుకప్పి గాడిదలుగా చేద్దామని చూస్తున్నారన్నమాట" అన్నాడు మాక్సిమ్‌గోర్కి.

ఆయన ఇంకా ఇలా అన్నాడు "విప్లవం అతిసహజమూ ఉదాత్తమూ అయిన సంఘటన మాతృగర్భంలోని శిశువు పైకి వొచ్చేందుకు అటూఇటూ కదిలే ప్రయతం వంటిదే అది. త్యాగం చేయండని ప్రజలకు బోధించడం వట్టిదగా. సామాన్య ప్రజ త్యాగం చేయవలసినదేముంది, ప్రాణాలు తప్ప."

రేపటి ఉషస్సులో విప్లవంవొస్తుంది. దీర్ఘ రాత్రి గడిచి వెలుతురు లోకి వెళ్ళే సమయం వస్తున్నది. ఉషస్సుముందు ఉన్న తమస్సులో నేడు సంఘంవుంది. ఈ గడియలో పత్రికా రచయితల బాధ్యత గురుతర మైనది. అంచేత నిజాన్ని నిర్భయంగాచాటి ప్రజలకు సరిఅయిన ప్రబోధ విజ్ఞానాలు కలిగించే పత్రికలు అసంఖ్యాకంగా రావాలి. మనకు కావలసింది ఆర్థిక స్వాతంత్ర్యమే కాదు. పరిపూర్ణ భావ స్వాతంత్ర్యం కూడా.

సంకుచితత్వాన్ని మనమంతా
సాంప్రదాయ బద్ధం చేశేసుకున్నాం
కాబట్టే మనకింకా అర్థంకానిది
"సర్వామానవ కళ్యాణం"

—జ్వాలాముఖి

With the best compliments from :

Sripada Art Printers

3-6-346/2, Shaheedyarjung Road

BASHEERBAGH : HYDERABAD-29

Phone : 37454

L60

అభ్యుదయ సాహిత్య సదస్సు

1970 జూలై 4, 5 తేదీలలో హైదరాబాదులో
జరిగిన అభ్యుదయ సాహిత్య సదస్సుకోసం
40 మంది ప్రముఖ రచయితలు పంపిన
ప్రత్యేక వ్యాసాల సంకలనం

కవిత

ప్రచురణ :
నక్షత్ర సప్తకం
విద్యానగర్, హైదరాబాదు-7.

SEVEN STARS SYNDICATE, VIDYANAGAR,
HYDERABAD-7.

269

WHEN YOU FEEL THIRSTY

GO FOR

GOLD SPOT

★

FOR PARTY ORDERS

CONTACT

HYDERABAD BOTTLING COMPANY (P) LTD.,

PANJAGUTTA, HYDERABAD-34.

PHONE NOS: 38445 & 34615

WITH BEST COMPLIMENTS TO

YUVABHARATHI

270

HARIYANA GENERAL TRADING CORPORATION

IRON & STEEL DEALER

Regional Office : **5-5-65, Mahatma Gandhi Road, Secunderabad-3, A. P.**

Phone : Office : 74069-72124 Res : 75314

Stockists of : Beams, Channels Angles, Tees, Plates Plain & Chequered, Sheets of Galv & Black, Plain & Corrugated, M. S. Rounds, Squares, Octogonals, Flats, Bars, Spring Steel Bars, Hoops, Semis (Blooms, Slabs, Billets) & Pig Iron and also Domestic Utensils as Tawa, Kadai & Ghamela,

Registered Office :

OLD MOTOR STAND, ITWARI, NAGPUR-2.

Office :	Residence :	Factory :
40463, 42457,	42203, 41449,	32906

Branch Office :

58-71, NEELWALIGALLI, KANPUR (U. P.)

Pushp Steel Trading Co.,

5-5-65/1, Mahatma Gandhi Road, Secunderabad-3.

Phone No : 72124

Stockists of :

Beams, Channels, Angles, Tees, Plates Plain & Chequered, Sheets of Glav & Black, Plain & Corrugated M. S. Rounds, Squares, Octogonals, Flats, Bars, Spring Steel Bars etc.,

Head Office : **ITWARI, NAGPUR-2**

Phone No : 42457



సాహితీ సమావేశాలు

ప్రతినెలామొదటి మరియు మూడవ ఆదివారా

మధ్యాహ్నం 2.30 గంటలకు

శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం

సుల్తాన్ బజార్, హైద్రాబాద్ లో జరుగును

సహృదయులందరూ ఆహ్వానితులే!

మంచి పుస్తకాల నీడన

మీ మనసెంతో చల్లన

కేవలం మూడురూపాయల పెట్టుబడికే

తక్షణమే నాలుగురూపాయల విలువగల

పుస్తకాలూ-తరువాత దశలవారీగా,

మరో తొమ్మిది రూపాయల

విలువగల పుస్తకాలు లభిస్తాయి.

పూర్తి వివరాలకు మీ చిరునామాతో

తపాలాబిళ్ళలు అతికించిన కవరు పంపండి.



పుస్తక పథకం

యువభారతి

5. కింగ్స్‌వే. సికింద్రాబాద్-3

272

ANDHRA PRADESH MARCHES AHEAD

Alphabetically first among the States of India, Andhra Pradesh has many "firsts" to its credit.

It was the first State to be formed on a linguistic basis and the first to usher in Panchayati Raj.

Fifth largest State in India and fourth in population, having the mighty Godavari and Krishna rivers and rich mineral wealth, Andhra Pradesh is now 13 years old, confident of a bright future, stepping out from a predominently agricultural State into industrial field, the industrial base in Hyderabad and its neighbourhood, in Visakhapatnam, Ramagundam and Kothagudem, attracting new industries to the State.


Even the worst critic cannot deny that Telangana, with Hyderabad, as the Capital of the State, has progressed considerably in every field, as an integral part of Andhra Pradesh.

Common language, common aspirations and common destiny beckon to the 4 crores of Telugu-speaking people, whose unity was disrupted under foreign rule, to remain united in an integrated Andhra Pradesh, essential for the maximum utilisation of its resources, skilfully distributed over the State's different regions, with a rare balance and complementariness.

Issued by the Director, Information Public Relations & Tourism Hyderabad

BC?

AOUA102B105



విశ్రాంతి పొందండి! చార్మినార్ త్రాగండి.

అచ్చమైన మేలిరకం పొగాకుల
పరిమళము కమ్మదనం అనుభవించండి.

చార్మినార్ సిగరెట్టు రుచియే ఇండియాలో
అది విశేషంగా అమ్ముటకు కారణం.

CMVS-5-253 Tel

BSC

VISTAS PRINTERS, HYD.

ఐయస్ ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA102B105
పుస్తకం పేరు	రచన విలువలు బాధ్యతలు దృక్పథాలు
తారీఖు	31 December 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	187
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	M. Roji
పేజీలు విడదీసినది	M. Roji
స్కాన్ చేసినది	anusha
పరీక్ష చేసినది	
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
స్కానింగు చేసినది	
పరిస్థితి	good